సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 236

SUNDAY Special | ఆదివారం 17-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'



చైనానూ చుట్టేసి...

ఆసియా మహిళల చాంపియన్స్ ట్రోఫీలో భారత మహిళల హాకీ జట్టు వరుసగా నాలుగో విజయం సాధించింది. చైనాపై 3–0 గోల్స్ తేడాతో నెగ్గి లీగ్ టాపర్‌గా స్థానాన్ని దాదాపు ఖరారు చేసుకుంది.

- వివరాలు 16లో



ఎముక కేన్సర్ అంటే..?

బోన్ కేన్సర్ గురించి సాధారణ ప్రజలకు అవగాహన కలిగించేందుకు యూకేకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బి. రాజేశ్, డాక్టర్ సుస్మితా జగదీశ్ చెబుతున్న కీలకాంశాలు.

- వివరాలు 15లో



మళ్లీ రాజుకున్న నిప్పు

మణిపూర్‌లో మళ్లీ విద్వేషాగ్ని రాజుకుంది. మైతేయ్ అనుకూల అల్లరిమూకలు ఎమ్మెల్యేల నివాసాలపై దాడులకు తెగబడ్డాయి.


- వివరాలు 6లో▶



ప్రజలే చేస్తున్న అభివృద్ధి ఇది

ప్రజల అభివృద్ధే లక్ష్యంగా తాము పాటుపడుతున్నామని ప్రధాని మోదీ హిందుస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో పేర్కొన్నారు.

- వివరాలు 6లో▶



ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్–నారాయణపూర్ జిల్లాల సరిహద్దుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు.

- వివరాలు 6లో▶



చిన్న పార్టీలే నిర్ణేతలు!

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చిన్న పార్టీలు తేల్చే సూచనలు కనిపిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

- వివరాలు 6లో▶

గం'జాయింట్'గా కొడదామా?

హైదరాబాద్‌లో గంజాయి మత్తులో జోగుతున్న యువత

- చాప కింద నీరులా విస్తరిస్తున్న మత్తు మహమ్మారి
- టెకీల నుంచి స్కూల్ పిల్లల వరకు గంజాయి వాడకం
- రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మంది వరకు గంజాయి వినియోగదారులు!
- ఈజీ మనీకి అలవాటు పడి గంజాయి దందాలోకి దిగుతున్న విద్యార్థులు
- గంజాయి దందాలోని కీలక వ్యక్తులను పట్టుకునేందుకు పోలీసుల జంకు
- అధికారుల తనిఖీలు పైపైనే.. క్షేత్రస్థాయిలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు
- నార్కోటిక్స్ బ్యూరో, ఎక్సైజ్, డీఆర్ఐ, పోలీసు విభాగాల మధ్య కొరవడిన సమన్వయం



'హాయ్ మామా.. బాగా గ్యాప్ వచ్చింది. జాయింట్ కొడదాం పద..'.. ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల మాటలివి..

'ఏం స్ట్రెస్‌రా బాబూ ఇది. టార్గెట్లతో తలపగిలిపోతోంది. చలో బయటికి వెళ్లి కాస్త స్మోక్ చేసొద్దాం'.. ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల సంభాషణ ఇది..

.. వాళ్లు ఏదో టీ తాగడానికో, టిఫిన్ చేయడానికో వెళ్లడం లేదు. గంజాయి తాగేందుకు వెళదామని కోడ్ భాషలో చెప్పుకొంటున్నారు. ఇక్కడా, అక్కడా అని కాదు హైదరాబాద్ మహా నగరంలో చాలా చోట్ల ఈ గంజాయి కల్చర్ కనబడుతోంది. కొందరిలో ఇదో సోషల్ స్టేటస్‌గా మారింది. నగరంలో గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. వివిధ పోలీసు విభాగాల మధ్య కొరవడిన సమన్వయాన్ని గంజాయి విక్రేతలు ఆసరాగా తీసుకుని, మరింతగా రెచ్చిపోతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

సాక్షి, హైదరాబాద్: గంజాయి మహమ్మారి రాష్ట్రంలో చాప కింద నీరులా విస్తరిస్తోంది. ఈ మత్తుకు బానిస అవుతున్న వారి జాబితా క్రమంగా పెరుగుతోంది. గతంలో కొన్నివర్గాలకే పరిమితమైన గంజాయి.. ఇప్పుడు స్కూళ్లు, కాలేజీల విద్యార్థుల నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల దాకా పాకింది. పెద్ద పెద్ద ఆస్పత్రుల వైద్యులు సైతం గంజాయి మత్తుకు బానిస అవుతుండటం విస్మయానికి గురిచేస్తోంది. ఆరు నెలల క్రితం హైదరాబాద్ నగరంలోని ఓ ప్రముఖ ఆస్పత్రికి చెందిన కొందరు వైద్యులు గంజాయి వాడుతున్నట్టు తెలియడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో మందలించి వదిలేయడం గమనార్హం. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నెలల క్రితం గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై యుద్ధం ప్రకటించింది. మత్తు దందాలపై ఉక్కుపాదం మోపాలని పోలీస్,

మిగతా 3వ పేజీలో ▶

సామాన్యుడి బతుకు..

పెనం నుంచి పొయ్యిలోకి..

గణనీయంగా పెరిగిన నిత్యావసరాల ధరలు

- ఎగుమతులపై ఆంక్షల ఎత్తివేతతో బియ్యం, దిగుమతి సుంకం పెంపుతో నూనెల ధరలకు రెక్కలు
- ఈ ఏడాదిలో కూరగాయల ధరల్లో సగటున 30 శాతం వృద్ధి
- పేదల నుంచి దిగువ ఉన్నతస్థాయి వర్గాల వరకు ఆందోళన
- దేశంలో భారీగా తగ్గిన సాగు.. గుర్తించిన కేంద్ర వ్యవసాయ శాఖ



సాక్షి, హైదరాబాద్: వాతావరణ మార్పులు, తగ్గిన పంటల దిగుబడులు, అంతర్జాతీయంగా మారిన పరిస్థితులు... సామాన్యుల వంటింటిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. నిత్యం వినియోగించే బియ్యం, పప్పులు, నూనెలు, కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఏమాత్రం తగ్గకుండా పెరుగుతున్న ధరలతో సామాన్యుడు ఏం కొనేటట్టు లేదని.. ఏం తినేటట్టు లేదని వాపోతున్నాడు. దేశవ్యాప్తంగా 14 నెలల గరిష్టానికి నిత్యావసరాల ధరలు చేరుకున్నాయని ఇటీవలే కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ స్పష్టం చేసింది. దేశంలో 70 రకాల పంటల సాగుకు అవకాశం ఉన్నప్పటికీ, కేవలం 20 నుంచి 25 రకాల పంటలనే ఎక్కువగా సాగు చేస్తున్నట్లు భారత వ్యవసాయ శాఖ గుర్తించింది. అందులో కొన్ని పంటలు కొన్ని రాష్ట్రాలకే పరిమితం కావడంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆయా వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇలా దేశంలో గత పదేళ్లలో 22 రకాల సరుకుల ధరలు గణనీయంగా పెరిగినట్లు ప్రభుత్వం లెక్కలు వేసింది. మొత్తమ్మీద సగటు వినియోగదారుడు వెచ్చాల కోసం భారీగా వెచ్చించాల్సిన పరిస్థితి. కాగా, డిసెంబర్ 6న రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్యోల్బణంపై సమీక్షించనుందని, ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. ఈ నిర్ణయంతో సామాన్యులకు కొంత మేర ఊరట దక్కుతుందని ఆశిస్తున్నారు.

బియ్యం ధరలకు రెక్కలు

బాస్మతీయేతర తెల్లబియ్యంపై ఎగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం నెలరోజుల క్రితం రద్దు చేసింది. అలాగే పారా బాయిల్డ్ బియ్యంపై ఎగుమతి సుంకాన్ని 20 నుంచి 10 శాతానికి తగ్గించింది. ఆంక్షలు ఎత్తివేయడంతో దేశం నుంచి బియ్యం ఎగుమతులు పెరిగాయి. విదేశాలకు ఎగుమతి అవుతున్న

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఫోన్ ట్యాపింగ్ కేసులో.. జైపాల్ యాదవ్ విచారణ



అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్‌ను పోలీసులు శనివారం సుమారు రెండు గంటల పాటు ప్రశ్నించారు. ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా ఉన్న ఎస్ఐబీ మాజీ అదనపు ఎస్పీ మేకల తిరుపతన్న ఫోన్‌లో జైపాల్ యాదవ్‌కు సంబంధించిన లింకు దొరికిన నేపథ్యంలో.. ఆ ఆధారాలను జైపాల్ ముందుపెట్టి విచారించినట్టు తెలిసింది.

- వివరాలు 3లో

రేవంత్‌రెడ్డీ.. చరిత్ర తిరగేసుకో!



కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను అంతం చేస్తామని గత 24 ఏళ్లలో ఎంతో మంది పిచ్చి ప్రేలాపనలు చేశారని.. వారంతా ఎక్కడున్నారో చరిత్రలోకి తొంగిచూస్తే సీఎం రేవంత్‌రెడ్డికి తెలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ నడుము బిగించకపోతే ఇవాళ సీఎంగా రేవంత్‌రెడ్డి ఉండేవారా? అని ప్రశ్నించారు.

- వివరాలు 12లో

నారా రామ్మూర్తి నాయుడు కన్నుమూత



అనారోగ్యంతో బాధపడుతున్న ఏపీ సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు (72) చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో శనివారం కన్నుమూశారు. ఆయన పార్థివదేహానికి చంద్రబాబు సహా పలువురు ప్రముఖులు నివాళులర్పించారు.

- వివరాలు 3లో

వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఉండదు

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

12 లో

ఇవాంటి పంచ్



మేం 50 వేల కొలువులిచ్చాం.. మీరేమిచ్చారు?

ప్రధాని మోదీకి సీఎం రేవంత్ ప్రశ్న

- 10 నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలు తెచ్చాం
- మీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఏమైనా చేశారా?
- మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం



శనివారం మహారాష్ట్రలోని రాజురాలో సీఎం రేవంత్ రోడ్‌షో

సాక్షి ముంబై: తెలంగాణలో తాము అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే నిరుద్యోగులకు 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. బీజేపీ అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఇలా ఇవ్వగలిగారా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు తన ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నదని చెప్పారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం విదర్భ ప్రాంతంలోని చంద్రపూర్, రాజురా, దిగ్రాస్, వార్ధా, నాగ్‌పూర్ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి అభ్యర్థుల తరఫున రేవంత్ ప్రచారం చేశారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం

మిగతా 12వ పేజీలో ▶



చంద్రుడు మన మామ కాదా?

ఎక్కడి నుంచో భూమి లాగేసుకుందా?

- తెరపైకి కొత్త సిద్ధాంతాన్ని తీసుకొచ్చిన శాస్త్రవేత్తలు
- ఓ 'బైనరీ గ్రహాల జంట' నుంచి చందమామను భూగురుత్వాకర్షణ శక్తి లాక్కుందని చెబుతున్న వైనం
- మన సౌర కుటుంబంలో అలాంటి ఘటనలు ఎన్నోసార్లు జరిగినట్లు వెల్లడి
- భూమి టైడల్ ఫోర్స్ వల్ల మెల్లగా దీర్ఘవృత్తాకార కక్ష్య నుంచి వృత్తాకార కక్ష్యకు చేరినట్లు వివరణ

- వివరాలు 18లో

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. న్యాయమూర్తిగా అత్యధిక కేసులు పరిష్కరించి యూకే వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శనివారం ఈ పురస్కారాన్ని న్యాయమూర్తికి అందజేశారు. 2017లో న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ 92 వేల కేసులు పరిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన ఆయన్ను సుప్రీంకోర్టు కొలీజియం 2017లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా నియమించింది. అనంతరం త్రిపుర హైకోర్టుకు బదిలీ అయ్యారు.



శనివారం ఇందిరాపార్కు వద్ద సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల మహాధర్నా



'సమగ్ర శిక్షా' ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్
- తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా
- ఎమ్మెల్సీ కోదండరాం, ఆర్.కృష్ణయ్య సంఘీభావం

13 లో

మళ్లీ ర్యాగింగ్ కలకలం

- 'పాలమూరు' ఘటనతో తల్లిదండ్రుల్లో ఆందోళన
- గాంధీతోపాటు ఇతర వైద్య కళాశాలల్లోనూ జూనియర్లకు సీనియర్ల వేధింపులు!... ప్రైవేటు కాలేజీల్లో ర్యాగింగ్ జరుగుతున్నా బయటకు పొక్కనీయని యాజమాన్యాలు
- వైద్యవిద్య యంత్రాంగం పర్యవేక్షణ లోపంపై విమర్శలు

5 లో

ప్రాణాలు తీశాకే భూములు లాక్కోండి

- వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ఫార్మా విలేజీ బాధితుల ఆవేదన... తమ వాళ్లు ఎక్కడున్నారోనని ఆందోళన
- పోలీసుల అదుపులో మరో 8 మంది.. నలుగురికి రిమాండ్
- పరారీలో ఉన్నవారి కోసం కొనసాగుతున్న గాలింపు
- లగచర్ల, పులిచర్లకుంట, రోటిబండ తండాల్లో 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలన

13 లో



శనివారం రాత్రి గోల్నాక తులసీరామ్‌నగర్ బస్తీలో మూసీ బాధితులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మూడు నెలల పోరాటం!

'మూసీ'పై సుదీర్ఘ నిరసనలకు సిద్ధమవుతున్న బీజేపీ

- 'మూసీ నిద్ర' కార్యక్రమాన్ని పొడిగించే యోచన
- కాంగ్రెస్ విమర్శలతో వ్యూహం మార్చాలని నిర్ణయం
- మూసీ ప్రక్షాళన చేయండి.. ఇళ్లు కూల్చొద్దనే నినాదంతో ఉద్యమం

- వివరాలు 12లో

గ్రీన్ ఎనర్జీ లక్ష్యం 50,500 మెగావాట్లు

2034-35 నాటికి రాష్ట్ర పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం పెంపుదల

- పదేళ్లలో కొత్తగా 40,405 మెగావాట్ల సామర్థ్యం వృద్ధి
- రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టుల డెవలపర్లకు భారీ రాయితీ, ప్రోత్సాహకాలు
- నామమాత్రపు లీజుతో సర్కారీ స్థలాల కేటాయింపు
- త్వరలో ఎనర్జీ పాలసీని ప్రకటించనున్న రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పునరుత్పాదక విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని మరో దశాబ్ద కాలంలో 50,500 మెగావాట్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రస్తుతం రాష్ట్రం 10,095 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సరఫరా సామర్థ్యం కలిగి ఉండగా, 2034–35 నాటికి మరో 40,405 మెగావాట్ల సామర్థ్యాన్ని వృద్ధి చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్రంలో సౌర, పవన, డిస్ట్రిబ్యూటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ, ఎనర్జీ స్టోరేజీ ప్రాజెక్టులు, జియోథర్మల్ వంటి పునరుత్పాదక ఇంధన

మిగతా 14వ పేజీలో ▶


A quality product from
PAN BAHAR
PAN BAHAR
ది హెరిటేజ్ ఇలాచి
విజయానికి గుర్తింపు
NEW PACK
PAN BAHAR PRODUCTS (P) LTD.
PAN BAHAR
THE HERITAGE ELAICHI
PAN BAHAR
THE HERITAGE ELAICHI
TOLL FREE NO.: 1800 257 2258
www.panbahar.in

గం'జాయింట్'గా కొడదామా?

▶ మొదటి పేజీ తరువాయి

ఎక్సైజ్, టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు బహిరంగంగానే ఆదేశాలు జారీ చేశారు. కానీ వివిధ విభాగాల మధ్య తగిన సమన్వయం లేకపోవడం, కొందరు అధికారులు దీనిని సీరియస్‌గా తీసుకోకపోవడం, గంజాయి సరఫరా దారులు కొత్త కొత్త మార్గాలు అనుసరిస్తూ, వినియోగదారులనే విక్రేతలుగా మారుస్తుండటం వంటివి గంజాయి దందా యథేచ్ఛగా సాగిపోవడానికి దారితీస్తున్నాయనే అభిప్రాయాలు ఉన్నాయి. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి వాడుతున్న వారి సంఖ్య 10లక్షల వరకు ఉందని అంచనా వేస్తున్నారు.

దందాలోకి దిగుతున్న విద్యార్థులు

ఇంజనీరింగ్ కాలేజీల్లో గంజాయి వాడకం క్రమంగా పెరుగుతోంది. తొలుత ఒకరిద్దరితో మొదలయ్యే ఈ వ్యసనం స్నేహితుల మధ్య విస్తరిస్తోంది. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో కొందరు బెట్టింగ్‌లకు, జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం గంజాయి విక్రేతలుగా మారుతున్నారు. అలాంటి వారిని కట్టడి చేయడం పోలీసులు, దర్యాప్తు ఏజెన్సీలకు ఒకింత తలనొప్పిగా మారింది.

ఈజీ మనీకి గంజాయి మార్గం!

చాలా మంది కష్టపడకుండా డబ్బులు వస్తుండటంతో (ఈజీ మనీ) గంజాయి అమ్మకాలకు దిగుతున్నారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల (ఏఓబీ)కు వెళితే ఏడెనిమిది వేల రూపాయలకే రెండు కిలోల గంజాయి దొరుకుతుంది. దాన్ని హైదరాబాద్ వరకు తెస్తే.. ఆ రెండు కిలోల ప్యాకెట్ రూ.15 వేలకు కొంటారు. అదే ఒక్కో కిలో గంజాయిని 10 గ్రాముల చొప్పున 100 ప్యాకెట్లు చేసి.. ఒక్కో ప్యాకెట్‌ను రూ.300 చొప్పున అమ్ముతారు. అంటే కిలోకు రూ.30 వేలు వస్తాయి. రెండు కిలోల గంజాయి ప్యాకెట్‌ను రూ.15 వేలు పెట్టి కొంటే.. దాన్ని విక్రయించడం ద్వారా.. రూ.45 వేలు మిగిలించుకుంటారు. ఇలా ఈజీ మనీ కోసం కొందరు గంజాయి అమ్మకంలోకి దిగుతున్నారు.

నియంత్రణపై హడావుడికే పరిమితం

హైదరాబాద్‌లో గంజాయికి ప్రధానంగా ధూల్‌పేట్, నానక్‌రామ్‌గూడ, సీతాఫల్‌మండి, ఫతేనగర్ హబ్‌లుగా ఉండేవి. ఇప్పుడు చాలా ప్రాంతాలు అడ్డాలుగా మారాయి. అంగోరి భాయ్, గాంజా కిశోర్, సునీతభాయ్, ముఖేశ్‌సింగ్, దీపు, సట్టా కిశోర్, రౌడీ గోపాల్, రౌడీ విశాల్ వంటి 25 మంది వరకు గంజాయి విక్రేతలు ఉన్నారని నిఘా వర్గాలు చెబుతున్నాయి. వారు 30, 40 కిలోల చొప్పున గంజాయి తెప్పించి.. రిటైల్‌గా విక్రయించేవారికి సరఫరా చేస్తున్నారు. దీనిపై దర్యాప్తు సంస్థలకు సమాచారం అందుతున్నా పైపైన హడావుడికే పరిమితం అవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. గంజాయి కట్టడిలో టీజీ నార్కోటిక్స్ బ్యూరో, స్థానిక పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) వంటి విభాగాల మధ్య సమన్వయ లోపం కూడా గంజాయి స్మగ్లర్లకు కలిసి వస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కూకట్‌పల్లి ఏరియాలో బిహార్‌కు చెందిన హోంగార్డు పెంచిన గంజాయి మొక్క (ఫైల్)

ఏఓబీ టు నార్త్ ఇండియా.. వయా తెలంగాణ!

ఏఓబీ (ఆంధ్రా– ఒడిశా బార్డర్), ఛత్తీస్‌గఢ్, వైజాగ్ తదితర ప్రాంతాల్లో పండించే గంజాయిని.. ఉత్తర భారతదేశంతోపాటు ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు తెలంగాణ కారిడార్‌గా మారిందనే విమర్శలు ఉన్నాయి. స్మగ్లర్లు రైలు, రోడ్డు మార్గాల్లో పెద్ద మొత్తంలో గంజాయిని తరలిస్తున్నారు. ప్రైవేటు వాహనాల్లోనూ రవాణా చేస్తున్నారు. టీజీ నార్కోటిక్స్ బ్యూరో, ఎక్సైజ్, స్థానిక పోలీసులు, డీఆర్ఐ అధికారుల తనిఖీల్లో తరచూ గంజాయి పట్టుబడుతోంది. ఇలా పట్టుబడుతున్నది స్వల్పమేనని, అంతకు ఎన్నో రెట్లు తరలుతోందని సమాచారం. ఇక వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లోనూ గంజాయి ఏజెంట్లు నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుంటున్నారని.. వారి ద్వారా స్థానికంగా గంజాయి అమ్మకాలు జరుపుతూనే ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారని తెలిసింది.

గంజాయి చాక్లెట్లు...

రాజస్తాన్, ఒడిశా నుంచి గాంజా, బంగ్ చాక్లెట్లు హైదరాబాద్ వస్తున్నాయి. కూరగాయలు, పండ్ల రవాణా వాహనాల్లో వాటిని తరలిస్తున్నారు. ఒక్కో చాక్లెట్‌ను రూ.40 నుంచి రూ.50కి అమ్ముతున్నారు. ఇటీవలే రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీమ్ 5 కిలోల బరువు గల 2,000 గాంజా బంగ్ చాక్లెట్స్ స్వాధీనం చేసుకుంది. నాలుగు కేసులు రిజిస్టర్ చేసింది.

డ్రగ్స్‌పై ఫోకస్ పెరగడంతో గంజాయి వైపు..

కొకైన్, ఎల్ఎస్‌డీ వంటి సింథటిక్ డ్రగ్స్ అమ్మకాలపై టీజీ నార్కోటిక్స్ బ్యూరో, పోలీస్, ఎక్సైజ్ ఫోకస్ పెరగడంతో.. చాలా మంది తక్కువ ధరకు, వెంటనే అందుబాటులో ఉండే గంజాయివైపు దృష్టి పెడుతున్నారని పోలీసు వర్గాలు చెప్తున్నాయి. ఎక్కువగా హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని లేబర్ కాలనీలు, రాజీవ్ గృహకల్ప, సైదాబాద్‌లోని సింగరేణి కాలనీ, ధూల్‌పేట్, జీడిమెట్ల, చింతల్, సూరారం కాలనీ, దుండిగల్ సహా పలు పారిశ్రామిక ప్రాంతాల్లో గంజాయి వాడకం విస్తృతంగా పెరిగింది. గోల్కొండ, లక్ష్మీనగర్, ఎల్బీనగర్‌లతోపాటు హాస్టళ్లు ఎక్కువగా ఉన్న అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, నాంపల్లి, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లు, ఎంజీబీఎస్, జేబీఎస్, నెక్లెస్‌రోడ్, ఇతర పార్కులు వంటి చోట్ల గంజాయి విక్రయాలు సాగుతున్నట్టు తెలిసింది.

శిక్షల భయం లేకపోవడంతో..

గంజాయి కేసులలో నిందితులపై శిక్షలు సరిగా లేకపోవడంతో వారిలో భయం ఉండటం లేదన్న వాదనలు ఉన్నాయి. కిలోకుపైన గంజాయి పట్టుబడితేనే దాన్ని కమర్షియల్ క్వాంటిటీగా గుర్తిస్తారు. ఆ కేసులలోనే కఠిన శిక్షలుంటాయి. ఈ క్రమంలోనే గంజాయి సప్లయర్లు చిన్నచిన్న ప్యాకెట్లలో విడివిడిగా సరఫరా చేస్తున్నారు. వారు పట్టుబడినా బలమైన కేసులు ఉండటం లేదు. సరైన దర్యాప్తు లేని కారణంగా కూడా చాలా వరకు కేసులు వీగిపోతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. పోలీసులకు చిక్కిన గంజాయి విక్రేతలు.. బెయిల్‌పై వచ్చాక మళ్లీ దందా మొదలుపెడుతున్నారు. ఇలా మళ్లీ మళ్లీ నేరం చేస్తున్నవారిపై పీడీ యాక్ట్ తరహాలో.. 'ప్రివెన్షన్ ఆఫ్ ఇల్లిసిట్ ట్రాఫిక్ ఇన్ నార్కోటిక్ డ్రగ్ సైకోట్రోపిక్' చట్టాన్ని నమోదు చేస్తున్నారు. దీనితో రెండేళ్ల వరకు బెయిల్ లభించే అవకాశం ఉండదు. అంతేగాక స్థానిక కోర్టుల అనుమతితో 'స్మగ్లింగ్ అండ్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మానిప్యులేటర్స్ యాక్ట్ (సఫెమా)' ప్రయోగించేందుకూ పోలీసులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ యాక్ట్ ప్రకారం.. దోషులుగా తేలినవారి ఆస్తులను జప్తు చేయవచ్చు. గతేడాది నమోదైన నాలుగు కేసుల్లో నిందితులకు చెందిన రూ.8 కోట్లు విలువైన ఆస్తులను టీన్యాబ్ జప్తు చేసింది.

టీజీ నార్కోటిక్స్ బ్యూరో నమోదు చేసిన గంజాయి కేసుల వివరాలివీ..

అంశం	2021	2022	2023	2024 (ఆగస్టు వరకు)
గంజాయి (కిలోలలో)	37,331	31,718	26,850	15,066
గంజాయి చాక్లెట్లు (కిలోలలో)	-	-	2.2	11.91

'సాంస్కృతిక సారథి'గా వెన్నెల



గద్దర్ కుమార్తెకు కీలక పదవి

- ఉత్తర్వులు జారీచేసిన సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా దివంగత ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె గుమ్మడి వి. వెన్నెలను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.శ్రీధర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు ప్రతిష్టాత్మక కార్యక్రమాలు, విధానాలు, పథకాల గురించి ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించటంతోపాటు తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని గర్వంగా చాటేందుకు ఈ పదవిలో వెన్నెలను నియమిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించిన సమయంలో విడుదల చేసిన జీవో నంబర్ 198లోని నియమ నిబంధనలే ఆమె నియామకానికి కూడా వర్తిస్తాయని పేర్కొన్నారు.

ఎన్నికల్లో ఓడినా ప్రాధాన్యం..

గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా వెన్నెల పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ఆమెకు కాకుండా శ్రీగణేశ్‌కు పార్టీ టికెట్ కేటాయించింది. దీంతో గద్దర్ కుమార్తెను పక్కన పెట్టారనే చర్చ గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీలో జరుగుతోంది. ఆ ప్రచారానికి చెక్ పెడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రాధాన్యత గల సాంస్కృతిక సారథి బాధ్యతలను ఆమెకు అప్పగిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

అబద్ధాలు, దోపిడీ కాంగ్రెస్ డీఎన్ఏ: చింతల

సాక్షి, హైదరాబాద్: అబద్ధాలు చెప్పడం, అధికారంలోకి వచ్చాక అడ్డగోలుగా దోచుకోవడం కాంగ్రెస్ డీఎన్ఏ అని బీజేపీ ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే మోసం, కుట్ర, మభ్యపెట్టడమని, బీసీల గొంతుకోసి, ఎస్సీ, ఎస్టీలను నిట్టనిలువునా మోసం చేసిన డీఎన్ఏ కాంగ్రెస్‌దని ధ్వజమెత్తారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. మంత్రిగా ఉంటూ చేసిన గలీజు వ్యాఖ్యలు.. ఆయన ఏ స్థాయిలో ఉన్నారో చెప్పకనే చెబుతున్నాయని ఎద్దేవా చేశారు. ముందు రాష్ట్రంలో మీ నాయకుడిది తెలుగుదేశం డీఎన్ఏనా, కాంగ్రెస్ డీఎన్ఏనా ? ఆంధ్రప్రదేశ్ డీఎన్ఏనా ? తెలంగాణ డీఎన్ఏనా? అనేది తేల్చుకోవాలని కోరారు.

పెనం నుంచి పొయ్యిలోకి..

▶ మొదటి పేజీ తరువాయి

తెల్ల బియ్యం, పారా బాయిల్డ్ రైస్‌లో భారత్ వాటా 45 శాతం కాగా, ఇందులో తెలంగాణ, ఏపీలే కీలకం. రాష్ట్రంలో మేలు రకం బియ్యం ధరలు క్వింటాలుకు రూ.6,500 నుంచి రూ.7,500కు చేరుకున్నాయి. ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ, సోనా మసూరి, జైశ్రీరాం వంటి మేలు రకాల ముడి బియ్యం ధరలు రూ.7వేల పైనే ఉన్నాయి. స్టీమ్డ్ రైస్ క్వింటాలుకు రూ.5,000 నుంచి రూ.6,000 వరకు లభిస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

మండుతున్న నూనె

కేంద్ర ప్రభుత్వం ఇటీవలే క్రూడ్ పామ్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై 20 శాతం దిగుమతి సుంకాన్ని విధించింది. అలాగే రిఫైన్ చేసిన పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై ఇప్పటికే ఉన్న 12.5 శాతం సుంకాన్ని 32.5 శాతానికి పెంచింది. దీంతో మార్కెట్‌లో రూ.90 లోపు లభించే లీటర్ పామాయిల్ రూ.130 వరకు చేరుకోగా, సన్‌ఫ్లవర్ నూనె ధరలు రూ.135 నుంచి రూ.150కి చేరాయి. సుంకం పెంచని వేరుశనగ, రైస్‌బ్రాన్, కుసుమ నూనె ధరలను కూడా ఆయా ఉత్పత్తి సంస్థలు విపరీతంగా పెంచడం గమనార్హం.

కూర 'గాయాలే'..!

కూరగాయల ధరల్లో ఈ ఏడాది సగటున 30 శాతం వృద్ధి కనిపించింది. అందరూ రోజూ కూరల్లో తప్పకుండా వినియోగించే టమాట, ఆలుగడ్డ, ఉల్లిగడ్డ, వెల్లుల్లి ధరలు కొంతకాలంగా ఆకాశాన్ని అంటుకున్నాయి. నెలరోజుల క్రితం వరకు ఉల్లిగడ్డ, టమాట ధరలు ఏకంగా కిలో రూ.వందకు చేరాయి. ప్రస్తుతం ఉల్లి రూ.60 వరకు ఉండగా, టమాట ధరలు కొంత తగ్గినట్టు కనిపించినా, ఇప్పటికీ మేలు రకం రూ.50కి తక్కువ లేదు. క్యారట్ కిలో ఏకంగా రూ.120 వరకు ఉండగా, బీట్‌రూట్ రూ.80, ముల్లంగి రూ. 72, చిక్కుడు రూ.100, వంకాయలు రకాన్ని బట్టి రూ. 70–90 వరకు విక్రయిస్తున్నారు. క్యాప్సికమ్ రూ.90, బెండకాయ రూ.60, బీరకాయ రూ.70, బీన్స్ రూ.70, కాకర రూ.60, దోసకాయ రూ.60 వరకు విక్రయిస్తున్నారు. మార్కెట్‌లు, రైతుబజార్లలో కొంత మేర తక్కువకు విక్రయించినప్పటికీ, చిల్లర వ్యాపారుల వద్ద ఇంకా ఎక్కువగా ఉంటున్నాయని చెబుతున్నారు. ములక్కాడలు ఒక్కోటి రూ.20కి విక్రయిస్తుండగా, నిమ్మకాయలు కిలోకు రూ.120–140 వరకు ఉన్నాయి. ఆకుకూరల ధరలూ ఆకాశంవైపే చూస్తున్నాయి. కాగా, సబ్బులు, టూత్‌పేస్ట్, షాంపూలు, కాఫీ, టీ పొడర్, సౌందర్య వస్తువుల ధరలు కూడా మూడు నెలలుగా పెరిగినట్లు తెలుస్తోంది.

ధరలు గతంలో.. ఇప్పుడు (కిలోకు రేటు రూ.లలో)

సరకు	నవంబర్ 2024	ఏప్రిల్ 2024	ఏప్రిల్ 2023
బియ్యం (మొదటి రకం)	75	62	51
బియ్యం (రెండో రకం)	55	35	34
గోధుమ	48	46	41
కందిపప్పు	165	162	124
శనగపప్పు	95	84	74
పెసరపప్పు	140	124	115
మినుములు	170	142	122
వేరుశనగ	180	162	176
పామాయిల్	125	96	105
సన్‌ఫ్లవర్ ఆయిల్	140	115	132
ఉల్లిగడ్డలు	60	26	22
ఎండుమిర్చి	300	241	245
చింతపండు	150	130	118
పంచదార	45	41	40

నారా రామ్మూర్తి నాయుడు కన్నుమూత

- ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- నివాళులు అర్పించిన ఏపీ సీఎం చంద్రబాబు, ప్రముఖులు
- నేడు నారావారిపల్లెలో అంత్యక్రియలు

సాక్షి, న్యూఢిల్లీ/చంద్రగిరి/గచ్చిబౌలి: అనారోగ్యంతో బాధపడుతూ ఏపీ సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు (72) చికిత్స పొందుతూ ఏఐజీ ఆస్పత్రిలో శనివారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రామ్మూర్తి నాయుడుకి గుండెపోటు రావడంతో ఈ నెల 14న రాత్రి గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించారని ఏఐజీ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పి.చందర్‌రెడ్డి తెలిపారు. వైద్యులు అన్ని ప్రయత్నాలు చేసినా పల్స్ పడిపోవడంతో ఫలితం లేకుండా పోయిందని, శనివారం మధ్యాహ్నం 12.45 గంటలకు మృతి చెందారని ఆయన ప్రకటించారు. నారా ఖర్జూర నాయుడు, అమ్మణ్ణమ్మ దంపతులకు నలుగురు సంతానం. ఇందులో చంద్రబాబు మొదటి సంతానం కాగా.. రాజేశ్వరి, హైమావతి, చివరగా నారా రామ్మూర్తినాయుడు 1953లో జన్మించారు. రామ్మూర్తినాయుడి మృతదేహం వద్ద ఆయన కుమారుడు, సినీ నటుడు నారా రోహిత్, మంత్రి లోకేశ్, నటుడు బాలకృష్ణ, దగ్గుబాటి దంపతులు, తీగెల కృష్ణారెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు తదితరులు నివాళులు అర్పించారు.

ఢిల్లీ నుంచి హుటాహుటిన చంద్రబాబు పయనం

సీఎం చంద్రబాబు రెండు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం ఢిల్లీ రాగా.. శనివారం ఆయన సోదరుడు రామ్మూర్తినాయుడు మృతి చెందడంతో మధ్యాహ్నం ఢిల్లీ నుంచి నేరుగా హైదరాబాద్ చేరుకున్నారు. హిందుస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు చంద్రబాబు ఢిల్లీ విషయం తెలిసిందే. శనివారం ఉదయం సమ్మిట్‌కు హాజరై పలు ప్రశ్నలకు చంద్రబాబు జవాబిచ్చారు. అనంతరం పలువురు కేంద్ర మంత్రుల్ని కలవాల్సి ఉండగా.. సోదరుడి మరణంతో హస్తిన పర్యటనను ముగించుకుని నేరుగా హైదరాబాద్ వెళ్లిపోయారు. అక్కడ రామ్మూర్తినాయుడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



నారావారిపల్లెలో నేడు అంత్యక్రియలు

ఆదివారం ఉదయం నారా, నందమూరి కుటుంబ సభ్యులు రామ్మూర్తినాయుడు పార్థివదేహంతో ఆదివారం ఉదయం నారావారిపల్లికి చేరుకోనున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. అనంతరం రామ్మూర్తినాయుడు పార్థివదేహాన్ని ఇంటివద్ద ఉంచుతారు. తరువాత అక్కడ నుంచి తన తల్లిదండ్రుల సమాధి వద్దకు తీసుకెళ్లి మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తల్లిదండ్రుల సమాధుల సమీపంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం

సాక్షి, హైదరాబాద్: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడి సోదరుడు మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. రామ్మూర్తినాయుడి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

తిరుమలలో నేడు కార్తీక వన భోజనం

తిరుమల: శ్రీవారి ఆలయం సమీపంలోని వైభవోత్సవ మండపంలో ఆదివారం టీటీడీ కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించనుంది. సాధారణంగా పార్వేట మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. వాతావరణ శాఖ భారీ వర్ష సూచనల నేపథ్యంలో ఈ ఏడాది వైభవోత్సవ మండపంలో నిర్వహించాలని నిర్ణయించింది. ఈ కారణంగా శ్రీవారి ఆలయంలో నిర్వహించే కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాన్ని ఆపలేరు: ఝాన్సీ

సాక్షి, హైదరాబాద్: అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాన్ని ఆపలేరని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ హెచ్చరించారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అక్కడ విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై ప్రభుత్వం నోరెందుకు మెదపడం లేదని శనివారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. అక్రమ నిర్బంధాలను ఛేదించుకుని ట్రిపుల్ ఐటీ ఎదుట ఏబీవీపీ కార్యకర్తలు చేపట్టిన ఆందోళన విజయవంతమైందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులతో కలసి ట్రిపుల్ ఐటీని ముట్టడించినట్టు ప్రకటించారు. స్వాతి ప్రియ ఆత్మహత్యకు కారణమైన నిందితులని శిక్షించాలని, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులపై ట్రిపుల్ ఐటీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాకేశ్ ప్రైవేట్ సెక్యూరిటీతో విచక్షణారహితంగా దాడి చేయించారన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో జైపాల్ యాదవ్ విచారణ

- రెండు గంటల పాటు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేను ప్రశ్నించిన పోలీసులు
- తిరుపతన్నకు ఇచ్చిన రెండు నంబర్లపైనే ప్రధాన దృష్టి
- కుటుంబాల మధ్య వివాదం నేపథ్యంలో ఆ నంబర్లను ఇచ్చానన్న జైపాల్!
- వారికి రాజకీయాలతో సంబంధం లేదని పోలీసులకు వివరణ

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవలే బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను విచారించిన పోలీసులు.. శనివారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ అదనపు ఎస్పీ మేకల తిరుపతన్న ఫోన్‌లో జైపాల్ యాదవ్‌కు సంబంధించిన లింకు దొరికిన నేపథ్యంలో.. ఆ ఆధారాలను జైపాల్ ముందుపెట్టి విచారించినట్టు తెలిసింది. జూబ్లీహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయంలో సుమారు రెండు గంటల పాటు ప్రశ్నించి, వాంగ్మూలం నమోదు చేసుకున్నట్టు సమాచారం.



రెండు ఫోన్ నంబర్ల విషయంలో..

ప్రధానంగా తిరుపతన్నకు జైపాల్‌యాదవ్ ఇచ్చిన రెండు ఫోన్ నంబర్లపై విచారణ సాగినట్టు తెలిసింది. తమ కుటుంబానికి, మరో కుటుంబంతో వివాదాల నేపథ్యంలో అదనపు ఎస్పీ తిరుపతన్నను కలిశానని.. తిరుపతన్న తమ సామాజికవర్గం వ్యక్తికావడంతో వివాదం పరిష్కరించాలని కోరానని జైపాల్‌యాదవ్ వెల్లడించినట్టు సమాచారం. తాను ఇచ్చిన రెండు ఫోన్ నంబర్లను తిరుపతన్న ట్యాప్ చేశారని.. అంతేతప్ప వారికి రాజకీయాలకు సంబంధం లేదని వివరించినట్టు తెలిసింది.

ఫోన్ల నుంచి రికవరీ చేసిన డేటా ఆధారంగా..

ఫోన్ ట్యాపింగ్‌పై కేసు నమోదుకు, పోలీసు అధికారుల అరెస్టుకు మధ్య కొంత సమయం వచ్చింది. ఆ సమయంలో తిరుపతన్న, మరికొందరు అధికారులు, మాజీ అధికారులు తమ ఫోన్లను ఫార్మాట్ చేయడం చేశారు. అయితే ప్రణీత్‌రావు, తిరుపతన్న, భుజంగరావు, రాధాకిషన్‌రావుల అరెస్టు తర్వాత పోలీసులు వారి ఫోన్లు స్వాధీనం చేసుకుని.. చెరిపేసిన డేటాను వెలికితీయడానికి (రిట్రీవ్) వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. నిపుణులు డేటాను వెలికితీసి పోలీసులకు అందించారు. అందులో తిరుపతన్న ఫోన్ నుంచి రిట్రీవ్ చేసిన డేటాను విశ్లేషించిన నేపథ్యంలో.. ఆయనతో చిరుమర్తి లింగయ్య, జైపాల్ యాదవ్ సంప్రదింపులు జరిపినట్టు వెల్లడైంది. దీంతో పోలీసులు వారిని విచారణకు పిలిచి ప్రశ్నించారు.

> ఎవడైనను నా మాటలు వినియు వాటిని గైకొనకుండిన యెడల నే నతనికి తీర్పుతీర్చను; నేను లోకమునకు తీర్పు తీర్చుటకు రాలేదు గాని లోకమును రక్షించుటకే వచ్చితిని.
>
> – క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, తిథి: బ.విదియ రా.11.20 వరకు తదుపరి తదియ, నక్షత్రం: రోహిణి రా.8.08 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: ప.12.31 నుండి 1.59 వరకు తదుపరి రా.1.35 నుండి 3.07 వరకు, దుర్ముహూర్తం: ప.3.55 నుండి 4.43 వరకు, అమృతఘడియలు: సా.5.10 నుండి 6.41 వరకు.

సూర్యోదయం : 6.09
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

పృథ్వీరాజ్ చవాన్ (కాంగ్రెస్ దిగ్గజం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"మీరు వృద్ధాప్యంలో ఆలోచిస్తారు. యవ్వనంలో ఉండగా బీజేపీలో చేరి వికసిత్ భారత్‌లో ఎందుకు పాలు పంచుకోలేదా అని..." అన్నారాయన నాకు మళ్లీ ఫోన్ చేసి!

ఆ ఫోన్ వచ్చింది ఆరెస్సెస్ నుంచి. ఆ ఫోన్ చేసింది ఆరెస్సెస్‌లోని ఒక పెద్ద మనిషి.


"నేనిప్పుడు నా 78లో ఉన్నాను. అయినప్పటికీ... 'మీరు మీ వృద్ధాప్యంలో ఆలోచిస్తారు...' అని మీరు నాతో అనటం ద్వారా నా వయసు పట్ల మీరు కనబరుస్తున్న గొప్ప ఔదార్యం నన్ను కట్టిపడేస్తోంది. అలాగని నేను కాంగ్రెస్ కట్లు తెంపుకొని బీజేపీలోకి వచ్చేయలేను..." అన్నాను మృదువుగా.

"కట్లు అని మీరే అంటున్నారు. తెంపుకొని వచ్చేయటానికి ఏమిటి ఆలోచన?!" అన్నారాయన.

"అవి నన్ను నేను కాంగ్రెస్‌తో కట్టేసుకున్న కట్లు. కాంగ్రెస్ నన్ను ఫోన్ చేసి పిలిపించుకుని కట్టిపడేసిన కట్లు కావు..." అన్నాను.

పెద్దగా నవ్వారాయన.

"మీలోని ఈ కట్టుబాటే నా చేత మీకు ఫోన్ చేయించేలా బీజేపీని ప్రేరేపించింది చవాన్‌జీ! ఢిల్లీలో బీజేపీకి మీ అవసరం ఉంది. సీనియర్ మోస్ట్‌గా మీకూ బీజేపీలో తగినంత గౌరవం ఉంటుంది. వచ్చేయండి..." అన్నారు.



కోరుకున్న చోట దక్కే గౌరవం, కోరుకోని చోట పొందే గౌరవం... రెండూ ఒకటి కావు. దక్కింది సంతృప్తిని ఇస్తుంది. పొందింది సంతోషాన్ని మాత్రమే ఇస్తుంది.

"నాకిక్కడ కాంగ్రెస్‌లో తగినంత గౌరవం దక్కుతూనే ఉంది మహోదయ్ జీ..." అన్నాను.

ఆయన మళ్లీ నవ్వారు.

"నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉండటం, ఆరేళ్లు ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్‌లో సహాయ మంత్రిగా ఉండటం, ఒక టర్మ్‌కు పైగా రాజ్యసభలో ఉండటం, రెండు టర్మ్‌లు లోక్‌సభలో ఉండటం, వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉండి, ఇప్పుడు మూడోసారి ఎమ్మెల్యేగా పోటీలో ఉండటం... ఇవన్నీ నిజంగా దక్కుదలలే అంటారా చవాన్ జీ... ఒక్కసారి మీ మనసును అడగండి..." అన్నారాయన!

ఆయన ఉద్దేశం – ఇవేవీ ఆరెస్సెస్ 'ప్రచారక్', 'విచారక్'లతో కానీ, బీజేపీ 'మార్గదర్శక్ మండల్' సభ్యత్వంతో కానీ సమానమైనవి కావన్నట్లుగా ఉంది!

మొదటిసారి ఆయన నాకు ఫోన్ చేసింది ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు. రెండోసారి ఫోన్ చేసింది నామినేషన్‌లకు ముందు. మూడోసారి ఫోన్ చేసింది నవంబర్ 4న నామినేషన్‌ల ఉపసంహారణ గడువుకు ముందు.

ఇప్పుడు మళ్లీ ఫోన్ చేసి, "ఇప్పటికైనా మించిపోయింది లేదు, వచ్చేయండి, చవాన్ జీ..." అంటున్నారు 20న పోలింగ్, 23న కౌంటింగ్ పెట్టుకుని!

కరద్ సౌత్ నుంచి వరుసగా రెండుసార్లు నా మీద పోటీ చేసి ఓడిపోయిన అతుల్ సురేశ్ భోసలేనే మళ్లీ నాపై నిలబెట్టింది బీజేపీ. మొదటిసారి 18 వేలు, రెండోసారి 9 వేల ఓట్ల తేడాతో అతుల్ ఓడిపోయారు కనుక ఈసారి ఆయన కచ్చితంగా గెలిచి తీరుతారని ఆ పార్టీ నమ్మకం.

నమ్మకాలు బీజేపీకి మాత్రమే ఉంటాయా?! కరద్ సౌత్‌లో మళ్లీ నేనే వస్తానని కాంగ్రెస్ నమ్ముతోంది. రాష్ట్రం మొత్తం మీద కాంగ్రెస్ వస్తే నేనే సీఎం అని నేను నమ్ముతున్నాను. తనే సీఎం అని మహారాష్ట్ర కాంగ్రెస్ ప్రెసిడెంట్ నానా పటోలే నమ్ముతున్నారు.

అడ్డు తొలగించుకోవటం కోసం బీజేపీ ఏమైనా చేస్తుంది. బిహార్‌లో తమ కన్నా తక్కువ సీట్లు వచ్చిన నితీశ్‌కు సీఎం సీటును ఇచ్చేస్తుంది. కరద్ సౌత్‌లో అతుల్‌కి దీటైన పోటీ లేకుండా నన్ను పార్టీలోకి తీసుకోటానికి ఆరెస్సెస్‌తో ఫోనూ చేయిస్తుంది.

"వృద్ధాప్యంలో మీరు ఆలోచిస్తారు..." అంటూ ఈసారి మళ్లీ ఆ ఆరెస్సెస్ మహోదయ్ ఫోన్ చేస్తే ఒకటే చెప్పాలి...

కాంగ్రెస్‌లో వృద్ధాప్యమనేదే ఉండదని గట్టిగా చెప్పాలి!

రాజ్యమేలుతున్న మారీచ తంత్రం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

వారి మాటల్లో మారీచ తంత్రం ఉంటుంది... ఓట్ల కోసం బంగారు జింకలమని చెప్పుకున్నారు కదా! చేతలు మరీచికా సదృశాలు... అమలుకాని హామీలు ఎండమావుల్ని తలపించడం లేదా? ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలిస్తున్న కూటమి సర్కార్ అనాటమీ ఓ కుతంత్రాన్ని తలపిస్తున్నది. గుండెల్లో గోబెల్స్‌ను పూజిస్తూ జెండాపై ఊసరవెల్లిని ఎగరేసినట్టుగా వారి చర్యల తాత్పర్యం తేటతెల్లం చేస్తున్నది. ఎన్నికల ముందు చేసిన బాసలకూ, ఇప్పుడు మాట్లాడుతున్న భాషకూ పొంతన కుదరడం లేదు. దగా, మోసం, వంచన... మూడు పార్టీల కూటమికి ముచ్చటైన స్ఫూర్తి వాచకాలేమో!

గద్దెనెక్కడం వరకే ఈ దగా పర్వం పూర్తి కాలేదు. ప్రజల ప్రశ్నించే హక్కును హైజాక్ చేయడానికి డైవర్షన్ కమెండోలను రంగంలోకి దించుతున్నారు. ప్రత్యర్థుల వ్యక్తిత్వ హననం కోసం పాతాళానికి దిగజారుతున్నారు. రణనీతిని రాక్షసరీతి కమ్మేసింది. అసత్యాలను కూడిక చేసి, హెచ్చవేసి, ఆపైన అచ్చేసి మెదళ్లను కలుషితం చేస్తున్నారు. వారి పరిపాలనా వైఫల్యాలను ఎవరూ ప్రశ్నించకూడదు. ఎన్నికల మేనిఫెస్టో గురించి ఎవరూ మాట్లాడకూడదు. తాము ఎత్తిపోసిన బురదను కడుక్కునే పనికి మాత్రమే ప్రతిపక్షం పరిమితమై ఉండాలి. ఇదీ ఎత్తుగడ!

కూటమి సర్కార్ వంచనా శిల్పం ప్రజాస్వామ్యాన్ని కూడా చెరబడుతున్నది. ప్రజల ప్రాథమిక హక్కయిన భావప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తున్నది. అసభ్య పోస్టింగ్‌లనే ముద్రవేసి హేతుబద్ధమైన విమర్శలపై సైతం లాఠీ ఝుళిపిస్తున్నది. నోళ్లు నొక్కేయడానికి తెగిస్తున్న తీరు ఎమర్జెన్సీ కాలాన్ని మరిపిస్తున్నది. సమాచార విప్లవ ఫలితంగా ప్రభవించిన సోషల్ మీడియా యుగంలో ఉన్నాము. భావప్రకటనా స్వేచ్ఛను సకల జనులకూ అందుబాటులోకి తెచ్చిన యుగమిది. తప్పుడు హామీలిచ్చి తోక జాడిస్తే గతంలో మాదిరిగా ఇప్పుడు జనం మిన్నకుండిపోవడం లేదు. ప్రశ్నిస్తున్నారు. వారి ప్రశ్నలు సోషల్ మీడియాలో ప్రతిధ్వనిస్తున్నవి.

ఏ నాయకుడు ఎప్పుడేమి మాట్లాడిందీ సాక్ష్యాధారాలతో జనం చేతిలో ఉంటున్నది కనుక ఇప్పుడు పబ్లిక్ ఆడిట్‌ను ఎవరూ తప్పించుకునే పరిస్థితి లేదు. అబద్ధాల పునాదులపై మొలకెత్తిన రాజకీయ నాయకులను ఈ పబ్లిక్ ఆడిట్ భయపెడుతున్నది. ఈ భయపెడుతున్న మీడియానే భయపెట్టడానికీ, గొంతునొక్కడానికీ కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని ఇప్పుడు ఏపీలో చూస్తున్నాం. రాజకీయ పోస్టులు పెడుతున్న దాదాపు 700 మందికి గత కొద్దిరోజులుగా పోలీసులు నోటీసులు పంపించారు. అందులో 176 మందిపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. 55 మందిని చెప్పాపెట్టకుండా అరెస్టులు చేసి, స్టేషన్ మార్చి స్టేషన్‌కు తిప్పారు. హైకోర్టులో హెబియస్ కార్పస్ దాఖలైతే తప్ప చాలా అరెస్టులను చూపనే లేదు. ఎమర్జెన్సీ కాలంలో కూడా ఆంధ్ర రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు జరగలేదు.

అరెస్టయిన, కేసులను ఎదుర్కొంటున్న సోషల్ మీడియా యాక్టివిస్టుల పోస్టుల్లో అత్యధికం రాజకీయపరమైనవే. నిజమే, అసభ్య పోస్టులు అనే జాడ్యం సోషల్‌మీడియాలో ప్రమాదకరంగా మారింది. ఈ జాడ్యానికి మందు వేయాల్సిందే! కానీ ఈ పేరుతో సర్కార్ తనకు గిట్టని పోస్టులు పెడుతున్నవారిని వేటాడుతున్నది. తెలుగుదేశం పార్టీ తరఫున పని చేస్తూ బూతు పోస్టులు పెట్టే వారిపై ఇంతవరకూ ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం, వైసీపీకి అనుకూలంగా ఉండేవారినే వేటాడటం దేన్ని సూచిస్తున్నది? రాజకీయ కక్షనే కదా! ఈ కక్ష ఎంత దూరం వెళ్లిందంటే ఆర్గనైజ్డ్ క్రిమినల్స్‌పై పెట్టే సెక్షన్లను ఈ యాక్టివిస్టుల మీద పెడుతున్నారు. టెర్రరిస్టులు, స్మగ్లింగ్, డ్రగ్స్ ముఠాలు వగైరాలు ఈ వ్యవస్థీకృత నేరాల పరిధిలోకి వస్తాయి. పైగా రెండు మూడేళ్ల కిందటి పోస్టులకు కూడా ఈ యేడు జూలై 1వ తేదీన అమల్లోకి వచ్చిన బీఎన్ఎస్ సెక్షన్లను ఆపాదిస్తున్నారు. అలా చేయవద్దని ఉన్నత న్యాయస్థానాల తీర్పులున్నప్పటికీ మనవాళ్లు పట్టించుకోవడం లేదు. కొత్తగా వచ్చిన శిక్షాస్మృతి ప్రకారం సైబర్ నేరాలు ఆర్గనైజ్డ్ క్రైమ్ కేటగిరీలోకి వస్తాయి. సోషల్‌మీడియాను కూడా సైబర్ నేరాల పరిధిలోకి తీసుకొనిరావడమనేది అచ్చంగా ఏపీ రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివిటీ.

రాజకీయాలకు అనుబంధంగా పనిచేస్తూ సోషల్ మీడియాను హోరెత్తించే గ్రూపుల్లో అత్యంత ఆర్గనైజ్డ్ గ్రూప్

> అరెస్టయిన, కేసులను ఎదుర్కొంటున్న సోషల్ మీడియా యాక్టివిస్టుల పోస్టుల్లో అత్యధికం రాజకీయపరమైనవే. నిజమే, అసభ్య పోస్టులు అనే జాడ్యం సోషల్‌మీడియాలో ప్రమాదకరంగా మారింది. ఈ జాడ్యానికి మందు వేయాల్సిందే! కానీ ఈ పేరుతో సర్కార్ తనకు గిట్టని పోస్టులు పెడుతున్నవారిని వేటాడుతున్నది. తెలుగుదేశం పార్టీ తరఫున పని చేస్తూ బూతు పోస్టులు పెట్టే వారిపై ఇంతవరకూ ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం, వైసీపీకి అనుకూలంగా ఉండేవారినే వేటాడటం దేన్ని సూచిస్తున్నది? రాజకీయ కక్షనే కదా! ఈ కక్ష ఎంత దూరం వెళ్లిందంటే ఆర్గనైజ్డ్ క్రిమినల్స్‌పై పెట్టే సెక్షన్లను ఈ యాక్టివిస్టుల మీద పెడుతున్నారు. టెర్రరిస్టులు స్మగ్లింగ్, డ్రగ్స్ ముఠాలు వగైరాలు ఈ వ్యవస్థీకృత నేరాల పరిధిలోకి వస్తాయి. పైగా రెండు మూడేళ్ల కిందటి పోస్టులకు కూడా ఈ యేడు జూలై 1వ తేదీన అమల్లోకి వచ్చిన బీఎన్ఎస్ సెక్షన్లను ఆపాదిస్తున్నారు. అలా చేయవద్దని ఉన్నత న్యాయస్థానాల తీర్పులున్నప్పటికీ మనవాళ్లు పట్టించుకోవడం లేదు. కొత్తగా వచ్చిన శిక్షాస్మృతి ప్రకారం సైబర్ నేరాలు ఆర్గనైజ్డ్ క్రైమ్ కేటగిరీలోకి వస్తాయి. సోషల్‌మీడియాను కూడా సైబర్ నేరాల పరిధిలోకి తీసుకొనిరావడమనేది అచ్చంగా ఏపీ రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివిటీ.
>
> రాజకీయాలకు అనుబంధంగా పనిచేస్తూ సోషల్ మీడియాను హోరెత్తించే గ్రూపుల్లో అత్యంత ఆర్గనైజ్డ్ గ్రూప్ 'ఐటీడీపీ' అనే సంగతి జగమెరిగిన సత్యం. ఇది తెలుగుదేశం పార్టీకి అనుబంధంగా పనిచేస్తున్నదనే సంగతి కూడా తెలిసిందే. అసభ్య పోస్టులు, బెదిరింపు పోస్టులు పెట్టడంలో కూడా 'ఐటీడీపీ'దే అగ్రస్థానమని విశ్లేషకులు ఎవరైనా చెబుతారు. ఇదే విషయాన్ని ప్రముఖ రాజకీయ వ్యాఖ్యాత ప్రొఫెసర్ నాగేశ్వర్ కూడా వెల్లడించారు.

'ఐటీడీపీ' అనే సంగతి జగమెరిగిన సత్యం. ఇది తెలుగుదేశం పార్టీకి అనుబంధంగా పనిచేస్తున్నదనే సంగతి కూడా తెలిసిందే. అసభ్య పోస్టులు, బెదిరింపు పోస్టులు పెట్టడంలో కూడా 'ఐటీడీపీ'దే అగ్రస్థానమని విశ్లేషకులు ఎవరైనా చెబుతారు. ఇదే విషయాన్ని ప్రముఖ రాజకీయ వ్యాఖ్యాత ప్రొఫెసర్ నాగేశ్వర్ కూడా వెల్లడించారు. తనకు తెలిసినంత వరకూ ఏ రాజకీయ పార్టీకి చెందిన సోషల్ మీడియా విభాగం కూడా ఐటీడీపీ స్థాయిలో బూతులకూ, బెదిరింపులకూ తెగబడలేదని ఆయన వెల్లడించారు. రాజకీయ ప్రత్యర్థులనే కాదు తన లాంటి తటస్థ రాజకీయ విశ్లేషకులను కూడా వాళ్ల వదిలిపెట్టడం లేదని ఆయన వాపోయారు. తెలుగుదేశం అభిమానులు అర్ధరాత్రి, అపరాత్రి కూడా ఫోన్లు చేసి తిడుతున్నారని ఆరోపించారు. తమకు గిట్టనివారు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా కనిపించకపోతే... ఈ-మెయిల్ల ద్వారా బూతు పంచాంగాలు పంపించడం ఆ పార్టీ అభిమానులకు రివాజుగా మారింది. ఈ పత్రిక సంపాదకుడు కూడా ఇటువంటి బూతు మెయిల్ల బాధితుడే!

'ఐటీడీపీ' వంటి నెంబర్ వన్ ఆర్గనైజ్డ్ సోషల్ మీడియా గ్రూప్ సభ్యులపై కేసు కూడా పెట్టలేదంటేనే ప్రభుత్వ ఉద్దేశమేమిటో స్పష్టమవుతున్నది. తమ రాజకీయ ప్రత్యర్థుల పైనా, వారి కుటుంబ సభ్యుల పైనా ఏ తరహా పోస్టులను ఈ గ్రూప్ సభ్యులు పెట్టారో తెలియదా? ఎంతగా వేధించారో తెలియదా? ఈ ఉద్యమకారుల సృజనాత్మకత కూడా చాలా పదునైనది. పేర్లను మార్చుకొని పరకాయ ప్రవేశం చేసి పెట్టిన కామెంట్లతో కల్లోలం సృష్టించడం వారికో హాబీ. వర్రా రవీందర్ రెడ్డి అనే వైసీపీ అభిమాని పేరుతో జగన్ మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యుల మీద ఓ తెలుగుదేశం అభిమాని పెట్టిన పోస్టులు కూడా అటువంటి కల్లోలాన్నే సృష్టించాయి. దీనిపై దర్యాప్తు జరిపిన పోలీసులు అది రవీందర్ రెడ్డి పెట్టిన పోస్టు కాదనీ, మరొకరు పెట్టిన ఫేక్ పోస్ట్ అనీ తేల్చారు. ఆ రంగులు మార్చిన మారీచుడిని కూడా గుర్తించారు.

జరిగింది ఇదైతే... తెలుగుదేశం పార్టీ విభాగాలన్నీ కలిసి చేసిన నీచప్రచారం మరొకటి! నిన్న అసెంబ్లీలో కూడా ఈ దుష్ప్రచారపు బాణీనే ముఖ్యమంత్రి చంద్రబాబు అందిపుచ్చుకున్నారు. అసెంబ్లీ చరిత్రలో ఇంతకంటే బాధాకరమైన సన్నివేశం మరొకటి కనిపించదు. 'ఐటీడీపీ' చేయించిన తప్పుడు ప్రచారానికి ముఖ్యమంత్రి అసెంబ్లీలోనే తందానా అన్నారు. తల్లి మీద, చెల్లి మీద జగన్ నీచమైన ప్రచారం చేయించారని దారుణమైన నిందను మోపారు. ఇది హీనమైన ప్రచారమనీ, మీ పార్టీ వాళ్లే సృష్టించిన పన్నాగమనీ నిజంగానే మీకు తెలియదా బాబు గారూ! మీ సతీమణి భువనేశ్వరమ్మను అసెంబ్లీలో ఎవరో ఏదో అన్నారని మీరు వెక్కి వెక్కి ఏడ్చారే! మరి అసెంబ్లీలో ఒక దుష్ప్రచారాన్ని ఉటంకిస్తూ జగన్ తల్లి, చెల్లెలి ప్రస్తావన స్వయంగా మీరే తేవడం సమంజసమేనా?

ఎన్నికల్లో గెలవడం కోసమే అలవిగాని హామీలిచ్చామనే సంగతి చంద్రబాబుకు స్పష్టంగా తెలుసు. ఆ వాగ్దానాలను నెరవేర్చలేమనే విషయాన్ని ఆయన నిన్నటి అసెంబ్లీ ప్రసంగంలో నర్మగర్భంగా చెప్పుకొచ్చారు. హామీల అమలుకు డబ్బుల్లేవు గానీ ఆలోచనలున్నాయని, ఆలోచనల్లోంచే సంపద సృష్టి జరుగుతుందనీ, అప్పుడు గానీ సంక్షేమ కార్యక్రమాలు అమలు కాబోవనేది ఆయన ప్రసంగంలోని సారాంశం. ఆయన మేధలో ఏయే విత్తనాలను నాటుకున్నారో మనకు తెలియదు. అవి మొలకెత్తి మొక్కగా మారి చెట్టయ్యేది ఎప్పటికో కూడా చెప్పలేము. ఆ చెట్టు పుష్పించి ఫలించిన రోజున ఆ ఫలాలను పేద వర్గాలకు అందజేయడం జరుగుతుందనే భరోసాతో ఎదురుచూడక తప్పదు. అందరికీ అంత ఓపిక ఉండకపోవచ్చు. తప్పుడు హామీలు ఇచ్చి మోసం చేశారని జనం తిరగబడవచ్చు. అందుకు విరుగుడు మంత్రమే... ఈ గోబెల్స్ నాజీల తరహా విషప్రచారం! ఫాసిస్టు పాలనను తలదన్నేలా అర్ధరాత్రి అరెస్టులు, బెదిరింపులు!

> ఎన్నికల్లో గెలవడం కోసమే అలవిగాని హామీలిచ్చామనే సంగతి చంద్రబాబుకు స్పష్టంగా తెలుసు. ఆ వాగ్దానాలను నెరవేర్చలేమనే విషయాన్ని ఆయన నిన్నటి అసెంబ్లీ ప్రసంగంలో నర్మగర్భంగా చెప్పుకొచ్చారు. హామీల అమలుకు డబ్బుల్లేవు గానీ ఆలోచనలున్నాయని, ఆలోచనల్లోంచే సంపద సృష్టి జరుగుతుందనీ, అప్పుడు గానీ సంక్షేమ కార్యక్రమాలు అమలు కాబోవనేది ఆయన ప్రసంగంలోని సారాంశం. ఆయన మేధలో ఏయే విత్తనాలను నాటుకున్నారో మనకు తెలియదు. అవి మొలకెత్తి మొక్కగా మారి చెట్టయ్యేది ఎప్పటికో కూడా చెప్పలేము. ఆ చెట్టు పుష్పించి ఫలించిన రోజున ఆ ఫలాలను పేద వర్గాలకు అందజేయడం జరుగుతుందనే భరోసాతో ఎదురుచూడక తప్పదు. అందరికీ అంత ఓపిక ఉండకపోవచ్చు. తప్పుడు హామీలు ఇచ్చి మోసం చేశారని జనం తిరగబడవచ్చు. అందుకు విరుగుడు మంత్రమే... ఈ గోబెల్స్ నాజీల తరహా విషప్రచారం! ఫాసిస్టు పాలనను తలదన్నేలా అర్ధరాత్రి అరెస్టులు, బెదిరింపులు!
>
> జగన్ ఐదేళ్లపాటు విధ్వంస పాలన చేశాడనే విష ప్రచారాన్ని ఐదేళ్లపాటు తెలుగుదేశం నేతలు, యెల్లో మీడియా, 'ఐటీడీపీ' బృందాలు నిర్వహించాయి. నిరుపేద బిడ్డలకు కూడా నాణ్యమైన విద్యను అందించే ప్రయత్నాన్ని ఈ కూటమి విధ్వంస పాలనగా పరిగణిస్తున్నది. పల్లెపల్లెకూ, గడప గడపకూ ప్రజావైద్యాన్ని అందుబాటులోకి తేవడం ఈ ముఠాకు విధ్వంసంగా కనిపించింది. ఐదేళ్లలో రెండు లక్షల డెబ్బయ్ మూడువేల కోట్ల ప్రజాధనాన్ని ప్రజల చేతికి చేర్చడమే వీరి దృష్టిలో విధ్వంస పాలనైందని అనుకోవాలి.

జగన్ ఐదేళ్లపాటు విధ్వంస పాలన చేశాడనే విష ప్రచారాన్ని ఐదేళ్లపాటు తెలుగుదేశం నేతలు, యెల్లో మీడియా, 'ఐటీడీపీ' బృందాలు నిర్వహించాయి. నిరుపేద బిడ్డలకు కూడా నాణ్యమైన విద్యను అందించే ప్రయత్నాన్ని ఈ కూటమి విధ్వంస పాలనగా పరిగణిస్తున్నది. పల్లెపల్లెకూ, గడప గడపకూ ప్రజావైద్యాన్ని అందుబాటులోకి తేవడం ఈ ముఠాకు విధ్వంసంగా కనిపించింది. ఐదేళ్లలో రెండు లక్షల డెబ్బయ్ మూడువేల కోట్ల ప్రజాధనాన్ని ప్రజల చేతికి చేర్చడమే వీరి దృష్టిలో విధ్వంస పాలనైందని అనుకోవాలి. వృద్ధాప్యంలో ఉన్న వారి ఇంటి తలుపు తట్టి, పింఛన్ డబ్బులు చేతిలో పెట్టడం అరాచక పాలనగానే కనిపించింది. గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేసి, పదిహేను వేల మినీ రాజధానులను ఏర్పాటు చేయడం వినాశకర పాలనగా కనిపించింది. ఏకైక రాజధానిగా అమరావతి ఉండాలేగానీ, పదిహేను వేల పల్లె రాజధానులెందుకని వారికి చిరాకు కలిగి ఉంటుంది.


ఏకబిగిన 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుమతులు తెచ్చి, అందులో ఐదు కాలేజీలను ప్రారంభించడం విధ్వంసం కాక మరేమిటి? నాలుగు భారీ ఓడరేవులకు పనులు ప్రారంభించడమేమిటి? పది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం ఎందుకోసం? రైతుల కోసం ఊరూరా 'ఆర్బీకే' కేంద్రాలు అవసరమా? ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిని ఒక జిల్లాగా పునర్విభజించి పాలనా సంస్కరణలకు తెగబడటమేమిటి? అంతకు ముందు పద్నాలుగేళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న బాబుగారు ఒక్క జిల్లానైనా కొత్తగా చేర్చారా? అది కదా పాడుపంటే! ...ఇటువంటి అనేకానేక కారణాల రీత్యా జగన్‌మోహన్ రెడ్డి విధ్వంస పాలన చేశారనే ప్రచారాన్ని కూటమి ఉద్యమ స్థాయిలో చేపట్టింది. ముఖ్యమంత్రి నిన్నటి అసెంబ్లీ ప్రసంగంలో కూడా దానిని కొనసాగించారు. అప్పుల గురించి, అభివృద్ధి గురించి తెలుగుదేశం... యెల్లో మీడియా కూటమి చేసిన ఆరోపణలకు ఇప్పటికి కొన్ని డజన్ల పర్యాయాలు అధికారిక గణాంకాల ఉటంకింపులతో వైసీపీ వాళ్లు దీటైన సమాధానాలు చెప్పారు. మొన్నటి బడ్జెట్ తర్వాత రెండు గంటల సుదీర్ఘ సమయాన్ని వెచ్చించి జగన్ మోహన్‌రెడ్డి కూటమి వాదనను పూర్వపక్షం చేశారు. అయినా సరే చంద్రబాబు నిన్న అదే పాటను మళ్లీ పాడారు. పాడిన పాటే పాడటంపై తెలుగులో మనకు చాలా సామెతలున్నాయి!

vardhelli1959@gmail.com

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గల్ఫ్ వలసజీవిత సారం

అభిప్రాయం





డా॥ టి. సంపత్ కుమార్

'ఆడు జీవితం' అనే మలయాళ పదం గత కొన్ని నెలల నుండి ప్రపంచమంతా తెలిసిపోతూ ఉంది. మలయాళీ భాషలో మొదటిసారి 2008లో ఈ పేరుతో వచ్చిన నవల ఎంతో ప్రజాదరణ పొంది రెండు వందల యాభైకి పైగానే ముద్రణలను పొందింది. ఇది భారతీయ సాహితీ ప్రపంచంలో ఒక గొప్ప విషయం. వలస వెళ్ళిన నజీబ్ అనే ఒక మలయాళీ దుర్భరమైన జీవితానుభవాలను ఆధారంగా... 'బెన్యామిన్' అనే మలయాళ రచయిత 'ఆడు జీవితం' నవల రాశారు. కేరళ సాహిత్య అకాడెమీ 2009లో ఈ పుస్తకానికి పురస్కారాన్నిచ్చి గౌరవించింది.

అత్యంత పేరు ప్రఖ్యాతులను సంపాదించిన ఈ నవల కేరళ చలనచిత్ర రంగాన్నీ వదలలేదు. ఫలితంగా 'ఆడు జీవితం (ది గోట్ లైఫ్)' అనే సినిమా తయారై ఈ సంవత్సరం మార్చిలో విడుదలైంది. ప్రింట్ రూపంలో వచ్చిన పుస్తకానికి ఎంత మన్నన దొరికిందో అంతకి మించి సినిమాకీ పేరు వచ్చింది. అవార్డులతో పాటు, వందకోట్లు వసూళ్లని దాటేసి చరిత్రపై చరిత్రను లిఖిస్తూ ముందుకు దూసుకుపోతోంది. ముందు ముందు ఇంకా ఏయే రూపాల్లో పేరు ప్రఖ్యాతులను సంపాదించుకొంటుదో కాలమే చెబుతుంది.

ఆడు జీవితం పలు భారతీయ బాషల్లోకి అనువాదమైంది. కొన్ని ఇతర దేశాల బాష (థాయ్, నేపాలీ, అరబిక్)ల్లో కూడా వచ్చింది. మన రెండు తెలుగు రాష్ట్రాల నుండి లక్షలమంది గల్ఫ్ దేశాల్లో ఉన్నారు. నలభై యాభై ఏళ్లుగా వలస వెళుతున్నారు. తిరిగొస్తున్నారు. మూడు తరాల నుండి వెళుతూ వస్తున్నారు. వీరిలో ఎందరో నజీబ్ మాదిరిగా ఎన్నో అవస్థలు పడ్డారు. హింసలకు గురయ్యారు. ఎడారుల్లో దుర్భరమైన జీవితాలను గడిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల్ని





మెరుగు పరచడానికి నానా కష్టాలు పడి ఎంతో కొంత సంపాదించుకొని ప్రాణాల్ని చేతిలో పెట్టుకొని తిరిగొస్తున్నారు. వెళ్ళినవారికి సంబంధించిన ఎన్నో వైవిధ్యమైన నేపథ్యాలు దొరుకుతాయి. నైపుణ్యం లేని వారు, చదువు కొన్నవారు, ఒంటరి మహిళలు, యువ సముదాయాలకు చెందిన వారు ఎన్నోరకాల పనులు చేసి జీవితానుభవాలను జీర్ణించుకొన్నారు. ఇవి అక్షర రూపంలో తెలుగు సాహిత్యలోకంలోకి అడుగుపెట్టాలి.

మా పక్క ఊళ్ళో ఉండే భీమన్న తన కష్టాల్ని చెబితే కళ్ళల్లో నీళ్లొస్తాయి. ఎక్కడో తనకు ఏమాత్రం తెలియని ఎడారిలో ఒంటెల్ని చూసుకొనే పని. ఒంటెల పాలు పితకడం కూడా రోజువారీ పనుల్లో ఒకటి. అయితే ఒంటెల ఎత్తు గేదెలు, ఆవుల కన్నా ఎంతో ఎక్కువ. కాబట్టి పాలు పితికే వారు కూర్చోలేరు, నిల్చోనూలేరు. మధ్యలో కాళ్లని కొంచెం వంచి పాలని పితకాలి. ఈ విషయాన్ని భీమన్న చెబుతుంటే ఆయన కళ్ళలో తడి, మాటల్లో వేదన! గల్ఫ్ దేశాల్లో పనిచేసి వచ్చిన వారి జీవితాల్లోకి రచయితలు, రచయిత్రులు తొంగిచూడాలి. ఓపిగ్గా కూర్చుని వారి జీవితానుభవాల్ని విని కథలు, నవలలు, కవితలుగా రాయాలి. ఒక విహంగ దృష్టితో చూస్తే ఇలాంటి కథా వస్తువులపై రావలసినంతగా రచనలు రాలేదనిపిస్తుంది.

ఈ మధ్య పత్రికల ద్వారా చాలా కథలు, నవలల పోటీల నిర్వహణ జరుగుతోంది. గల్ఫ్ వలస ప్రజలపైనే ప్రత్యేక పోటీలు నిర్వహిస్తే ఎన్నో వైవిధ్య జీవన రేఖలు, చిత్రాలు అక్షరాల్లో రూపం పోసుకొని పాఠకులకు అందించవచ్చు. ఎంతో విలువైన జీవన పార్శ్వాలు దొరుకుతాయి. పత్రికలు ఈ విషయాన్ని ఆలోచించి కొన్ని పోటీలు వీటినే అక్షరబద్ధం చేయడానికి పెడితే తెలుగు సాహిత్య సంపద వైవిధ్యాన్ని సంతరించుకుంటుంది. ఒక సముదాయపు జీవితానుభవాలను తెలుసుకొన్న వారమవుతాము.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు

అసలు సంపద

జ్యోతిర్మయం

శీలం వలన ధర్మం నిలుస్తుంది. ధర్మం వలన సత్యం, సత్యం వలన ప్రవర్తన, ప్రవర్తనతో సంపద సిద్ధిస్తాయి. కాబట్టి మనిషికి శీలమే ముఖ్యం. మంచి మనసు, నిర్మలమైన ఆలోచనలు కలిగి, కపటబుద్ధి లేకుండా ఉండటం, పరోపకార బుద్ధి కలిగివుండటం శీలం అనుకోవచ్చు. శీల సంపదతో లోకంలో ఎందరో గౌరవం, శాశ్వతత్వం పొందారు.

ప్రహ్లాదుడు హిరణ్య కశిపుని కుమారుడు. వినయానికి మారు పేరు. పెద్దలంటే అమితమైన గౌరవం. సత్యసంధుడు. తన శీలం మూలంగానే ఇంద్రుడి రాజ్యాన్ని లోబరచుకున్నాడు. ధర్మబద్ధంగా ముల్లోకాలను తన వశం చేసుకున్నాడు. ఇంద్రుడు తన రాజ్యాన్ని పొందే ఉపాయం చెప్పమని శుక్రుణ్ణి అడిగితే, అతడు ప్రహ్లాదుని దగ్గరకే వెళ్ళమంటాడు. ఇంద్రుడు బ్రాహ్మణ వేషంలో వెళ్లి ప్రహ్లాదుని శిష్యుడిగా చేరి సేవలు చేస్తూ ఉంటాడు. కొంతకాలం గడిచాక, ప్రహ్లాదుడు అతని సేవలు మెచ్చుకుని ఏం కావాలో కోరుకొమ్మంటాడు. ఇంద్రుడు 'ముల్లోకాలు మీ అధీనంలోకి ఎలా వచ్చాయో తెలుసుకోవాలనుంది' అని అడుగుతాడు.

అప్పుడు ప్రహ్లాదుడు 'నేను ఎప్పుడూ రాజును అని చెప్పుకోను. అహంకారంతో ఎవరినీ నొప్పించను. పెద్దలకు, మహానుభావులకు ధనం ఇచ్చి ఆదరిస్తుంటాను. నా నడవడిని అందరూ మెచ్చుకుంటారు. అయినా నేను గర్వించను. నా ప్రవర్తనతోనే ముల్లోకాలు నాకు సిద్ధించాయి' అన్నాడు. ఇంద్రుడు, నీ శీలాన్ని నా కిమ్మని అడిగాడు. అడిగిన వారికి లేదనటం తెలియని ప్రహ్లాదుడు తన శీలాన్ని దానం చేశాడు. ప్రహ్లాదుని శీలం పొంది ఇంద్రుడు వెళ్ళగానే, ప్రహ్లాదుని శరీరం నుండి ఒక తేజోరూపం బయటకి వచ్చింది. ప్రహ్లాదుడు నువ్వెవరని అడిగితే 'నువ్వు దానం చేసిన వ్యక్తి దగ్గరకు వెళ్ళిపోతున్నాను. నేను నీ శీలాన్ని' అంది ఆ ఆకారం. తర్వాత శరీరం నుండి మరికొన్ని తేజోమయ రూపాలు వెళ్లిపోతుంటే ప్రహ్లాదుడు వాటి పేర్లు అడిగి తెలుసుకున్నాడు.

అవి ధర్మం, సత్యం, సద్వర్తనం, బలం! అది విని ప్రహ్లాదుడు ఆశ్చర్యపోతాడు. చివరిగా, ఒక మంచి రూపవతి ప్రహ్లాదుని శరీరం నుండి వెళ్లిపోతుంటే అతడు నువ్వెవరివి అనడిగాడు. 'నేను సిరిని. ధర్మం, సత్యం, వంటి సద్గుణాలు ఎక్కడున్నాయో అక్కడికే వెళ్ళిపోతాను. ఇంద్రుడే కపట రూపంలో నీ దగ్గరికి వచ్చాడు. నువ్వు నీ శీల సంపదను కోల్పోయావు' అని చెప్పి వెళ్ళిపోతుంది. ప్రహ్లాదుడు అప్పుడు ఎంతో దుఃఖించాడని మన పురాణాలు చెబుతున్నాయి.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో గౌడ కులస్తులు నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ సూరమాంబ-శ్రీకంఠమహేశ్వరస్వామి బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జాతీయ రహదారి మీదుగా బోనాలతో వెళ్తున్న మహిళలు

మళ్లీ ర్యాగింగ్ కలకలం

- 'పాలమూరు' ఘటనతో తల్లిదండ్రుల్లో ఆందోళన
- గాంధీతో పాటు ఇతర వైద్య కళాశాలల్లోనూ జూనియర్లకు సీనియర్ల వేధింపులు!
- గత ఏడాది మూడు కాలేజీల్లో వెలుగుచూసిన వికృత చేష్టలు
- ప్రైవేటు కాలేజీల్లో జరుగుతున్నా బయటకు పొక్కనీయని యాజమాన్యాలు
- వైద్యవిద్య యంత్రాంగం పర్యవేక్షణ లోపంపై విమర్శలు
- నామమాత్రంగా మారిన ర్యాగింగ్ నిరోధక కమిటీలు
- యూజీసీ నిబంధనలు సైతం బేఖాతరు

సాక్షి, హైదరాబాద్: మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ భూతం మళ్లీ పంజా విసురుతోంది. సుప్రీంకోర్టు తీర్పు (2009), 1956 యూజీసీ చట్టం సెక్షన్ 36, సబ్‌సెక్షన్ (1) ప్రకారం విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిషేధం. అయినా ఆకతాయిలైన సీనియర్ విద్యార్థులు అక్కడక్కడా శ్రుతి మించి ప్రవర్తిస్తున్నారు. ముఖ్యంగా మెడికల్ కాలేజీల్లో ఇలాంటి ఘటనలు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి. గత ఏడాది రాష్ట్రంలోని గాంధీ, కాకతీయ, మహబూబాబాద్ వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ చోటు చేసుకుంది. తాజాగా పాలమూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ వ్యవహారం వెలుగులోకి రావడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. మరోవైపు గాంధీ మెడికల్ కాలేజీలోనూ ర్యాగింగ్ జరుగుతోందని, అయితే బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. అలాగే మరికొన్ని ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోనూ ర్యాగింగ్ ఇబ్బందికరంగా మారిందని అంటున్నారు. కొత్తగా ఎంబీబీఎస్‌లో చేరిన విద్యార్థులను సీనియర్లు ర్యాగింగ్ పేరిట వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అధికారులు కఠినచర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా, ర్యాగింగ్ ఘటనలు ఆగడం లేదనే చర్చ జరుగుతోంది.



ర్యాగింగ్ పేరిట వికృత చేష్టలు

రాష్ట్రవ్యాప్తంగా గత నెల నుంచి ఎంబీబీఎస్ మొదటి ఏడాది తరగతులు ప్రారంభమయ్యాయి. కొత్త విద్యార్థులను రెండు, మూడో ఏడాది చదివే కొందరు ఎంబీబీఎస్ విద్యార్థులు ర్యాగింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ర్యాగింగ్‌కు పాల్పడితే కాలేజీ నుంచి తొలగించాలన్న నిబంధనలు ఉన్నాయని, కానీ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని సస్పెన్షన్లకే పరిమితం అవుతున్నామని వైద్య విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. గత ఏడాది గాంధీ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ సందర్భంగా కొందరు సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను అర్ధరాత్రి 2 గంటల సమయంలో తమ హాస్టల్ గదులకు రప్పించి వారితో బలవంతంగా మద్యం, సిగరెట్లు తాగించినట్లు తేలింది. కొందరితో బట్టలు విప్పించి డ్యాన్స్‌లు చేయించారనే ప్రచారం కూడా జరిగింది. వారు బూతులు తిడుతూ, బాధితులతో కూడా బూతులు మాట్లాడించారని తేలింది. కొందరు విద్యార్థినిలను కూడా ర్యాగింగ్ చేసినట్లు ప్రచారం జరిగింది. 'పాలమూరు'లో విద్యార్థులతో గోడకుర్చీ వేయించడం లాంటి దారుణ చర్యలకు పాల్పడినట్లు తెలిసింది. ఇలా రాష్ట్రంలోని పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో కూడా ర్యాగింగ్ సంఘటనలు జరుగుతున్నా అవి బయటకు పొక్కకుండా యాజమాన్యాలు జాగ్రత్త వహిస్తున్నాయని అంటున్నారు. అయితే కళాశాలలపై నిఘా వేసి ర్యాగింగ్‌ను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ఈ విషయంలో నిర్లిప్తంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. కొన్ని కాలేజీలు డీఎంఈ కార్యాలయానికి సమాచారం ఇవ్వడంలేదని తెలిసింది. కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఉన్నా అవి నామమాత్రంగా మారాయని అంటున్నారు. ర్యాగింగ్ ఘటనలపై వైద్యవిద్య డైరెక్టర్ (డీఎంఈ) డాక్టర్ వాణి వివరణ కోసం ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

క్రిమినల్ చర్య అన్న యూజీసీ

ర్యాగింగ్‌ను నేరపూరిత (క్రిమినల్) చర్యగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ పేర్కొంది. దీనిపై ఫిర్యాదులకు ప్రత్యేకంగా మానిటరింగ్ సెల్ నంబర్‌ను కూడా ఏర్పాటు చేసింది. ర్యాగింగ్‌ను నిరోధించాలంటూ ఉన్నత విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లకు, వర్సిటీల వీసీలకు స్పష్టమైన ఆదేశాలున్నాయి.

యూజీసీ నిబంధనలు..

- విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీని, యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్‌ను, యాంటీ ర్యాగింగ్ సెల్‌ను ఏర్పాటు చేయాలి.
- ర్యాగింగ్ శ్రుతిమించి విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన పక్షంలో సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్, వర్సిటీ రిజిస్ట్రార్లను విచారణకు పిలుస్తారు. వీరు నేషనల్ యాంటీ ర్యాగింగ్ మానిటరింగ్ కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.
- విద్యాసంస్థలు, విద్యార్థుల హాస్టళ్లు, కీలక ప్రాంతాల్లో సీసీ టీవీలు ఏర్పాటు చేయాలి.
- విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్‌లు, సెమినార్లు నిర్వహించాలి.
- యాంటీ ర్యాగింగ్ మానిటరింగ్ కమిటీ ఆదేశాల ప్రకారం జూనియర్లు, సీనియర్ల మధ్య అంతరాన్ని పూడ్చేందుకు మెంటార్‌షిప్‌ను ప్రోత్సహించాలి.
- లీగల్ కౌన్సెలింగ్ ద్వారా ర్యాగింగ్ నిరోధక చట్టాలు, శిక్షలపై అవగాహన కల్పించాలి.

విద్యార్థికి గుండు కొట్టించిన అసిస్టెంట్ ప్రొఫెసర్

- ఖమ్మం మెడికల్ కాలేజీలో కలకలం
- నల్లగొండలో జూనియర్ విద్యార్థులపై ర్యాగింగ్– ముగ్గురు విద్యార్థులు, ఓ జూనియర్ డాక్టర్ సస్పెండ్



ఖమ్మం వైద్యవిభాగం/ నల్లగొండ టౌన్: ఖమ్మం మెడికల్ కళాశాలలో ఓ విద్యార్థి భిన్నంగా హెయిర్ కట్ చేయించుకున్నాడని ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏకంగా విద్యార్థికి గుండు కొట్టించాడు. దీనిపై విద్యార్థి ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశాడు. ఇక నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జరిగిన ర్యాగింగ్ ఘటనలో విద్యార్థులతో పాటు జూనియర్ డాక్టర్‌ను సైతం సస్పెండ్ చేశారు. వివరాలు..

ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థికి ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ గుండు కొట్టించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సదరు అసిస్టెంట్ ప్రొఫెసర్ బాయ్స్ హాస్టల్ యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆఫీసర్ కావడం గమనార్హం. ఖమ్మం మెడికల్ కళాశాలలో ఈ ఏడాది చేరిన ములుగుకు చెందిన విద్యార్థి ఒకరు చైనా దేశస్తుల మాదిరి కటింగ్ చేయించుకున్నాడు. దీన్ని గమనించిన సెకండ్ ఇయర్ విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసిస్తూ ఇలా వ్యవహరించొద్దని సూచించడంతో ఆ విద్యార్థి సెలూన్‌కు వెళ్లి జుట్టు ట్రిమ్ చేయించుకున్నాడు. కాగా, ఈ విషయం బాయ్స్ హాస్టల్ యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆఫీసర్‌గా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ (సర్జన్)కు తెలియడంతో ఆగ్రహించిన ఆయన విద్యార్థిని సెలూన్‌కు తీసుకెళ్లి ఏకంగా గుండు గీయించాడు. దీంతో మనస్తాపం చెందిన సదరు విద్యార్థి కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను హాస్టల్ విధుల నుంచి తప్పించారు. కాగా, ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఘటనను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ దృష్టికి తీసుకెళ్లడమే కాక విచారణకు ఫోర్‌మెన్ కమిటీని నియమించామని తెలిపారు.

నల్లగొండ కాలేజీలో ర్యాగింగ్ కలకలం!

నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జూనియర్ విద్యార్థినులను ర్యాగింగ్ చేశారనే ఆరోపణలతో ముగ్గురు సీనియర్ విద్యార్థులను, ఒక జూనియర్ డాక్టర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. సీనియర్ మెడికోలతో పాటు జూనియర్ డాక్టర్ కూడా విద్యార్థినులను ర్యాగింగ్ పేరుతో ఇబ్బందులకు గురిచేశారన్న ఫిర్యాదుతో ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం విద్యార్థిని నెల రోజులు, ఇద్దరు నాలుగో సంవత్సరం విద్యార్థులను ఆరు నెలలు, ఒక జూనియర్ డాక్టర్‌ను మూడు నెలలపాటు సస్పెండ్ చేసినట్లు కాలేజీ వర్గాల ద్వారా తెలిసింది. అయితే మొదటిసారి ర్యాగింగ్ విషయం బహిర్గతం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ర్యాగింగ్ విషయంపై కళాశాల ప్రిన్సిపల్‌ను వివరణ కోరడానికి 'సాక్షి' ప్రయత్నించగా స్పందించలేదు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్య



స్వాతి

సంగారెడ్డి టౌన్: గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సంగారెడ్డి మండలం కొత్లాపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 9వ తరగతి చదువుతున్న స్వాతి (14) శనివారం ఉదయం పాఠశాల రెండో అంతస్తు భవనంలోని గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉంది. సమాచారం అందుకున్న డీఎస్పీ సత్తయ్య ఘటన స్థలానికి చేరుకొని.. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతురాలి కుటుంబం మదీనాగూడ ఎంఏ నగర్ కాలనీలో నివాసం ఉంటోంది. స్వాతి తండ్రి పండు రాజు, తల్లి దివ్యవాణి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. కాగా, తమ కూతురు ఆత్మహత్య వెనుక హాస్టల్ వారిపైనే అనుమానం ఉందని మృతురాలి తల్లి ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ జరిపించాలని ఆమెతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని వార్డెన్ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

15 ఏళ్లకే నూరేళ్లు

- గుండెజబ్బుతో బాలిక మృతి



శ్రావిక

అక్కన్నపేట(హుస్నాబాద్): పదిహేనేళ్ల బాలిక గుండె జబ్బుతో కుప్పకూలి తుదిశ్వాస వదిలింది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో శనివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన పిచర లక్ష్మి-సత్యనారాయణరావు దంపతులకు ఇద్దరు సంతానం. రెండ్రోజులుగా జ్వరంతో బాధపడుతున్న పెద్ద కుమార్తె శ్రావిక (15) శనివారం ఇంట్లో టీ తాగుతున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందింది. శ్రావిక హుస్నాబాద్ ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది.

చిన్న పార్టీలే... నిర్ణేతలు!

ఆసక్తికరంగా మహారాష్ట్ర పోరు

ఇరు కూటముల్లోనూ గుబులు

మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల పోరు ప్రధానంగా అధికార మహాయుతి, విపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటముల మధ్యే కేంద్రీకృతమైంది. కానీ అంతిమ ఫలితాన్ని మాత్రం చిన్న పార్టీలు, స్వతంత్రులే తేల్చే సూచనలు కన్పిస్తుండటం విశేషం. ఈ జాబితాలో మజ్లిస్, ఎంఎన్ఎస్, వీబీఏ వంటి పార్టీలు ప్రముఖంగా కన్పిస్తున్నాయి. వీటికి, స్వతంత్రులకు కలిపి ఈసారి కనీసం 30 స్థానాలకు పైగా రావచ్చని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగి, హంగ్ వచ్చే పక్షంలో అవి కింగ్‌మేకర్లుగా మారినా ఆశ్చర్యం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకూ నవంబర్ 20న ఒకే విడతలో పోలింగ్ జరగనుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో చిన్న పార్టీల హల్‌చల్ రెండు కూటముల్లోనూ గుబులు రేపుతోంది. దాంతో అందరి దృష్టీ 23న వెల్లడయ్యే ఫలితాలపైనే కేంద్రీకృతమైంది...!



రాజ్ ఠాక్రే



అసదుద్దీన్ ఒవైసీ



ప్రకాశ్ అంబేడ్కర్

మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల పోరు పరాకాష్టకు చేరింది. అధికారం నిలుపుకునేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్న బీజేపీ సారథ్యంలోని మహాయుతి, దాన్ని ఎలాగైనా గద్దె దించేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్న కాంగ్రెస్ నాయకత్వంలోని ఎంవీఏ కూటములకు చిన్న పార్టీలు పెద్ద సమస్యగా పరిణమించాయి. జరుగుతున్నది ద్విముఖ పోరే అయినా రెండు కూటముల భాగ్యరేఖలనూ ఈ 'తృతీయ శక్తులు' నిర్దేశించేలా కన్పిస్తుండటం ఆసక్తికరంగా మారింది. ఈ చిన్న పార్టీల్లో ఒక్కోదానికీ ఒక్కో ప్రాంతంలో చెప్పుకోదగ్గ పట్టుంది.



మనోజ్ జరంగే

అగాడీకి ఎంఎన్ఎస్ గుబులు

ఈ ఎన్నికల్లో ప్రబల శక్తిగా కన్పిస్తున్న **రాజ్ ఠాక్రే సారథ్యంలోని మహారాష్ట్ర** నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) విపక్ష ఎంవీఏ **కూటమికి గుబులు పుట్టిస్తోంది.** రాజధాని ముంబై, శివార్లలో ఎంఎన్ఎస్ హవా అంతా **ఇంతా కాదు. ముంబైలోని 25** స్థానాల్లో ఎంఎన్ఎస్ బరిలో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా **కనీసం మరో 36 అసెంబ్లీ** స్థానాల్లో పార్టీ గట్టి ప్రభావం చూపడం ఖాయంగా **కన్పిస్తోంది. ముంబైలోని** 25 స్థానాల్లో మహాయుతి కూటమి నుంచి శివసేన (షిండే) **12, బీజేపీ 10** చోట్ల పోటీ పడుతున్నాయి. ఎంఎన్ఎస్‌ను బీజేపీకి **మిత్రపక్షంగా పరిగ**ణిస్తారు. రాజ్ ఠాక్రేను ప్రసన్నం చేసుకునే ప్రయత్నా**ల్లో భాగంగా** ఆయన కుమారుడు అమిత్ పోటీ చేస్తున్న మాహిం**లో కూటమి** ధర్మాన్ని కూడా బీజేపీ పక్కన పెట్టింది! అక్కడ షిం**డే సేన** అభ్యర్థిని కాదని మరీ అమిత్‌కే బీజేపీ నేతలు బాహాట**ంగా** మద్దతు పలుకుతున్నారు! ఇది ఆ రెండు పార్టీల లోపాయికారీ అవగాహనకు, బీజేపీ వ్యూహ చతురతకు నిదర్శనమని పరిశీలకులు అంటున్నారు.

కింగ్‌మేకర్ ఆశల్లో ఒవైసీ

అసదుద్దీన్ ఒవైసీకి చెందిన మజ్లిస్‌కు కూడా మహారా**ష్ట్రలో చెప్పు**కోదగ్గ పట్టే ఉంది. ముఖ్యంగా ఔరంగాబాద్‌తో **పాటు ముంబైలోని** ముస్లిం ప్రాబల్య ప్రాంతాల్లో పార్టీ హవా కొనసాగుతుంది. **2019లో 44 అసెం**బ్లీ స్థానాల్లో పోటీ చేసిన మజ్లిస్ ఈసారి కేవలం 16 **స్థానాల్లోనే బరిలో ఉంది.** కాకపోతే అవన్నీ ముస్లిం ప్రాబల్య స్థానాలే. వాటిలో చెప్పు**కోదగ్గ స్థానాల్లో విజయం**పై పార్టీ నమ్మకంగా ఉంది. అంతేగాక మిగతా చోట్ల మ**జ్లిస్ చీల్చే ముస్లిం ఓట్లు అగాడీ** కూటమి అభ్యర్థుల విజయావకాశాలకు గట్టిగా గండి కొ**ట్టేలా కన్పిస్తున్నాయి. ''హంగ్ వచ్చి** ఎంవీఏ కూటమి గనక మెజారిటీకి కొన్ని సీట్ల దూరంలో **ఆగిపోతే మేం గెలవబోయే సీట్లే కీలకం** కావచ్చు. అప్పుడు మజ్లిస్ కింగ్‌మేకర్ అవుతుంది'' అని **ఆ పార్టీ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అభిప్రా**యపడ్డారు. నిజానికి ఎంవీఏ కూటమిలో చేరేందుకు మ**జ్లిస్ విఫలయత్నం చేసింది.**

గత ఎన్నికల్లోనూ దుమ్ము రేపాయి

మహారాష్ట్రలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా చిన్న పార్టీలు దుమ్మురేపాయి. మొత్తమ్మీద 29 సీట్లు గెలుచుకోవడమే గాక ఏకంగా మరో 63 అసెంబ్లీ స్థానాల్లో చిన్న పార్టీల అభ్యర్థులు రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈసారి కూడా ఆ ఫలితాలే పునరావృతమైతే కూటములకు కష్టకాలమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎందుకంటే రాష్ట్రంలో చాలా అసెంబ్లీ స్థానాల్లో మొత్తం ఓటర్లు 4 లక్షలు, అంతకన్నా తక్కువే ఉంటారు. 60 శాతం పోలింగ్ జరుగుతుందనుకున్నా సగటున ఒక్కో అసెంబ్లీ స్థానం పరిధిలో 2.5 లక్షల ఓట్లు పోలవుతాయి. పార్టీపరమైన చీలికల దృష్ట్యా ప్రతి స్థానంలోనూ కేవలం లక్ష ఓట్లే విజేతను తేల్చే అవకాశముంది. సరిగ్గా ఈ అంశమే పలు స్థానాల్లో చిన్న పార్టీలను ప్రబల శక్తులుగా మారుస్తోంది. దీనికి తోడు గత ఎన్నికలతో పోలిస్తే మహారాష్ట్రలో ఈసారి రాజకీయ రంగస్థలం నానారకాలుగా చీలిపోయింది. దాంతో చిన్న పార్టీ, గట్టి ఇండిపెండెంట్ బరిలో ఉన్న అన్ని స్థానాల్లోనూ మిగతా అభ్యర్థులందరి భాగ్యరేఖలూ ప్రభావితమయ్యే పరిస్థితి నెలకొంది! ఈ కారణంగానే ఈసారి ఫలితాలను అంచనా వేయడం చాలా కష్టతరంగా మారిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

దళిత ఓట్లను చీల్చనున్న వీబీఏ!

ఎన్నికల బరిలో ఉన్న వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ) నిజానికి పలు చిన్న పార్టీల కూటమి. అంబే**డ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్** సారథ్యంలోని ఈ కూటమికి దళితులు, బౌద్ధ దళితులు, ఇతర అణ**గారిన వర్గాలతో పాటు ముస్లిం**లలో కూడా మంచి ఆదరణే ఉంది. రిజర్వేషన్లే ప్రధాన నినాదంగా **ఈసారి ఏకంగా 67 స్థానాల్లో** వీబీఏ బరిలో దిగింది. వీటిలో అత్యధిక స్థానాలు ముంబై, విదర్భ **ప్రాంతాల్లోనే ఉన్నాయి.** మహారాష్ట్ర జనాభాలో దళితులు 14 శాతం, బౌద్ధ దళితులు 7 **శాతమున్నారు. గతం**లోనూ పలు ఎన్నికల్లో వీబీఏ సత్తా చాటింది. విదర్భతో పాటు **మరాఠ్వాడా ప్రాంతం**లోనూ పార్టీకి చెప్పుకోదగ్గ ఆదరణ ఉంది. 2019 అసెంబ్లీ **ఎన్నికల్లో పెద్ద**గా సీట్లు రాకపోయినా 7 శాతం ఓట్లు సాధించింది. ఈసారి వీబీఏ **భారీగా దళి**త ఓట్లు సాధిస్తే ప్రధానంగా ఎంవీఏ కూటమికే దెబ్బ పడుతుంది. **2019లో** కూడా కనీసం 10 స్థానాల్లో కాంగ్రెస్, ఎన్సీపీ కూటమి అభ్యర్థుల **ఓట**మికి వీబీఏ సాధించిన ఓట్లే కారణమని తేలింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కూడా పలు స్థానాల్లో ఎంవీఏ అభ్యర్థుల ఓటమికి వీబీఏ కారణంగా నిలిచింది. ఇవే గాక మరికొన్ని చిన్న పార్టీలతో స్థానికంగా గట్టి పట్టున్న స్వతంత్ర అభ్యర్థులు కూడా పలు స్థానాల్లో **కూ**టముల అభ్యర్థుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నారు.

జరంగే ఫ్యాక్టర్?

మరాఠా హక్కుల ఉద్యమ నేత మనోజ్ జరంగే పాటిల్ కూడా ఈసారి ఎన్నికల్లో **గట్టి ప్రభావమే చూ**పేలా ఉన్నారు. ఈసారి అత్యధిక స్థానాల్లో పోటీ చేస్తానని ప్రకటించి **రెండు కూటములకూ** ఆయన చెమటలు పట్టించారు. మహారాష్ట్ర జనాభాలో ఏకంగా 30 **శాతానికి పైగా ఉండే మరాఠా**ల్లో ఆయనకు గట్టి పట్టుండటమే ఇందుకు కారణం. చివరి క్షణంలో **ఎన్నికల బరి నుంచి తప్పుకున్నా** ఎన్నికల ఫలితాలపై మాత్రం జరంగే గట్టి ప్రభావమే చూపను**న్నారు. ముఖ్యంగా మరాఠ్వాడా**లో చాలా స్థానాల్లో ఆయన మద్దతిచ్చే అభ్యర్థులే గట్టెక్కే పరిస్థితి **నెలకొని ఉంది! ఇటీవలి లోక్‌సభ** ఎన్నికల్లో జరంగే సహాయ నిరాకరణ మరాఠ్వాడాతో పాటు పశ్చిమ **మహారాష్ట్ర, విదర్భల్లోని పలు స్థానాల్లో** మహాయుతి అవకాశాలను బాగా దెబ్బతీసింది. ఆ చేదు అనుభవం **ఈసారీ పునరావృతం అవుతుందేమోనని బీ**జేపీ పెద్దలు భయపడుతున్నారు.


- సాక్షి, నేషనల్ డెస్క్

అకాలీదళ్ అధ్యక్ష పదవికి బాదల్ రాజీనామా



చండీగఢ్: శిరోమణి అకాలీదళ్ పార్టీ అధ్యక్ష పదవికి సుఖ్బీర్‌సింగ్ బాదల్ రాజీనామా చేశారు. మతాన్ని అగౌరపర్చినందుకు గాను అకల్‌తఖ్త్ సుఖ్బీర్‌ను దోషిగా ప్రకటించింది. క్షమాపణ చెప్పినా అకల్‌తఖ్త్ నుంచి ఎలాంటి ఊరట లభించకపోవడంతో సుఖ్బీర్ రాజీనామా చేశారు. డిసెంబరు 14న అకాలీదళ్ వర్కింగ్ కమిటీ ఎన్నికలు జరగనున్నాయి. అందులో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. సుఖ్బీర్ శనివారం వర్కింగ్ కమిటీకి తన రాజీనామా లేఖను సమర్పించారని అకాలీదళ్ సీనియర్ నాయకుడు దల్జీత్‌సింగ్ చీమా వెల్లడించారు. అధ్యక్షుడిగా తన పదవీకాలంలో అండగా నిలిచిన, పూర్తి విశ్వాసం కనబర్చిన వారందరికీ సుఖ్బీర్ కృతజ్ఞతలు తెలిపారు. శిరోమణి అకాలీదళ్ అధికారంలో ఉన్న కాలంలో.. 2007–2017 వరకు మతపరమైన దుష్ప్రవర్తనకు గాను సుఖ్బీర్‌ను అకల్‌తఖ్త్ ఆగస్టు 30న దోషిగా ప్రకటించింది. రెండు నెలలు గడిచిపోయినా శిక్ష ఏమిటనేది ఇంతవరకు అకల్‌తఖ్త్ ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో సుఖ్బీర్ అకాలీదళ్ అధ్యక్ష పదవికి రాజీనామా సమర్పించారు.


కుర్చీని కాపాడుకునేందుకే మోదీ ఆరాటం: ఖర్గే



రాంచీ: ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసి.. ప్రధాని కుర్చీని కాపాడుకునేందుకు పాకులాడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. రాష్ట్రాల ఎన్నికలపై ప్రధాని ఈస్థాయిలో దృష్టి పెట్టి ప్రచారం చేయడాన్ని ఆక్షేపించారు. 'ప్రధాని రోజుకు 24 గంటలు ఎన్నికల ప్రచారానికి కేటాయించడం, ఈ స్థాయిలో శక్తియుక్తులు కేంద్రీకరించడం గతంలో ఎన్నడూ చూడలేదు. చిన్న రాష్ట్రం (జార్ఖండ్) ఎన్నికల్లో గెలవడానికి ఈస్థాయిలో వనరులు వెచ్చించడం అసాధారణం. ప్రజల కోసం మోదీ పనిచేయడం లేదు. కుర్చీని కాపాడుకునేందుకు తాపత్రయపడుతున్నారు' అని ఖర్గే విమర్శించారు. పేదల కోసం మోదీ పనిచేయడం లేదన్నారు. ద్రవ్యోల్బణం పెరగడం, నిత్యావసరాల ధరలు అమాంతం పెరిగిపోవడం.. మోదీ వైఫల్యానికి నిదర్శనాలన్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానిగా 25 ఏళ్ల సుదీర్ఘకాలం పనిచేశాక.. సొంతరాష్ట్రం గుజరాత్‌లో పేదరికాన్ని మోదీ నిర్మూలించగలిగారా? అని ఖర్గే నిలదీశారు. అహ్మదాబాద్–ముంబై బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు ఏకంగా 3 లక్షల కోట్ల రూపాయలు వ్యయమేమిటని ఖర్గే అన్నారు. ప్రాజెక్టు వ్యయం లక్ష కోట్ల నుంచి మూడు లక్షల కోట్లకు పెరిగిందని.. ఈస్థాయి ఖర్చుతో బుల్లెట్ రైలు ప్రాజెక్టును చేపట్టడం అవసరమా? అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ హేమంత్ సోరెన్ సర్కారు తెచ్చిన బిల్లును కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. జార్ఖండ్‌లో ఇండియా కూటమియే తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రాహుల్ హామీలిస్తారు.. విదేశాలకు వెళ్లిపోతారు

గ్యారంటీలను నెరవేర్చేది బీజేపీయే: అమిత్ షా



మధుపూర్ (జార్ఖండ్): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల వేళ హామీలిచ్చి.. అనంతరం విదేశీ పర్యటనలకు వెళ్లిపోతారని హోంమంత్రి అమిత్ షా అన్నారు. బీజేపీ మాత్రమే తామిచ్చిన గ్యారంటీలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. మధుపూర్‌లో శనివారం అమిత్ షా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యూపీఏ హయాంలో ఉగ్రవాదులు భారత్‌పై దాడులు చేసి ప్రజలను చంపడమే కాకుండా.. బిర్యానీలు తిన్నారని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్జికల్ స్ట్రయిక్స్, వైమానిక దాడుల ద్వారా ఉగ్రవాదాన్ని పెకిలించి వేశారని పేర్కొన్నారు. 'రాహుల్ బాబా ఒకదాని వెంట మరొక హామీలు గుప్పిస్తారు. తర్వాత విదేశాలకు వెళ్లిపోతారు. మరోవైపు ప్రధాని మోదీ ఏదైనా హామీ ఇస్తే అది శిలాక్షరమే. బీజేపీ తమ హామీలను నెరవేరుస్తుంది. మేము మాత్రమే జార్ఖండ్‌ను తీర్చిదిద్దగలం. కాంగ్రెస్, జేఎంఎం, ఆర్జేడీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏనాడూ పనిచేయవు' అని అమిత్ షా అన్నారు.

యుద్ధానికి త్వరలో తెర: జెలెన్‌స్కీ

బ్రసెల్స్: అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడం శుభ పరిణామమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ శనివారం అన్నారు. ''మాపై రష్యా చేస్తున్న యుద్ధానికి ఇక త్వరలోనే తెర పడటం ఖాయం. ట్రంప్ రాకపోయి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. యుద్ధానికి తెర దించేందుకు ఆయన అన్ని చర్యలూ తీసుకుంటారని నాకు పూర్తి విశ్వాసముంది'' అని ఆయన ధీమా వెలిబుచ్చారు. ట్రంప్ విజయానంతరం ఆయనతో ఫోన్ సంభాషణ సందర్భంగా అన్ని అంశాలూ చర్చకు వచ్చినట్టు వెల్లడించారు. తమ మధ్య నిర్మాణాత్మకం, ఫలప్రదమైన చర్చ జరిగిందన్నారు. రష్యాతో చర్చల విషయంలో జెలెన్‌స్కీ ముందు ట్రంప్ ఏమైనా డిమాండ్లు ఉంచారా అన్న ప్రశ్నకు జెలెన్‌స్కీ బదులివ్వలేదు. అయితే ఉక్రెయిన్ ప్రయోజనాలకు విరుద్ధమైన అంశాలేవీ ఆయన నోటినుంచి రాలేదని స్పష్టం చేశారు.

వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీగా కరోలిన్ లీవిట్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తదుపరి వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీగా యువ కరోలిన్ లీవిట్‌ను ప్రకటించారు. ట్రంప్ అమెరికా 47వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే జనవరి 20, 2025న 27 ఏళ్ల లీవిట్ కూడా ప్రెస్ సెక్రటరీగా బాధ్యతలు చేపడతారు. కరైన్ జీన్ పియరీ స్థానంలో లీవిట్ కొత్త ప్రెస్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆమె ట్రంప్ ప్రచారబృందం జాతీయ ప్రెస్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. ట్రంప్ తొలిసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో లీవిట్ అసిస్టెంట్ ప్రెస్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. 'ప్రచార పర్వంలో లీవిట్ సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె తెలివైన వారు. దృఢచిత్తురాలు. సమర్థురాలిగా రుజువు చేసుకున్నారు' అని ట్రంప్ ఆమె నియామక ప్రకటన సందర్భంగా పేర్కొన్నారు. కొత్త బాధ్యతల్లోనూ ఆమె రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



అర్థవంతమైన చర్చల కోసం ఎదురుచూస్తున్నా: మోదీ

న్యూఢిల్లీ: బ్రెజిల్‌లో జరగబోయే జీ20 శిఖరాగ్ర సదస్సు వేదికగా అర్థవంతమైన చర్చల కోసం ఎదురుచూస్తున్నట్లు ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. నైజీరియా, బ్రెజిల్, గయానాల్లో పర్యటించేందుకు బయల్దేరుతున్న సందర్భంగా ప్రధాని మోదీ శనివారం 'ఎక్స్'లో పలు పోస్టులు పెట్టారు. తొలుత నైజీరియాలో పర్యటించే మోదీ ఆ తర్వాత బ్రెజిల్‌కు వెళ్తారు. ''గత ఏడాది జీ20కి సారథ్యం వహించిన భారత్ తరఫున బ్రెజిల్‌లో 19వ జీ20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనబోతున్నా. గత ఏడాది భారత్ కూటమికి విజయవంతంగా నాయకత్వం వహించి జీ20ని ప్రజలకూటమిగా మార్చింది. గ్లోబల్ సౌత్ దేశాల ప్రాధాన్యాలను జీ20 ప్రధాన ఎజెండాల్లో ఒకటిగా విజయవంతంగా మార్చగలిగింది'' అని మోదీ అన్నారు. నవంబర్ 18, 19వ తేదీల్లో రియో డీ జనీరియో నగరంలో జరగబోయే జీ20 శిఖరాగ్ర సదస్సులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, మోదీసహా పలువురు సభ్య దేశాధినేతలు పాల్గొననున్నారు.

నేటి నుంచి నైజీరియాలో పర్యటన

మోదీ నేటి నుంచి రెండ్రోజులపాటు నైజీరియాలో పర్యటించనున్నారు. ''ప్రజాస్వామ్యం, బహుళత్వాన్ని నమ్మే ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు కృషిచేస్తా. నాకు సాదర స్వాగతం పలుకుతూ హిందీలో ఆహ్వానించిన నైజీరియాలోని భారత సంతతి ప్రజలను, స్నేహితులను కలిసేందుకు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నా' అని మోదీ అన్నారు. నవంబర్ 19 నుంచి మోదీ గయానాలో పర్యటించనున్నారు. గత 50 సంవత్సరాల్లో ఒక భారతీయ ప్రధాని గయానాలో పర్యటనకు సిద్ధమవడం ఇదే తొలిసారి.



శనివారం హిందుస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న మోదీ

ప్రజలే చేస్తున్న అభివృద్ధి ఇది

మేం ఆ ప్రగతి కోసం పాటుపడుతున్నాం ● హెచ్‌టీ లీడర్‌షిప్ సదస్సులో ప్రధాని మోదీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: గత ప్రభుత్వాలు ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే పలు పథకాలు తీసుకొచ్చాయని మేం మాత్రం ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పాటుపడుతున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. శనివారం ఢిల్లీలో హిందుస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొన్న సందర్భంగా ప్రధాని మోదీ కీలకోపన్యాసం చేశారు. ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

అసమానతలు పెరిగిపోతున్నాయి

''ప్రజాప్రగతి కోసం ప్రజలే స్వయంగా పాటుపడుతున్నారు. మేం ఆ ప్రజాయజ్ఞం దిగ్విజయం కావడానికి కృషిచేస్తున్నాం. కానీ గత ప్రభుత్వాలు తమ ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే పథకాలు తీసుకొచ్చాయి. దీంతో ఆ ప్రభుత్వాలు సమాజంలో అసమానతలకు హేతువులయ్యాయి. దీంతో నేడు సామాజిక తులాభారంలో అసమతుల్యత రోజురోజుకూ మరింత పెరుగుతోంది. ఆ ఓటు బ్యాంక్ రాజకీయాలకు మేం చాలా దూరం. మా ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని మళ్లీ పెంపొందించింది. 90వ దశకంలో భారత్ పదేళ్లలో ఐదుసార్లు ఎన్నికలను చవిచూసింది. ఆనాడు దేశంలో ఎంతో అస్థిరత తాండవించింది. భారత్‌లో పరిస్థితులు ఇకమీదట ఎప్పుడూ ఇలాగే ఉంటాయని రాజకీయ పండితులూ తరచూ విశ్లేషణలు చూసేవారు. ఇప్పుడు చాలా దేశాల్లో అంతర్యుద్ధం, ఆర్థికసంక్షోభం, అస్థిరత రాజ్యమేలుతున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ భారతీయ ఓటర్లు మమ్మల్ని నమ్మి మూడోసారి అవకాశం ఇచ్చారు. ప్రజల కోసం భారీగా ఖర్చుపెట్టాలి. ప్రజల కోసం భారీగా ఆదా చేయాలి. ఈ శతాబ్దిని భారతీయ శతాబ్దిగా అందరూ గుర్తుంచుకుంటారు'' అని మోదీ అన్నారు. హిందుస్తాన్ టైమ్స్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మోదీ స్మారక తపాలా బిళ్లను ఆవిష్కరించారు.

రిస్క్ చేసే సంస్కృతిని పోగొట్టారు

సవాళ్లను భారత్ ఎదుర్కొంటున్న తీరుపై మోదీ స్పందించారు. ''మన ముందుతరాల వాళ్లు సవాళ్లను స్వీకరించారు. రిస్క్ తీసుకోవడం వల్లే మనం ఇప్పుడు మన వస్తు, సేవలను విదేశాలకూ అందించగల్గుతున్నాం. దాంతోపాటే వాణిజ్యం, సంస్కృతికి భారత్ కేంద్రంగా పరిఢవిల్లింది. అయితే భారత స్వాతంత్ర్యానంతరం ఈ రిస్క్ తీసుకునే సుగుణాన్ని గత ప్రభుత్వాలు కోల్పోయాయి. మా హయాంలో గత పదేళ్లుగా భారత్ మళ్లీ రిస్క్ తీసుకోవడానికి కావాల్సిన శక్తిసామర్థ్యాలను అందిస్తోంది'' అని అన్నారు.

నాడు భయపెట్టి ఇప్పుడదే భయపడుతోంది

''ఈ సదస్సు సందర్భంగా ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో పాత దినపత్రికలను చదివా. 1947 అక్టోబర్‌లో జమ్మూకశ్మీర్ భారత్‌లో విలీనంవేళ భారతీయుల ఆనందం వార్త చదివి నేను కూడా అంతేస్థాయిలో పరమానందభరితుడినయ్యా. అయితే గత ప్రభుత్వాల కారణంగా ప్రజలను ఉగ్రవాదం భయపెట్టేది. పొరుగుదేశాల సీమాంతర ఉగ్రవాదం కారణంగా భారతీయులు సొంత ఇళ్లు, నగరాల్లోనూ ఉండటానికి జంకారు. ప్రభుత్వాల నిర్లక్ష్యాత్మకంగా వ్యవహరించపోవడం వల్ల ఏడుదశాబ్దాలపాటు కశ్మీర్ హింసను చవిచూసింది. ఇప్పుడు కాలం మారింది. మా ప్రభుత్వాల హయాంలో ఉగ్రవాదం దాని సొంత దేశం(పాకిస్తాన్)లో కూడా భయపడుతోంది. ఇప్పుడు కశ్మీర్‌లో కూడా రికార్డ్ స్థాయిలో ఓటింగ్ నమోదవుతోందని ఈనాటి పత్రికల్లో వస్తోంది'' అని అన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఐదుగురు మావోయిస్టులు మృతి
- ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ – నారాయణపూర్ జిల్లాల సరిహద్దుల్లో శనివారం మధ్యాహ్నం జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందగా, ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. కాంకేర్ – నారాయణపూర్ జిల్లాల సరిహద్దుల్లోని నార్త్ అబూజ్‌మడ్‌లో గల పేకమెటాకపూర్ అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో రెండు జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ విభాగాల పోలీసులు శుక్రవారం ఉదయం నుంచే కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో శనివారం బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరుపుతూ పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు సైతం ఎదురుకాల్పులు జరపగా ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. మరి కొందరు తప్పించుకున్నారు. కాగా, ఈ ఘటనలో చిర్మాన్ యాదవ్, కైలేశ్వర్ గావ్డే అనే జవాన్లు తీవ్రంగా గాయపడడంతో నారాయణపూర్ ఆస్పత్రికి తరలించారు. ఘటనా ప్రాంతంలో పెద్ద ఎత్తున మందుగుండు సామాగ్రి, విప్లవ సాహిత్యం, నిత్యావసర వస్తువులు, మందులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మళ్లీ మణిపూర్‌లో నిప్పు

- అస్సాం–మణిపూర్ సరిహద్దులో నదిలో ఆరు మృతదేహాలు లభ్యం
- మృతులు మైతేయ్ వర్గానికి చెందిన వాళ్లుగా అనుమానం
- ఇంఫాల్ లోయలో మళ్లీ మొదలైన ఆందోళనలు
- ఏడు జిల్లాల్లో ఇంటర్నెట్ బంద్



ఇంఫాల్/గువాహటి: మెజారిటీ మైతేయ్‌లకు రిజర్వేషన్లను కల్పించాలన్న నిర్ణయంతో రాజుకున్న అగ్గికి 200 మందికిపైగా బలైన ఉదంతం నుంచి తేరుకుంటున్న మణిపూర్‌లో మళ్లీ విద్వేషాగ్ని రాజుకుంటోంది. గత వారం అపహరణకు గురైన ఆరుగురి మృతదేహాలు తాజాగా నదిలో బయటపడటంతో మైతేయ్ వర్గాల్లో ఆగ్రహం కట్టలుతెంచుకుంది. మైతేయ్ అనుకూల అల్లరిమూకలు ఎమ్మెల్యేల నివాసాలపై దాడులకు తెగబడ్డాయి. నిరసనలు, ఆందోళనలు ఒక్కసారిగా ఉధృతమవడంతో పుకార్లు, తప్పుడు వార్తల ప్రచారానికి అడ్డుకట్టవేసేందుకు మణిపూర్ ప్రభుత్వం వెంటనే ఏడు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపేసింది. ఘర్షణాత్మక, సున్నిత ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించింది. ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, బిష్ణుపూర్, తౌబాల్, కక్చింగ్, కంగ్‌పోక్పీ, చురాచాంద్‌పూర్ జిల్లాల్లో నెట్‌సేవలను ఆపేశారు.

అసలేం జరిగింది?

కుకీ–జో వర్గానికి చెందిన గ్రామవలంటీర్లుగా చెప్పుకునే 11 మంది సాయుధులు బోరోబెక్రా ప్రాంతంలోని పోలీస్‌స్టేషన్‌పైకి దాడికి తెగించారు. అయితే భద్రతాబలగాల ఎదురుకాల్పుల్లో ఈ 11 మంది చనిపోయారు. దీనికి ప్రతీకారంగా మైతేయ్ వర్గానికి చెందిన వారిని కుకీ సాయుధమూకలు నవంబర్ 11వ తేదీన అపహరించాయి. అపహరణకు గురైన వారిలో ఆరుగురి మృతదేహాలు శుక్రవారం జిరిబామ్ జిల్లాలో లభించాయి. అస్సాం–మణిపూర్ సరిహద్దు వెంట ఉన్న జిరిముఖ్ గ్రామ సమీప జిరి, బారక్ నదీసంగమ ప్రాంత జలాల్లో ఈ మృతదేహాలను కనుగొన్నారు. ముగ్గురు చిన్నారులు, ముగ్గురు మహిళల మృతదేహాలు లభించడంతో మైతేయ్ వర్గాల్లో ఆగ్రహజ్వాలలు పెల్లుబికాయి. ఇంఫాల్ లోయలోని చాలా ప్రాంతాల్లో వేలాది మంది నిరసనలు, ఆందోళనలు చేపట్టారు.

ఎమ్మెల్యేల నివాసాలపై దాడులు

ఎమ్మెల్యేల నివాసాలపై మైతేయ్ వర్గీయులు శనివారం దాడులకు తెగబడ్డారు. ముగ్గురు రాష్ట్రమంత్రులు, ఆరుగురు ఎమ్మెల్యేలపై ఇళ్లపై దాడులు చేశారు. ఎమ్మెల్యే నిశికాంత్ ఇంటిపై దాడిచేశారు.

చైనాలో ఉన్మాది వీరంగం

- కత్తిపోట్లకు ఎనిమిది మంది బలి
- 17 మందికి గాయాలు

బీజింగ్: చైనాలో ఓ ఉన్మాది రెచ్చిపోయాడు. విచ్చలవిడిగా కత్తిపోట్లకు పాల్పడ్డాడు. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది మృతి చెందగా, 17 మందికి కత్తిపోట్ల గాయాలయ్యాయి. శనివారం చైనాలోని జియాంగ్సు ప్రావిన్స్‌లో ఈ ఘటన జరిగింది. యిక్సింగ్ సిటీలోని వుక్సీ వొకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ టెక్నాలజీలో షు అనే 21 ఏళ్ల ఉన్మాది శనివారం సాయంత్రం 6:30 గంటలకు ఈ దాడికి తెగబడ్డాడు. కనిపించిన వారినల్లా కత్తితో పొడిచాడు. మొత్తం ఎనిమిది మంది ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. మరో 17 మంది గాయపడ్డారు. నిందితుడిని సంఘటనా స్థలంలోనే అదుపులోకి తీసుకున్నారు. తానే ఈ దాడికి పాల్పడ్డట్లు నిందితుడు అంగీకరించాడు. వుక్సీ వృత్తివిద్య సంస్థలో పూర్వ విద్యార్థి అయిన షు కొన్ని పరీక్షల్లో ఫెయిలయ్యాడు. అలాగే ఇంటర్న్‌షిప్ కాలంలో తనకు చెల్లించిన సొమ్ముపై అసంతృప్తితో రగిలిపోయాడు. గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ రాలేదనే కోపంతో ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చి దాడికి తెగబడ్డాడు. పోలీసులు సహాయకచర్యలు చేపట్టి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ వారంలో ఇది సాధారణ పౌరులపై జరిగిన రెండోదాడి. ఈనెల 12న జుహాయ్ నగరంలో ఒక దుండగుడు జనంపైకి కారును తోలడంతో ఏకంగా 35 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

బైడెన్ లాగే మతిమరుపు

మోదీపై రాహుల్ ధ్వజం

అమరావతి/ చిమూర్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ లాగే ప్రధాని నరేంద్ర మోదీ మతిమరుపుతో బాధపడుతున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని దేశ డీఎన్ఏగా భావిస్తుందని, అధికార బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లకు మాత్రం అదో ఖాళీ పుస్తకమని రాహుల్ గాంధీ అన్నారు. శనివారం రాహుల్ అమరావతిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చవచ్చని రాజ్యాంగంలో ఎక్కడా రాసిలేదని, కానీ మహారాష్ట్రలో అదే జరిగిందని పేర్కొన్నారు. బడా వ్యాపారవేత్తలకు సంబంధించి 16 లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేశారని బీజేపీపై ధ్వజమెత్తారు. 'రాజ్యాంగమే మన దేశ డీఎన్ఏగా కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది. కానీ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు అదో ఖాళీ పుస్తకం' అని రాహుల్ అన్నారు. ఎన్నికల ప్రచారసభల్లో రాహుల్ ప్రదర్శిస్తున్న రాజ్యాంగ ప్రతిలో లోపలి పేజీలు ఖాళీగా ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ విమర్శించిన నేపథ్యంలో రాహుల్ ఈ విధంగా స్పందించారు. నేను లేవనెత్తుతున్న అంశాలపైనే మోదీ మాట్లాడుతున్నారని సోదరి ప్రియాంక గాంధీ నా దృష్టికి తెచ్చారు. 'కులగణన జరగాలని, రిజర్వేషన్లపై 50 శాతం గరిష్ట పరిమితిని ఎత్తివేయాలని నేను మోదీకి లోక్‌సభలో చెప్పాను. కానీ ఆయన మాత్రం నేను రిజర్వేషన్లకు వ్యతిరేకమని ఎన్నికల సభల్లో చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్ లాగే మతిమరుపుతో బాధపడుతున్నారు' అని రాహుల్ ధ్వజమెత్తారు. బైడెన్ ఒక సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌గా పరిచయం చేయడాన్ని ఉదహరించారు. అలాంటి లక్షణాలే మోదీలోనూ కనపడుతున్నాయని విమర్శించారు. రాహుల్ గాంధీ కులగణనకు వ్యతిరేకమని కూడా మోదీ చెబుతారని ఎద్దేవా చేశారు.



రాహుల్ బ్యాగ్ తనిఖీ

సాక్షి, న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని అమరావతిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెలికాప్టర్‌ను కేంద్ర ఎన్నికల సంఘం శనివారం తనిఖీ చేసింది. ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు రాహుల్ మహారాష్ట్రలోని అమరావతికి వెళ్లా రు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెలికాప్టర్ ధమన్‌గావ్ రైల్వే హెలిప్యాడ్‌లో దిగింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ హెలికాప్టర్‌లో ఎన్నికల సంఘం అధికారులు సోదాలు చేశారు. ఎన్నికల సంఘం తనిఖీలకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 17 । నవంబర్ । 2024



పాతబస్తీ మెట్రో పనులు షురూ

మెట్రో రెండో దశ విస్తరణకు క్షేత్రస్థాయిలో పనులు మొదలయ్యాయి. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు పాతబస్తీ మెట్రో కారిడార్‌లో భూసేకరణ పనులు చేపట్టారు. -8లో



ప్యాడెల్ టెన్నిస్ ఆడేద్దాం..

ఇటీవల కాలంలో ప్యాడెల్ టెన్నిస్‌పై నగర వాసుల్లో ముఖ్యంగా యువతలో ఆసక్తి పెరుగుతోంది. ఇప్పుడిప్పుడే ప్యాడెల్ టెన్నిస్ నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/21.0

వాతావరణం

నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై పొగమంచుతో ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

పేలిన రిఫ్రిజిరేటర్ సిలిండర్



ఫ్లాట్‌లో వ్యాపించిన మంటలు

అపార్ట్‌మెంట్‌లో మంటలు

- రూ. 50 లక్షల ఆస్తి నష్టం

మణికొండ: రిఫ్రిజిరేటర్‌లోని గ్యాస్ సిలిండర్ పేలి మంటలు రావడంతో అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్ కిచెన్, హాల్, బెడ్రూం వరకు వ్యాపించడంతో అందులోని వ్యక్తులు హాహాకారాలు చేస్తూ కిందకు పరుగులు తీశారు. గేటెడ్ కమ్యూనిటీలో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు స్థలంలో పార్కును అభివృద్ధి చేయటంతో అగ్నిమాపక వాహనాలు ప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్ వరకు సకాలంలో చేరలేక పోయాయి. మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడలోని గోల్డెన్ ఓరియల్ కమ్యూనిటీలోని బీ బ్లాక్ మూడో అంతస్తులోని 301 ఫ్లాట్‌లో శనివారం తెల్లవారుజామున ఒక్కసారిగా ఫ్రిడ్జిలోని గ్యాస్ సిలిండర్ పేలి మంటలు చెలరేగడంతో వంట గది మొత్తం అంటుకుని మిగతా గదులకూ వ్యాపించాయి. మంటలు వంట గ్యాస్ సిలిండర్‌కూ అంటుకోవటంతో పెద్ద శబ్దంతో పేలిపోయింది. దీంతో ఇంటి యజమాని వెంకటరమణతో పాటు మిగతా నలుగురు కుటుంబ సభ్యులు భయభ్రాంతులతో కిందకు వచ్చేశారు. చుట్టు పక్కల వారు సైతం నిద్ర నుంచి మేల్కొని అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు.

అపార్ట్‌మెంట్ వరకూ వెళ్లలేక పోయిన ఫైరింజిన్..

గోల్డెన్ ఓరియల్‌లో రెండు బ్లాక్‌ల మధ్య ఉన్న రోడ్డును పార్కుగా మార్చారు. సకాలంలోనే గేటు వద్దకు చేరుకున్న మూడు ఫైరింజిన్‌లు ఫ్లాట్ వద్దకు చేరుకోలేక 300 మీటర్ల దూరంలోనే నిలిచిపోయాయి. దీంతో ఫ్లాట్ పూర్తిగా కాలిపోయిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. మంటలు ఫ్లాట్ మొత్తం వ్యాపించి విలువైన గృహోపకరణాలతో పాటు దుస్తులు, నగదు కాలిపోవటంతో రూ.50 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఫ్లాట్ యజమాని తెలిపారు. ఫ్లాట్ వద్దకు చేరుకునేందుకు అగ్నిమాపక శాఖ సిబ్బంది గంట పాటు ప్రయత్నం చేసినా సఫలం కాక పక్క బ్లాక్ నుంచి నీటిని చల్లి మంటలను ఆర్పారు. కాగా.. స్థానికులు అంతలోపే పక్క ఫ్లాట్‌ల నుంచి పైపులను వేసి సాధ్యమైనంత వరకు మంటలను ఆర్పారు.



ఎంట్రన్స్‌లోనే నిలిచిపోయిన ఫైరింజిన్

కేసు నమోదు

గోల్డెన్ ఓరియల్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ఇంటి యజమాని వెంకటరమణ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పడిగాపుల్లో ఫైళ్లు!

‘ప్లానింగ్’లో పరిష్కారం లభించినా పైస్థాయిలో మోక్షం సున్నా

- హెచ్ఎండీఏలో ఉన్నతాధికారుల కోసం ఎదురుచూపులు
- నిర్దిష్ట గడువులోగా పరిష్కారం చూపని టీజీబీ పాస్

సాక్షి, సిటీబ్యూరో: టీజీబీపాస్.హెచ్ఎండీలో వివిధ రకాల అనుమతుల కోసం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఆన్‌లైన్ పద్ధతితో దరఖాస్తుదారులు నేరుగా హెచ్ఎండీఏకు వెళ్లాల్సిన అవసరం లేదు. డాక్యుమెంట్లు జతచేస్తే చాలు. నిర్దిష్ట వ్యవధిలో ఫీజులు చెల్లించి అనుమతులు పొందవచ్చు. భవన నిర్మాణాలు, లే అవుట్‌లు, ఎల్ఆర్ఎస్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ల కోసం సింగిల్‌విండో విధానం అందుబాటులో ఉంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన టీజీబీ పాస్ సకాలంలో పరిష్కారాలు మాత్రం చూపడం లేదు. నిర్దిష్ట గడువు మేరకు అనుమతులు ఇవ్వాలనే నిబంధన ఆచరణకు నోచుకోవడం లేదు. కిందిస్థాయిలో ప్రణాళికా విభాగం ఉద్యోగులు, అధికారులు ఫైళ్లను పరిష్కరించినప్పటికీ పైస్థాయిలో మోక్షం లభించడం లేదని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో ఉండని ఉన్నతాధికారులు..


హెచ్ఎండీఏలోని వివిధ జోన్‌లలో ప్రతిరోజూ పదుల సంఖ్యలో దరఖాస్తులు నమోదవుతాయి. వాటిలో కొన్నింటికి వారం, పది రోజుల్లో పరిష్కారం లభిస్తాయి. మరికొన్నింటికి నెల రోజుల వరకూ సమయం పట్టవచ్చు. కానీ ఆరు నెలలు దాటినా ఎలాంటి పరిష్కారం లభించక అధికారుల కోసం పడిగాపులు కాయాల్సివస్తోందని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి ఎన్‌ఓసీలు అవసరమైన ఫైళ్లు మినహాయించి మిగతా వాటికి సకాలంలో పరిష్కరించేందుకు అవకాశం ఉంది. కానీ.. ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడంతో రోజుల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి.

ఎప్పుడొస్తారో తెలియదు..

హెచ్ఎండీఏలోని వివిధ జోన్‌ల నుంచి టీజీబీ పాస్ ద్వారా వచ్చే ఫైళ్లను క్షేత్రస్థాయిలో అధికారులు వారం, పది రోజుల్లో పరిశీలించి అవసరమైన షార్ట్‌ఫాల్స్‌ను సూచిస్తారు. ఈ మేరకు దరఖాస్తుదారులు సంబంధిత డాక్యుమెంట్‌లను అప్‌లోడ్ చేసిన తర్వాత మరో వారం రోజుల్లో ఆ ఫైళ్లకు పరిష్కారం లభిస్తుంది. సహాయ ప్లానింగ్ అధికారి నుంచి ప్లానింగ్ అధికారి పరిశీలనకు వెళ్తుంది. ఆ తర్వాత డైరెక్టర్ స్థాయిలో టెక్నికల్‌గా ఆమోదం లభిస్తుంది. నిబంధనల మేరకు ప్రతీ ఫైల్‌కు కమిషనర్ ఆమోదం తప్పనిసరి. బిల్డింగ్‌లు, లే అవుట్‌లు, ఎల్ఆర్ఎస్ వంటి ఏ పనులైనా కమిషనర్ ఆమోదంతోనే అనుమతులు లభిస్తాయి. ఇటీవల కాలంలో కమిషనర్ స్థాయిలోనే జాప్యం చోటుచేసుకుంటోందని బాధితులు ఆరోపిస్తున్నారు. ‘కమిషనర్ అందుబాటులో ఉండడం లేదు. ఎప్పుడొస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది’ అని ఓ దరఖాస్తుదారు ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్కో జోన్ పరిధిలో నెలకు కనీసంవంద ఫైళ్ల వరకు నమోదవుతున్నాయి. ప్రణాళికా విభాగం అధికారులు ప్రతి ఫైల్‌ను వారం నుంచి 15 రోజుల గడవులో పరిష్కరిస్తున్నారు. దరఖాస్తుదారుకు అనుమతి లభించడానికి మాత్రం ఎక్కువ సమయం పడుతోంది. ఇలా పై స్థాయిలోనే వందల కొద్దీ పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

పైనుంచి ఫోన్ వస్తేనే..

మరోవైపు భారీ లే అవుట్‌లు, హైరైజ్‌డ్ అపార్ట్‌మెంట్‌లు, భూమార్పిడి దరఖాస్తులపై మాత్రం ఎలాంటి కదలిక ఉండడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో దరఖాస్తుదారులు అమీర్‌పేట్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయానికి వస్తున్నారు. కమిషనర్ లేకపోవడంతో వెనుదిగిరి వెళ్తున్నారు. చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ కోసం వచ్చిన దరఖాస్తుల్లో ఇటీవల నాలుగింటికి మాత్రం అనుమతులు లభించినట్లు సమాచారం. ‘ప్రభుత్వ పెద్దలు పచ్చజెండా ఊపిన వాటికి మాత్రమే అనుమతులు వస్తున్నాయి. నిబంధనల మేరకు వెళితే పడిగాపులే మిగులుతున్నాయని బాచుపల్లి ప్రాంతానికి చెందిన మరో బిల్డర్ అభిప్రాయపడ్డారు. ‘ఫైళ్లలో కదలిక రావాలంటే పై నుంచి కాల్ రావాల్సిందే’ అనేది ఇప్పుడు హెచ్ఎండీఏలో సాధారణంగా అందరి నోటా వినిపించే మాట. ప్రభుత్వ పెద్దలు స్వయంగా కానీ లేదా వారి అనుచరుల ద్వారా కానీ గ్రీన్‌సిగ్నల్ ఇస్తేనే ముఖ్యమైన ఫైళ్లు ముందుకు కదులుతున్నాయి.



కరగని వ్యర్థాల కట్టడి!

పైపులైన్‌లో మురుగు నీరు పరుగెత్తాల్సిందే

- బహుళ అంతస్తుల భవనాల సీవరేజీపై దృష్టి
- పైపులైన్ల అప్‌గ్రేడ్‌కు సూచన
- నిర్మాణానికి డిసెంబర్ చివరి వరకు గడువు
- సిల్ట్ చాంబర్లు లేని భవంతులకు నోటీసులు
- 90 రోజుల సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో జలమండలి ప్రయోగం



ఇవి డ్రైనేజీలో చేరకుండా చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో భారీగా ఉత్పన్నమవుతున్న మురుగు నీరు డ్రైనేజీ పైపులైన్ల ద్వారా కరగని వ్యర్థాలు లేకుండా సాఫీగా పరుగెత్తించేందుకు జలమండలి సర్వశక్తులూ ఒడ్డుతోంది. వాటర్ బోర్డు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 90 రోజులు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ డీ-సిల్టింగ్‌లో డ్రైనేజీ పైపులైన్ నుంచి బయటపడుతున్న కరగని వ్యర్థాలు మురుగు ప్రవాహానికి అడ్డుపడి ఓవర్‌ఫ్లో అవుతున్నట్లు గుర్తించింది. మురుగు నీటిలో కరగని వ్యర్థాలను ఎక్కడికక్కడే కట్టడి చేసేందుకు చర్యలకు ఉపక్రమిస్తోంది.

బహుళ అంతస్తుల భవనాలే ప్రాధాన్యంగా..

ప్రధానంగా మురుగునీరు అధికంగా ఉత్పన్నమయ్యే హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు, ఆస్పత్రులు, మాల్స్, బేకరీలు తదితర బహుళ అంతస్తుల భవనాలతో పాటు.. బహుళ నివాస సముదాయాల సీవరేజీ కనెక్షన్లపై దృష్టి సారించింది. బహుళ అంతస్తుల భవన సముదాయంలో ఉత్పన్నయ్యే మురుగు నీరంతా ముందుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిల్ట్ చాంబర్‌లో చేరి.. అందులో ఏవైనా ఘన పదార్థాలుంటే.. అక్కడ వడబోతతో అవి అక్కడే ఆగి కేవలం మురుగు నీరు మాత్రమే డ్రైనేజీ పైపులైన్‌లోకి కలిస్తే మురుగు ప్రవాహానికి ఎలాంటి ఆటంకం ఉండదని జలమండలి భావిస్తోంది. ఇందు కోసం మురుగు అధికంగా ఉత్పన్నమయ్యే బహుళ అంతస్తులు, వాణిజ్య భవనాల సీవరేజీ కనెక్షన్లకు సిల్ట్ చాంబర్లు తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది.

నిర్మించకపోతే కఠిన చర్యలు

- బహుళ అంతస్తు భవనాల వినియోగదారులు మురుగు కనెక్షన్లకు సిల్ట్ చాంబర్లు నిర్మించుకోకుంటే కఠినంగా వ్యవహరించాలని జలమండలి యోచిస్తోంది. ప్రధానంగా వాణిజ్య, బహుళ అంతస్తుల భవన సముదాయాల సీవరేజీ పైపులైన్లలోనే మురుగులో కరగని వ్యర్థాలైన ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ బాటిళ్లు, కొబ్బరి బోండాలు, దుస్తులు, నాప్కిన్లు, డైపర్లు, ఇతర ప్లాస్టిక్ ఉత్పత్తులు మ్యాన్‌హోళ్లలో నుంచి బయటపడటాన్ని జలమండలి తీవ్రంగా పరిగణించింది. అలాంటివి రాకుండా.. వాటిని సిల్ట్ చాంబర్లకే పరిమితం చేసి మురుగు నీరు మాత్రమే పైపులైన్లలో కలిసేలా చర్యలు తీసుకోవాలని భావిస్తోంది.



- అందులో భాగంగానే సిల్ట్ చాంబర్లు లేని కొన్ని భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేసి.. తక్షణమే వాటిని నిర్మించుకోవాలని వినియోగదారులకు సూచించనుంది. ఇప్పటికే కొన్ని వాణిజ్య భవనాల్ని గుర్తించి నోటీసులు జారీ చేయగా.. మిగతా భవనాలకు సైతం నోటీసులు జారీ చేసే పనిలో నిమగ్నమైంది. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటి వరకు సీవరేజీ కనెక్షన్లకు సిల్ట్ చాంబర్లు నిర్మించుకునేలా గడువు విధించాలని భావిస్తోంది. అప్పటి వరకు సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోకుంటే.. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తోంది.

ప్రజలు భాగస్వాములవ్వాలి



సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే యజ్ఞంలో నగర వాసులందరూ భాగస్వామ్యులు కావాలి. మురుగు నీటిలో కరగని వ్యర్థాలను వేయకూడదు. సిల్ట్ చాంబర్లు ఏర్పాటు చేసుకొని వాటిద్వారా సీవరేజీ కనెక్షన్లను ప్రధాన డ్రైనేజీ పైపులైన్లకు అనుసంధానం చేసుకోవాలి. నగరంలో డ్రైనేజీ ఓవర్ ఫ్లో కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత నగర వాసులపై ఉంది.

– అశోక్ రెడ్డి, ఎండీ, జలమండలి

సీవరేజీ పైపులైన్ల అప్‌గ్రేడ్.. కమ్యూనిటీ సిల్ట్ చాంబర్లు

గతంలో ఉన్న ఇళ్ల స్థానంలో.. కొత్తగా నిర్మించిన బహుళ అంతస్తుల సీవరేజీ కనెక్షన్లకు అప్‌గ్రేడ్ తప్పనిసరి చేస్తూ జలమండలి చర్యలు చేపట్టింది. ఇలాంటి భవన సముదాయాలను గుర్తించి అప్‌గ్రేడ్ చేసుకోవాలని నోటీసులు జారీ చేస్తోంది. కాలనీల్లో సైతం సీవరేజీ అవుట్‌లెట్లు ఏర్పాటు చేసుకులా వినియోగదారులను ప్రోత్సహించాలని జలమండలి నిర్ణయించింది. ఇళ్లలో మిగిలిపోయిన ఆహార, తదితర ఘన పదార్థాలు సీవరేజీ లైన్‌లో కలిసి మురుగు సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని నివారించడానికి నాలుగు ఆపైన కొన్ని ఇళ్లకు కలిపి ఒక కమ్యూనిటీ సిల్ట్ చాంబర్ నిర్మిస్తే ఎప్పటికప్పుడు శుభ్రం చేసే వీలుంటుందని జలమండలి యోచిస్తోంది.

వాటర్ ఫీజిబిలిటీ | ప్రక్రియ సులభతరం

ప్రధాన కార్యాలయం నుంచే ధ్రువపత్రాలు

సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణదారులకు జలమండలి శుభవార్త చెప్పింది. కొత్తగా భవనాలు నిర్మించుకునే యజమానులు జీహెచ్ఎంసీ అనుమతుల కోసం సమర్పించాల్సిన వాటర్ ఫీజిబిలిటీ ధ్రువపత్రాన్ని జారీ చేసే ప్రక్రియను జలమండలి సులభతరం చేసింది. గ్రేటర్ పరిధిలోని నూతన భవన నిర్మాణానికి జీహెచ్ఎంసీ అనుమతి తప్పనిసరి. ఇందు కోసం భవన యజమానులు విద్యుత్ ఫీజిబిలిటీతో పాటు జలమండలి జారీ చేసే వాటర్ ఫీజిబిలిటీ ధ్రువ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. గతంలో ఈ సర్టిఫికెట్‌ను జలమండలి సర్కిల్ కార్యాలయాల్లో సీజీఎం జారీ చేసేవారు. వివిధ కారణాల రీత్యా ఈ ప్రక్రియలో జాప్యం జరిగేది. దీన్ని నివారించి, ఆ ప్రక్రియను సులభతరం చేయడానికి ధ్రువపత్రాల జారీని జలమండలి కేంద్ర కార్యాలయం నుంచే చేపట్టేలా మార్పులు చేసింది.



కమిటీ ఏర్పాటు

వాటర్ ఫీజిబిలిటీ ధ్రువపత్రాలు జారీ చేయడానికి జలమండలి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వినియోగదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ధ్రువపత్రాలు జారీ చేస్తుంది. ఈ ధ్రువపత్రాల కోసం వినియోగదారులు ముందుగా సంబంధిత తమ దగ్గర లోని సీజీఎంలకు దరఖాస్తులు సమర్పించాలి. వారు ఆరు రోజుల పాటు వాటిని పరిశీలించి.. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలోని కమిటీకి సిఫార్సు చేస్తారు. సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వినియోగదారులు 30 రోజుల్లోగా సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుల్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం నిర్దేశిత 5 రోజుల్లో (పని దినాలు) రెవెన్యూ విభాగ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ధ్రువపత్రాలను జారీ చేస్తారు. దీంతో భవనాలు నిర్మించుకునే వారికి పని, ధ్రువపత్రాల విషయంలో ఆలస్యం జరగకుండా ఉంటుంది.

చతుర్విధ జల ప్రక్రియపై
19న రౌండ్ టేబుల్ సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: హనుమంతరావు చతుర్విధ జల ప్రక్రియలో కేవలం రూ.150 కోట్లు కేటాయిస్తే ఏడాదికి లక్ష ఎకరాలు మూడు పంటలకు సాగు నీరందించవచ్చని ఎం.చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ విషయమై ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు వివరించారు. నీటి భద్రత, మూసీ నది పునరుజ్జీవం అనే అంశంపై ఈ నెల 19న వికారాబాద్‌లోని శ్రీఅనంతపద్మనాభస్వామి ఆర్ట్స్ కళాశాల (ఎస్ఏపీ)లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. 2001లో ఎకరాకు రూ.5 వేల ఖర్చుతో సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం గొట్టిగారిపల్లి గ్రామంలో అమలు చేసిన హనుమంతరావు ఫర్ వాటర్ టెక్నాలజీ మంచి ఫలితాలు ఇచ్చిందన్నారు. ఈ విధానాన్ని తెలంగాణలో విస్మరించినా.. రాజస్థాన్ ప్రభుత్వం 2014 నుంచి 33 జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో చాలా విజయవంతంగా అమలు చేసిందన్నారు. పూర్తిగా వర్షాధారంపై ఆధారపడిన రైతులకు ఇదో మంచి అవకాశమన్నారు. వికారాబాద్ జిల్లాలో 5.09 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. అందులో కేవలం 13.6 శాతానికి మాత్రమే సాగునీరు అందుతోంది. దాదాపు 84 శాతం మందికి 5 ఎకరాల కంటే తక్కువ సాగు భూమి ఉన్నట్లు ఆయన వివరించారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు తప్ప ఇతర సాగునీటి వనరులు లేవు. జిల్లా సగటు వార్షిక వర్షపాతం 833 మిల్లీమీటర్లుగా ఉందని తెలిపారు. వాటర్‌షెడ్ అభివృద్ధికి అత్యంత అనుకూలమైనది ఈ ప్రాంతమన్నారు. హనుమంతరావు చతుర్విధ జల ప్రక్రియను అమలు చేస్తే సంవత్సరానికి మూడు పంటలు పండించే అవకాశం ఉందన్నారు.

నిర్దేశిత రుణ లక్ష్యాలను చేరుకోవాలి: దానకిశోర్

సాక్షి, సిటీబ్యూరో: మహిళా స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) నిర్దేశిత లక్ష్యాల మేరకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఎంఏయూడీ కార్యాలయంలో జీహెచ్ఎంసీ, మెప్మా అధికారులతో ఎస్‌హెచ్‌జీల బ్యాంకు లింకేజీ టార్గెట్, కొత్త గ్రూపుల ఏర్పాటు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యకలాపాల అభివృద్ధి తదితరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్య సాధనకు నెలవారీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, జీహెచ్ఎంసీ బ్యాంకు లింకేజీ ద్వారా ఎస్‌హెచ్‌జీలకు నెలకు కనీసం రూ. 200 కోట్ల రుణాలు అందించాలన్నారు. బ్యాంకర్లతో వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలని, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధికి స్థానిక ఎన్జీఓలను, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్లను గుర్తించాలన్నారు. అర్హులైన మహిళలను గుర్తించి కొత్త ఎస్‌హెచ్‌జీలను ఏర్పాటు చేయాలన్నారు. పాత గ్రూపులను పటిష్ట పరిచేందుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించే కార్నివాల్ కోసం కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవి, ఎంఏయూడీ డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (యూసీడీ) చంద్రకాంత్ రెడ్డి, జాయింట్ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దానకిశోర్

47 చెరువుల పునరుద్ధరణ



ఎన్‌డీఎంఎఫ్ నిధులతో పనులు

- రూ.141 కోట్లు మంజూరు

సాక్షి, సిటీబ్యూరో: బల్దియా పరిధిలో ఎంతోకాలంగా నిర్లక్ష్యానికి గురై తగిన కట్టలు (బండ్స్) లేక కబ్జాల పాలవుతూ.. ఎక్కడెక్కడి నుంచో వచ్చి కలుస్తున్న మురుగు నీటితో కలుషిత కాసారాలుగా మారుతూ.. వర్షాలొచ్చినప్పుడు పరిసర బస్తీలు, కాలనీలను ముంచుతున్న 47 చెరువులను పునరుద్ధరించేందుకు రంగం సిద్ధమవుతోంది. వర్షాకాలంలో వరద ముంపు ప్రమాదాలు ఏర్పడకుండా జీహెచ్ఎంసీ తగిన చర్యలు తీసుకోనుంది. అర్బన్ ఫ్లడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం కింద జీహెచ్ఎంసీకి తగిన నిధులివ్వాల్సిందిగా చేసిన విజ్ఞప్తికి స్పందించిన కేంద్రం నిధులు మంజూరు చేసినట్లు తెలిసింది. చెరువుల ప్రక్షాళన, అభివృద్ధి పనులతో పాటు మురుగునీటి మళ్లింపు, వర్షాల రాకకు సంబంధించి ముందస్తు సమాచారం తెలుసుకునే ఆధునిక సాంకేతికత, తదితర పనుల కోసం మొత్తం రూ. 319.53 కోట్ల సహాయాన్ని కోరగా, నేషనల్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ (ఎన్‌డీఎంఎఫ్) నుంచి రూ.250 కోట్లు మంజూరు కాగా, మిగతా రూ.69.53 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్నట్లు సమాచారం.

నిధులిలా..

చెరువుల పునరుద్ధరణకు రూ. 141.37 కోట్లు, మురుగునీటి మళ్లింపు పనులకు రూ.100.45 కోట్లు, ముందస్తు వాతావరణ సమాచారం తెలుసుకునే ఆధునిక సాంకేతికతకు రూ.57.71 కోట్లు, ఇతరత్రా పనులకు రూ.20 కోట్లు ఖర్చు చేయనున్నారు. మంజూరైన ఎన్‌డీఎంఎఫ్ నిధులు జీహెచ్ఎంసీకి అందాక పనులు చేపట్టనున్నారు.

ఆ చెరువులు ఇవీ: పనులు చేపట్టనున్న చెరువుల్లో చార్మినార్ జోన్‌లోని సులేమాన్ చెరువు, గుర్రం చెరువు, ఖైరతాబాద్ జోన్‌లోని లంగర్ హౌస్ ట్యాంక్, చిక్కడపల్లి బ్రిడ్జి, సాతం చెరువు, అనంతగాని కుంట, బాతుర్ కుంట, ఎర్రకుంట, కూకట్‌పల్లి జోన్‌లోని పరికి చెరువు, ముండ్లకత్వ, కాముని చెరువు, పెద్దబంధం, చింతల్ చెరువు, పెద్దచెరువు, చిన్నబంధం, కాల్మన్న కుంట, కొకూర్ చెరువు, సున్నం చెరువు, మైసమ్మ చెరువు, వెన్నలగడ్డ చెరువులు ఉన్నాయి. ఎల్‌బీనగర్ జోన్‌లోని డీఎంఆర్ఎల్ లేక్, బాతుల చెరువు, సరూర్‌నగర్ చెరువు, బండ్లగూడ చెరువు, నల్లచెరువు, పటేల్ చెరువు, రామంతాపూర్ చిన్నచెరువు, సికింద్రాబాద్‌జోన్‌లోని బండ చెరువు, సఫిల్‌గూడ లేక్, రామన్న చెరువు, తిరుమలగిరి ట్యాంక్, శేరిలింగంపల్లి జోన్‌లోని బొటానికల్ గార్డెన్ లేక్, పోచమ్మకుంట, గుండ్ల కుంట, గన్నేరుకుంట, నోవాటెల్ లేక్, తమ్మిడికుంట, గోపి చెరువు, నల్లగండ్ల చెరువు, చాకలివాని చెరువు, ఈద్గవాని కుంట.. ఇంకా తదితర చెరువులు ఉన్నాయి.

విద్యార్థి నేతలపై కేసులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసినందుకు బీఆర్ఎస్ విద్యార్థి నేతలపై కేసులు నమోదు అయ్యాయి. లగచర్ల సంఘటనలో రైతుల అక్రమ అరెస్టులకు నిరసనగా ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన విషయం విదితమే. ఈ సంఘటనలో పాల్గొన్న చటారి దశరథ్, కొంపల్లి నరేష్, జంగయ్య, ప్రశాంత్, నాగేందర్, అవినాష్, శ్రీకాంత్, శ్రీను నాయక్, రమేష్ గౌడ్‌పై కేసులు నమోదయ్యాయి.

కెమెరాలు తస్కరించే ఇద్దరు దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మునావర్, ఇన్‌స్పెక్టర్ రాజు

అబిడ్స్: ఫంక్షన్ హాళ్లలో ఫొటోగ్రాఫర్లకు చెందిన ఖరీదైన కెమెరాలను దొంగిలిస్తున్న ఇద్దరు దొంగలను గుడిమల్కాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం కుల్సుంపురా డివిజన్ ఏసీపీ మునావర్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుడిమల్కాపూర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఇద్దరు కెమెరాలను దొంగిలిస్తుండగా అనుమానంతో యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ రాజు కార్వాన్ ఉప్పర్‌బస్తీకి చెందిన ప్రవీణ్‌కుమార్, అత్తాపూర్‌కు చెందిన భిక్షపతిలను అరెస్టు చేసి వారి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు, పలు కెమెరాలు, కెమెరాల లెన్స్‌లు స్వాధీన పరచుకున్నారు. ఫంక్షన్ హాళ్లలో ప్రవేశిస్తున్న ఈ ఇద్దరు దొంగలు అనుమానం రాకుండా ఫొటోగ్రాఫర్ల బ్యాగ్‌లలో చాకచక్యంగా సామాగ్రి దొంగిలించారు. ఈ కేసును గుడిమల్కాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సర్వే డేటా ఎంట్రీ బాధ్యతాయుతంగా చేపట్టాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి, సిటీబ్యూరో: డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా నమోదును ఎలాంటి తప్పులు లేకుండా బాధ్యతాయుతంగా చేపట్టాలని రాష్ట్ర నోడల్ అధికారి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. శనివారం షేక్‌పేటలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొన్నారు. సర్వే డేటా ఎంట్రీ నమోదు విధివిధానాలపై వివరించారు. ప్రతి జిల్లాకు ఎంట్రీ నమోదుకు లాగిన్ ఇవ్వడం జరుగుతుందని, ఇక్కడ శిక్షణ పొందిన ఆపరేటర్లు జిల్లాలోని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ అందించేందుకు ఈ శిక్షణ ఎంతో కీలకమని అన్నారు. దాదాపు 20 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లకు మెరుగైన శిక్షణ అందించనున్నామని తెలిపారు. డేటా ఎంట్రీ బాధ్యతాయుతంగా తప్పులు లేకుండా పక్కాగా చేపట్టాలని సూచించారు. ఇప్పటి వరకు 50 శాతం పైగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరిగిందని, అలాగే కొన్ని జిల్లాల్లో 70 శాతం వరకు సర్వే జరిగినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరిస్తున్నారని, సర్వే వేగవంతంగా జరుగుతుందని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అర్థ గణాంక శాఖ సంచాలకులు ఓం ప్రకాష్, ప్రణాళిక శాఖ సంచాలకులు రూఫస్ దత్తం, సీసీజీ ప్రాజెక్టు మేనేజర్ లోకేష్, ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతబస్తీ మెట్రో పనులు షురూ

- వేగవంతంగా మెట్రో భూసేకరణ పనులు
- 200 ఆస్తులకు డిక్లరేషన్ ఇచ్చిన కలెక్టర్
- ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు పనులు
- కూల్చివేతల తొలగింపునకు హెచ్ఎంఆర్ఎల్ బిడ్డింగ్



సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండో దశ విస్తరణకు క్షేత్రస్థాయిలో పనులు మొదలయ్యాయి. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపట్టనున్న పాతబస్తీ మెట్రో కారిడార్‌లో భూసేకరణ పనులు చేపట్టారు.ఈ కారిడార్‌లో రోడ్ల విస్తరణ, మెట్రో అలైన్‌మెంట్ కోసం తొలగించవలసిన నిర్మాణాలను ఇప్పటికే గుర్తించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా 200 ఆస్తుల డిక్లరేషన్‌కు (100 ఎల్‌హెచ్‌ఎస్, 100 ఆర్‌హెచ్‌ఎస్) హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఆమోదం తెలిపారు. ఈ డిక్లరేషన్‌కు అనుగుణంగా అవార్డు డిసెంబర్ నెలాఖరు నాటికి ఆమోదించనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించనున్న 7.2 కిలోమీటర్ల మెట్రో అలైన్‌మెంట్‌లో భాగంగా కూల్చివేతలను తొలగించేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ ఆసక్తి గల సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు తాజాగా టెండర్ నోటిఫికేషన్ వెల్లడించింది. ఇందుకోసం సుమారు రూ.1.3 కోట్లు వెచ్చించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే మెట్రో కోసం ఆస్తులు కోల్పోయిన వారికి జనవరి నుంచి పరిహారం చెల్లించే అవకాశం ఉంది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు పలు మార్గాల్లో మెట్రో రెండో దశ విస్తరణకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిన సంగతి తెలిసిందే. కేబినెట్ ఆమోదం అనంతరం మెట్రో రెండో దశకు పరిపాలనాపరమైన అనుమతులు కూడా లభించాయి. అలాగే కేంద్రం ఆమోదం కోసం కూడా రెండో దశ ప్రాజెక్టు డీపీఆర్‌ను అందజేశారు. సుమారు రూ.24 వేల కోట్లకు పైగా నిధులతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేయనున్న నిధులతో పాటు ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా మెట్రో మొదటి దశలోనే జూబ్లీబస్‌స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు నిర్మించవలసి ఉండగా వివిధ కారణాల వల్ల వాయిదా పడింది. ఎంజీబీఎస్ వరకే అది పరిమితమైంది. దీంతో ఈ కారిడార్‌ను రెండో దశలో చేర్చి చాంద్రాయణగుట్ట వరకు పొడిగించారు.ఈ మేరకు ఈ ఏడాది మార్చి 7వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫలక్‌నుమా వద్ద శంకుస్థాపన కూడా చేశారు.

మూసీ బాధితులతో మమేకమైన బీజేపీ నేతలు

- గ్రేటర్‌లోని 21 చోట్ల మూసీ నిద్ర చేసిన నాయకులు
- బాధితులకు భరోసా

సాక్షి, సిటీబ్యూరో: మూసీ పునరుజ్జీవంలో భాగంగా చేపట్టిన ఇళ్ల కూల్చివేతలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ శనివారం మూసీనిద్ర చేపట్టింది. బాధిత కుటుంబాలకు భరోసాను ఇవ్వడంతో పాటు స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొనేందుకు ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు గ్రేటర్‌లోని 21 ప్రాంతాల్లో మూసీ నిద్ర చేశారు. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి అంబర్‌పేట్ తులసీనగర్‌లో నిద్ర చేశారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హైదర్‌షాకోట్ వద్ద నిద్ర చేశారు.అలాగే మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఎల్‌బీనగర్‌లోని చైతన్యపురి ఫణిగిరి కాలనీలో మూసీ బాధితులతో కలిసి నిద్రించారు.ఎన్‌వీఎస్ ప్రభాకర్ రామంతాపూర్‌లో నిద్రించారు.మూసీ ప్రక్షాళనకు తాము వ్యతికం కాదని, ఇళ్ల కూల్చివేతలను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని ఈ సందర్భంగా బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.మూసీకి ఇరువైపులా ప్రహరీగోడలు నిర్మించి ప్రక్షాళన చేపట్టాలని సూచించారు. నగరంలోని అఫ్జల్‌గంజ్, గౌలిగూడ, జుమ్మేరాత్‌బజార్, పురానాపూల్, కమలానగర్, అంబేద్కర్‌బస్తీ,హైదర్‌గూడ, అత్తాపూర్,న్యూమారుతీనగర్, సత్యానగర్, కిషన్‌బాగ్, ద్వారకాపురికాలనీ,గణేశ్‌నగర్, ఫత్యేనగర్, తదితర ప్రాంతాల్లో బీజేపీ శనివారం మూసీ నిద్ర చేపట్టింది.

కేన్సర్ చికిత్స కోసం దొంగగా మారాడు



చోరీ వివరాలు వెల్లడిస్తున్న తిరుమలగిరి ఏసీపీ రమేష్

రసూల్‌పురా: కేన్సర్ బారిన పడిన ఓ యువకుడు వైద్య ఖర్చుల కోసం దొంగగా మారాడు. తన కుటుంబ సభ్యులు తన వైద్యం కోసం చేస్తున్న అప్పులు చూడలేక డబ్బుల కోసం దొంగతనం చేయాలని నిశ్చయించుకుని నేరాల బాట పట్టాడు. తిరుమలగిరి ఏసీపీ రమేష్ తెలిపిన వివరాల మేరకు న్యూబోయిన్‌పల్లి మహాత్మనగర్‌కు చెందిన కళ్యాణ్‌కుమార్ (30) ఎక్స్‌ప్రెస్ బీస్ సంస్థలో కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. గత కొన్నేళ్ళుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. తన వైద్య ఖర్చుల కోసం గత నెల అల్వాల్ పీఎస్ పరిధిలోని టెంపుల్ అల్వాల్‌లో తాళం వేసి ఉన్న మూడు ఇళ్లను గమనించి ఇనుపరాడ్‌తో తాళం పగుల గొట్టి 33 వేల రూపాయల నగదు చోరీ చేశాడు. అదేవిధంగా ఈనెల ఐదవ తేదీన కార్ఖాన వాసవీనగర్ చోలాస్ రెసిడెన్సీ నాలుగో అంతస్థులోకి ప్రవేశించి ప్రతిభా శర్మకు చెందిన ఫ్లాట్ నంబర్ 107 తాళంను ఇనురాడ్‌తో పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, రూ.52 వేల నగదు తస్కరించి పారిపోయాడు. చోరీ అయినట్లు గ్రహించిన ప్రతిభా శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు 350కు పైగా సీసీ ఫుటేజీలను పరిశీలించి..వాటి ఆధారంగా, విశ్వసనీయ సమాచారం మేరకు కళ్యాణ్‌కుమార్ చోరీలకు పాల్పడినట్లు తేల్చి అరెస్టు చేశారు. బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా కేన్సర్ చికిత్సకు డబ్బులు లేకనే తాను దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు విచారణలో పేర్కొన్నాడని పోలీసులు తెలిపారు.

ములాఖాత్‌లో స్నేహితులను కలిసేందుకు వచ్చి ..

ఏటీఎంలో చోరీకి యత్నం




బంజారాహిల్స్: జైల్లో ఉన్న స్నేహితుల్ని ములాఖాత్‌లో కలిసేందుకు ఉత్తర్‌ప్రదేశ్ నుంచి నగరానికి వచ్చిన ఇద్దరు పాత నేరస్తులు..ఖాళీగా ఇంటికి వెళ్లడం ఎందుకని దారిలో ఏటీఎం సెంటర్‌లో చోరీకి యత్నించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు క్షణాల్లో స్పందించడంతో నిందితుల్లో ఒకరు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళ్తే..ఉత్తరప్రదేశ్‌కు చెందిన పర్వేజ్, అరవింద్ జోలా, సలీం, సక్లేయిన్ నలుగురూ స్నేహితులు. వీరంతా గతంలో పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడిన నేర చరిత్ర ఉంది. వీరిలో సలీం, సక్లెయిన్ ఇటీవల గంజాయి కేసులో అరెస్టు అయి ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నారు. సలీం, సక్లయిన్లను ములాఖత్‌లో కలవడం కోసం శుక్రవారం ఉదయాన్నే ఉత్తర్ ప్రదేశ్ నుంచి రైల్లో వచ్చిన పర్వేజ్, అరవింద్‌లు చంచల్ గూడ జైలుకి వెళ్లారు. ములాఖాత్‌లో స్నేహితులను కలిసి బయటకు వచ్చిన వీరు శనివారం ఉదయం రైల్లో యూపీ వెళ్ళాల్సి ఉంది. అయితే గతంలో ఏటీఎంల చోరీలు చేసిన అనుభవం కలిగిన వీరిద్దరూ వెళ్లేలోగా ఓ ఏటీఎంలో చోరీకి ప్లాన్ వేశారు. శుక్రవారం రాత్రి శ్రీనగర్ కాలనీలోని ఏటీఎం చౌరస్తాలో రాత్రి 10 గంటల ప్రాంతంలో కొటక్ మహేంద్ర బ్యాంక్ ఏటీఎంలోకి వెళ్ళారు. అక్కడ ఏటీఎం చోరీకి ప్రయత్నిస్తుండగా ముంబయిలో ఆ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో అలారం మోగింది. అక్కడి అధికారులు వెంటనే డయల్ 100కు, బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన బంజారాహిల్స్ క్రైమ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు పోలీసుల రాకను గమనించిన నిందితులు పరుగులు పెట్టారు. వారిని వెంబడించిన పోలీసులు పర్వేజ్‌ను పట్టుకోగా అరవింద్ జోలా పరారయ్యాడు.

పార్ట్ టైం జాబ్ చీటింగ్ కేసులో ఇద్దరి అరెస్టు


సాక్షి, సిటీబ్యూరో: పార్ట్ టైం జాబ్ పేరిట చీటింగ్‌కు పాల్పడిన కేసులో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన కృష్ణా బాబురావు పవార్, రమాకాంత్ జీవన్ ధనావతేలు టెలిగ్రాం యాప్‌లో నకిలీ ప్రొఫైల్స్‌ను సృష్టించారు. పార్ట్‌టైం జాబ్ పేరుతో విద్యార్థులు, నిరుద్యోగులకు టెలిగ్రాంలో సందేశాలు పంపించేవారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితుడికి టెలిగ్రాంలో ఇదే తరహా సందేశం వచ్చింది. దీంతో కేటుగాళ్ల సూచన మేరకు వెబ్‌సైట్‌లో యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను నమోదు చేసుకున్నాడు. మొదట్లో బాధితుడు చిన్నమొత్తంలోనే పెట్టుబడులు పెట్టాడు. దీంతో బాధితుడ్ని నమ్మించేందుకు కేటుగాళ్లు కూడా లాభాలను పంపించారు. దీంతో బాధితుడికి ఆశ కలిగింది. ఈసారి ఏకంగా రూ.1.16 లక్షలు పెట్టుబడి పెట్టాడు. వెబ్‌సైట్‌లో బాధితుడి బ్యాంక్ ఖాతాలో లాభంతో కలిపి ఎక్కువ మొత్తమే కనిపిస్తుంది కానీ, ఆ సొమ్మును విత్‌డ్రా చేసేందుకు అనుమతించలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాధితుడితో జరిపిన టెలిగ్రాం సందేశాలు, బ్యాంక్ లావాదేవీలను పరిశీలించారు. అందులోని ఫోన్ నంబర్లను గుర్తించి, వాటిని ట్రేసింగ్‌లో పెట్టారు. అయితే నిందితులు బాబురావు, రమాకాంత్‌లు కరెంట్ బ్యాంక్ అకౌంట్ల కోసం హైదరాబాద్‌కు వచ్చారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు..గచ్చిబౌలిలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఇప్పటికే వీరికి దేశవ్యాప్తంగా 140 సైబర్ క్రైమ్ కేసులతో సంబంధం ఉంది. తెలంగాణలోనే 9 కేసులున్నాయి.

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- మృతులు నగర వాసులు



శివకుమార్



చికిత్స పొందుతున్న మనోజ్



ప్రమాదానికి గురైన కారు

జహీరాబాద్ టౌన్: దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న సమయంలో భక్తులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. 65వ జాతీయ రహదారిపై జహీరాబాద్ బైపాస్ రోడ్డులో కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఈ ఘంటన చోటు చేసుకుంది. జహీరాబాద్ పట్టణ ఎస్ ఐ కాశీనాథ్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్‌కు చెందిన సురేష్, శివకుమార్, నర్సింహరావు అతని కుమారుడు మనోజ్‌లు కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని కర్నాటక రాష్ట్రం గానుగాపూర్‌లోని శ్రీదత్తాత్రేయస్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం కారులో వెళ్లారు. స్వామి వారిని దర్శించుకుని తిరిగి వస్తున్న సమయంలో డ్రైవర్‌కు నిద్రమత్తు రావడంతో కారుపై నియంత్రణ కోల్పోయాడు. 65 జాతీయ రహదారిపై పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఇంద్రప్రస్త కాలనీ వద్ద వేగంగా వెళ్లి కారు కల్వర్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటినా గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో జహీరాబాద్‌లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా నర్సింహరావు(42) మృతి చెందారు. శివకుమార్, మనోజ్‌లకు తీవ్రగాయాలు కావడంతో స్థానికంగా చికిత్స అందించిన తరువాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యారంగానికి ఇక్ఫాయ్ వర్సిటీ దిక్సూచి



బంజారాహిల్స్: దేశంలోని విద్యా రంగానికి ఇక్ఫాయ్ యూనివర్సిటీ దిక్సూచిగా నిలుస్తోం దని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గుళ్లపల్లి ఎన్.రావు అన్నారు. ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఎన్‌జే యశశ్వీ స్మారకోపన్యాస కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ గుళ్లపల్లి ఎన్.రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఇక్ఫాయ్ విశ్వవిద్యాలయ కులపతి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ రంగరాజన్ వర్చువల్‌గా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గుళ్లపల్లి ఎన్.రావు మాట్లాడుతూ సాధారణ కుటుంబం నుంచి వచ్చి ఉన్నత విద్యలో ఆరితేరి ఎన్నో విద్యాసంస్థలు స్థాపించి ఎన్‌జే యశశ్వీ ఎంతోమందికి ఉపాధి కల్పించారన్నారు. పేద ప్రజలకు అవసరమైన కనీస వైద్య సేవలు అందించాలని కోరారు. అదే విధంగా ఎన్నో ఏళ్లుగా ఎల్వీప్రసాద్ పేదలకు విశేష సేవలు అందిస్తుందని, మారుమూల గ్రామాల్లో కూడా తమ సేవలు అందించి పేదలకు ఉచితంగా కంటి చికిత్సలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర బడ్జెట్‌లో వైద్య రంగానికి 2 శాతం కేటాయింపును 5 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. డాక్టర్ సి.రంగరాజన్ మాట్లాడుతూ బడ్జెట్ కేటాయించిన నిధులు సక్రమంగా అమలు జరిగి పేదవారికి సైతం అభివృద్ధి ఫలాలు అందించే దిశగా చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఇక్ఫాయ్ ఫౌండేషన్ సొసైటీ చైర్‌పర్సన్ శోభారాణి యశశ్వీ, అధ్యక్షులు వీఆర్ శంకర, ఉపకులపతి ఎల్ఎస్ గణేష్, రిజిస్ట్రార్ విజయలక్ష్మీ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సబ్‌స్టేషన్ల మరమ్మతు పనులు

బంజారాహిల్స్: విద్యుత్ శాఖ బంజారాహిల్స్ డీఈ పరిధిలోని 24 సబ్‌స్టేషన్లలో మరమ్మతులు ముమ్మరంగా సాగుతున్నాయి. జనవరి చివరి నాటికి వేసవి కాల కార్యాచరణ ప్రణాళిక పూర్తి చేయాలని అధికారులు ఆదేశించడంతో సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్ పనులు జోరుగా సాగుతున్నాయి. సబ్‌స్టేషన్లను తనిఖీలు చేస్తూ ఎక్కడైనా లోపాలు కనిపిస్తే వెంటనే వాటి మరమ్మతులు చేస్తున్నారు. సంబంధిత సిబ్బంది వివిధ విద్యుత్ ఫీడర్ల నిర్వహణ పనులను చేపడుతున్నారు. విద్యుత్ మరమ్మతులు నిమిత్తం సిబ్బంది బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ తదితర ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లలో చిన్నచిన్న మరమ్మతులు ముందస్తుగానే పూర్తి చేస్తున్నారు.

గాండ్ల తెలికుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు తదితరులు

ఖైరతాబాద్: రెడ్డిగాండ్ల సామాజిక వర్గం వారిని బీసీ గ్రూపులో చేర్చకూడదని, బీసీలు కాని రెడ్డి గాండ్ల సామాజిక వర్గం వారు తీసుకున్న బీసీ బీ6 గాండ్ల కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిక్కుమళ్ల రాంచందర్‌రావు కోరారు. శనివారం ఖైరతాబాద్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంచందర్‌రావు మాట్లాడుతూ గాండ్ల కుల ధ్రువీకరణ పత్రాలను చట్ట విరుద్ధంగా జారీ చేసిన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గాండ్ల తెలికుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి గాండ్ల కులస్తులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. భూపాల్‌పల్లి జిల్లా, కాటారం మండలంలో కుల ధ్రువీకరణ పత్రాలను చట్టవిరుద్ధంగా రెడ్డిగాండ్ల కులస్తులు తీసుకుంటున్నారని వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కూతురు లక్ష్మణ్, కోశాధికారి వేల్పుల మల్లికార్జున్‌రావు, రాష్ట్ర నాయకులు ఎన్.సుధాకర్, అడ్డం నాగ సత్యనారాయణ, వై.మధుకర్, బొల్లం కృష్ణవేణి, గుజ్జేటి వెన్నెల, పోతు సత్యనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీఎల్ కాంతారావు జయంతి



టీఎల్ కాంతారావు 101వ జయంతి వేడుకల్లో రమణాచారి తదితరులు

బంజారాహిల్స్: ప్రేక్షకుల హృదయాల్లో కళాప్రపూర్ణ టీఎల్ కాంతారావు శాశ్వతంగా నిలిచి ఉంటారని మాజీ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి అన్నారు. కళాప్రపూర్ణ టీఎల్ కాంతారావు 101వ జయంతి వేడుకలు ఫిలించాంబర్‌లో నిర్మాతల మండలి హాల్‌లో ఆహ్లాదభరిత వాతావరణంలో జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి మాట్లాడుతూ కాంతారావుకు ప్రభుత్వం నుంచి సరైన గుర్తింపు తేవడంలో కృషి చేసినా సఫలం కాలేదన్నారు. సీనియర్ నటీమణి రోజారమణి తన చిన్నతనంలో కాంతారావు ఇంట్లో ఆటలాడుకున్న విషయాలను, కాంతారావు జంటగా నటించినప్పటి అనుభవాలను గుర్తుచేసుకున్నారు. సీనియర్ నటి కవిత మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు కలిసి కాంతారావుకు ప్రభుత్వపరంగా తగిన గౌరవం లభించేలా కృషి చేస్తానన్నారు. కేవీ కృష్ణకుమారి మాట్లాడుతూ కాంతారావు కుటుంబంతో, తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. శత చిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ కాంతారావు 101వ జయంతి కార్యక్రమం చిత్ర పరిశ్రమ నిర్వహిస్తే బాగుండేదన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ కల్చరల్, తెలుగు టెలివిజన్ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్, కాంతారావు కుమార్తె సుశీల, కుమారుడు రాజా, టీటీడబ్ల్యుఏ అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, కోశాధికారి చిత్తరంజన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్‌డీఎస్ ప్రకాష్, కార్యవర్గ సభ్యులు అక్కినేని శ్రీధర్, కేవీఎల్ నరసింహారావు, స్వప్న, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సమగ్ర సర్వే

• ఖైరతాబాద్ సర్కిల్ 17,18ల్లో 30 శాతం పూర్తి • 90 వేల గృహాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు • ప్రతి రోజూ పది ఇళ్లు సర్వే



ఫారాలను తనిఖీ చేస్తున్న సర్కిల్-17 డీసీ రజనీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వేలో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధి కిందికి వచ్చే జీహెచ్ఎంసీ సర్కిల్-17, 18 పరిధిలో శనివారం రాత్రి 30 శాతం సర్వే పూర్తయ్యింది. మొత్తంగా 90 వేల వరకు గృహాలు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. ఇందులో ఇప్పటివరకు ఖైరతాబాద్ సర్కిల్-17 పరిధిలో 14,696, జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో 17,057 ఇళ్లల్లో సర్వేలు పూర్తి చేశారు. సర్కిల్-17 పరిధిలో 434 ఎన్యూమరేటర్ బ్లాక్‌లు ఉండగా, సర్కిల్-18 పరిధిలో 422 బ్లాక్‌లు ఉన్నాయి. ఒక్కో ఇంటిలో సర్వే చేయడానికి సుమారు 40 నిమిషాల వ్యవధి పడుతుందని ఎన్యుమరేటర్లు పేర్కొంటున్నారు. దీంతో ప్రతిరోజూ 10 ఇళ్ల వరకు మాత్రమే సర్వే చేస్తున్నామని, మొదట్లో ఆలస్యం కాగా, ఇప్పుడు సర్వే వేగం పుంజుకుందని అధికారులు పేర్కొంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సమగ్ర సర్వేలో సర్కిల్-18 మూడో స్థానంలో నిలిచింది. డీఎంసీలు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ జూమ్ మీటింగ్ నిర్వహిస్తూ ఎన్యుమటరేటర్లను, సూపర్‌వైజర్లను సలహాలు, సూచనలు చేస్తున్నారు. సర్వే పూర్తయిన తర్వాత ఆయా ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. సర్వే సక్రమంగా నిర్వహిస్తున్నారా? లేదా..? సర్వే ఫారంలో ఖాళీలను పూర్తిగా నింపుతున్నారా? అన్న అంశాలను క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలిస్తున్నట్లు సర్కిల్-17 డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు పూర్తయిన సర్వేలో పకడ్బందీగా పూర్తి వివరాలు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి: ప్రశాంతి, డీసీ, జూబ్లీహిల్స్ సర్కిల్-18

సమగ్ర కుటుంబ సర్వేను త్వరితగతిన పూర్తి చేసే దిశలో సూపర్‌వైజర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని జూబ్లీహిల్స్ సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి సూచించారు. సర్కిల్-17, 18 సూపర్‌వైజర్లతో శనివారం ఆమె సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లకు దిశా నిర్దేశం చేశారు. ఫారాల్లో తప్పులు లేకుండా పూర్తి చేయాలని కోరారు. తొందరగా సర్వే పూర్తి చేసే దిశలో ఎన్యుమరేటర్లతో సమన్వయంగా కుదుర్చుకోవాలన్నారు. ప్రజల నుంచి సహకారం లభిస్తుందా? లేదా అన్న విషయంలో ఆమె సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి మంచి సహకారం ఉందని వారు వెల్లడించారు. ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతున్నారని వెల్లడించారు. సర్కిల్-18 పరిధిలో ఇంకో 35 వేల గృహాలు సర్వే చేయాల్సి ఉందని, 10 రోజుల్లో పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. ఎన్యుమరేటర్ బ్లాక్‌లను ప్రతిరోజూ తనిఖీ చేస్తామని, సర్వే ఫారాన్ని సంపూర్ణంగా భర్తీ చేయాలన్నారు. ప్రతిరోజూ ఒక్కొక్కరు 10 ఇళ్లను సర్వే చేస్తున్నారని, దీనిని మరింతగా పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు.



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-11లో సమగ్ర సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు

తక్కువ బరువుతో పుట్టిన శిశువుకు కొత్త జీవితం

రెండునెలలపాటు క్లిష్టమైన వైద్యసేవలు



వివరాలను వెల్లడిస్తున్న వైద్య బృందం

లక్డీకాపూల్: కేవలం 28 వారాలలో 760 గ్రాముల బరువుతో జన్మించిన శిశువుకు వైద్యులు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. శనివారం వైద్య చికిత్స వివరాలను అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్య బృందం వెల్లడించింది. రాజమోహన్‌రెడ్డి, కవిత దంపతులకు నెలలు నిండకుండానే చాలా తక్కువ గ్రాముల బరువుతో శిశువు జన్మించింది. దీంతో అనారోగ్య సమస్యలు ఎదురుకాగా ఈ ఏడాది ఆగస్టు 31న జూబ్లీహిల్స్‌లోని అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు తరలించారు. దీంతో వైద్యులు శిశువు కడుపును ఎక్స్‌రే తీయగా పేగులో కొన్ని ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో శిశువుకు సుమారు రెండునెలలపాటు వివిధ రకాలలైన ప్రత్యేక వైద్య సేవలు అందించిన వైద్యులు 1.56 కిలోల బరువు పెరగడంతో డిశ్చార్జ్ చేశారు. అపోలో క్రెడిల్ పీడియాట్రిక్ సర్జరీ టీమ్, డాక్టర్ లలతేందు కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు విశ్వనాథ్, కృష్ణ స్వరూప్ రెడ్డి, కె.రాజ సుబ్బారెడ్డి, పి. శివకుమార్ రెడ్డిలతో పాటు నర్సింగ్, పారామెడికల్ బృందం ఈ వైద్య చికిత్సల్లో సేవలు అందించారు.

ఉచిత వైద్య శిబిరం

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్, మాఈఎన్‌టీ ఆసుపత్రి సంయుక్తాధ్వర్యంలో సికింద్రాబాద్, నల్లగుట్ట బాలంరాయి పాఠశాలలో వినికిడి సమస్యలపై వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులు, సిబ్బంది సుమారు 200 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.

రోడ్ల పక్కన వాహనాలు నిలిపితే చర్యలు

ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే



మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

బంజారాహిల్స్: రోడ్ల పక్కన వాహనాలు పార్కింగ్ చేయడం ద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రతిపబ్, బార్ అండ్ రెస్టారెంట్, వైన్ షాపు యజమానులు సరైన పార్కింగ్ సదుపాయం కల్పించుకోవాలని, వాలెట్ పార్కింగ్ కూడా ఏర్పాటు చేసుకోవాలని ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే సూచించారు. వెస్ట్‌జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పబ్‌లు, బార్‌అండ్ రెస్టారెంట్లు, వైన్‌షాపుల నిర్వాహకులతో శనివారం బషీర్‌బాగ్ పాత కమిషనరేట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల పక్కన పార్కింగ్ చేసిన 50 మందికి ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. వాలెట్ పార్కింగ్ వద్ద డ్రంకన్ డ్రైవ్ చేసిన వారు వాహనాలు నడపవద్దంటూ బోర్డులు ఏర్పాటు చేసి వారిని అప్రమత్తం చేయాలన్నారు. సరైన పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేసుకోకుంటే నోటీసులు, జరిమానాలు విధిస్తామన్నారు. గత రెండుమూడు రోజుల్లోనే అక్రమ పార్కింగ్ చేసిన 400లకు పైగా కార్లకు జరిమానా విధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సాయిప్రకాష్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, బోస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్‌హిల్స్ రిజర్వాయర్‌ను త్వరగా ప్రారంభించాలి



రిజర్వాయర్ వద్ద బీజేపీ నాయకులు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ రిజర్వాయర్ పనులు పూర్తి చేసి బస్తీవాసులకు త్వరగా నీరందించాలని బీజేపీ నాయకులు బృందం జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం బీజేపీ నాయకులు రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీజేపీ నాయకుడు లంకల దీపక్ రెడ్డి మాట్లాడుతూ ఎస్పీఆర్‌హిల్స్‌లో నూతనంగా నిర్మించిన 3 ఎంఎల్ రిజర్వాయర్ పనులు దాదాపు పూర్తయిన ప్రారంభించకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. దీంతో దాదాపు 50 బస్తీల ప్రజలు మంచి నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జలమండలి అధికారులు ఎప్పుడు ప్రారంభిస్తారో స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లో ఏర్పడ్డ మంచినీటి సమస్యను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు దీపక్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ గంగారాజు, రాష్ట్ర నాయకులు షర్మిల, రామకృష్ణ, నగర నాయకులు ప్రేమ్, బంగారు ప్రశాంత్, సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ, చిన్న శ్రీను, తంగలపెల్లి లక్ష్మణ్, రాంధారిబాబు, రహమత్‌నగర్, బోరబండ డివిజన్ అధ్యక్షులు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కూల్చి వారం దాటినా మొదలుకాని రోడ్డు పనులు!

హైడ్రా కమిషనర్ ఆదేశాలు సైతం బేఖాతర్



ఫిలింనగర్ సొసైటీలో హైడ్రా కూల్చివేసిన స్థలంలో నిర్మాణ వ్యర్థాలు

ఫిలింనగర్: ఫిలింనగర్ సొసైటీకి చెందిన 291 గజాల స్థలంలో మహిళా కల్చరల్ సెంటర్ పేరుతో నిర్మిస్తున్న నిర్మాణాన్ని ఈ నెల 9వ తేదీన హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. ఇది రోడ్డు స్థలమని భావించిన హైడ్రా అధికారులు వీటిని కూల్చడమే కాకుండా రెండు రోజుల్లో ఇక్కడ రోడ్డు పనులు చేపట్టాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అదే రోజు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌కు సూచించారు. అయితే సర్కిల్-18 ఇంజినీరింగ్ విభాగం మాత్రం ఇంకా మొద్దు నిద్రను వీడకుండా కూల్చివేసి వారం గడుస్తున్నా రోడ్డు పనులు ప్రారంభించలేదు. దీంతో ఈ స్థలంపై హక్కులు పొందేందుకు ఫిలింనగర్ సొసైటీ మరోసారి కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతుంది.

స్థలం జోలికి రావొద్దని కోర్టు స్టే ఉంది – కాజా సూర్యనారాయణ

ఫిలింనగర్ రోడ్డునెంబర్-9లోని విగ్రహాల వెనుక 291 గజాల స్థలంలో ఫిలింనగర్ మహిళా కల్చరల్ సెంటర్ నిర్మించేందుకు 20 ఏళ్ల క్రితమే ప్రతిపాదించడం జరిగిందని ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ అన్నారు. ఇటీవల ఈ స్థలాన్ని ఫిలింనగర్ తపాలా శాఖ కార్యాలయానికి కేటాయించాలనే నిర్ణయించామన్నారు. ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి కూడా తీసుకువెళ్లామని తెలిపారు. లేఅవుట్‌లో ఇది ఓపెన్ ల్యాండ్ అని, రోడ్డు కాదని, ఆయనకు ఆధారాలు చూపించడం జరిగిందన్నారు. ఈ స్థలంలో నిర్మాణాలు కూల్చివేసే ముందు తమకు ఈ నెల 2న నోటీసులు ఇచ్చారని, దానికి మూడు రోజుల్లో జవాబు ఇవ్వాలని చెప్పగా జవాబు కూడా పంపించామన్నారు. అయితే మరోసారి తమకు నోటీసు పంపించారని, దానికి కూడా మళ్లీ జవాబు ఇచ్చామన్నారు. ఈ రెండు జవాబులను కాదని ఈ నెల 9న ఏకంగా కూల్చివేతలు చేపట్టారన్నారు. ఈ స్థలం జోలికి రావొద్దని కోర్టు పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ గత ఏడాది జీహెచ్ఎంసీకి ఇచ్చిందని, దానిని ఖాతరు చేయకుండా కూల్చివేతలు చేపట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ అక్రమ కూల్చివేతలపై తాము కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడించారు.

ప్రీ లాంచింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

పంజగుట్ట: కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రీ లాంచింగ్ పేరుతో ఎన్నో మోసాలకు పాల్పడుతుందని, అలాంటి సంస్థల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అన్సార్ హుస్సేన్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ గ్రేటర్ కార్యవర్గం ప్రకటించారు. ఈ సందర్భంగా అన్సార్ హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6 నుంచి 8 లక్షలమంది రియల్ ఎస్టేట్ ఎగ్జిక్యూటీవ్స్ ఉంటారని వీరు కష్టమర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారికి అండగా ఉంటారని తెలిపారు. అధికారంలోకి రాగానే జీవో 257 ఎత్తేసి గ్రామ పంచాయతీ లేఔట్‌లపై మిగిలి ఉన్న ప్లాట్స్‌ను రిజిస్ట్రేషన్ చేస్తామని, రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారని కానీ ఇప్పటి వరకు నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఎఫ్‌టీసీ పరిధిలో ఉన్నవాటిని కూల్చివేయడం న్యాయమే కానీ ప్రభుత్వమే అనుమతులు ఇచ్చి, బ్యాంకు రుణాలు ఇచ్చిన వాటిని కూడా కూల్చివేయడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా తగ్గుముఖం పట్టిందని తెలిపారు. ప్రభుత్వం హైడ్రాపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. అసోసియేషన్ గ్రేటర్ కార్యవర్గం గ్రేటర్ అధ్యక్షునిగా ఎ.ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎమ్.మోహన్, కోశాధికారిగా కె.లక్ష్మీగోపాల్, కోర్ కమిటీ సభ్యులుగా బోగ కోదండపాని, మహ్మద్ తాఫీజ్ అలీ, సరళాదేవి, మహమ్మద్ సర్వర్ పాషా, శివప్రసాద్, గాలయ్య, లీగల్ అడ్వైజర్‌గా హెచ్.గౌరీశంకర్, చీఫ్ అడ్వైజర్‌గా వి.ప్రవీణ్ కుమార్‌లను ఎన్నుకున్నారు.



నూతన కార్యవర్గంతో అధ్యక్షులు అన్సార్ హుస్సేన్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖైరతాబాద్: సైఫాబాద్ టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ల మెయింటెనెన్స్, చెట్ల తొలగింపులో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సంగీత్‌నగర్ ఏరియా, కపాడియా లేన్, రెడ్‌రోస్ హోటల్, సివిల్ సప్‌లై లైన్, ఎర్రమంజిల్ మెయిన్ రోడ్డు పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎర్రమంజిల్ పరిధిలోని ఎర్రమంజిల్ కాలనీ, రవీంద్ర నికేతన్ స్కూల్, ఆర్‌అండ్‌బి ఆఫీస్, హెరిటేజ్ లేన్ పంజగుట్ట, నిమ్స్ మెయిన్ రోడ్డు ప్రాంతంలో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు. నిజాంకాలేజ్, ఎగ్జిబిషన్ సబ్‌స్టేషన్ల పరిధిలో లిటిల్ ఫ్లవర్ స్కూల్, లక్ష్మి టాకీస్ ఏరియా, మహేష్‌నగర్, మెడ్విన్ హాస్పిటల్ లేన్, డిసిబి బ్యాంక్ ఏరియాల్లో, చంద్రవిహార్ ఏరియా, కేర్ హాస్పిటల్, ఏసీబీ ఆఫీస్, డాక్ సదన్ ఆఫీస్ ఏరియాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని దీనిని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

'రాజకీయ లబ్ధి కోసమే ఏకసభ్య కమిషన్లు'

లిబర్టీ: రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు వేసిన ఏకసభ్య కమిషన్లను వెంటనే ఉపసంహరించుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఏకసభ్య కమిషన్లు వేశారని ఆరోపించారు. మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య కమిషన్లు నియమించి దళితులను విడదీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధమైన సుప్రీంకోర్టు తీర్పు చెల్లదని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును ఆసరా చేసుకొని రాజకీయ ప్రయోజనాల కోసం రాజకీయ నాయకులు వెంపర్లాడుతూ కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకసభ్య కమిషన్లు ఉపసంహరించుకుంటే తిరుగుబాటు పోరాటం తప్పదని శ్రీకృష్ణ హెచ్చరించారు.

నూతన వీసీకి సన్మానం



వీసీని సన్మానిస్తున్న ఉప్పర్ ఎల్లేష్

లిబర్టీ: కాకతీయ యూనివర్సిటీ నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిని ఉస్మానియా యూనివర్సిటీ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఉప్పర్ ఎల్లేష్ ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యువజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలీవుల్లా ఖాద్రి, కేయూ యూనివర్సిటీ పరిశోధన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు

కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి



ఎల్‌ఓసీని అందజేస్తున్న సీఎన్‌రెడ్డి

రహమత్‌నగర్: సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని, ఆపద సమయాల్లో పేదల ప్రాణాలు నిలబడుతున్నాయని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి అన్నారు. రహమత్‌నగర్‌కు చెందిన బాధితుడు సయ్యద్ అజీముద్దీన్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 60 వేలు మంజూరు కాగా దానికి సంబంధించిన ఎల్‌ఓసీని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సీఎన్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు అనారోగ్యాల బారినపడిన సమయాల్లో సీఎంఆర్‌ఎఫ్ ఆదుకుంటుందన్నారు. సీఎంఆర్ఎఫ్‌ను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎక్బాల్, మన్సూర్, షేక్ సాబేర్, రవిశంకర్, బోర రవికుమార్, రామోజీ పల్లెసాయిలు పాల్గొన్నారు.


ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



నిరసనలో అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలం జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ఉపకులపతి ఎస్ఏఎం రిజ్వీని శనివారం తెలంగాణ సచివాలయంలో కలిసి ఉన్నత విద్యాశాఖ జారీ చేసిన లేఖను ఉపసంహరించుకునేలా చూడాలని కోరారు. వీసీని కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ వేణుగోపాల్‌రెడ్డి, నేతలు రజిని, కృష్ణారెడ్డి, యాకేష్ దైద ఉన్నారు. అదే విధంగా విశ్వవిద్యాలయంలో గత 58 రోజులుగా కొనసాగుతున్న మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జరిగిన నిరసనలో జేఏసీ నేతలు కాంతం ప్రేమ్‌కుమార్, బ్రహ్మానందనాయుడు, అవినాష్, కిషోర్, రాఘవేంద్ర, రజిత, అంబేద్కర్, దివాకర్, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆక్రమణలతో బస్సు రావట్లే..!



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని నందినగర్ గ్రౌండ్‌లో ఆక్రమణలతో రోడ్డంతా ఇరుకుగా మారడంతో ఇటువైపు వచ్చే బస్సులు రావడం మానేశాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. విశాలమైన నందినగర్ గ్రౌండ్‌లో ఇష్టారాజ్యంగా ఏర్పడిన అక్రమ నిర్మాణాలతో స్థానికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. ఈ గ్రౌండ్‌ను అభివృద్ధి చేయడంలో జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో స్థానికులకు అందుబాటులో లేకుండాపోతుందనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రౌండ్‌లో గతంలో సిటీ బస్సులు వచ్చివెళ్లేవని, అయితే ఇప్పుడు గ్రౌండ్‌లోకి వస్తే తిరగడానికి దారి సరిగా లేకపోవడంతో బస్సులు ఇక్కడ వరకు రాకుండానే మళ్లుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, టౌన్‌ప్లానింగ్, బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు సమన్వయంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఈ గ్రౌండ్‌లో అక్రమ నిర్మాణాలను తొలగించి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు.

తెలంగాణ సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం



అవార్డు గ్రహీతలతో ప్రొఫెసర్ కోదండరామ్, డాక్టర్ గజల్ శ్రీనివాస్, రొయ్యూరు శేషసాయి తదితరులు

- శాసన మండలి సభ్యుడు కోదండరామ్

నాంపల్లి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శప్రాయమని తెలంగాణ శాసన మండలి సభ్యుడు, తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.కోదండరామ్ అన్నారు. బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి అధ్యక్షతన పాన్ ఇండియన్ నేషనల్ అవార్డ్స్ కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ప్రసంగించారు. తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు రావడానికి కారణం ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలే అన్నారు. కళలు, కళాకారులకు పుట్టినిల్లుగా భాసిల్లే తెలంగాణ గడ్డపై పుట్టినందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథిగా హాజరైన మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కళలు, కళాకారులకు సముచితమైన గౌరవం ఇవ్వాలని, అప్పుడే మన సంస్కృతి పది కాలాల పాటు మనుగడ సాగిస్తుందన్నారు. ఇండో కెనేడియన్ యూత్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు రొయ్యూరు శేషసాయి మాట్లాడుతూ.. మన భాషకు, సంస్కృతికి సేవ చేసిన వారిని గౌరవించడం మన కనీస కర్తవ్యమని, ఆ బాధ్యతను పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ నెరవేరుస్తోందని అన్నారు. అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 20 మంది విభిన్న రంగాల్లోని ప్రతిభావంతులను పాన్ ఇండియన్-2024 నేషనల్ అవార్డ్స్‌తో ఘనంగా సత్కరించారు. సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ వ్యవస్థాపకులు పద్మ కళ్యాణ్ జ్యోతి ప్రజ్వలతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో గాయత్రి స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్, నాట్య భారతి కూచిపూడి అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను అలరించాయి. పిస్కా వ్యవస్థాపకుడు డాక్టర్ అద్దంకి రాజా యోనా, తెలంగాణ యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ కూన వేణుగోపాలకృష్ణ, తెలంగాణ జన సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వర్దిబోయిన బాబు, టీటీడీ బోర్డు మాజీ డైరెక్టర్ ధారావత్ బాల్‌సన్ నాయక్ పాల్గొన్నారు.

పైసా పైసా పోగుచేసి కట్టుకున్నరు

పేదల కష్టం కాంగ్రెసోళ్లకు ఏం తెలుసు..?

- జవహర్‌నగర్‌లో పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోం..
- హైడ్రా పేరుతో భయపెట్టిస్తే.. భయపడేది లేదు..
- మూసి నిర్వాసితులకు అండగా ఉంటాం
- మల్కాజిరి ఎంపీ ఈటల రాజేందర్



జవహర్‌నగర్: కాంగ్రెస్ సర్కార్ పేదలకు అండగా ఉంటుందని అనుకున్నాం.. కానీ ఆ విధంగా వ్యవహరించడంలేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని చెన్నాపురం నుంచి బీజేఆర్ నగర్ మల్లికార్జునగర్ కమాన్ వరకు 100 ఫీట్ల రోడ్డును నిలిపివేసి 60 ఫీట్లకు కుదించాలని శనివారం డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ఈటల రాజేందర్ హాజరై బాధితులతో కలిసి మాట్లాడారు. ప్రజల శ్రమ మీద బతికేటోళ్లకు ఏమి తెలుస్తదని, ఇప్పుడు వాళ్లు గద్దమీద ఉన్నారు కాబట్టి పేదల కష్టాలు తెలియవని కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డారు. జవహర్‌నగర్‌లో మాజీ సైనికుల భూముల్లో చాలామంది నిరుపేదలు పైసా పైసా పోగుచేసుకుని నివాసాలు ఏర్పర్చుకున్నారని, ఏ ఒక్కరూ పుకడ్‌గా ఆక్రమించుకోలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ బుల్డోజర్లతో పేదలను భయపెట్టాలని ప్రయత్నిస్తోందని, ఇక వారి ఆటలు సాగనివ్వమన్నారు. హైడ్రా పేరుతో భయపెట్టిస్తే ఊరుకునేదిలేదన్నారు. మూసి నిర్వాసితులకు అండగా ఉంటామన్నారు. అభివృద్ధి పేరుతో పేదలను రోడ్డుమీద పడేస్తామనడం విచారకరం అన్నారు. పేదల ఇళ్లను కూల్చే సీఎంగా రేవంత్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారు. మూసీ ప్రక్షాళనతో మరో మోసం చేస్తున్నారన్నారు. అందమైన నగరాలకు అడ్డు చెప్పం, సర్కారు చేసే కుట్రలను తిప్పికొడతామన్నారు. సర్కారు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. చెన్నాపురం నుంచి బీజేఆర్‌నగర్ వరకు వేస్తున్న 100 ఫీట్ల రోడ్డును 60 ఫీట్లకు కుదించాలని స్థానికుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు, బీజేఆర్ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.


బీజేఆర్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

నగరంలో నేడు

- కార్తీకమాసాన్ని పురస్కరించుకుని భక్తి టీవీ ఎన్టీఆర్ స్టేడియం వేదికగా నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుంది.
- సూత్ర ప్రత్యేక వివాహ కలెక్షన్స్ ఎగ్జిబిషన్ బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్‌కృష్ణలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మెగా ప్రీమియర్ సినిమాటిక్ ఎక్స్‌పో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్‌లో కామిక్ కాన్ ప్రోగ్రాం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మైనార్టీ సంక్షేమ శాఖలో ఆర్థిక సంక్షోభం

- 2024 హజ్ క్యాంప్ కాంట్రాక్టర్లకు విడుదల కానీ బిల్లులు
- ఉర్దూ అకాడమిలో నిధులు లేక అమలు కాని పథకాలు

సాక్షి, సిటీబ్యూరో: మైనార్టీ సంక్షేమ శాఖ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. సంక్షేమ శాఖలోని హజ్ కమిటీ, ఉర్దూ అకాడమి, వక్ఫ్ బోర్డు దారిపుల్ మారిఫ్, మైనార్టీ స్టడీ సెంటర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ విభాగాల్లో నిధులు లేక ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు కావడం లేదని శాఖ ఉన్నత అధికారులు ద్వారా తెలిసింది. 2024 హజ్ క్యాంప్ కోసం యాత్రికుల సౌకర్యార్థం భోజనాలు, రవాణా, షామీయానాలు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్లకు ఇంకా డబ్బులు రిలీజ్ కాలేదు. హజ్ క్యాంప్ విజయవంతంగా పూర్తి చేయాలని, యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలు కల్పించడానికి డబ్బులు అప్పుగా తీసుకొని శిబిరం నిర్వహించారు. అందుకు సంబంధించిన బిల్లులు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ దివస్ ఘనంగా ఏర్పాటు చేసింది. ఈ దివస్ కోసం అయిన ఖర్చులు చెల్లించడానికి కూడా నిధులు లేవని ఓ ఉన్నతాధికారి సాక్షికి చెప్పారు. ఉర్దూ అకాడమీ ద్వారా ఉర్దూ భాషా అభ్యున్నతికి కోసం వివిధ రకాల పథకాలు ప్రవేశ పెట్టారు. కానీ ఒక్కటి అమలైన దాఖలాలు లేవు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ పరిస్థితి కూడా నిధులు లేక పథకాలు అమలు చేయడం లేదు. స్టడీ సర్కిల్ ద్వారా విద్యార్థులకు పోటీ పరీక్షల్లో కోచింగ్ క్లాస్‌లు జరడగం లేదు. ఏది ఏమైనా మైనార్టీ సంక్షేమ శాఖకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో శాఖ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతుంది. శాఖకు మంత్రి లేకపోవడం, కార్యదర్శి కూడా శాఖకు సంబంధించిన ప్రాతినిధ్యం సరిగా చేయకపోడం ఈ పరిస్థితి ఓ కారణంగా కనిపిస్తోంది.

19న సంప్రదాయ కళల ఉత్సవం ప్రారంభం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

నాంపల్లి: సంప్రదాయ కళల పరిరక్షణ కోసం కిన్నెర సాంస్కృతిక సంస్థ చేస్తున్న కృషి అమోఘమని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. ఏసీగార్డ్స్ నఫీజ్ రెసిడెన్సీలోని గాయత్రీ సదనంలో కిన్నెర 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నాలుగు రోజుల పాటు రవీంద్ర భారతి ప్రధాన వేదికపై ప్రదర్శించబోయే సంప్రదాయ కళల ఉత్సవం పోస్టర్ ఆవిష్కరణ సభ శనివారం సాయంత్రం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ.. అంతరించిపోతున్న కళలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయ కళల్లోని గుస్సాడి, కొమ్ముకోయ, చిందు యక్షగానం, తోలుబొమ్మలాట కార్యక్రమాలు ఎంతో ప్రాచీనమైనవని అన్నారు. ఈ కళలను నగరంలో ప్రదర్శించడానికి కిన్నెర సంస్థ ముందుకు రావడం సంతోషకరం అన్నారు. ఈ నెల 19న జరిగే ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ నెల 22న జరిగే ముగింపు సభకు ముఖ్య అతిథిగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి హాజరవుతున్నట్లు తెలిపారు. కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ మాట్లాడుతూ.. కిన్నెర అధ్యక్షులు డాక్టర్ ప్రభాకర్‌రావు అధ్యక్షతన జరిగే సంప్రదాయ కళల ఉత్సవాల్లో భాగంగా కిన్నెర వ్యవస్థాపక సభ్యులు, దివంగత ఎస్.ద్వారకానాథ రావుకు నివాళులర్పిస్తామని తెలిపారు. శస్త్ర వైద్యులు, గ్రంథకర్త డాక్టర్ పసుమర్తి సత్యనారాయణమూర్తికి ఈ కార్యక్రమాన్ని అంకితం ఇస్తున్నట్లుగా ప్రకటించారు. కార్యక్రమంలో కోశాధికారి కె.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

డిజిటల్ రంగం సేవలు వెలకట్టలేనివి



హైబిజ్ టీవీ 15వ వార్షికోత్సవంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గోల్కొండ: డిజిటల్ రంగంలో 15 ఏళ్లు పూర్తి చేసుకోవడం సామాన్య విషయం కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మాసాబ్‌ట్యాంక్ హోటల్ గోల్కొండలో హైబిజ్ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి హైబిజ్ టీవీ మేనేజర్ రాజశేఖర్‌కు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రోజురోజుకూ పోటీ పెరుగుతున్న ఆన్‌లైన్ రంగంలో హైబీజ్ టీవీ మరిన్ని మెరుగైన సేవలతో కష్టమర్ల ఆదరణ పొందుతోందని అన్నారు. నేటి రంగంలో పోటీ పెరుగుతూ వస్తోందని, దీనికి అనుగుణంగా హైబీజ్ టీవీ కూడా తమ సేవలను విస్తృతం చేస్తూ మార్కెట్‌లో మరింత ఆదరణ పొందుతోందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన హైబిజ్ టీవీ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీలలో మద్యం ఏర్పాటు చేయడంపై ఛలోక్తులు విసిరారు. ఇటువంటి సందర్భాల్లో రేవ్ పార్టీ, మద్యం సరఫరాదారులకు లైసెన్స్ ఉందా అనే ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ హోంమంత్రి మహమ్మూద్ అలీ, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యులు రవి, ఎమ్మెల్సీ ఆమెర్ ఆలీఖాన్ తదితరులున్నారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్సీ ఆమెర్ ఆలీఖాన్‌ను ఆప్యాయంగా కౌగిలించుకొని కైసే హో భాయ్ అంటూ పలకరించారు.

సర్వే తీరును ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్


బేగంపేట మయూరి మార్గ్‌లో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సనత్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఎన్యుమరేటర్లు ఏవిధంగా సర్వే చేస్తున్నారు.. సర్వేకు సంబంధించి అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్నారా? లేదా తదితర అంశాలపై ఆరా తీస్తూ ఎన్యుమరేటర్లను అప్రమత్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా బేగంపేట మయూరి మార్గ్‌లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తీరును హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కట్ట జయరాం బాబురావు, కట్ట మారమ్మ ఇంట్లో నిర్వహించిన సర్వే కార్యక్రమంలో పాల్గొని కుటుంబ వివరాలను నమోదు చేసే వరకు అక్కడే ఉన్నారు. రికార్డులు, భర్తీ చేసిన ఫారాలను పరిశీలించారు. కుటుంబ సభ్యులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. మంచి ఆశయం కోసం ప్రభుత్వం సర్వే చేపట్టిందని, దీనికి అందరూ సహకరించాల్సిందిగా ఆయన సూచించారు. ఎన్యుమరేటర్లు ప్రశ్నావళికి సంబంధించి అన్ని భర్తీ చేయాల్సిందిగా వారికి దిశానిర్దేశం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతికి, వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపర్చడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సర్వే క్వాలిటీగా జరగాలని అధికారులకు సూచించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, జీహెచ్ఎంసీ బేగంపేట డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, సూపర్‌వైజర్ ఎరిక్, ఎస్ఎఫ్ఏ సాయినాథ్, దయాకర్, వార్డు అధికారి అండాలు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా నర్సింహారెడ్డి


నర్సింహారెడ్డిని అభినందిస్తున్న జాయింట్ రిజిస్ట్రార్ పరిమళాదేవి

కాచిగూడ: రాజధాని కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్‌గా వేమిరెడ్డి నర్సింహారెడ్డి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా, జాతీయ అర్బన్ బ్యాంక్స్ ఫెడరేషన్ డైరెక్టర్‌గా ఆయన వ్యవహరిస్తున్నారు. రాజధాని కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వ కో ఆపరేటివ్ జాయింట్ రిజిస్ట్రార్ వై.పరిమళాదేవి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్, నూతన కార్యవర్గాన్ని ఆమె అభినందించారు. ఎన్నికల్లో వేమిరెడ్డి నర్సింహారెడ్డి వరుసగా ఐదవసారి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా టి.సుధీర్‌రెడ్డి, డైరెక్టర్లుగా బి.రామ్‌రెడ్డి, ఎ.జైపాల్‌రెడ్డి, ఘన్‌శ్యామ్ భేటి, జి.క్రాంతిరెడ్డి, జి.నిర్మలాదేవి, కె.శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పద్మశాలి కులస్తులు ఏకతాటిపై రావాలి

రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మచ్చ సుధాకర్


పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మచ్చ సుధాకర్‌రావు

మైలార్‌దేవ్‌పల్లి: పద్మశాలి కులబాంధవులు ఏకతాటిపై ఉండి మన వారిని చట్టసభలకు పంపించేలా కృషి చేయాలని పద్మశాలి సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మచ్చ సుధాకర్‌రావు అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని భావన రుషినగర్ మార్కండేయ పద్మశాలీ ట్రస్టు భవన్‌లో రంగారెడ్డి జిల్లా స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో పద్మశాలి కులస్తులు సుమారు 5లక్షల మంది ఉన్నప్పటికీ చట్టసభల్లో కనీసం ఆరుగురు ఉండాలి కానీ ఒక్కరు మాత్రమే ఉన్నారని విచారణ వ్యక్తం చేశారు. బీసీల్లో అనేక కులాలు ఉన్నప్పటికీ ఎక్కువ శాతం కొన్ని కులాల వారే చట్టసభలకు వెళ్తున్నారని, పద్మశాలి నేతలు కూడా నియోజకవర్గం వారీగా ఎన్నికల్లో నిలబడి ఐక్యత చాటాలని కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా స్థాయి నాయకులు ఏర్వ సత్యనారాయణ, కాశిగారి యాదగిరి, వేముల వెంకన్న, కోట జనార్దన్, చిప్ప లక్ష్మి, నరసింహమూర్తి, మునగపాటి వెంకటేష్, సంకూరి జయప్రకాష్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక

రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా మచ్చ సుధాకర్‌రావు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి చెన్న బాల్‌రాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కించ లక్ష్మీనారాయాణ, గూడ వెంకటస్వామి, గౌరవాధ్యక్షుడిగా బాస విఠల్, చేనేత విభాగం అధ్యక్షుడిగా కుంకుతి ఆంజనేయులు, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడిగా కొపల్లి జగదీష్, మీడియా సెల్ అధ్యక్షుడిగా పగిడిమర్రి సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిమ్స్‌లో ప్రయోగాత్మకంగా శిక్షణ

మైక్రోసర్జరీ, మైక్రో న్యూరోవాస్క్యులర్ అనస్టొమోసిస్‌పై అవగాహన

లక్డీకాపూల్: మెదడు బైపాస్ శస్త్రచికిత్స నిర్వహణపై నిమ్స్ న్యూరోసర్జరీ నిపుణులు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. న్యూరో సర్జికల్ విధానాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు రోగులకు మెరుగైన ఫలితాలను అందించే క్రమంలో న్యూరోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా రెండు రోజుల పాటు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. నిమ్స్‌లోని న్యూరోసర్జరీ అదనపు ప్రొఫెసర్ డాక్టర్ వై.తిరుమల్ సమన్వయంతో రూపొందించిన ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిమ్స్ ఆస్పత్రి ట్రామా బ్లాక్‌లో శనివారం నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప ప్రారంభించారు. ప్రధానంగా మెదడు బైపాస్ సర్జరీలు చేయడంలో కీలకమైన ఇంట్రాక్రానియల్ వాస్క్యులర్ అనాస్టోమోసిస్‌లో ఆధునాతన సాంకేతికతపై దృష్టి పెట్టింది. మోయామోయా వ్యాధి, జటిలమైన అనూరిజమ్స్, కణితులు వంటి సంక్లిష్టమైన న్యూరోవాస్కులర్ సమస్యలకు చికిత్స చేయడానికి, అలాగే దేశంలోని పీడియాట్రిక్ రోగులతో సహా స్ట్రోక్ కేసులను నిర్వహించడానికి ఈ పద్ధతులు అవసరమని నిపుణులు స్పష్టం చేశారు. ఈ శిక్షణ ద్వారా వివిధ ప్రాంతాలకు చెందిన న్యూరో సర్జన్లు ప్రముఖ అధ్యాపకుల మార్గదర్శకత్వంలో ఈ లైఫ్-సేవింగ్ స్కిల్స్‌లో ప్రావీణ్యం సంపాదించడానికి ప్రత్యేకమైన అవకాశం ఉంటుందని పలువురు వైద్య విద్యార్థులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా న్యూరో సర్జన్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు రూపొందించిన ఈ కోర్సుతో శస్త్ర చికిత్స విధానాలు మరింత మెరుగు పడతాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. న్యూరో సర్జరీ నిపుణులు క్రిష్ శ్రీధర్, మానస్ పాణిగ్రాహి, వంశీ, సుచంద భట్టాచార్జీ వంటి అధ్యాపకుల మార్గదర్శకత్వంలో న్యూరో సర్జన్లకు క్లిష్టమైన వాస్కులర్ సర్జరీలు చేయడంలో నైపుణ్యాలను పెంపొందించడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తున్నారు. తొలిరోజు అవగాహన కార్యక్రమంలో డీన్ డాక్టర్ లీజ రాజశేఖర్ పాల్గొన్నారు.



నేటి నుంచి టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్ష

సాక్షి, సిటీబ్యూరో: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-3 పరీక్షలు ఆదివారం, సోమవారం జరగనున్నాయి. రెండురోజుల పాటు జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెల్లడించారు. ఆదివారం ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్-2, సోమవారం ఉదయం పేపర్-3 పరీక్ష జరుగుతుంది. ఇందు కోసం హైదరాబాద్ జిల్లా పరిధిలో సుమారు 102 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు నిర్దేశించిన సమయం కంటే గంట ముందు చేరుకోవాలని అధికారులు సూచించారు. అదేవిధంగా హాల్ టికెట్స్, ఒరిజినల్ ఐడీ, గుర్తింపు కార్డులను వెంట తెచ్చుకోవాలని, సెల్‌ఫోన్, క్యాలిక్యులేటర్‌తో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని ఆయన తెలిపారు. ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని సూచించారు.

గ్రూపు-3 పరీక్షలకు అదనపు బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 17, 18 తేదీల్లో జరగనున్న గ్రూప్-3 పరీక్షల కోసం అదనపు బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా జరగనున్న పరీక్షల సమయానికి అనుగుణంగా ఉదయం 10 గంటల్లోపు అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విధంగా బస్సులు అందుబాటులో ఉంటాయి. అలాగే పరీక్షల అనంతరం సాయంత్రం తిరిగి గమ్యస్థానాలకు వెళ్లేందుకు వీలుగా బస్సులను నడపనున్నట్లు పేర్కొన్నారు.

19 నుంచి బీఏ 3వ సెమిస్టర్ పరీక్షలు

ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఈ నెల 19 నుంచి బీఏ రెగ్యులర్ కోర్సు 3వ సెమిస్టర్ ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 4 వరకు జరిగే సెమిస్టర్ పరీక్షల టైంటేబుల్‌ను ఉస్మానియా వెబ్‌సైట్లో విద్యార్థులకు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

ఇండియా వర్సెస్ మలేషియా ఫ్రెండ్లీ మ్యాచ్ రేపు

సాక్షి, సిటీబ్యూరో: ఫిఫా ఆధ్వర్యంలో ఇండియా వర్సెస్ మలేషియా అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఫ్రెండ్లీ మ్యాచ్ సోమవారం జరగనుంది. నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో రాత్రి 7.30గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ సందర్భంగా సందర్శకులకు మరింత వినోదాన్ని పంచేందుకు నగరానికి చెందిన ఇన్‌ఫ్యూజన్ రాక్ బ్యాండ్ సంగీత ప్రదర్శన నిర్వహించనున్నారు.

ఆందోళన బాటపట్టిన విద్యార్థి లోకం


ఈసీఐఎల్‌లో విద్యార్థుల మహార్యాలీ

కాప్రా: స్కాలర్‌షిప్‌ల కోసం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. స్కాలర్‌షిప్‌లతో విద్యార్థులకు భరోసా కల్పించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా ఆటంకం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఈసీఐఎల్‌లో విద్యార్థుల మహార్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. లక్షల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్ బిల్లులు వందల కోట్లు పెండింగ్‌లో పెట్టి కాంట్రాక్టర్లకు మాత్రం రూ.వేలకోట్ల బిల్లులు చెల్లిస్తున్నారని మండిపడ్డారు. మూడేళ్లుగా విద్యార్థుల స్కాలర్‌షిప్ బిల్లులు ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికావొస్తున్నా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 12ఏళ్ల క్రితం ధరల ప్రకారం స్కాలర్‌షిప్‌లు కొనసాగిస్తున్నారని, ధరలు పెరగడంతో హాస్టల్ మెనూ పాటించేందుకు డబ్బులు కూడా సరిపోకపోవడంతో మెనూలో పౌష్టికాహారాన్ని తగ్గిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగుల వేతనాలు పెంచారు.. ఎమ్మెల్యేల జీతాలు మూడురెట్లు పెంచారు.. వృద్ధాప్య పెన్షన్లు ఐదురెట్లు పెంచారు.. కానీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు మాత్రం పెంచడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ, భూపేష్ సాగర్, మనోజ్, వెంకన్నగౌడ్, అంజి, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి పరీక్ష ఫీజు గడువు పొడిగించాలి


డైరెక్టర్ కృష్ణారావుకు వినతి పత్రం అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కాచిగూడ: పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ఈ నెల 18 తేదీ ఆఖరు కావడంతో చాలా మంది విద్యార్థులు వివిధ కారణాలతో ఇంకా పరీక్ష ఫీజు చెల్లించలేకపోయారని, ఇందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ కార్యాలయంలో డైరెక్టర్ కృష్ణారావును శనివారం ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడారు. చాలామంది విద్యార్థులు 6వ నుంచి 10వ తరగతి వరకు వారికి సంబంధించిన స్కూల్ ఎడ్యుకేషన్ వివరాలు ఇంకా యుడైస్ పోర్టల్‌లో నమోదు చేసుకోలేదని తెలిపారు. గతంలో కేవలం పదవ తరగతి విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఫీజు చెల్లించే అవకాశం ఉండేదని, కానీ ఈ సంవత్సరం నుంచి ఖచ్చితంగా ప్రతి విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి చేయడం వల్ల విద్యార్థులు వారి వివరాలను ఇంకా పూర్తిస్థాయిలో నమోదు చేయకపోవడంతో పాటు ఆన్‌లైన్‌లో సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 30వ తేదీ వరకు పరీక్ష ఫీజు గడువు పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
11
హైదరాబాద్, ఆదివారం, 17, నవంబర్, 2024
సిటీ ప్లస్

హైదరాబాద్ వైబ్స్



ప్యాడెల్ టెన్నిస్ ఆడేద్దాం..!

నగరంలో ఆకర్షణగా సరికొత్త ట్రెండ్

ఎప్పుడైనా ప్యాడెల్ టెన్నిస్ గురించి విన్నారా? టెన్నిస్ గురించి తెలుసు.. బ్యాడ్మింటన్ గురించి తెలుసు.. ఇంకా స్క్వాష్ గురించీ తెలుసు కానీ కొత్తగా ప్యాడెల్ టెన్నిస్ అంటే ఏంటి అనుకుంటున్నారా..? అవును ఇది చాలా కొత్త గేమ్.. కాకపోతే చాలా ట్రెండీ గేమ్. మెక్సికోలో పుట్టిన ఈ గేమ్ ప్రపంచవ్యాప్తంగా సుపరిచితమే. కానీ మన హైదరాబాదీయులకు మాత్రం ఇది కాస్త కొత్త గేమ్ అనే చెప్పుకోవచ్చు. కానీ ఇటీవల కాలంలో ప్యాడెల్ టెన్నిస్‌పై నగరవాసుల్లో ముఖ్యంగా యువతలో ఆసక్తి పెరుగుతోంది. ఇప్పుడిప్పుడే ప్యాడెల్ టెన్నిస్ నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో అసలు ప్యాడెల్ టెన్నిస్ అంటే ఏంటి? సాధారణ టెన్నిస్‌కు, ప్యాడెల్ టెన్నిస్‌కు మధ్య వ్యత్యాసాలేంటి? ఎలా ఆడుతారు..? ఇలా ఎన్నో విషయాలు తెలుసుకుందాం..! - సాక్షి, సిటీబ్యూరో

- టెన్నిస్‌కు తక్కువ బ్యాడ్మింటన్‌కు ఎక్కువ!
- విదేశాల్లో క్రేజీగేమ్‌గా ప్యాడెల్ టెన్నిస్
- హైదరాబాద్‌లోనూ యువత ఆసక్తి
- ఫన్, ఫిట్‌నెస్, ఏకాగ్రత సొంతం

ప్యాడెల్ టెన్నిస్ కూడా టెన్నిస్ లాంటి ఆటనే. 1969లో మెక్సికోకు చెందిన ఎన్‌రిక్ కార్క్యూరా అనే క్రీడాకారులు ఈ గేమ్ కనిపెట్టాడు. టెన్నిస్, స్క్వాష్ ఆటల కలయికనే ఈ ప్యాడెల్ టెన్నిస్. టెన్నిస్‌లో ఉన్నట్టే అన్ని రూల్స్ ఉంటాయి. కోర్టు, రాకెట్, వాడే బాల్ ఇలా చాలా విషయాల్లో కాస్త వ్యత్యాసాలు ఉన్నాయి. సాధారణంగా టెన్నిస్ కోర్టులు పెద్ద పరిమాణంలో, ఓపెన్‌గా ఉంటాయి. అయితే ప్యాడెల్ టెన్నిస్ కోర్టులు మాత్రం కాస్త చిన్న పరిమాణంలో మూసేసి ఉంటాయి. 20 మీటర్ల పొడవుతో, 10 మీటర్ల వెడల్పుతో ఉంటాయి. అదే టెన్నిస్ కోర్టులు మాత్రం 23 మీటర్ల పొడవు, 11 మీటర్ల వెడల్పుతో ఉంటాయి. ప్యాడెల్ గేమ్‌లో కాస్త ఫన్నీ అనిపించే అంశం ఏంటంటే.. చిన్నప్పుడు డబుల్ స్టెప్ ఔట్ అనుకునేవాళ్లం కదా.. అలాగే ఇక్కడ కూడా ఒక్కసారి వెనుక ఉన్న గోడకు తగిలి.. మరోసారి కోర్టులో బౌన్స్ అయినా కూడా ఆట కొనసాగించవచ్చు. చాలా మంది గోడకు బంతి తగిలేలా చేసి స్ట్రాటజీలా ఆడుతుంటారు. అదే టెన్నిస్‌లో మాత్రం ఒకసారే బౌన్స్ కావాల్సి ఉంటుంది. ఇక, వెనుక గోడలకు తగిలితే ప్రత్యర్థికే పాయింట్ దక్కుతుంది.



ఇప్పుడే ట్రెండ్ అవుతోంది..

హైదరాబాద్‌లో ఇప్పుడిప్పుడే ప్యాడెల్ టెన్నిస్ గురించి అవగాహన పెరుగుతోంది. నేర్చుకునేందుకు యువత, పిల్లలు ఆసక్తి చూపిస్తున్నారు. టెన్నిస్‌తో పోలిస్తే ప్యాడెల్ టెన్నిస్ గురించి చాలా మందికి తెలియదు. ప్యాడెల్ టెన్నిస్‌లో ఫిట్‌నెస్‌తో పాటు ఏకాగ్రత కూడా పెరుగుతుంది. కొన్ని మెళకువలతో నేర్చుకుంటే ప్యాడెల్ టెన్నిస్ ఆడటం సులువే.

– ఎస్.జగన్నాథం, టెన్నిస్ ట్రైనర్



ఇదో సోషల్ గేమ్..

ప్యాడెల్ టెన్నిస్‌ను సోషల్ గేమ్ అంటుంటారు. ఎందుకంటే దీన్ని కచ్చితంగా ఇద్దరు ఆటగాళ్లు జట్టుగా ఆడాల్సి ఉంటుంది. అదే టెన్నిస్ మాత్రం సింగిల్స్, డబుల్స్ కూడా ఆడొచ్చు. ఇక, రాకెట్ విషయంలో టెన్నిస్‌కు, ప్యాడెల్ టెన్నిస్‌కు చాలా తేడా ఉంటుంది. టెన్నిస్ రాకెట్‌లో స్ట్రింగ్స్ ఉంటాయి. అదే ప్యాడెల్ టెన్నిస్ రాకెట్‌లో స్ట్రింగ్స్ ఉండవు. పొడవు విషయంలో కూడా టెన్నిస్ రాకెట్ కన్నా ప్యాడెల్ రాకెట్ చిన్నగా ఉంటుంది. వెడల్పు ఎక్కువగా ఉంటుంది. అయితే వాడే బాల్లు చూడటానికి ఒకేలా కనిపించినా.. కాస్త తేడా ఉంటుంది. టెన్నిస్ బాల్స్ గట్టిగా ఉంటాయి. అదే ప్యాడెల్ టెన్నిస్ విషయంలో కాస్త మెత్తగా, తక్కువ పీడనంతో ఉంటాయి. ఆడే విధానంలో కూడా రెండు గేమ్స్ మధ్య చాలా వ్యత్యాసాలు ఉంటాయి. ముఖ్యంగా బాల్ సర్వీంగ్ విషయంలో చాలా రూల్స్ ఉంటాయి.

ఫన్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్..

మనదేశంలో క్రికెట్ తర్వాత దాదాపు అదే స్థాయిలో ఆదరణ పొందుతోన్న గేమ్ టెన్నిస్ అని చెప్పుకోవచ్చు. అయితే ప్యాడెల్ టెన్నిస్ ఆడుతున్నా.. చూస్తున్నా కూడా చాలా ఫన్ ఉంటుంది. ఉత్కంఠతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ పక్కా అంటున్నారు ప్యాడెల్ టెన్నిస్ శిక్షకులు. హైదరాబాద్‌లో కూడా పలు అకాడమీలు ఈ ప్యాడెల్ టెన్నిస్ నేర్పిస్తున్నారు.





రేసింగ్‌లో అఖిల్ ఫార్ములా 4

- టాప్‌లో గోవా ఏసెస్
- తరువాతి స్థానంలో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్
- 'సాక్షి'తో అనుభవాలు పంచుకున్న హైదరాబాద్ టీం టాప్ రేసర్ అఖిల్ అలీ భాయ్

సాక్షి, సిటీబ్యూరో: గ్లోబల్ రేసింగ్ వేదికపై భారత్ తన ప్రశస్తిని పెంచుకోవడంలో భాగంగా కొయంబత్తూర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో గోవా ఏసెస్ మొదటి స్థానంలో నిలువగా, 2వ స్థానంలో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ నిలిచింది. గోవా ఏసెస్ జేఏ రేసింగ్ సోహిల్ షా హైక్వాలిటీ ఫీల్డ్‌ను చేరుకుని, పోల్ పొజిషన్, రేస్ విన్, బెస్ట్ ల్యాప్‌లో హ్యాట్రిక్ సాధించి టీంను టాప్‌లో నిలిపారు. షాతో పోటీ పడుతూ అత్యుత్తమ రీచింగ్ పాయింట్స్‌తో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్‌ను ద్వితీయ స్థానంలో నిలిపారు హైదరాబాద్ టీం రేసర్ నీల్ జాని. హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ చేజ్ చేయలేక మూడో స్థానంతో సరిపెట్టుకుంది స్పీడ్ డెమన్స్ ఢిల్లీ (అల్వారో పరెంటే). అయితే పరంటే ఐదు–సెకన్ల పెనాల్టీ పడటంతో జోన్ లాంకాస్టర్ (చెన్నై టర్బో రైడర్స్) 3వ స్థానంలో ఢిల్లీ తరువాతి స్థానంలో కొనసాగుతుంది. నేడు కరీ మోటార్ స్పీడ్‌వే వేదికగా జరగనున్న చివరి పోరులో విజేత ఎవరో తెలియనుంది.

టాప్ పొజిషన్‌లో..

ఈ నేపథ్యంలో ఐ ఆర్ ఎల్ తో పాటుగా ఫార్ములా– 4 లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ తరఫున పోటీ పడుతూ ఎఫ్–4లో సీజన్ టాప్ పొజిషన్ లో కొనసాగుతున్న అఖిల్ అలీ భాయ్ ప్రత్యేకంగా 'సాక్షి'తో మాట్లాడుతూ.. భారత్‌లో రేసింగ్ మరో స్థాయికి తీసుకెళ్లే వేదికగా ఇండియన్ రెసింగ్ ఫెస్టివల్ నిలిచిందని అన్నారు. ఎఫ్–4లో హైదరాబాద్ టీం రేసర్‌గా టాప్‌లో నిలవడం సంతోషంగా ఉందని అన్నారు. హైదరాబాద్ టీంకు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటి నుంచి సోషల్ మీడియా వేదికగా హైదరాబాది రేసింగ్ లవర్స్ ఫాలోయింగ్ చాలా పెరిగిపోయారని అన్నారు. హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ యజమాని ప్రముఖ టాలీవుడ్ హీరో అక్కినేని నాగ చైతన్య తమకు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని తెలిపారు. తమ డ్రైవింగ్ నైపుణ్యాలను ఇలానే కొనసాగిస్తూ హైదరాబాద్ టీం ను టాప్ లో నిలబెట్టే ప్రయత్నం చేస్తామని మరోసారి పునరుద్ఘాటించారు. ఇదే వేదికగా రాయల్ ఎన్ఫీల్డ్ కాంటినెంటల్ జీటీ కప్ ట్రాక్ రేసింగ్ పోటీ నిర్వహించగా.. పుదుచ్చేరికి చెందిన ఛాంపియన్‌షిప్ లీడర్ నవనీత్ కుమార్ ఒక విజయం, పీ2 ముగింపుతో పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ చివరి రేసు నేడు జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ రైజింగ్ లవర్స్ ఎంతో ఉత్కంఠగా ఫలితాలు కోసం ఎదురుచూస్తున్నారు.

సిటీలో ఫెస్టివల్ ఆఫ్ ఆస్ట్రేలియా





సాక్షి, సిటీబ్యూరో: ఆస్ట్రేలియా వెళ్లి చదువుకోవాలనుకునే వారికోసం అక్కడి ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ నగరంలో ప్రత్యేకం 'ఫెస్టివల్ ఆఫ్ ఆస్ట్రేలియా' పేరుతో సదస్సు నిర్వహించింది. బెంగళూరు, ముంబై, కొచ్చి, హైదరాబాద్‌లో ఈ ఫెస్టివల్‌ను నిర్వహించాలని నిర్ణయించారు. ముంబైలో ముగిసిన తర్వాత హైదరాబాద్‌లో శనివారం నిర్వహించారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఆస్ట్రేలియా సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు ఎలా ఉంటాయనేది అవగాహన కల్పించారు. అక్కడి వంటకాలను విద్యార్థుల ముందు తయారు చేసి వడ్డించారు. ఆస్ట్రేలియాకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీల ప్రతినిధులు అందిస్తున్న సేవలను విద్యార్థులకు వివరించారు. ఏయే ఎంట్రన్స్ పరీక్షలు రాస్తే ఆస్ట్రేలియా వర్సిటీల్లో సులువుగా సీటు సాధించవచ్చో తెలిపారు. ఇక, చదువుల తర్వాత అక్కడే ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆస్ట్రేలియా ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ కమిషనర్ విక్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.







హెచ్ఐసీసీలో సినిమాటిక్ ఎక్స్‌పో..

- సినిమాటోగ్రఫీపై అనుభవాలు పంచుకున్న వక్తలు
- సాంకేతికత గురించి తెలుసుకున్న మూవీ లవర్స్
- ముఖ్య అతిథులుగా రాంగోపాల్ వర్మ, సందీప్‌రెడ్డి వంగా

సాక్షి, సిటీబ్యూరో: సినిమా.. ప్రతి ఒక్కరికీ చాలా ఇంట్రెస్టింగ్ టాపిక్. తెర మీద నటీనటులు అందంగా కనబుడుతున్నారంటే దాని వెనుక ఎంతో మంది టెక్నీషియన్ల శ్రమ ఉంటుంది. తెర వెనుక ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే ఉత్సుకత కూడా మనందరికీ ఉంటుంది. అలాంటి వారందరి కోసం నగరంలోని హెచ్ఐసీసీలో సినిమాటికా ఎక్స్‌పో పేరుతో మెగా ప్రీమియర్ సినిమా ఎక్స్‌పో శనివారం ప్రారంభమైంది. ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను ప్రముఖడైరెక్టర్లు రాంగోపాల్ వర్మ, సందీప్‌రెడ్డి వంగా, సినిమాటోగ్రఫర్ సెంథిల్ తదితరులు తిలకించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ ఎక్స్‌పోలో సినిమా చిత్రీకరణలో భాగమైన క్రేన్స్, కెమెరాలు, లైట్లు ఇతర వినూత్న పరికరాలను ప్రదర్శించారు. అలాగే సినిమా నిర్మాణంలో త్రీడీ ప్రింటింగ్ సాంకేతికత వినియోగంపై స్టాళ్లు ఏర్పాటు చేశారు. సినిమా సెట్టింగ్, నటీనటులకు సంబంధించిన ప్రాపర్టీలు, త్రీడీ ప్రింటింగ్ ద్వారా ఎలా చేస్తారో సినీ ప్రియులు తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. సినిమా నిర్మాణంలో ఎదురయ్యే సవాళ్లు, ఇబ్బందులు తదితర అంశాలను పలువురు టెక్నీషియన్లు వివరించారు. ఎక్స్‌పోకు దాదాపు 20 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ రంగంలో రాణించాలనుకునే యువతీ, యువకులు ప్రతి స్టాల్ దగ్గరికీ వెళ్లి అడిగి తెలుసుకున్నారు.



ఫ్యాషన్ లేబుల్ ఫర్ మెన్స్..





అద్యాయే ప్రారంభోత్సవంలో నిఖిల్ సిద్ధార్థ్

సాక్షి, సిటీబ్యూరో: 'అబ్బాయిలకు ఏమున్నాయ్? అన్ని స్టైలిష్ డ్రెస్సింగ్స్ అమ్మాయిలకే అనుకునే వాడ్ని, కానీ అబ్బాయిలకూ బోలెడన్ని ఉన్నాయని ఇప్పుడే తెలిసింది' అంటూ చెప్పారు టాలీవుడ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన అద్యాయే ఫ్యాషన్ లేబుల్ స్టోర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తానెప్పుడూ ఇలాంటి ఓపెనింగ్స్‌కు రాలేదని, ఇదే తొలిసారని చెప్పారు. కానీ ఇకపై తరచూ వద్దామని అనుకుంటున్నానని, కొన్ని నిమిషాల్లోనే అక్కడి డిజైనర్స్ తన లుక్‌ని మార్చేశారంటూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు చంద్రేష్, రితేష్‌లు మాట్లాడుతూ సంప్రదాయ చేనేతలు, హస్తకళలకు పట్టం కడుతూ తయారైన అత్యాధునిక శైలి డిజైనర్ కలెక్షన్స్ తమ ప్రత్యేకతగా పేర్కొన్నారు. సినీనటి బిగ్‌బాస్ ఫేం సోనియా ఆకుల, మిస్ టీన్ చార్మ్ ఇండియా విజేత బిపాసా తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైనర్స్

యువతీ యువకుల ర్యాంప్ వాక్
అలరించిన ఫ్రెషర్స్ డే





మోడల్స్‌గా మెరిశారు.. డ్యాన్సర్లుగా ఊపేశారు.. వెరైటీ డ్రెస్సింగ్‌తో వావ్ అనిపించారు.. సృజనకు ఆకాశమే హద్దు అనిపించారు రేపటి డిజైనర్లు.. నగరానికి చెందిన హామ్‌స్టెక్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీ ఉర్రూతలూగించింది. ఫ్యాషన్, ఇంటీరియర్ రంగాల్లో డిజైనర్లుగా మారి సృజనాత్మకతకు పట్టం కట్టనున్న భావి క్రియేటర్లు సృష్టించిన సందడి కనుల పండుగ చేసింది. ఇన్‌స్టిట్యూట్‌లో కొత్తగా ప్రవేశించిన యువతీ యువకులు ర్యాంప్ వాక్‌తో పాటు నృత్యాలతోనూ ఆకట్టుకున్నారు. ఈ ఈవెంట్‌లో రాణించిన విద్యార్థులకు మిస్, మిస్టర్ ఫ్రెషర్ పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ నిర్వాహకులు అజితారెడ్డి పర్యవేక్షించారు. –సాక్షి, సిటీబ్యూరో

క్లుప్తంగా...

మూసీ ప్రక్షాళన ఆపేందుకే బీజేపీ 'మూసీ నిద్ర'

కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు సహా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తున్నదని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. శనివారం బీజేపీ చేపట్టిన మూసీ నిద్ర కార్యక్రమంపై ఆయన విమర్శలు గుప్పించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మూసీ పరీవాహక ప్రాంతంలో నిద్రించి, వారితో భోజనం చేసి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని వస్తే తప్పులేదు కానీ.. కేవలం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ ప్రక్షాళనను అడ్డుకోవడమే లక్ష్యంగా వెళ్లడం తప్పు అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ సబర్మతి రివర్ ఫ్రంట్, గంగా రివర్ ఫ్రంట్ ప్రక్షాళన చేసినప్పుడు బీజేపీ నాయకులు ఎలాగైతే సహకరించారో... ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మూసీ ప్రక్షాళనకు కూడా సహకరించాలని కోరారు.

దోమతెరలు, ఫ్యాన్లు లేకుండా నిద్రపోండి

రాజకీయాల కోసమే మూసీపై బీజేపీ రాద్ధాంతం: బీర్ల అయిలయ్య



సాక్షి, హైదరాబాద్: 'మూసీ కంపులో మూడు నెలలు ఉండాలని బీఆర్‌ఎస్, బీజేపీ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాలు విసిరారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాత్రం ఒకరోజు షో చేయడానికి వెళ్తున్నారు. ఒక్క రాత్రి ఉండి మీరు ఏం సాధిస్తారు? నిజంగా బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే దోమతెరలు, ఫ్యాన్లు, మాస్కులు లేకుండా మూసీ పక్కన ఆరుబయట నిద్రపోవాలి' అని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వ్యాఖ్యానించారు. మూసీ పునరుజ్జీవ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు బీజేపీ.. బీఆర్‌ఎస్‌తో కలసి కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. శనివారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, మూసీ బాధితులతో కలసి ఒక రాత్రి ఉంటామని కిషన్‌రెడ్డి అనడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సహకరించాలని కోరారు.

పదేళ్ల పాటు రాబందుల్లా దోచుకున్నారు

- కేటీఆర్ రైతు అయితే ఎక్కడ పొలం దున్నారో చెప్పాలి: సామేల్



సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాబందుల రాజ్యమని బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ అనడం విడ్డూరంగా ఉందని, పదేళ్ల పాటు రాబందుల్లా తెలంగాణను దోచుకుంది కల్వకుంట్ల కుటుంబమేనని తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. అమరవీరుల శవాలపై పేలాలు ఏరుకున్న ఆ కుటుంబానికి, కేటీఆర్‌కు రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. శనివారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. తాను కూడా రైతునని కేటీఆర్ అంటున్నారని, కేటీఆర్ రైతు అయితే ఎక్కడ పొలం దున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు ఐఏఎస్‌లతో కాళ్లు మొక్కించుకుని, ఇప్పుడు అధికారం పోయాక అదే ఐఏఎస్ అధికారులపై బీఆర్‌ఎస్ దాడులకు తెగబడుతోందన్నారు.

టెట్ కోసం టి-శాట్ స్పెషల్ డిజిటల్ కంటెంట్

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న టెట్-2024 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు టి-శాట్ స్పెషల్ డిజిటల్ కంటెంట్ అందుబాటులోకి తెచ్చిందని సీఈవో బోదనపల్లి వినోద్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీపీఎస్సీ నిర్వహించే పోటీ పరీక్షలతో పాటు ఇతర పోటీ పరీక్షలకు టి-శాట్ కంటెంట్ అందించినట్టు గుర్తు చేశారు. రెండో విడత ఉపాధ్యాయ నియామకాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు స్పెషల్ డిజిటల్ కంటెంట్ ఎంతో ఉపయోగపడుతుందని వెల్లడించారు. వచ్చే ఏడాది జనవరి 5 నుంచి 20వ తేదీ మధ్యలో ఈ పరీక్ష జరగనుందని తెలిపారు. ఇందుకోసం నవంబర్ 17వ తేదీ నుంచి 50 రోజుల పాటు 200 ఎపిసోడ్లను ప్రసారం చేస్తున్నట్లు వివరించారు. టి-శాట్ నిపుణ చానల్‌లో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, విద్య చానల్‌లో సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు రోజూ 4 గంటల పాటు ప్రత్యేక ప్రసారాలుంటాయన్నారు.

విద్యారంగంలో విస్తృత సాంకేతికత

- ఉన్నత విద్యా మండలి చైర్మన్

సాక్షి, హైదరాబాద్: విద్యారంగంలో సాంకేతికతను విస్తృతం చేయాల్సిన అవశ్యకత ఉందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. ఈ విషయంలో సహకారం అందించేందుకు ఐఐటీ మద్రాస్ ముందుకు వచ్చిందని వివరించారు. ఐఐటీ మద్రాసును సందర్శించిన అనంతరం ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నత విద్యామండలి, ఐఐటీ మద్రాస్ కలసి పనిచేసేందుకోసం అవగాహన కుదుర్చుకునే అంశాన్ని పరిశీలించినట్లు వివరించారు.

రేవంత్‌రెడ్డీ.. చరిత్ర తిరగేసుకో!

గత 24 ఏళ్లలో కేసీఆర్‌ను అంతం చేస్తామన్నవారు ఎక్కడున్నారో చూడు: కేటీఆర్

- కేసీఆర్ తెలంగాణ తేకపోతే నువ్వా సీట్లో ఉండేవాడివా?
- ఎత్తు కుర్చీలు వేసుకున్నంత మాత్రాన పెద్దోడివి అయిపోవు
- ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకోవాలి.. అది ఒక్క కేసీఆర్‌కే సొంతం
- సీఎం రేవంత్ దేవుళ్లపై ఒట్లు పెట్టి మోసం చేశారు
- గాడ్సే వారసుడు గాంధీ విగ్రహం పెడతాడట అని వ్యాఖ్య
- బీఆర్‌ఎస్‌లో చేరిన రాజేంద్రనగర్ సెగ్మెంట్ కాంగ్రెస్ నేతలను స్వాగతించిన కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్‌ను అంతం చేస్తామని గత 24 ఏళ్లలో ఎంతో మంది పిచ్చి ప్రేలాపనలు చేశారని.. వారంతా ఎక్కడున్నారో చరిత్రలోకి తొంగిచూస్తే రేవంత్‌రెడ్డికి తెలుస్తుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ నడుము బిగించకపోతే ఇవాళ సీఎంగా రేవంత్‌రెడ్డి ఉండేవారా? అని ప్రశ్నించారు. అధికారం, పదవులు తాత్కాలికం, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవడం ఒక్కటే శాశ్వతమని.. అది కేసీఆర్‌కు మాత్రమే సొంతమని చెప్పారు. శనివారం రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు మల్లాద్రి నాయుడు, షేక్ అరిఫ్, వారి అనుచరులు తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీ ఆర్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. "సీఎం రేవంత్‌రెడ్డికి కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయి. ఎత్తయిన కుర్చీలు, లేదంటే రెండు కుర్చీలు వేసుకుని కూర్చుంటున్నారు. ఎత్తయిన కుర్చీలో కూర్చుంటే పెద్దోడివి అయిపోవు రేవంత్‌రెడ్డీ.. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకోవాలి. కేసీఆర్ అంటే ఒక వ్యక్తి కాదు. బీఆర్‌ఎస్ అంటే సామాన్య శక్తి కాదు. తెలంగాణ ఏర్పాటు సమయంలో హైదరాబాద్ లోని పలు నియోజకవర్గాల ప్రజల్లో ఉన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ కేసీఆర్ పాలన సాగించారు. అందరినీ కలుపుకొని పోయి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు పదవుల కోసం పార్టీని వదిలిపోయినా.. పార్టీని వదిలిపెట్టకుండా ఉన్న గులాబీ సైనికులకు శిరసు వంచి నమస్కరిస్తున్నాను.

దేవుళ్లను మోసం చేసిన తొలి వ్యక్తి రేవంత్..

సీఎం రేవంత్ రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15 వేలు ఇస్తా అన్నారు. దాని కోసం రాష్ట్ర రైతాంగం ఎదురుచూస్తోంది. మూడు పంటలకు రైతు భరోసా ఎక్కడ పోయింది. వానాకాలం రైతుబంధు ఇంకా ఖాతాల్లో పడలేదు. మోసపోయామని రైతులు బాధపడుతున్నారు. 2 లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేశావు. రేవంత్ ఏ దేవుడి వద్దకు వెళ్తే అక్కడ ఒట్లు పెట్టారు. మనుషులను మోసం చేసిన వారున్నారు. కానీ దేవుళ్లను మోసం చేసిన తొలి వ్యక్తి రేవంతే. పంద్రాగస్టులోపు రుణమాఫీ అంటివి. ఎగిరెగిరిపడితివి. హరీశ్‌రావుతో సవాల్ చేస్తివి. ఇప్పుడు ఏమైంది రుణమాఫీ? జేపీ దర్గా వద్ద కూడా ఒట్టు పెడితివి. నీ ఒట్లకు మెదక్ చర్చిలో యేసుక్రీస్తు కూడా బాధపడుతున్నాడు.

గాడ్సే వారసుడు గాంధీ విగ్రహం పెడతాడట!

మూసీ గురించి మేం గట్టిగా అడిగితే బాపూఘాట్ వద్ద అతిపెద్ద మహాత్మాగాంధీ విగ్రహాన్ని పెడతామని రేవంత్‌రెడ్డి కొత్త పల్లవి ఎత్తుకున్నారు. గాంధీకి విగ్రహాలు ఇష్టం ఉండవని.. అవే డబ్బులతో పేద వాళ్లకు మంచి చేయాలని మహాత్మాగాంధీ మనవడు సూచించారు. కానీ గాడ్సే వారసుడు రేవంత్ రెడ్డి గాంధీ విగ్రహం పెడతానని అంటున్నారు. మహాత్ముడి విగ్రహాన్ని అడ్డుపెట్టుకొని శిఖండి రాజకీయాలు చేస్తామంటే మంచిది కాదు. ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలకు పైసలు లేవుగానీ.. మూసీకి రూ.లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తారట. ఆ మూసీ మూటల్లో మీ వాటా ఎంతో చెప్పాలి.

హైదరాబాదీలు మోసపోలేదు..

ఇవాళ హైదరాబాద్ ప్రజల చైతన్యానికి శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నా. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో కొందరు మోసపోయారు. కాంగ్రెస్ వాళ్ల మాటలు, వ్యవహారం తెలుసు కాబట్టి హైదరాబాద్ వాళ్లు మాత్రం మోసపోలేదు. 24 నియోజకవర్గాల్లో చైతన్యాన్ని చూపించి బీఆర్‌ఎస్‌ను గెలిపించారు. పార్టీ వీడిన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే పశ్చాత్తాపపడే రోజు వస్తుంది. కార్యకర్తలంతా పార్టీని వెన్నంటే ఉన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల తరఫున కొట్లాడి.. వారి గుండెల్లో శాశ్వతంగా స్థానం సంపాదించుకునే అవకాశం లభిస్తుంది. ఆ అవకాశం కార్తీక్‌రెడ్డికి వచ్చింది. ఎంత గట్టిగా ప్రజల్లోకి పోతే.. అంత మేలు జరుగుతుంది" అని కేటీఆర్ పేర్కొన్నారు.

జనాభా ప్రకారం రిజర్వేషన్ కోరుతున్నారు

- డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని
- నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంఘాలతో కమిషన్ చైర్మన్, కార్యదర్శి సమావేశం



మీడియాతో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు

నల్లగొండ: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఎలా ఉండాలన్న ముఖ్య ఉద్దేశంతో హైకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటైనట్లు ఆ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వర్‌రావు తెలిపారు. శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించి బీసీ కుల సంఘాల నాయకులు, వ్యక్తులు, సంస్థల నుంచి వినతులు స్వీకరించడంతోపాటు వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ ఎంత ఉండాలనే దానిపైనే అభిప్రాయ సేకరణ కోసం డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటైందన్నారు. పంచాయతీల్లో, వార్డుల్లో, జిల్లా, మండల పరిషత్‌లలో ఎంత శాతం రిజర్వేషన్ ఉండాలనే విషయాలపై కమిషన్ అభిప్రాయాలు సేకరిస్తుందని చెప్పారు. బీసీ సంఘాల నాయకులు, బీసీ కుల సంఘాలు, వ్యక్తులు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా, మౌఖికంగా తెలిపారని వెల్లడించారు. ఇప్పటివరకు రంగారెడ్డి జిల్లాలో పర్యటించామని, త్వరలో మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో కూడా అభిప్రాయ సేకరణ చేస్తామని చెప్పారు. నల్లగొండ ప్రజాభిప్రాయ సేకరణలో జనాభాలో బీసీల శాతం ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ ఉండాలనే అంశంపై ఎక్కువ మంది వినతులు అందించారని చెప్పారు. కొందరు స్థానిక సంస్థల రిజర్వేషన్లలో కూడా ఏబీసీడీలుగా విభజిస్తే బాగుంటుందని పేర్కొన్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల్లో ఇప్పటివరకు ప్రాతినిధ్యం లేని కులాలకు అవకాశం కల్పించాలని, సమగ్ర సర్వే తదితర అంశాలకు సంబంధించి వినతులు అందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డెడికేటెడ్ కమిషన్ కార్యదర్శి బి.సైదులు, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఏఎస్పీ రాములునాయక్ పాల్గొన్నారు.

రేపటినుంచి బీసీ కమిషన్ రెండో విడత విచారణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీసీ కమిషన్ ఈ నెల 18వ తేదీ నుంచి 26 వరకు రెండో విడత బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో విద్య, ఉద్యోగపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతుల అధ్యయనంలో భాగంగా ప్రజలు, కుల సంఘాల నుంచి వినతులు, సలహాలు, సూచనలను కమిషన్ స్వీకరించనుందని వివరించారు. ఇప్పటికే తొలి విడతగా అక్టోబర్ 28 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, కరీంనగర్, హనుమకొండ జిల్లాల్లో కమిషన్ పర్యటించిందని పేర్కొన్నారు. తాజాగా ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు మిగిలిన ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 18న నల్లగొండ, 19న ఖమ్మం, 21న రంగారెడ్డి, 22న మహబూబ్‌నగర్, 23న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బహిరంగ విచారణ జరగనుందని తెలిపారు. జిల్లా కేంద్రాలలో నిర్వహించే బహిరంగ విచారణకు హాజరు కాలేనివారు.. ఈ నెల 25, 26 తేదీలలో ఖైరతాబాద్‌లోని రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో జరగనున్న బహిరంగ విచారణకు హాజరు కావచ్చని తెలిపారు.

ఆ భూమికి ఎన్‌ఓసీ ఎలా చేస్తారు?

- కలెక్టర్‌కు ఆ అధికారం ఎక్కడుందన్న హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్ నౌఖల్సా గ్రామం ప్రశాంతి హిల్స్‌లో సర్వే నంబర్ 66/2లోని భూమికి కలెక్టర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) ఎలా జారీ చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఆయనకు ఆ అధికారం ఎక్కడుందని, దీనిపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆ భూమిపై సర్కార్ హక్కులు క్లెయిమ్ చేస్తోందా? లేదో? చెప్పాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేస్తూ, ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని సీఎస్‌తోపాటు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, తహసీల్దార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తోపాటు ప్రైవేట్ వ్యక్తి మృత్యుంజయరెడ్డికి నోటీసులు జారీ చేసింది. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు యథాతథస్థితి కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రశాంతి హిల్స్‌లో 200 చదరపు గజాల భూమికి కలెక్టర్ 2023, సెప్టెంబర్ 4న ప్రైవేట్ వ్యక్తులకు ఎన్‌ఓసీ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన ఆళ్లగడ్డ చెన్నమ్మ హైకోర్టును ఆశ్రయించారు. తాను 600 చ.గజాల ప్లాట్‌ను సాదాబైనామా కింద కొనుగోలు చేశానని.. ఆ తర్వాత స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు వసూలు చేసిన అధికారులు దాన్ని క్రమబద్ధీకరించారని చెప్పారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సర్వే నంబర్ 66లోని కొంత భూమిని (భూమిని గుట్టగా పిలిచేవారు) తమకు హక్కులు ఉన్నాయని ప్రైవేట్ హౌసింగ్ సొసైటీ, ఇతర వ్యక్తులు గతంలో పిటిషన్ దాఖలు చేయగా, హైకోర్టు వారి వాదనను సమర్థించలేదని చెప్పారు. ఆ భూమిని ప్రభుత్వ భూమిగా ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో ఆ భూమి పరిస్థితిని తెలుసుకోవాలనుకుంటున్నామని, అందుకే ఆ భూమిపై ప్రభుత్వ వైఖరిని తెలియజేస్తూ కౌంటర్ దాఖలు చేయాలని సీఎస్‌ను ఆదేశించారు.



మూసీ నిద్రలో భాగంగా మూసారాంబాగ్ శాలివాహననగర్‌లో ఓ స్థానికుడి ఇంట్లో భోజనం చేస్తున్న బీజేపీ ఎంపీ లక్ష్మణ్





గోల్నాక తులసీరామ్‌నగర్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. కొత్తపేట డివిజన్ ఫణిగిరి కాలనీలో ఎంపీ ఈటల రాజేందర్ నిద్ర

ఎన్ని బుల్డోజర్లు వచ్చినా ఎదురొడ్డుతాం

- 'మూసీ నిద్ర'లో బాధితులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భరోసా
- ప్రభుత్వ ప్రకటనలతో మూసీ ప్రాజెక్టు బాధితుల్లో ఆందోళన..
- ముఖ్యమంత్రి అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని ధ్వజం

సాక్షి, హైదరాబాద్/అంబర్‌పేట(హైదరాబాద్): మూసీ సుందరీకరణపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలతో పరీవాహక ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని, వారికి ధైర్యం, భరోసా కల్పించడంలో బీజేపీ ముందుంటుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. మూసీనది పునరుజ్జీవం పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. మూసీ నది సుందరీకరణకు బీజేపీ వ్యతిరేకం కాదని, నదిలో కలుస్తున్న మురుగునీరును నియంత్రించి, ప్రహరీ నిర్మించి సుందరీకరణ చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోతున్న బాధితులకు భరోసా కల్పించేందుకు బీజేపీ మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో చేపట్టిన మూసీ నిద్ర కార్యక్రమంలో భాగంగా కిషన్‌రెడ్డి శనివారం రాత్రి గోల్నాక తులసీరామ్‌నగర్‌లో బస చేశారు. అంబోజి శంకరమ్మ నివాసంలో కిషన్‌రెడ్డి రాత్రి భోజనంచేసి అక్కడే నిద్రించారు. అంతకుముందు బస్తీలో బాధితులతో మాట్లాడుతూ, ఇంటింటికీ తిరుగుతూ వారికి భరోసా కల్పించారు. మూసీ ప్రాజెక్టులో భాగంగా అధికారులు మార్కింగ్ చేసిన ఇళ్లకు సంబంధించి బాధితుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎట్టిపరిస్థితుల్లోనూ మూసీ ప్రాజెక్టు ఆగదని, బుల్డోజర్లు ఎక్కించి మరీ పనులు చేస్తామని సీఎం అహంకారపూరితంగా మాట్లాడటం దారుణమని అన్నారు. ఎన్ని బుల్డోజర్లు వచ్చినా బీజేపీ పేదలకు అండగా ఉంటుందన్నారు. మూసీ సుందరీకరణపై ప్రభుత్వానికి స్పష్టమైన విజన్ లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా బాధితులు 'మా ఇళ్లు మాకు కావాలి. మా ఇళ్లు కూలగొట్టడానికి వీల్లేదు' అంటూ నినదించారు.

శాలివాహననగర్‌లో లక్ష్మణ్..

మలక్‌పేట నియోజకవర్గంలోని మూసారాంబాగ్ శాలివాహననగర్‌లో బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కే.లక్ష్మణ్ 'మూసీ నిద్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. మూసీ బాధితులతో కలిసి రాత్రి భోజనం చేసి అక్కడే నిద్రించారు. ఆ పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కొత్తపేట డివిజన్ ఫణిగిరి కాలనీలో పాల్గొన్నారు. అంబేడ్కర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం పర్యటించి అక్కడే బస చేశారు.

రాత్రి 'మూసీ నిద్ర'.. ఉదయం రచ్చబండ

మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లు కూల్చరాదని డిమాండ్ చేస్తూ బీజేపీ శనివారం సాయంత్రం చేపట్టిన 'మూసీ నిద్ర' కార్యక్రమంలో ఆ పార్టీ అగ్రనేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మూసీ వెంబడి ఉన్న పలు బస్తీల్లో నేతలు పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం ఆదివారం ఉదయం 9 గంటల వరకు కొనసాగనుంది. ముందుగానే నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం పార్టీ నేతలు శనివారం సాయంత్రం ఎవరికి కేటాయించిన బస్తీలకు వారు వెళ్లారు. నేతల వెంట బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. బస్తీల్లో తిరుగుతూ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. 'మూసీ ప్రక్షాళన చేయండి.. కానీ పేదల ఇళ్లు కూలగొట్టకండి' అని డిమాండ్ చేశారు. కాగా, ఆదివారం ఉదయం అక్కడే అల్పాహారం తీసుకొని రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మిగతా చోట్ల కూడా పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు.

వచ్చే ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్ ఉండదు

మీడియా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

- ఆ పార్టీకి తెలంగాణలో నూకలు చెల్లినయ్
- బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధికన్నా అన్యాయమే ఎక్కువ
- 19న లక్ష మంది మహిళలతో విజయోత్సవ సభ



సాక్షి ప్రతినిధి, వరంగల్: వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ ఉండదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ జోస్యం చెప్పారు. తెలంగాణలో ఆ పార్టీకి నూకలు చెల్లాయని, పదేళ్ల పాలనలో యథేచ్ఛగా నీళ్లు, నిధులు, భూములు దోపిడీ చేసిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు 2023లో గద్దె దించారని పేర్కొన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని.. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణలో జరిగింది అభివృద్ధి కాదు.. మొత్తం అన్యాయమేనని, దీనిపై తాము చర్చకు సిద్ధమని బీఆర్‌ఎస్ నేతలకు ఆయన సవాల్ విసిరారు. 19న నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు శనివారం హనుమకొండకు విచ్చేసిన టీపీసీసీ చీఫ్ ముందుగా నయీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కాంగ్రెస్ ప్రముఖులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ అప్పుల తెలంగాణగా మార్చిందని, ప్రత్యేక రాష్ట్రంలో ఒక్క కేసీఆర్ కుటుంబం మాత్రమే బంగారుమయం అయ్యిందని.. పేదలు అష్టకష్టాలు పడ్డారని ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రతిపక్ష హోదాను నిర్వర్తించకుండా ఫాంహౌస్‌కే పరిమితమయ్యాడని విమర్శించారు. మతం పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ.. తెలంగాణలో ఉనికి కోసం కులం, మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నదన్నారు. మూసీ ప్రక్షాళన అవసరమా, కాదా? కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేయాలన్నారు.

కులగణనతో దేశానికే రోల్‌మోడల్..

దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీన హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ కాలేజీ మైదానంలోని ఇందిరా మహిళా శక్తి ప్రాంగణంలో లక్ష మంది మహిళలతో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు మహేశ్‌కుమార్ వెల్లడించారు. రాష్ట్రంలో పది నెలల రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలు, అభివృద్ధి నేపథ్యంలో నిర్వహించనున్న ఈ సభ చరిత్రాత్మకంగా నిలవబోతుందన్నారు. రాహుల్‌గాంధీ ఆశయాలకు అనుగుణంగా రేవంత్‌రెడ్డి సర్కార్ రాష్ట్రంలో కులగణన చేపడుతోందని, కులగణనతో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. కేటీఆర్, బీఆర్‌ఎస్ నేతలు అధికారం కోల్పోయి అసహనంతో మాట్లాడుతున్నాడని, తాను జైలుకు పోవడం ఖాయమని కేటీఆర్‌కు తెలిసిపోయిందని చెప్పారు. అనంతరం హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీలో సభాస్థలిని పరిశీలించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, డాక్టర్ మురళీనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మేం 50 వేల కొలువులిచ్చాం.. మీరేమిచ్చారు?

▶ మొదటి పేజీ తరువాయి


కల్పించామని తెలిపారు. ఇప్పటివరకు 1.10 కోట్ల మంది మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారని వివరించారు. రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని, 25 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వెల్లడించారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటాయని విశ్వసించి అధికారంలోకి వచ్చిన 25 రోజుల్లోనే తాము రూ.18 వేల కోట్లు ఖర్చుచేసి ఒక్కో రైతుకు రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసినట్లు చెప్పారు.

బందిపోటు ముఠాను తరిమికొట్టండి

ముంబైని దోచుకోవాలని చూస్తున్న బీజేపీ బందిపోటు ముఠాను తరిమికొట్టాలని మహారాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. వెన్నుపోటు రాజకీయాలను పాతిపెట్టాలని కోరారు. ముంబైని కొల్లగొట్టేందుకే ప్రధాని మోదీ, అదానీ కలిసి వస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్‌లు గుజరాత్‌కు గులాంలుగా మారిపోయారని మండిపడ్డారు. ఎంవీఏ కూటమి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేస్తుందని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. మహారాష్ట్రలో జరుగుతున్నవి ఎన్నికలు కాదని.. అది ఒక పోరాటమని అభివర్ణించారు. ఈ పోరాటంలో ఎంవీఏను గెలిపించాలని కోరారు. కాగా, ప్రచార సభలు, నాగ్‌పూర్ రోడ్‌షో సందర్భంగా రేవంత్‌రెడ్డికి స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. రేవంత్ వేదికపైకి రాగానే పెద్దపెట్టున నినదించారు.

ఆలస్యం చేస్తే లైసెన్సులు రద్దే!

- ఆయిల్‌పామ్ కంపెనీలకు మంత్రి తుమ్మల హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: అనుమతులు పొంది ఆయిల్‌పామ్ గెలల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటులో అలసత్వం ప్రదర్శిస్తోన్న కంపెనీల లైసెన్సులు రద్దుచేసేందుకు కూడా వెనుకాడబోమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. యూనిట్ల ఏర్పాటు కార్యకలాపాలను వేగవంతం చేయాలని, వచ్చే ఏడాది చివరి నాటికి కేటాయించిన జోన్లలో గెలల ప్రాసెసింగ్ ప్రారంభించాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ కంపెనీల ఏర్పాటు పురోగతిపై శనివారం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణంలో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలని అధికారులకు సూచించారు. తీరు మార్చుకోని కంపెనీల అనుమతులు రద్దు చేసి, వాటికి కేటాయించిన జోన్లను తెలంగాణ ఆయిల్‌ఫెడ్‌కు అప్పగిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఇప్పటికే 64,040 హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటలు ఏర్పాటుచేశామని తెలిపారు. శనివారం ఆయన నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటాం

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ సర్పంచుల జేఏసీ

విద్యానగర్ (కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా తమ పదవీకాలంలో సొంత డబ్బు వెచ్చించి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని, దీనికి నిరసనగా ముఖ్యమంత్రి వేములవాడ పర్యటనను అడ్డుకుంటామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్ చెప్పారు. శనివారం ఆయన కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్నప్పటికీ పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదన్నారు. సర్పంచులుగా తాము సొంత డబ్బులు వెచ్చించి గ్రామాల్లో రైతువేదికలు, శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులు, క్రీడా ప్రాంగణాలు, గ్రామపంచాయతీ భవనాలు, పల్లె ప్రకృతి వనాలు, మిషన్ భగీరథ, సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. ఈ పనుల కోసం అప్పటి అధికారుల ఒత్తిడితో అప్పులు తీసుకొచ్చామని, బిల్లులు రాక, అప్పులకు వడ్డీలు చెల్లించలేక పలువురు మాజీ సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించకుంటే వేములవాడలో సీఎం పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

మూసీపై మూడు నెలల పోరాటం!

- సుదీర్ఘ నిరసనలకు సిద్ధమవుతున్న బీజేపీ
- 'మూసీ నిద్ర' కార్యక్రమాన్ని పొడిగించే యోచన
- కాంగ్రెస్ విమర్శలతో వ్యూహం మార్చాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో పేదలను బాధితులుగా చేయవద్దన్న డిమాండ్‌తో 'మూసీ నిద్ర' కార్యక్రమాన్ని చేపట్టిన బీజేపీ.. ఈ పోరాటాన్ని ఒక్క రోజులోనే ముగించాలని భావించటంలేదు. మూసీ నిద్ర కార్యక్రమంపై కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో ఈ పోరాటాన్ని నెలపాటు లేదంటే మూడు నెలల వరకు కూడా కొనసాగించాలని బీజేపీ రాష్ట్ర నేతలు నిర్ణయించినట్లు తెలిసింది. మూసీ సమీపంలో మూడు నెలలు నివసించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా గతంలో సవాల్ చేసిన నేపథ్యంలో బీజేపీ ఈ నిర్ణయం తీసుకొన్నట్లు సమాచారం. మూసీ నది ప్రవహించే మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లోని 8 అసెంబ్లీ స్థానాల్లో 20 చోట్ల బీజేపీ నేతలు శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు మూసీ నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే.

ప్రక్షాళన చేయండి.. ఇళ్లు మాత్రం కూల్చొద్దు

ప్రభుత్వపరంగా మూసీ పునరుజ్జీవం, ప్రక్షాళన వంటి ఏ కార్యక్రమం చేపట్టినా పేదల ఇళ్లు కూలగొట్టకుండా చేయాలనే ప్రధాన డిమాండ్‌తో బీజేపీ ముందుకు సాగుతోంది. ఇంకా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) కూడా సిద్ధం కాకముందే పేదల ఇళ్ల కూల్చివేత ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. తాము చేపట్టే ఆందోళనలు, నిరసన కార్యక్రమాలపై ప్రభుత్వం స్పందించే తీరును బట్టి 'మూసీ ప్రక్షాళన చేయండి.. కానీ పేదల ఇళ్లు కూలగొట్టకండి' అనే నినాదంతో దీర్ఘకాల పోరాటం చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు సమాచారం. ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాలు చూపకుండా వారి నివాసాలను ఎలా కూల్చుతారని బీజేపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాజెక్టుపై ముందు ప్రభుత్వం తీసుకొనే చర్యలను బట్టి పోరాట విధానాన్ని నిర్ణయించనున్నట్లు చెబుతున్నారు. నిజానికి శనివారం చేపట్టిన మూసీ నిద్ర కార్యక్రమాన్ని ఒక రోజుకే పరిమితం చేయాలని బీజేపీ నాయకత్వం భావించింది. కానీ, ఈ కార్యక్రమంపై మంత్రులు, అధికార కాంగ్రెస్‌పార్టీ నేతలు విమర్శలు గుప్పించారు. 'మూసీ కంపులో 3 నెలలు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరితే కిషన్‌రెడ్డి, ఇతర బీజేపీ నేతలు ఒకరోజు షో చేస్తున్నారు. ఒక్కరాత్రి నిద్రతో ఏం సాధిస్తారు' అని ప్రశ్నించారు. దీంతో బీజేపీ నేతలు వ్యూహం మార్చాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రజల ఇళ్లు కూలగొట్టే బదులు మూసీలోకి మురుగునీరు చేరకుండా కట్టడి చేస్తే సరిపోతుంది కదా అని ప్రశ్నిస్తున్నారు. నదికి రెండువైపులా భారీ రిటైనింగ్ వాల్ నిర్మిస్తే భారీ వరదల నుంచి కూడా ప్రజలను కాపాడవచ్చని, ఆ పనులు చేయకుండా 30- 40 ఏళ్లుగా అక్కడ నివసిస్తున్న పేదల ఇళ్లను కూల్చివేయటం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

మా ప్రాణాలు తీసి..

భూములు లాక్కోండి

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ఫార్మా విలేజీ బాధితుల ఆవేదన

భయానక పరిస్థితుల్లో కాలం గడుపుతున్నామంటున్న మహిళలు

- తమ వాళ్లు ఎక్కడున్నారో.. ఎలా ఉన్నారోనని ఆందోళన
- పోలీసుల అదుపులో మరో 8 మంది గిరిజనులు.. నలుగురికి రిమాండ్
- పరారీలో ఉన్నవారి కోసం కొనసాగుతున్న గాలింపు
- లగచర్ల, పులిచర్లకుంట, రోటిబండతండాల్లో 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలన



చెట్టుకింద దిగులుగా కూర్చున్న రోటిబండ తండా మహిళలు

దుద్యాల్/ వికారాబాద్: ''భూములే కావాలంటే.. ముందు మా ప్రాణాలు తీసి, లాక్కోండి. కొన్నాళ్లుగా మా ఆందోళనలను పట్టించుకోకపోవడాన్ని తట్టుకోలేక నిరసన తెలిపాం. ఇప్పుడు మా వాళ్లు ఎక్కడున్నారో, ఎలా ఉన్నారో. కంటి మీద కునుకులేకుండా గడుపుతున్నాం..'' అని వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ఫార్మా విలేజీ బాధిత గిరిజనులు వాపోయారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'లగచర్ల' ఘటన, గిరిజనుల అరెస్టు నేపథ్యంలో శనివారం ఆ ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిస్థితులపై 'సాక్షి' పరిశీలన జరిపింది. ఈ కేసులో ఇప్పటికే 21 మందిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు తాజాగా మరో 18 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఎక్కడ చూసినా టెన్షన్ టెన్షన్..

ఫార్మా విలేజీ ప్రతిపాదిత గ్రామాలైన లగచర్ల, పులిచర్లకుంటతండా, రోటిబండతండాలలో ఎక్కడ చూసినా ఉద్రిక్త వాతావరణమే కనిపిస్తోంది. ఏ క్షణం ఏం జరుగుతుందోనని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రామాలకు వెళ్లే మార్గాల్లో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. గిరిజనులను పరామర్శించేందుకు వెళ్తున్న వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలను అడ్డుకుంటున్నారు. గ్రామాల్లో పోలీసులు మోహరించడంతో మహిళలు, వృద్ధులు భయపడుతున్నారు. వ్యవసాయ పనులకూ వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరో నలుగురు రిమాండ్‌కు..

లగచర్ల ఘటనలో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. శనివారం పులిచర్లకుంటతండాకు చెందిన రూప్లా నాయక్, లగచర్లకు చెందిన మరో ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. కానీ పోలీసులు నలుగురిని శనివారం రాత్రి కొడంగల్ న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చి.. రిమాండ్‌కు తరలించారు. మరో నలుగురి విషయంలో స్పష్టత రాలేదు.

కలెక్టర్‌తో ఏడీజీ భేటీ

లగచర్ల ఘటనపై అడిషనల్ డీజీ (ఏడీజీ) మహేశ్ భగవత్ శనివారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో సమావేశమయ్యారు. ఈ అంశంలో ఎలా ముందుకు వెళ్లాలనేదానిపై వారు చర్చించినట్లు తెలిసింది. మరోవైపు పోలీసులు కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు భద్రత పెంచారు. ఇప్పుడున్న సిబ్బందికి అదనంగా మరో ఇద్దరు ఏఆర్ గన్‌మన్లను అదనంగా కేటాయించారు.

పోలీసుల భయంతో వృద్ధురాలికి గుండెపోటు!

'లగచర్ల' ఘటనకు సంబంధించి పోలీసుల భయంతో డాకిడిబాయి అనే వృద్ధురాలు గుండెపోటుకు గురైంది. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పులిచర్లకుంటతండాకు చెందిన డాకిడిబాయికి గ్రామ పరిధిలో ఆరు ఎకరాల భూమి ఉంది. ఫార్మా విలేజీ భూసేకరణలో ఆ భూమి కూడా పోతోంది. ఆమె కుటుంబం ఈ ఆందోళనతోనే ఉంది. ఈ నెల 11న లగచర్లలో అధికారులపై దాడి ఘటన అనంతరం.. ఆమె కుమారులు ఇద్దరు పోలీసుల భయంతో ఇంట్లోంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో పోలీసులు తరచూ ఆమె ఇంటికి వెళ్లి.. కుమారుల జాడ చెప్పాలంటూ ఒత్తిడి చేశారని, శుక్రవారం కూడా వచ్చి గట్టిగా బెదిరించారని స్థానికులు చెప్తున్నారు. ఈ భయాందోళనతో డాకిడిబాయి గుండెపోటుకు గురైందని పేర్కొంటున్నారు.

తిండికి తిప్పలు వచ్చాయి



ఇంట్లో బియ్యం, కారంపొడి తప్ప ఏమీ లేవు. కూరగాయలు అమ్మేందుకు సైతం తండాల్లోకి ఎవరూ రావడం లేదు. తిండికి తిప్పలొచ్చాయి. మాకున్న ఐదెకరాల భూమి ఫార్మా విలేజీలో పోతోంది. భూమి లేకపోతే ఏం చేసి బతకాలి.

- సోనిబాయి, రోటిబండతండా

పోలీసులమని బెదిరించి మేకలు ఎత్తుకెళ్లారు



అధికారులపై దాడి చేసిన వారి కోసం తండాలకు పోలీసులు తరచూ వస్తున్నారు. వారిలో కొందరు యూనిఫామ్‌లో ఉంటే.. మరికొందరు మామూలు డ్రెస్‌లలో ఉంటున్నారు. వచ్చినవారు ఎవరో తెలియడం లేదు. కొందరు దొంగలు పోలీసులమని బెదిరించి రెండు మేకలు ఎత్తుకెళ్లారు. తండాల్లో మగవాళ్లు ఎవరూ ఉండటం లేదని ఇలా చేస్తున్నారు. మాకు రక్షణ ఏది?

- అంబిక, రోటిబండతండా



లగచర్ల బాధిత మహిళలతో కలిసి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న సత్యవతి రాథోడ్, ప్రవీణ్ కుమార్

పోలీసులపై అత్యాచార కేసులు పెట్టాలి

'లగచర్ల'ఘటనపై బాధిత మహిళలతో కలిసి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

- రేవంత్‌రెడ్డి గిరిజనుల భూములు లాక్కుంటున్నారు: సత్యవతి రాథోడ్
- దాడి జరిగింది అధికారులపై కాదు... గిరిజనులపై: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

సాక్షి, హైదరాబాద్: రైతులు అధికారులపై దాడులు చేశారన్న నెపంతో పోలీసులు లగచర్లలో మహిళలపై లైంగిక దాడులకు పాల్పడ్డారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. అర్ధరాత్రి ఇళ్ల పైకి వచ్చి మహిళలను బూతులు తిట్టారని, లైంగికంగా వేధించారని చెప్పారు. ఈ మేరకు వారు బాధిత మహిళలతో కలిసి శనివారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత మహిళలు తమపై పోలీసులు ఏ విధంగా అఘాయిత్యాలకు పాల్పడ్డారో కమిషన్‌కు వివరించారు. తమపై దాడి చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అత్యాచార కేసులు నమోదు చేయాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి తన నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ కోసం గిరిజనుల భూములను లాక్కుంటున్నారని మండిపడ్డారు. తిరగబడిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుండా రైతులను జైల్లో పెట్టడం అమానుషమన్నారు. లగచర్లలో దాడి జరిగింది అధికారులపై కాదని, ఎస్సీ, ఎస్టీలపైనే అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కమిషన్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, అనిల్ జాదవ్ తదితరులున్నారు.

అన్యాయం జరిగితే ఊరుకోం: కమిషన్ చైర్మన్

ఎస్సీ, ఎస్టీ మహిళలపై దాడులను నియంత్రించే విషయంలో కమిషన్ కఠినంగా వ్యవహరిస్తుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య చెప్పారు. అత్యాచార ఆరోపణలకు సంబంధించి విచారణ జరుపుతామన్నారు. త్వరలోనే కమిషన్ లగచర్లలో పర్యటిస్తుందన్నారు. భూములు కోల్పోతున్న గ్రామస్తులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

లగచర్ల ఘటనలో

కుట్రలేదు

భూమి పోతుందన్న బాధతో రైతుల నిరసన

అనుకోకుండా జరిగిన సంఘటనపై ప్రభుత్వం కక్ష

మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్లలో భూసేకరణపై నిర్వహించిన అభిప్రాయ సేకరణ సందర్భంగా జరిగిన ఘటన వెనుక ఎలాంటి కుట్రలు లేవని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి అన్నారు. జీవనాధారమైన పచ్చని పంట పొలాలు పోతున్నాయన్న బాధతో రైతులు నిరసన తెలపటంతో తోపులాట మాత్రమే జరిగిందని తెలిపారు. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనతో రైతులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పూనుకొన్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లగచర్లకు వచ్చిన అధికారులకు పోలీసులు ఎందుకు భద్రత కల్పించలేదని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి ఆ సంఘటన జరిగిన రోజు అక్కడ లేరని తెలిపారు. ప్రభుత్వ కుట్రలో భాగంగానే ఆయనను జైలుకు పంపారని మండిపడ్డారు. బీఆర్ఎస్ సర్కార్ గతంలో 14 వేల ఎకరాల భూమిని ఫార్మా సిటీ కోసం కేటాయించిందని, మళ్లీ కొత్తగా భూసేకరణ ఎందుకు జరుపుతున్నారని ప్రశ్నించారు. వికారాబాద్ జిల్లాకు పెద్ద దిక్కు అని చెప్పుకుంటున్న పట్నం మహేందర్ రెడ్డి ఈ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. నరేందర్ రెడ్డి జైలుకి వెళ్లడం వెనుక మహేందర్ రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. నరేందర్ రెడ్డిని వెంటనే విడుదల చేయాలని, పట్నం కుటుంబంపై మహేందర్ రెడ్డికి ప్రేమే ఉంటే ఎమ్మెల్సీ పదవికి, చీఫ్ విప్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల డిమాండ్

- ధర్నాకు హాజరైన ఎమ్మెల్సీ కోదండరాం, ఆర్.కృష్ణయ్య



ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కవాడిగూడ (హైదరాబాద్): సమగ్ర శిక్షా ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేసి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ధర్నాకు ముఖ్య అతిథులుగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ... ప్రభుత్వాలు శాశ్వతం కాదని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించుకోవాలని, గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు. గత 18 ఏళ్లుగా 19 వేల మంది ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షా విధానంలో పనిచేస్తున్నారని గుర్తు చేశారు. విద్యా ప్రమాణాలు పెంచాలంటే నిబంధనలకు అనుగుణంగా ఎంపికైన సమగ్రశిక్షా ఉద్యోగులందరినీ పర్మ నెంట్ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, సమగ్ర శిక్షా ఉద్యోగులకు గత ప్రభుత్వంలో అన్యా యం జరిగిందని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం వారితో మాట్లాడి పేస్కేల్ అమలుకు కృషిచేస్తానని చెప్పారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతానని తెలిపారు. మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, క్రమబద్ధీకరణ సమగ్ర శిక్షా ఉద్యోగుల హక్కు అన్నారు.



రోడ్లను ఆ'వరి'ంచి..

నిర్మల్ జిల్లాలో హార్వెస్టర్లతో పంటలు కోయిస్తున్న రైతులు.. ధాన్యాన్ని ఆరబోసేందుకు కల్లాల్లేక రోడ్లపై రాశులుగా పోస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే నిండిపోయాయి. కొంతమంది రైతులు పొలాలకు దగ్గరగా, కొనుగోలు కేంద్రాలకు అందుబాటులో ఉండేలా రోడ్లను ముందే సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో జిల్లాలోని గ్రామీణ రోడ్లన్నీ ధాన్యపు రాశులతో నిండిపోయి కనిపిస్తున్నాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

గ్రీన్ ఎనర్జీ లక్ష్యం 50,500 మెగావాట్లు

▶ మొదటి పేజీ తరువాయి

వనరుల ప్రాజెక్టుల ఏర్పాటును ప్రోత్సహించేందుకు లక్ష్యాలు నిర్దేశించుకుంది. ఈమేరకు తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ పాలసీ–2024ని ప్రభుత్వం త్వరలో ప్రకటించనుంది.

పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం, లక్ష్యం ఇలా.. (మెగావాట్లలో)

ప్రస్తుత సామర్థ్యం	పునరుత్పాదక విద్యుత్ (నిర్మాణంలో ఉన్నవాటితో కలిపి)	లక్ష్యం (2029-30 నాటికి)	లక్ష్యం (2029-30 నాటికి)
సౌర విద్యుత్	7,900	19,800	26,000
డిస్ట్రిబ్యూటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ	467	4,300	8,000
పవన విద్యుత్	128	2,500	4,500
ఎనర్జీ స్టోరేజీ (పంప్డ్+బ్యాటరీ)	1,600	3,800	10,000
జియో థర్మల్	0.20	1,000	2,000
మొత్తం	10,095.20	31,400	50,500

లీజుకు చౌకగా సర్కారీ స్థలాలు

విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు టారిఫ్ ఆధారిత కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా కొత్త సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్లు, పవన విద్యుత్ కేంద్రాల స్థాపనకు డెవలపర్ల నుంచి బిడ్లను ఆహ్వానించనున్నాయి. వీటిని గ్రిడ్‌కు అనుసంధానం చేసి వాటితో వచ్చే విద్యుత్‌ను కొనుగోలు చేయనున్నాయి. డెవలపర్లు ప్రైవేటు, ప్రభుత్వ స్థలాల్లో ఈ ప్రాజెక్టులను స్థాపించడానికి అవకాశం ఇవ్వనున్నారు. సర్కారు స్థలాలను నామమాత్రపు అద్దెతో ప్రభుత్వం లీజుకు ఇవ్వనుంది. బిడ్డింగ్ విజేతలకు మార్కెట్ రేటులో 10 శాతం లీజు రేటుతో భూములను కేటాయించనుంది. టీజీ–ఐపాస్ ద్వారా డెవలపర్లకు అన్ని అనుమతులు సత్వరంగా జారీ కానున్నాయి. డెవలపర్లు రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని ప్రైవేటు సంస్థలకు ఓపెన్ యాక్సెస్ ద్వారా అమ్ముకునే అవకాశాన్ని కల్పించనున్నారు. సొంత అవసరాలకూ సౌర, పవన విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు వీలుంటుంది.

జలాశయాలపై ఫ్లోటింగ్ ప్రాజెక్టులు

నీటిపారుదల శాఖ భాగస్వామ్యంతో కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటును సైతం ప్రభుత్వం ప్రో త్సహించనుంది. జలాశయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు నామినేషన్ విధానంలో కేటాయించనుంది. ఇందుకుగాను నీటిపారుదల శాఖకు డిస్కంలు విద్యుత్‌లో వాటా/ నామమాత్రపు అద్దెను చెల్లిస్తాయి.

- రాష్ట్రంలో ఏడాదిలో 300 రోజులు సౌరవిద్యుదుత్పత్తికి అనుకూలత ఉంటుంది. దేశంలో బలంగా గాలులు వీచే 8 రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణ 5,500 మెగావాట్ల పవన విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది.
- రాష్ట్రంలోని సబ్‌స్టేషన్ల వారీగా సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు ఎక్కడ అవకాశం ఉందో వెల్లడిస్తూ డిస్కంలు ప్రకటన జారీచేయనున్నాయి. ఆ మేరకు సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళల నుంచి ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించనున్నాయి.

ప్రోత్సాహకాలివీ..

- పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు వినియోగించే స్థలాలను వ్యవసాయేతర భూములుగా పరిగణిస్తారు. భూవినియోగ మార్పిడి అనుమతులు అవసరం ఉండదు.
- డిస్కంలకు విద్యుత్ విక్రయించే ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందించనున్నారు.
- సూపర్విజింగ్ చార్జీల మినహాయింపు.
- ప్రాజెక్టు కోసం కొనుగోలు చేసే యంత్రాలు, పరికరాలకు 100 శాతం రాష్ట్ర జీఎస్టీ వాటాను తిరిగి చెల్లిస్తారు.
- భూగరిష్ట పరిమితి చట్టం నుంచి మినహాయింపు కల్పిస్తారు. మెగావాట్ ప్రాజెక్టుకు 4 ఎకరాల వరకు ఈ వెసులుబాటు వర్తిస్తుంది.
- ప్రభుత్వ పాఠశాలలు, ఇందిరమ్మ గృహాలు, ప్రభుత్వ భవనాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలపై రూఫ్‌టాప్ సౌరవిద్యుత్ ప్లాంట్ల స్థాపనను ప్రోత్సహించనున్నారు.
- పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను నామమాత్రపు లీజు ధరతో 45 ఏళ్ల కాలానికి ప్రభుత్వం కేటాయించనుంది.

ఇకపై టీజీ పోలీస్..

టోపీ, బెల్ట్, బ్యాడ్జీలపై టీఎస్ స్థానంలో టీజీ లోగో

- హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: పోలీస్‌శాఖ సిబ్బంది, అధికారులు ధరించే యూనిఫాంకు సంబంధించిన.. పోలీస్ టోపీ, బెల్ట్, బ్యాడ్జీలపై టీఎస్‌కు బదులుగా టీజీ అని ఉండేలా లోగోలో మార్పు చేశారు. ఈ మేరకు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. బ్యాడ్జీలపై టీఎస్పీ స్థానంలో టీజీపీ, తెలంగాణ స్టేట్ పోలీస్ స్థానంలో తెలంగాణ పోలీస్, టీఎస్ఎస్పీ స్థానంలో టీజీఎస్పీ, టీఎస్‌పీఎస్ స్థానంలో టీజీపీఎస్ ఉండేలా మార్పులు చేసినట్టు తెలిపారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీ జితేందర్‌ను ఆదేశించారు.



శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక

ట్రిపుల్‌ఐటీ ముట్టడికి ఏబీవీపీ విఫలయత్నం!

వేకువజాము నుంచే అరెస్టులు ● బాసరలో ఉద్రిక్తత



ట్రిపుల్‌ఐటీ గోడ దూకుతున్న ఏబీవీపీ నాయకులు

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ ముట్టడికి ఏబీవీపీ శనివారం విఫలయత్నం చేసింది. పీయూసీ–2 విద్యార్థిని స్వాతిప్రియ ఆత్మహత్య, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులపై యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది దాడికి నిరసనగా విద్యార్థి సంఘం నాయకులు ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని ఏబీవీపీ నాయకులను శనివారం వేకువజాము నుంచే అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి నాయకులు వస్తున్నారన్న సమాచారం ఇంటెలిజెన్స్ అధికారులు చేరవేశారు. అప్రమత్తమైన ఎస్పీ జానకీషర్మిల బాసర బస్టాండ్, రైల్వే స్టేషన్, సరస్వతీ ఆలయం, ట్రిపుల్ ఐటీ వద్ద పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పలువురిని అరెస్ట్ చేశారు. అయినా మహారాష్ట్రవైపు నుంచి వచ్చిన ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ గోడ దూకి లోనికి వెళ్లారు. అప్రమత్తమైన సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మరోవైపు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి వచ్చేవారిని ముథోల్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బాసర ఆత్మహత్యలకు సర్కారే బాధ్యత వహించాలి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి



సాక్షి, హైదరాబాద్: బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థిని స్వాతిప్రియ ఆత్మహత్యకు కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ట్రిపుల్ ఐటీలో పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ఓ ప్రకటనలో ప్రశ్నించారు. ప్రభుత్వం ఏమాత్రం జాప్యం చేయకుండా విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. స్వాతిప్రియ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని, అరెస్ట్ చేసిన ఏబీవీపీ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పక్షాన ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని ధ్వజమెత్తారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినికి న్యాయం చేయమంటే, ఏబీవీపీ నాయకులపై పోలీసులు, బాసర ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం దుర్మార్గమని బండి మండిపడ్డారు.

ఆర్జీయూకేటీని బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసింది

వర్సిటీ పునర్నిర్మాణానికి నిధులు కేటాయిస్తాం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వీసీ ప్రొ. గోవర్ధన్‌తో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

భైంసా టౌన్: రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం బాసర ఆర్జీయూకేటీని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. వర్సిటీలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వంతో చర్చించి యూనివర్సిటీ పునర్నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేసి బలోపేతం చేస్తామన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం నిమిత్తం శనివారం భైంసా వచ్చిన ఆయన మండలంలోని కుంసర గ్రామంలో బస చేశారు. ఈ సందర్భంగా ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్‌తో వర్సిటీ సమస్యలపై సమీక్షించారు. ఇటీవల స్వాతిప్రియ అనే విద్యార్థిని ఆత్మహత్యకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. వర్సిటీలో విద్యార్థులకు హాస్టల్ వసతి, మెస్, అకడమిక్ బ్లాక్, ఇతర మౌలిక వసతుల కల్పనతోపాటు బోధన, బోధనేతర సిబ్బంది, సమస్యలు, ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. వర్సిటీలో విద్యార్థుల ఆత్మహత్యలు బాధాకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వీసీకి సూచించారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆత్మహత్యలను ప్రేరేపిస్తున్న అంశాలను గుర్తించి, నివారణ దిశగా ఆలోచన చేయాలని సూచించారు. విద్యార్థులకు తరచూ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు సైతం చదువుపై దృష్టి పెట్టి నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు చేయాలని, తద్వారా చదువుల తల్లి కొలువైన బాసర క్షేత్రానికి ప్రత్యేక గుర్తింపు తేవాలని మంత్రి ఆకాంక్షించారు.

న్యూస్‌మేకర్

మండే కండలు



బాడీ బిల్డింగ్‌కి ముందు, తర్వాత



తల్లిదండ్రులు లేరు. అండ దండలు లేవు. నానమ్మ నేటికీ పల్లెలో ఆకుకూరలు అమ్ముతుంది. కాని 24 ఏళ్ల ఎస్తేర్ రాణి గుంటూరు జిల్లా వేమూరు నుంచి బయలుదేరి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి మహిళా బాడీబిల్డర్ అయ్యింది. ఇటీవల చెన్నైలో జరిగిన 'మిస్టర్ అండ్ మిస్ హిందూస్తాన్' పోటీలో గోల్డ్‌మెడల్ సాధించింది. హైదరాబాద్‌లో జిమ్ ట్రయినర్‌గా ఉద్యోగం చేస్తున్న ఎస్తేర్ ఏ సాయం అందక గుండె మండుతోందని అంటున్నది.

ఎస్తేర్ 2021లో గుంటూరు జిల్లా వేమూరు నుంచి హైదరాబాద్ వచ్చింది. కేవలం ఇంటర్ వరకూ చదువుకుంది. ఏదో ఒక పని చేయాలనుకుంటే ఏం చేయాలో తెలియలేదు. ఆమెకు సిటీలో ఎవరూ తెలియదు. స్కూల్లో కాలేజీలో అథ్లెటిక్స్‌లో మంచి ప్రావీణ్యం ఉంది. హామర్ త్రోలో నేషనల్స్ వరకూ వెళ్లింది. ఆ ఫిట్‌నెస్ వల్ల జిమ్‌లో పనికి కుదిరి ట్రయినర్‌గా మారింది. ''కొద్దిపాటి జీతం. గుర్తింపు లేని పని. 'ఏదైనా సాధించాలనే నా తపనకు ఆ పని సరిపోలేదు. ఆ సమయంలోనే మహిళా బాడీ బిల్డర్ల మీదకు నా దృష్టి వెళ్లింది. జాతీయస్థాయి కాంపిటీషన్లలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక్కరు కూడా లేకపోవడాన్ని గమనించాను. ఇదే ఎందుకు నేను సాధించకూడదు అని భావించి ఎవరికీ చెప్పకనే ఎవరి అంగీకారం లేకనే నాకై నేనుగా కృషి చేసి ఎదిగాను' అంటుంది ఎస్తేర్.

అన్నీ ఆటంకాలే

మహిళా బాడీగార్డ్ కావాలంటే పర్సనల్ ట్రయినర్ ఉండాలి. అందుకు నెలకు పది వేల నుంచి భారీ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అదీగాక నిర్దిష్ట డైట్ తీసుకోవాలి. రోజుకు కనీసం 7 గంటలు వర్కవుట్స్ చేయాలి. అవన్నీగాక మహిళలు బాడీ బిల్డింగ్ చేసే సమస్యలు అనేకం ఉంటాయి. 'అయినా సరే అప్పుచేసి కండలు పెంచాను. రెండేళ్లలోనే తగినట్టుగా తయారయ్యి మొన్నటి సెప్టెంబర్‌లో వరల్డ్ ఫిట్‌నెస్ ఫెడరేషన్ (డబ్ల్యు.ఎఫ్.ఎఫ్) నిర్వహించిన నేషనల్స్ బాడీబిల్డింగ్ పోటీల్లో 'స్పోర్ట్స్ మోడల్' కేటగిరీలో ద్వితీయస్థానంలో రజత పతకం సాధించాను. ఆ ఉత్సాహంతోనే ఈనెల 9,10 తేదీల్లో చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో డబ్ల్యు.ఎఫ్.ఎఫ్ నిర్వహించిన 'మిస్టర్ అండ్ మిస్ హిందూస్తాన్' బాడీబిల్డింగ్ ఫిట్‌నెస్ చాంపియన్‌షిప్ అండ్ మోడల్స్' పోటీల్లో 'మిస్ ఫిగర్' కేటగిరీలో ప్రథమ స్థానంలో బంగారు పతకం గెలుచుకున్నాను. నా కేటగిరిలో దేశవ్యాప్తంగా పోటీ ఉన్నా నాకు స్వర్ణం రావడం మర్చిపోలేను' అంటుంది ఎస్తేర్.



నానమ్మ అమ్మే ఆకు కూరల బుట్టతో..

'మహిళా బాడీబిల్డింగ్‌లో ఉత్తర భారతదేశం వారు ముందంజలో ఉన్నారు. మనకు ప్రతిభ ఉన్నా పైస్థాయిలో మనల్ని ముందుకు తీసుకెళ్లేవారు లేరు. మహారాష్ట్ర, హర్యాణ మహిళా బాడీబిల్డర్లు ఎంతో సౌకర్యంగా కెరీర్‌లో రాణిస్తున్నారు'

– ఎస్తేర్

దొరకని సాయం

బాడీ బిల్డింగ్‌లో నిరంతర సాధన ఉండాలి. రోజుకు తీసుకునే ఆహారానికే 1500 నుంచి రెండు వేలు ఖర్చు అవుతుంది. 'ఉద్యోగం చేస్తే సాధన మిస్ అవుతుందని ఫ్రీలాన్స్ జిమ్ ట్రయినర్‌గా పని చేస్తున్నాను. ఆసియా స్థాయి, ప్రపంచ స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ వరకూ వెళ్లాలని నా కల. ఊళ్లో మా నానమ్మ నేటికీ ఆకుకూరలు అమ్ముతుంది. మాకు సరైన తిండి లేదు. నా తమ్ముడు ఇంకా సెటిల్ కాలేదు. మహిళా బాడీ బిల్డింగ్ అంటే ఎన్నో సవాళ్లు. బంధువులు అందరూ నన్ను నిరోధించారు. అబ్బాయిగా మారిపోయానని సందేహించారు. ఇలా అయితే ఎవరు పెళ్లి చేసుకుంటారన్నారు. కాని నా గెలుపులను చూసి వారు ఇప్పుడు సంతోషిస్తున్నారు. మన సమాజంలో స్త్రీ తన శరీరాన్ని సరైన వస్త్రధారణలో ఉంచుకోవాలి. అందుకే ఎక్కువమంది స్త్రీలు ఆ రంగంలోకి రారు. ఏదైనా సాధించాలని వచ్చిన నావంటి వారిని ఎంకరేజ్ చేయడం ప్రభుత్వ బాధ్యత. అందరికీ అదే నా విన్నపం' అంది ఎస్తేర్.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి

చల్లని తల్లి



బాలీవుడ్ నటి రిచా చద్దా ఈ మధ్యనే జూలై లో తన మొదటి బిడ్డకు జన్మనిచ్చారు. నిజానికి, ఏడాది క్రితం వరకు ఆమె – పిల్లల్ని అస్సలు కనకూడదనే అనుకున్నారు! ఆమెలోని ఎకో యాంగ్జైటీనే అందుకు కారణం. 'ఇంతటి విపరీతమైన వాతావరణ మార్పుల్లో పిల్లల్ని భూమి మీదకు తెచ్చిపడేయటం ఎలారా దేవుడా..' అని ఆకాశం వైపు దీనంగా చూసేవారట రిచా. ఉదయ లేస్తూనే భూతాపం గురించి ఆలోచించటం, లేచాక కిటికీ లోంచి పొల్యూషన్ లోని తీవ్రతను అంచనా వేయటం రిచాకు అలవాటైపోయింది.

'మొన్నటి వరకు అతి వేడి. ఇప్పుడు అతి చలి. ఈ మార్పులు నా బిడ్డపై ప్రభావం చూపకుండా జాగ్రత్త పడుతున్నాను. తనకు వాడే ప్రొడక్ట్స్ అన్నీ కూడా ఎకో ఫ్రెండ్లీ వే. అలాంటి కొన్ని బేబీ ఐటమ్స్ ని నా స్నేహితురాళ్లు దియా మీర్జా, సోహా అలీ ఖాన్, ఇంకా నా పేరెంటల్ యోగా ఇన్‌స్ట్రక్టర్ నాకు కానుకగా ఇచ్చారు. నా చుట్టూ వాళ్లంతా నా ఆందోళనను కనిపెట్టి వాతావరణ మార్పులకు అనుగుణంగా పాప పెంపకంలో నాకు తోడ్పడుతున్నారు. టిప్స్ ఇస్తున్నారు' అని 'ఓగ్స్ ఇండియా' కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో తెలిపారు రిచా.

ఇక ఆమె భర్త అలీ ఫజల్ గురించి చెప్పే పనే లేదు. ఈ ' మీర్జాపూర్ ' యాక్టర్.. సింగిల్ యూస్ ప్లాస్టిక్ కి ఎప్పట్నుంచో వ్యతిరేకి. భార్యాభర్తలు షాపింగ్ నుంచి తిరిగి వస్తున్నప్పుడు కూడా వాళ్ళ ప్యాకేజీల్లో ఏ రూపంలోనూ ప్లాస్టిక్ అన్నదే ఉండదు. బిడ్డ పుట్టాకయితే వాళ్ళు మరీ మరీ జాగ్రత్తగా ఉంటున్నారు.

పిల్లలు పుట్టక ముందు నుంచే, పుట్టబోయేవారి సంరక్షణ గురించి, వారి కోసం భూతాపాన్ని తమ వంతుగా తగ్గించటం గురించి ఆలోచించే ఇటువంటి తల్లిదండ్రుల వల్లనే రాబోయే తరాలు ఆరోగ్యంగా ఉంటాయి. భూమి తల్లి వారిని చల్లగా చూస్తుంది.

సోషల్ మీడియా గెలిపించింది!

కోవిడ్ లాక్‌డౌన్ ప్రపంచాన్ని స్తంభింప చేసింది. కానీ కోవిడ్ కాలం కొందరికి కెరీర్ బాటను వేసింది. ఆ బాటలో నడిచిన ఓ సక్సెస్‌ఫుల్ యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ ముస్కాన్ జైన్. ఇంట్లో టైమ్ పాస్ కోసం చేసిన డోనట్ ప్రయత్నం ఆమెను డోనటేరియా ఓనర్‌ని చేసింది.

ముస్కాన్ జైన్ ఎంబీఏ చేసింది. కరోనా లాక్‌డౌన్ సమయంలో యూట్యూబ్‌లో చూసినవన్నీ వండడం మొదలు పెట్టింది ముస్కాన్. ఆమె అప్పటికే యూ ట్యూబ్ స్టార్. ఆమె డాన్స్ కొరియోగ్రఫీ చానెల్‌కు యాభై వేలకు పైగా సబ్‌స్క్రైబర్లున్నారు. ఒత్తిడిని తగ్గించుకోవడానికి వంటగదిలో అడుగుపెట్టిన ముస్కాన్ చేసిన డోనట్స్ ఇంట్లో అందరికీ నచ్చాయి. ఇదే నీకు సరైన కెరీర్ అని ప్రోత్సహించారు. కానీ ముస్కాన్ వెంటనే మొదలు పెట్టలేదు. 'ఇంట్లో వాళ్లు అభిమానం కొద్దీ ప్రశంసల్లో ముంచేస్తున్నారు. అది చూసి బిజినెస్ ప్రారంభిస్తే కష్టం అనుకున్నాను. కొన్నాళ్లకు ఒకామె ''ఇప్పుడు కూడా డోనట్స్ చేస్తున్నారా, ఆర్డర్ మీద చేసిస్తారా'' అని అడిగింది. అప్పుడు నాకు ధైర్యం వచ్చింది. అలా 2023లో 'డోనటేరియా' స్టార్టప్‌ను ప్రారంభించాను. తక్కువ పెట్టుబడితో ఇంటి కిచెన్‌లోనే మొదలు పెట్టాను. డోనట్‌ని పరిచయం చేయడానికి బేకరీలు, స్టాల్స్‌కి మొదట ఫ్రీ సాంపుల్స్ ఇచ్చాను'' అంటూ తన స్టార్టప్ తొలినాళ్ల కష్టాలను వివరించారు ముస్కాన్.

ముస్కాన్ జైన్‌ను సూరత్‌తోపాటే ప్రపంచం కూడా గుర్తించింది. అందుకు కారణం సోషల్ మీడియా. ''నా ప్రతి ప్రయత్నాన్నీ ఇన్‌స్టాలో షేర్ చేసేదాన్ని. డోనట్‌ల తయారీ నుంచి ప్యాకింగ్ వరకు ప్రతిదీ షేర్ చేయసాగాను. ఇన్‌స్టా ద్వారా కూడా ఆర్డర్‌లు రాసాగాయి. ఇప్పుడు రోజుకు మూడు వందల ఆర్డర్‌లు వస్తున్నాయి'' అని సంతోషంగా చెప్పారు ముస్కాన్.



ఆమె డోనట్ తయారీ గురించి దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు యూఎస్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్ వాళ్లకు కూడా ఆన్‌లైన్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. తన డోనటేరియాను జాతీయస్థాయి బ్రాండ్‌గా విస్తరించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు.

హెయిర్ కేర్

చుండ్రు నివారణకు



- ఆపిల్ సైడర్ వెనిగర్‌లో అరటిపండు గుజ్జును బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు పట్టించి పది నిమిషాల తర్వాత గోరు వెచ్చని నీళ్లతో శుభ్రపరుచుకోవాలి.
- వేప నూనె, ఆలివ్ ఆయిల్ సమపాళ్లలో కలిపి వేడి చేయాలి. గోరువెచ్చని ఈ నూనెను తలకు పట్టించి వేళ్లతో మృదువుగా మర్దనా చేయాలి. 15 నిమిషాల తర్వాత రసాయనాల గాఢత తక్కువ ఉండే షాంపూతో తలస్నానం చేయాలి.
- కప్పు నీళ్లలో 2–3 టేబుల్ స్పూన్ల ఉప్పు కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించాలి. 10 నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి.

హెల్త్

ఎముక క్యాన్సర్ అంటే...?

ఎముక మీద ఏదైనా అసాధారణ లేదా అవాంఛిత కణజాలం పెరుగుదలతో కనిపించే 'ఎముక ట్యూమర్'లను ఎముక క్యాన్సర్‌గా చెప్పవచ్చు. ఇలాంటి ఎముక గడ్డలు శరీరంలోని ఏ ఎముకపైన అయినా రావచ్చు. అంటే ఎముక పైభాగంలో లేదా లోపలి వైపునా ఇంకా చెప్పాలంటే ఎముకలోని మూలుగ (బోన్ మ్యారో)లో... ఇలా ఎక్కడైనా రావచ్చు. ఈ బోన్ క్యాన్సర్ గురించి సాధారణ ప్రజలకూ అవగాహన కలిగేలా యూకే బర్మింగ్‌హమ్‌లోని రాయల్ ఆర్థోపెడిక్ హాస్పిటల్‌కు చెందిన మస్క్యులో స్కెలిటల్ రేడియాలజీ స్పెషలిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. రాజేశ్, అలాగే అక్కడి వైద్యురాలు డాక్టర్ సుష్మితా జగదీశ్ చెబుతున్న కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసుకుందాం.



ఎముక క్యాన్సర్‌లో రకాలివి...

ఎముకల గడ్డల గురించి... ఎముక మీద వచ్చే ఈ గడ్డ (బోన్ ట్యూమర్) అన్నది ప్రమాదాన్ని తెచ్చిపెట్టే (మేలిగ్నెంట్) బోన్ క్యాన్సర్ గడ్డ కావచ్చు లేదా అది ఎలాంటి ప్రమాదాన్నీ కలిగించని (బినైన్) గడ్డ కూడా కావచ్చు.

ఇక ఎముక క్యాన్సర్ గురించి చెప్పాలంటే వచ్చే విధానాన్ని బట్టి వీటిని రెండు రకాలుగా చెప్పవచ్చు. ఒకవేళ క్యాన్సర్ గనక ఎముకలోనే మొదలైతే దాన్ని 'ప్రైమరీ బోన్ క్యాన్సర్' అంటారు.

ఒకవేళ ఈ క్యాన్సర్ దేహంలోని మరో చోట మొదలై... ఆ కణాలు ఎముక మీదికి చేరి ఎముక కణాలనూ క్యాన్సర్ కణాలుగా మార్చడం వల్ల వచ్చిన క్యాన్సరైతే దాన్ని 'మెటాస్టాటిక్ బోన్ డిసీజ్' అనీ 'సెకండరీ బోన్ క్యాన్సర్' అని డాక్టర్లు చెబుతారు.

ప్రైమరీ బోన్ క్యాన్సర్లలో...

- మల్టిపుల్ మైలోమా (మూలుగలో వచ్చే క్యాన్సర్)
- ఆస్టియోసార్కోమా (ఇది టీనేజీ పిల్లల ఎముకల్లో కనిపించే సాధారణమైన క్యాన్సర్... సాధారణంగా మోకాలి చుట్టూ ఇది అభివృద్ధి చెందుతుంది)
- ఈవింగ్స్ సార్కోమా (ఇది కూడా యువతలో ఎక్కువగా కనిపిస్తూ సాధారణంగా కాళ్లూ, కటి భాగాల్లో ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది)
- కాండ్రో సార్కోమా (ఇది ఎముకల్లో కనిపించే అతి సాధారణ క్యాన్సర్లలో రెండో ది, ఎక్కువగా మధ్య వయస్కుల్లో అందునా చాలావరకు కటి లేదా భుజం ఎముకల్లో కనిపిస్తుంది).



డాక్టర్ (ప్రొఫెసర్) బి. రాజేష్
మస్క్యులో స్కెలిటల్ రేడియాలజీ స్పెషలిస్ట్, రాయల్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ బర్మింగ్‌హమ్ (యూకే)

సెకండరీ బోన్ క్యాన్సర్లలో దేహంలోని...

రొమ్ము, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, ప్రోస్టేట్ వంటి ఇతర ప్రాంతాల్లో వచ్చి క్యాన్సర్లు పెరుగుతూ ఆ కణాలు ఎముకలకూ చేరి అలా ఎముక క్యాన్సర్‌కూ కారణమవుతాయి. ఇక... ఏ హానీ చేయని బినైన్ ట్యూమర్స్ అని పిలిచే ఎముక గడ్డల విషయానికి వస్తే... తేడాలను బట్టి వాటిని ఆస్టియోకాండ్రోమా, జెయింట్ సెల్ ట్యూమర్స్ అని పిలుస్తారు. ఇవి ఎముకలపై పెరిగే అంతగా అపాయకరం కాని 'నాన్ క్యాన్సరస్' గడ్డలని చెప్పవచ్చు.

చికిత్స...

ఒకసారి ఎముక క్యాన్సర్ నిర్ధారణ చేశాక... ఆ క్యాన్సర్ దశ, వ్యాధి తీవ్రత వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని, ప్రాధాన్యక్రమంలో ఏ చికిత్స ప్రక్రియను తొలుత లేదా ఆ తర్వాత నిర్వహించాలో డాక్టర్లు నిర్ణయిస్తారు. ఎముక క్యాన్సర్‌కు అవలంబించే సాధారణ చికిత్స ప్రక్రియల్లో ముఖ్యమైనవి...

- శస్త్రచికిత్స: ఎముకపైన ఉన్న గడ్డనూ... దాంతోపాటు ఆ చుట్టుపక్కల కణజాలాన్ని శస్త్రచికిత్సతో తొలగిస్తారు.
- కీమోథెరపీ: కొన్ని మందులతో క్యాన్సర్ కణాలను తుదముట్టించే ప్రక్రియను కీమోగా చెప్పవచ్చు. ప్రధానంగా ఈ ప్రక్రియను ఆస్టియోసార్కోమా వంటి క్యాన్సర్ల కోసం వాడతారు.
- రేడియేషన్ థెరపీ: అత్యంత శక్తిమంతమైన రేడియేషన్ కిరణాల సహాయంతో క్యాన్సర్‌ను మాడ్చివేసే ప్రక్రియనే రేడియోషన్ థెరపీగా చెబుతారు. సాధారణంగా శస్త్రచికిత్స ద్వారా క్యాన్సర్ గడ్డలను తొలగించలేని సమయాల్లో డాక్టర్లు ఈ ప్రక్రియను ఎంచుకుంటారు.

అన్ని క్యాన్సర్‌లలో లాగే ఎముక క్యాన్సర్‌నూ ఎంత త్వరగా గుర్తించి, నిపుణులైన డాక్టర్లతో మంచి చికిత్స అందిస్తే ఫలితాలూ అంతే మెరుగ్గా ఉంటాయి. మరీ ముఖ్యంగా... పెరుగుతున్న పిల్లల్లో ఇవి వారి ఎదుగుదలను ప్రభావితం చేయడంతో పాటు కొన్నిసార్లు వైకల్యాలకూ కారణమయ్యే అవకాశం ఉన్నందున వీలైనంత త్వరగా వీటిని కనుగొని, తగిన చికిత్స అందించాలి.

బాధితుల్లో కనిపించే మెరుగుదల (ప్రోగ్నోసిస్) అనే అంశం ... అది ఏ రకమైన క్యాన్సర్ లేదా ఏదశలో దాన్ని కనుగొన్నారు, బాధితుడికి అందుతున్న చికిత్సకు ఎలా ప్రతిస్పందిస్తున్నాడనే అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది.

అయితే ఇటీవల మంచి అధునాతన చికిత్స ప్రక్రియలతో పాటు కొత్త కొత్త చికిత్స ప్రణాళికలు అందుబాటులోకి రావడం, సరికొత్త పరిశోధనలతో వచ్చిన ఆవిష్కరణల కారణంగా బాధితుల్లో మంచి మెరుగుదల కనిపిస్తోంది.

లక్షణాలు...

ఎముక క్యాన్సర్ లక్షణాలు తొలి దశల్లోనే గుర్తించడం అంతగా సాధ్యం కాదు. లక్షణాలిలా ఉంటాయి.
- నొప్పి: క్యాన్సర్ గడ్డ వచ్చిన ఎముక ప్రాంతంలో నిరంతరం నొప్పి వస్తూ సమయం గడుస్తున్నకొద్దీ దీని తీవ్రత పెరుగుతుంది.
- వాపు: ఎముక క్యాన్సర్ వచ్చిన చోట స్పష్టంగా వాచినట్లుగా వాపు కనిపిస్తుంది.
- ఫ్రాక్చర్లు: క్యాన్సర్ వచ్చిన ఎముక బలహీనంగా మారడంతో తేలిగ్గా విరగడానికి అవకాశాలెక్కువ.
- తీవ్రమైన అలసట, బరువు తగ్గడం: బాధితుల్లో బాగా నీరసం, నిస్సత్తువ, అలసట కనిపిస్తాయి. అలాగే బాధితులు ఎక్కువగా బరువు తగ్గుతారు.

నిర్ధారణ...

సాధారణంగా ఎక్స్-రే, ఎమ్మారై, సీటీ స్కాన్ పరీక్షలతో పాటు సాధారణంగా చిన్న ముక్క తీసి పరీక్షించే బయాప్సీ ద్వారా ఎముక క్యాన్సర్ నిర్ధారణ చేస్తారు.

ఎముక క్యాన్సర్‌తో జీవించాల్సి వస్తే...

ఎముక క్యాన్సర్‌తో జీవించాల్సి వచ్చే బాధితులకు తమ కుటుంబసభ్యుల నుంచి, డాక్టర్ల నుంచి ఆరోగ్య సంరక్షకుల నుంచి మంచి సహకారం అవసరం. ఎముక క్యాన్సర్ వచ్చిందని తెలియగానే అన్ని క్యాన్సర్లలో లాగానే బాధితులు షాక్‌కు గురికావడం, జీవితం శూన్యమైనట్లు అనుకోవడం, నిరాశా నిస్పృహలకు గురికావడం వంటివి ఉంటాయి. అయితే వాళ్లు బాగా కోలుకోవడం అన్నది... వాళ్లకు అందే చికిత్సతో పాటు వాళ్లకు నైతిక మద్దతు అందించే కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. తమకు వచ్చిన క్యాన్సర్ రకం, దాని గురించి అవసరమైన సమాచారంతో పాటు తమకు వచ్చిన వ్యాధి గురించి డాక్టర్లు, తమకు నమ్మకమైనవాళ్లతో అరమరికలు లేకుండా చర్చించడం వంటి అంశాలు త్వరగా కోలుకునేలా చేస్తాయి. ఈ క్రమంలో నర్సులూ, తాము తీసుకునే మందులు, తమకు లభించాల్సిన ట్రాన్స్‌పోర్టు సహకారాలూ, బాధితుల బాధల్ని తమవిగా ఎంచి, సహానుభూతితో మద్దతు అందించే సపోర్ట్ గ్రూపుల సహకారం బాగుంటే కోలుకునే ప్రక్రియ కూడా మరింత మెరుగ్గా, వేగంగా జరుగుతుంది.

కాకర: చక్కెరకు చెక్ పెడుతుందా?

డయాబెటిస్ ఉన్నవారు తరచూ కాకరకాయ కూర తింటుంటే చక్కెర అదుపులో ఉంటుందన్న అభిప్రాయం కొందరిలో ఉంది. ఇది కేవలం ఒక అపోహ మాత్రమే. అయితే ఇందులో కాస్తంత పాక్షిక సత్యమూ లేకపోలేదు. కాకరలో 'కరాటిన్', 'మమోర్డిసిస్' అనే పోషకాలు ప్రధానంగా ఉంటాయి. వాటికి కొంత వరకు చక్కెరను నియంత్రించే సామర్థ్యం ఉంది. ఇక కాకర గింజల్లోనూ 'పాలీపెప్టైడ్–పీ' అనే ఇన్సులిన్‌ను పోలిన ఫైటోకెమికల్ ఉంటుంది. దీనికి కూడా కొంతవరకు ఇన్సులిన్‌లాగా పనిచేసే గుణం ఉండటంతో అది కొంతవరకు చక్కెరను అదుపు చేస్తుంది. కానీ కాకరకాయతో చేసే వంటలతోనే చక్కెర పూర్తిగా అదుపులో ఉండటమన్నది అసాధ్యం. వాళ్లు డాక్టర్లు సూచించిన మందులు వాడాల్సిందే.



ఉపయోగపడే పోషకాలెన్నెన్నో...

అయితే ఆరోగ్యానికి ఉపయోగపడే పోషకాలు కాకరలో ఎన్నెన్నో ఉన్నాయి. ఉదాహరణకు కాకరలో విటమిన్ బి1, బి2, బి3, సి లతో పాటు మెగ్నీషియమ్, ఫోలేట్, జింక్, ఫాస్ఫరస్, మాంగనీస్, ఐరన్, క్యాల్షియం, పొటాషియం ఉంటాయి. 'సి' విటమిన్ చాలా శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ కావడంతో అది దేహంలోని ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తుంది. ఆ ప్రక్రియతో మాలిగ్నంట్ కణాల (క్యాన్సర్ కారక కణాలు) తొలగిపోయి... క్యాన్సర్లు నివారితమవుతాయి. కాకర గింజలకు కొవ్వును కరిగించే గుణం ఉండటంతో గుండె గదులు, రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టకుండా రక్షిస్తాయి. ఇలా అనేక రకాలుగా కాకర ఎన్నో ప్రయోజనాలను ఇస్తుంది. ఇందులో పీచు చాలా ఎక్కువగా ఉండటంతో మలబద్ధకాన్ని రాకుండా చూస్తూ ఎన్నో వ్యాధులను నివారిస్తుంది.



ఒడిశా పురుషుల హాకీ జట్టు సంచలనం... తొలిసారి జాతీయ టైటిల్ సొంతం

సుదీర్ఘ చరిత్ర కలిగిన జాతీయ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌లో కొత్త చాంపియన్ అవతరించింది. చెన్నైలో శనివారం ముగిసిన ఈ ప్రతిష్టాత్మక చాంపియన్‌షిప్‌లో ఒడిశా జట్టు తొలిసారి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో ఒడిశా జట్టు 5–1 గోల్స్ తేడాతో మూడుసార్లు చాంపియన్ హరియాణా జట్టును బోల్తా కొట్టించి జాతీయ చాంపియన్‌గా నిలిచింది. ఒడిశా తరఫున శిలానంద్ లాక్రా (48వ, 57వ, 60వ నిమిషాల్లో) మూడు గోల్స్ సాధించగా... రజత్ ఆకాశ్ టిర్కీ (11వ నిమిషంలో), ప్రతాప్ లాక్రా (39వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. హరియాణా జట్టుకు జోగిందర్ సింగ్ (55వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. 96 ఏళ్ల చరిత్ర కలిగిన జాతీయ చాంపియన్‌షిప్‌లో ఒడిశా జట్టుకిదే తొలి టైటిల్ కావడం విశేషం. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ జట్టు 2–1తో మణిపూర్ జట్టును ఓడించింది.

చైనానూ చుట్టేసి...

- వరుసగా నాలుగో విజయం సాధించిన భారత మహిళల జట్టు
- చైనా జట్టుపై 3–0తో ఘనవిజయం
- నేడు జపాన్‌తో మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకున్నా లీగ్‌లో అగ్రస్థానం ఖరారు



రాజ్‌గిర్ (బిహార్): సొంతగడ్డపై భారత మహిళల హాకీ జట్టు తమ జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్‌లో వరుసగా నాలుగో విజయం నమోదు చేసింది. పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత చైనా జట్టుతో శనివారం జరిగిన నాలుగో రౌండ్ లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 3-0 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున సంగీత కుమారి (32వ నిమిషంలో), కెప్టెన్ సలీమా టెటె (37వ నిమిషంలో), దీపిక (60వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. మ్యాచ్ మొత్తంలో భారత జట్టుకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు లభించాయి. ఇందులో చివరిదైన ఐదో పెనాల్టీ కార్నర్‌ను దీపిక గోల్‌గా మలిచింది. తమకు లభించిన ఏకైక పెనాల్టీ కార్నర్‌ను చైనా జట్టు వృథా చేసుకుంది. ఈ మ్యాచ్‌లో భారత జట్టుకు ఆరంభంలో గట్టిపోటీ లభించింది. తొలి రెండు క్వార్టర్‌లు ముగిసేసరికి ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. మూడో క్వార్టర్‌లో భారత క్రీడాకారిణులు ఒక్కసారిగా విజృంభించి ఐదు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ సాధించారు. చివరి నిమిషంలో దీపిక గోల్‌తో భారత్ విజయం సంపూర్ణమైంది. ఇతర నాలుగో రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో జపాన్ 2–1తో మలేసియాపై, కొరియా 4–0తో థాయ్‌లాండ్‌పై గెలిచాయి.

ఆరు జట్ల మధ్య లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచి 12 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. మూడు మ్యాచ్‌ల్లో నెగ్గిన చైనా జట్టు 9 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఈ రెండు జట్లకు ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్‌లు ఖరారయ్యాయి. లీగ్‌లో టాప్ ర్యాంక్ అధికారికంగా ఖరారు కావాలంటే నేడు జపాన్‌తో జరిగే చివరిదైన ఐదో రౌండ్ లీగ్ మ్యాచ్‌ను (సాయంత్రం గం. 4:45 నుంచి) భారత జట్టు ‘డ్రా’ చేసుకుంటే చాలు. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత జట్టు 23 గోల్స్ చేసి 2 గోల్స్ మాత్రమే సమర్పించుకుంది. మరోవైపు చైనా జట్టు 22 గోల్స్ చేసి, 4 గోల్స్‌ను ప్రత్యర్థి జట్లకు కోల్పోయింది. నేడు జరిగే ఇతర చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో థాయ్‌లాండ్‌తో మలేసియా (మధ్యాహ్నం గం. 12:15 నుంచి), దక్షిణ కొరియా జట్టుతో చైనా (మధ్యాహ్నం గం. 2:30 నుంచి) తలపడతాయి.



టైసన్‌పై పాల్ ‘పంచ్’దే పైచేయి

టెక్సాస్ (అమెరికా): సుదీర్ఘ విరామం తర్వాత రింగ్‌లోకి దిగిన అమెరికా దిగ్గజ బాక్సర్ మైక్ టైసన్ నిరాశపరిచాడు. అమెరికాకే చెందిన 27 ఏళ్ల జేక్ పాల్‌తో జరిగిన హెవీవెయిట్ బౌట్‌లో మైక్ టైసన్ ఓడిపోయాడు. పాల్ 80–72, 79–73, 79–73 స్కోరుతో ఏకపక్ష విజయం అందుకున్నాడు. రెండు నిమిషాల నిడివిగల ఎనిమిది రౌండ్‌లతో ఈ బౌట్‌ను నిర్వహించారు. తొలి రెండు రౌండ్‌లలో మినహాయించి మిగతా రౌండ్‌లలో జేక్ పాల్ పూర్తి ఆధిపత్యం చలాయించాడు. పాల్ విసిరిన పంచ్‌ల నుంచి ఎలా తప్పించుకోవాలో 58 ఏళ్ల టైసన్‌కు అర్థం కాలేదు. ఒకప్పుడు ప్రత్యర్థులను తన పదునైన పంచ్‌లతో హడలెత్తించిన టైసన్ తాజా ప్రదర్శనపై వయసు ప్రభావం స్పష్టంగా కనిపించింది. రింగ్‌లో చురుకుగా కదల్లేకపోయిన టైసన్ ఏదశలోనూ జేక్ పాల్‌కు ఇబ్బంది పెట్టలేకపోయాడు. ఈ బౌట్‌ను పర్యవేక్షించిన ముగ్గురు నిర్ణేతలు నిర్ణీత 8 రౌండ్ల తర్వాత జేక్ పాల్ విజయం సాధించాడని ప్రకటించారు. ఒక నిర్ణేత పాల్‌కు 80 పాయింట్లు, టైసన్‌కు 72 పాయింట్లు ఇచ్చారు. మరో ఇద్దరు నిర్ణేతలు పాల్‌కు 79 పాయింట్ల చొప్పున... టైసన్‌కు 73 పాయింట్ల చొప్పున ఇచ్చారు. ఈ బౌట్ ద్వారా జేక్ పాల్‌కు 4 కోట్ల డాలర్లు (రూ. 337 కోట్లు), మైక్ టైసన్‌కు 2 కోట్ల డాలర్లు (రూ. 168 కోట్లు) ప్రైజ్‌మనీగా లభించినట్లు సమాచారం. చివరిసారి 2005లో ప్రొఫెషనల్ బౌట్‌లో పోటీపడ్డ టైసన్ ఆ తర్వాత ఆటకు వీడ్కోలు పలికాడు. 2020లో టైసన్–రాయ్ జోన్స్ మధ్య ఎగ్జిబిషన్ బౌట్ జరిగింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

రాణించిన తన్మయ్

- ఆంధ్ర జట్టుతో రంజీ మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకున్న హైదరాబాద్
- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించడంతో ఆంధ్ర ఖాతాలో 3 పాయింట్లు

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ చివరకు ‘డ్రా’గా ముగిసింది. ఎలైట్ గ్రూప్ ‘బి’లో భాగంగా ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఈ పోరులో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించడం ద్వారా 3 పాయింట్లు ఖాతాలో వేసుకోగా... హైదరాబాద్ జట్టుకు ఒక పాయింట్ దక్కింది. ఓవర్‌నైట్ స్కోరు 448/9తో శనివారం నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు అదే స్కోరు వద్ద చివరి వికెట్ కోల్పోయింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు 51 ఓవర్లలో వికెట్ నష్టానికి 193 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (110 బంతుల్లో 95; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) త్రుటిలో రెండో శతకం చేజార్చుకోగా... అభిరత్ రెడ్డి (140 బంతుల్లో 70 నాటౌట్; 5 ఫోర్లు) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్‌లు ‘డ్రా’కు అంగీకరించారు. ఆంధ్ర కెప్టెన్ షేక్ రషీద్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు దక్కింది. లీగ్ దశలో ఇప్పటి వరకు 5 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ జట్టు ఒక విజయం, 2 పరాజయాలు, 2 ‘డ్రా’లతో 9 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఆరో స్థానంలో నిలవగా... ఐదు మ్యాచ్‌ల్లో 3 ఓటములు, 2 ‘డ్రా’లతో ఆంధ్ర జట్టు 4 పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది.

కార్ల్‌సన్‌కు అర్జున్ షాక్

బ్లిట్జ్ గేమ్‌లో వరల్డ్ నంబర్‌వన్‌ను 20 ఎత్తుల్లో ఓడించిన భారత నంబర్‌వన్

కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ ఇండియా బ్లిట్జ్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ సంచలనం సృష్టించాడు. ప్రపంచ నంబర్‌వన్, నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్‌పై అర్జున్ విజయం సాధించాడు. ఎనిమిదో రౌండ్ గేమ్‌లో అర్జున్ ఎత్తులకు చిత్తయిన కార్ల్‌సన్ 20 ఎత్తుల్లో ఓటమి పాలయ్యాడు. ఓపెన్ విభాగంలో 10 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య 18 రౌండ్లపాటు బ్లిట్జ్ టోర్నీ జరుగుతోంది. తొలి రోజు శనివారం 9 రౌండ్ గేమ్‌లు జరిగాయి. తొమ్మిది రౌండ్ గేమ్‌లు ముగిశాక కార్ల్‌సన్ 6.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద 6 పాయింట్లతో రెండో స్థానంలో, అర్జున్ 5.5 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నారు. తొలి రోజు అర్జున్ నాలుగు గేముల్లో గెలిచి (నొదిర్‌బెక్, నిహాల్ సరీన్, విదిత్, కార్ల్‌సన్‌లపై), మూడు గేమ్‌లను (విన్సెంట్, డానిల్ దుబోవ్, నారాయణన్‌లతో) ‘డ్రా’ చేసుకొని, రెండు గేముల్లో (సో వెస్లీ, ప్రజ్ఞానంద చేతుల్లో) ఓడిపోయాడు.

ఇదే టోర్నీలోని మహిళల బ్లిట్జ్ విభాగంలో తొలి రోజు 9 రౌండ్ గేమ్‌లు ముగిశాక భారత ప్లేయర్లు దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్, కోనేరు హంపి 4.5 పాయింట్లతో సంయుక్తంగా నాలుగో స్థానంలో ఉన్నారు. భారత్‌కే చెందిన ద్రోణవల్లి హారిక 4 పాయింట్లతో ఏడో స్థానంలో, వైశాలి 3.5 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉన్నారు.



ధనుష్‌ది సంకుచిత బుద్ధి

\- నయనతార

సినిమా

- ‘నానుమ్ రౌడీదాన్’లోని మూడు సెకన్ల వీడియోపై వివాదం


ధనుష్



నయనతార

నటి నయనతార నటుడు ధనుష్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయనది సంకుచిత బుద్ధి అంటూ ఘాటుగా స్పందించారు. ఈ విషయమై నయనతార శనివారం ఓ లేఖను నటుడు ధనుష్‌కు రాశారు. అది సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, నయనతార జంటగా హీరో ధనుష్ ‘నానుమ్ రౌడీదాన్’ (2015) సినిమా నిర్మించారు. ఈ సినిమా సమయంలోనే విఘ్నేష్–నయనతార ప్రేమలో పడ్డారనే వార్తలు వచ్చాయి. 2022లో ఈ ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఆ సంగతి అలా ఉంచితే, తాజాగా నయనతార సినీ జీవితం, వ్యక్తిగత జీవితంపై రూపొందిన ‘నయనతార: బియాండ్ ది ఫెయిరీటేల్’ డాక్యుమెంటరీలో ‘నానుమ్ రౌడీదాన్’కి సంబంధించిన మూడు సెకన్ల వీడియోను వాడారు. అవి ఈ సినిమాకి సంబంధించిన తెరవెనుక రికార్డింగ్స్ అని, వాడటం సరికాదని పేర్కొని, రూ. పది కోట్లు నష్ట పరిహారం కోరుతూ ధనుష్ లీగల్ నోటీసు పంపించారు. ఈ నేపథ్యంలో నయనతార సామాజిక మాధ్యమం ద్వారా ఓ బహిరంగ లేఖను విడుదల చేశారు. ఆ లేఖ సారాంశం ఈ విధంగా...

‘‘పలు తప్పుడు విషయాలను సరిచేయడానికే బహిరంగంగా ఈ లేఖ రాశాను. మీ నాన్న కస్తూరి రాజా సపోర్టుతో, ఉత్తమ దర్శకుడు, మీ సోదరుడు కె. సెల్వ రాఘవన్ దర్శకత్వంతోనూ సినీ పరిశ్రమకు పరిచయం అయ్యి, ప్రముఖ నటుడిగా మారిన మీరు కచ్చితంగా ఈ విషయాన్ని గ్రహించాలి. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా, ఒంటరి మహిళగా పలు సవాళ్లను ఎదుర్కొని సినీరంగానికి పరిచయం అయ్యి, కఠిన శ్రమతోనూ, నిజాయితీ, అంకిత భావంతోనూ నేను ఈ స్థాయికి చేరుకున్నాను.

నా ఈ నిజాయితీ పయనం గురించి సినీ ప్రముఖులకు, నా అభిమానులకు తెలుసు. నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్న ‘నయనతార: బియాండ్ ది ఫెయిరీటేల్’ డాక్యుమెంటరీ కోసం నాలానే నా అభిమానులు ఎదురు చూస్తున్నారు. వారి అంచనాలను అధిగమించడానికి అందులో పని చేసిన ప్రతి ఒక్కరం పలు అవరోధాలను ఎదుర్కొని, అన్ని పనులు పూర్తి చేసి విడుదల కోసం ఎదురు చూస్తున్నాం. మీ ప్రతీకార చర్యల కారణంగా నా భర్త (దర్శకుడు విఘ్నేష్ శివన్)తో పాటు ఎంతో అంకితభావంతో పని చేసిన ప్రతి ఒక్కరూ బాధ పడుతున్నారు. ప్రేమ, వివాహం వంటి నా జీవితంలోని సంతోషకరమైన సంఘటనలు ఉన్న ఈ డాక్యుమెంటరీలో నా జీవితంలో మధురమైన ప్రేమకు బీజం పడిన ‘నానుమ్ రౌడీదాన్’ (తెలుగులో ‘నేనూ రౌడీనే’) చిత్రానికి సంబంధించిన సన్నివేశాలు లేకపోవడం చాలా వేదన కలిగించే విషయం. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో విడుదల కావాల్సిన ‘నయనతార: బిహైండ్ ది ఫెయిరీటేల్’ డాక్యుమెంటరీలో ‘నానుమ్ రౌడీదాన్’ చిత్రంలోని సన్నివేశాలను, పాటలను, ఫొటోలను ఉపయోగించకోవడానికి మీ నుంచి అభ్యంతరం లేని ధ్రువ పత్రాన్ని పొందడానికి రెండేళ్ల వేచి చూశాం. ఆ పోరాటాలన్నీ నిష్ప్రయోజనం కావడంతో నిర్ణయాన్ని మార్చుకుని డాక్యుమెంటరీలో మార్పులు చేసుకున్నాం. ఎన్‌ఓసీ సర్టిఫికెట్ నిరాకరింపు అంశం వ్యాపారపరంగానో, చట్టపరంగానో అయితే కచ్చితంగా దాన్ని అంగీకరించేవాళ్లం. అయితే పూర్తిగా నాపై కోపంతో, వ్యక్తిగత ద్వేషంతో మీరు చేసిన ఈ చర్యను ఎలా సమర్థించగలం? ఇటీవల విడుదలైన ఈ డాక్యుమెంటరీ ట్రైలర్‌లో వాడిన 3 సెకన్ల వీడియోపై లీగల్ నోటీసులు పంపడం దిగ్భ్రాంతికి గురి చేసింది. అందులో స్వతహాగా షూట్ చేసిన, ఇంతకు ముందే సామాజిక మాధ్యమాల్లో ప్రసారం అయిన ఒక సన్నివేశానికి రూ. 10 కోట్లు పరిహారం కోరడం వింతగా ఉంది. ఇలాంటి నీచమైన చర్యలతో మీరేంటో బాహ్య ప్రపంచానికి తెలిసింది.


డాక్యుమెంటరీ కోసం ఉపయోగించిన క్లిప్పింగ్



వేదికలపై మీ అమాయక అభిమానుల ముందు మాట్లాడినట్లు ఒక్క శాతం కూడా మీరు ప్రవర్తించరన్నది నేను, నా భర్త ఎప్పుడో అర్థం చేసుకున్నాం. నా చిత్రాల్లోని పలు మంచి సన్నివేశాలు డాక్యుమెంటరీలో చోటు చేసుకున్నాయి. అనుమతి కోసం పలువురు నిర్మాతలను కోరగా ఎంతో అభిమానంతో అనుమతించారు. అప్పుడే మీకంటే వారు ఎంత భిన్నంగా ఉన్నారో అర్థం అయ్యింది. అందుకే వారు గౌరవించబడుతున్నారు. మీ చర్యలను చట్టపరంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం’’ అంటూ నయనతార ఆ లేఖలో ఘాటుగా స్పందించగా, ఆమె భర్త–దర్శకుడు విఘ్నేష్ శివన్ డాక్యుమెంటరీలో వాడిన ఓ క్లిప్పింగ్‌ని సామాజిక మాధ్యమంలో షేర్ చేసి, నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీలో తీసివేయాలంటున్న రూ. పది కోట్ల క్లిప్పింగ్ ఇదే.. ఫ్రీగా చూడండి’’ అంటూ వ్యంగ్య ధోరణిలో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే నటీమణులు అనుపమా పరమేశ్వరన్, నజ్రియా, పార్వతి తదితరులు నయనతార పోస్ట్‌ని లైక్ చేశారు.

\- చెన్నై, సాక్షి ప్రతినిధి

ఓటీటీ ఇది చూడొచ్చు

సెంటిమెంట్... యాక్షన్... థ్రిల్

ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం ‘ల్యాండ్ ఆఫ్ బ్యాడ్’ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



సైనికుడి ప్రయాణం ప్రతి మలుపూ ప్రమాదభరితం అన్న లైన్‌తో ముడిపడి ఉన్న సినిమా ‘ల్యాండ్ ఆఫ్ బ్యాడ్’. అప్పట్లో ప్రపంచ సినీ ప్రేక్షకులను ఉర్రూతలూగించిన యోధుడు గ్లాడియేటర్. ఆ గ్లాడియేటర్ పాత్రధారి రస్సెల్ క్రోవ్ నటించిన సినిమా ఈ ‘ల్యాండ్ ఆఫ్ బ్యాడ్’. ఈ సినిమాని దర్శకులు విలియమ్ యూబ్యాంక్ రూపొందించారు. ‘ల్యాండ్ ఆఫ్ బ్యాడ్’ ప్రైమ్ వీడియో ఓటీటీలో స్ట్రీమ్ అవుతోంది. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే... యూఎస్ డెల్టా ఫోర్స్ ఓ పెద్ద ఆపరేషన్ చేపడుతుంది. సౌత్ ఫిలిప్పీన్స్‌లో తీవ్రవాదులచే బందీగా ఉన్న సీఐఏ (సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ) సిబ్బందిని రక్షించడం ఈ ఆపరేషన్ ముఖ్యోద్దేశం. ఈ ఆపరేషన్‌కు స్టాఫ్ సార్జెంట్‌నియా బ్రాన్సన్ సారథ్యంలో ఓ టీమ్ వెళుతుంది. ఆఖరి నిమిషంలో ఈ టీమ్‌కు కొత్తగా యంగ్ ఎయిర్ ఫోర్స్ ఆఫీసరైన కెన్నీ జాయిన్ అవుతాడు. ఈ కెన్నీయే సినిమాకు కథానాయకుడు. కెన్నీ పాత్రలో వర్ధమాన నటుడు లియామ్ హెమ్స్‌వర్త్ నటించారు. ఇకపోతే ఈ టీమ్‌కు రీపర్ గ్రిమ్ డ్రోన్ సపోర్ట్‌గా వ్యవహరిస్తాడు. ఈ రీపర్ కథలో మరో ముఖ్య పాత్రధారి. రీపర్ పాత్రలో ప్రముఖ నటుడు రస్సెల్ క్రోవ్ నటించి, మెప్పించారు. నాడు గ్లాడియేటర్‌గా నేడు రీపర్‌గా రస్సెల్ క్రోవ్ నటన న భూతో న భవిష్యతి. యూఎస్ డెల్టా ఫోర్స్ టీమ్ ఫిలిప్పీన్స్ ఆపరేషన్ కోసం బయలుదేరడంతో ‘ల్యాండ్ ఆఫ్ బ్యాడ్’ కథ మొదలవుతుంది. టీమ్‌లో కెన్నీ కొత్తవాడవడం, ఆ పై ఇది మొదటి ఆపరేషన్ అవడంతో టీమ్‌లోని మిగతావారు అతన్ని ఆట పట్టిస్తుంటారు. జాగ్రత్తగా వ్యవహరించమని సలహాలిస్తుంటారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా టీమ్‌లోని మిగతా సభ్యులందరూ ఓ సమయంలో గాయపడతారు. ఆపరేషన్‌కి కొత్త అయినా, ఎవరూ తోడు లేకున్నా కెన్నీ తనకున్న ధైర్యంతో రీపర్ సాయంతో ఆపరేషన్ ఎలా ముగించాడన్నదే? ఈ సినిమా కథ. సాధారణంగా టెర్రరిస్ట్ ఎలిమినేషన్ ఆపరేషన్ అంటే గన్ ఫైట్ తప్ప ఇంకేమీ ఉండదని అనుకుంటాం. కానీ సున్నితమైన సెంటిమెంట్ లైన్‌తో గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో ఈ యాక్షన్, థ్రిల్లింగ్ మూవీ ప్రేక్షకుడిని కట్టిపడేస్తుంది. వర్త్ టూ వాచ్ ఫర్ దిస్ వీకెండ్.

\- ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఎస్‌ఐ యుగంధర్ ఆరంభం


మేఘలేఖ, ఆది, సందీప్ కిషన్

ఆది సాయికుమార్ హీరోగా ‘ఎస్‌ఐ యుగంధర్’ సినిమా ఆరంభమైంది. యశ్వంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా మేఘలేఖ, విలన్‌గా రాకేందు మౌళి నటిస్తున్నారు. శ్రీ పినాక మోషన్ పిక్చర్స్ పై ప్రదీప్ జూలూరు నిర్మిస్తున్న ఈ మూవీ హైదరాబాద్‌లో ప్రారంభం అయ్యింది. తొలి సన్నివేశానికి హీరో సందీప్ కిషన్ క్లాప్ ఇవ్వగా, నటుడు సాయికుమార్ స్క్రిప్ట్ అందించారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ– ‘‘కథని నమ్మి ‘ఎస్‌ఐ యుగంధర్’ చేస్తున్నాం. ప్రదీప్‌గారు చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్. ఈ నెల 18న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం’’ అని తెలిపారు. ‘‘2025లో విడుదలయ్యే ‘ఎస్‌ఐ యుగంధర్’ ఆదికి, టీమ్‌కి మంచి సక్సెస్ ఇవ్వాలి’’ అన్నారు సాయికుమార్. ‘‘క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ ఇది’’ అని యశ్వంత్ తెలిపారు. ‘‘వైవిధ్యమైన కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం’’ అన్నారు ప్రదీప్ జూలూరు.

మహేశ్‌బాబుకి ట్రైలర్ బాగా నచ్చింది

\- అర్జున్ జంధ్యాల



‘‘‘దేవకి నందన వాసుదేవ’ సినిమా మంచి భావోద్వేగాలతో కూడిన యాక్షన్ ఎంటర్‌టైనర్. ధర్మం అంటే దేవుడు అనే మాట కూడా ఈ మూవీలో చాలా కీలకం. అలాగే పూర్తి వాణిజ్య అంశాలు ఉంటాయి. మా చిత్రం కుటుంబ ప్రేక్షకులకు అద్భుతంగా నచ్చుతుంది. అలాగే అన్ని వర్గాల ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఉంటుంది’’ అని డైరెక్టర్ అర్జున్ జంధ్యాల తెలిపారు. అశోక్ గల్లా, వారణాసి మానస జంటగా నటించిన చిత్రం ‘దేవకి నందన వాసుదేవ’. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా అర్జున్ జంధ్యాల విలేకరులతో మాట్లాడుతూ– ‘‘‘గుణ 369’ డైరెక్టర్ ప్రశాంత్ వర్మగారికి నచ్చింది. ఆయన రాసిన ‘దేవకి నందన వాసుదేవ’ కథకు నేనైతే న్యాయం చేయగలనని భావించి, దర్శకత్వ బాధ్యతలను నాకు అప్పగించారు. ఫైనల్ సినిమా చూసి సర్‌ప్రైజ్ అయ్యారాయన. అశోక్ గల్లాగారు తన పాత్ర కోసం చాలా కష్టపడ్డారు. మానసది బలమైన పాత్ర. దేవ్ దత్తాగారు కంసరాజ్ పాత్రని అద్భుతంగా చేశారు. సాయి మాధవ్ బుర్రాగారు సినిమాలోని భావోద్వేగాలు, కథకి తగ్గట్టుగా మాటలందించారు. నేపథ్య సంగీతం, మ్యూజిక్‌తో ఈ సినిమాకి ప్రాణం పోశారు భీమ్స్. బాలకృష్ణగారు ఈ కథకి కావల్సినవన్నీ సమకూర్చి గ్రాండ్‌గా నిర్మించారు. హీరో మహేశ్‌బాబుగారికి మా సినిమా ట్రైలర్ బాగా నచ్చింది. ఆయన మా టీమ్‌ని అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు’’ అని తెలిపారు.

ప్రేమలో భిన్న కోణం


హర్ష నర్రా, తేజ సజ్జా

‘‘నిర్మాత బెక్కం వేణుగోపాల్‌గారు ఇప్పటివరకు తీసిన 14 సినిమాల ద్వారా ఎందరో దర్శకులను, రచయితలను, నటీనటులను పరిచయం చేశారు. ‘రోటి కపడా రొమాన్స్’ చిత్రంతోనూ చాలా మంది కొత్త నటీనటులను పరిచయం చేస్తున్నారు. ఆయన్ని చూస్తే ఎంతో స్ఫూర్తిగా ఉంటుంది. ఈ చిత్రం యూనిట్‌కి బ్రేక్ ఇవ్వాలి’’ అని హీరో తేజ సజ్జా అన్నారు. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘ లేఖ, ఖుష్బూ చౌదరి ముఖ్య తారలుగా విక్రమ్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం ‘రోటి కపడా రొమాన్స్’. బెక్కం వేణుగోపాల్, సృజన్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా తేజ సజ్జా, అతిథులుగా దర్శకులు యదు వంశీ, పవన్ సాధినేని, హర్ష, రచయిత కోన వెంకట్, నిర్మాతలు కేఎల్ దామోదర్ ప్రసాద్, చదలవాడ శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. ‘‘నేటి తరం యువతకి, ఫ్యామిలీ ఆడియన్స్‌కి కనెక్ట్ అయ్యేలా మా సినిమా ఉంటుంది’’ అన్నారు విక్రమ్ రెడ్డి. ‘‘ప్రేమకథలో ఓ భిన్నమైన కోణాన్ని దర్శకుడు ఈ చిత్రంలో ఆవిష్కరించాడు’’ అన్నారు బెక్కం వేణుగోపాల్, సృజన్ కుమార్.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



క్రిస్టియన్ మాల/M.Tech, IIT/C.Govt. ఇంజనీర్/ONGC/1.30Lakhs. PM/ 6' ఎత్తు/30 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9908222406 [HA-16472]

హిందూ మాదిగ / M.Tech, IIT / స్టాఫ్ ఇంజనీర్ /MNC / 35 Lakhs. PA / 5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-16472]

కుమ్మరి/కట్న ప్రసక్తి లేదు / M.Tech / C. Govt. మెకానికల్ ఇంజనీర్/ రైల్వేస్/ 80000/-PM/5'10"ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-16472]

పద్మశాలి/ B.Tech / C.Govt. స్టేషన్ మాస్టర్/రైల్వే/72000/-PM/6'ఎత్తు/30 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-16472]

ముదిరాజ్/కట్న ప్రసక్తి లేదు/M.Tech / C. Govt. Tax. Asst./కమర్షియల్ ట్యాక్స్ Dept/ 50,000/-PM/5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-16472]

ఆర్యవైశ్య, కుల పట్టింపు లేదు, 33/ 5'6"/ PG/80 వేలు, 1.5Cr ఆస్తి గల వరునకు ఏదేని చదువుకున్న అందమైన వధువు కావలెను. పెద్దవారైనను సంప్ర డైరెక్ట్ : 8639798537 [H-796700]

మాల వధువుకు 2nd మ్యారేజ్ డాక్టర్ 30yr's/ 5'4"/తగిన వరుడు కావలెను. * మాల వరుడికి 2nd మ్యారేజ్ సాఫ్ట్‌వేర్ 30 yr's/5'9"/40 Lacs తగిన వధువు కావలెను. 9493285326 [H-783361]

కుల, కట్న ప్రసక్తి లేదు. Reddy / 40 సం॥ / B.Tech./ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ / Salary: 1 lakh - P.M. / తగిన వధువు కావలెను. సంప్ర॥ సెల్: 7337586682. [A-1408]

కమ్మ 56 Y / 5'10" / Fair NRI Doctor ఇక్కడే స్థిరపడిన అతనికి ఏ బాదర బందీ లేని అందమైన చదువుకున్న 45 సం॥లోపు ఇంట్లో ఉండిపోయే యువతి కావలెను. CNB. ఫోన్: 8074687749 [V- 1240860]

గవర / డైవర్స్ / జ్యూడియష్యరీ డిపార్ట్‌మెంట్ / 56 Y / 5'7", కుల ప్రసక్తి లేదు, తగిన వధువు కావలెను. ఫోన్ : 70325 93118 [V- 823910]

★

కోమట్ల లేక బి.సి. అమ్మాయి కావలెను. 1, కోమట్ల అబ్బాయి 35 M.Sc, M.Ed ప్రైవేట్ లెక్చరర్ వ్యవసాయం 20 వేలు . ఆస్తి 50 లక్షలు. నల్లగొండ. సెల్ : 9121325068 [Y-798345]

క్రిస్టియన్ మాల 40 6ft Pvt Job వరునికి వధువు కావలెను. కులం, కట్నం పట్టింపు లేదు. విడోవర్స్, డైవర్స్ వారు కూడా కాల్, నో బ్రోకర్స్ జెన్యూన్ పర్సన్స్ కాల్ డైరెక్ట్ : 9505485359 [Y-1145762]

★★

డైరెక్ట్ కాంటాక్ట్: ఆర్యవైశ్య, 46Yrs/5'.5"/ బిజినెస్,జాబ్, 30 కోట్ల స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. (నో బ్రోకర్స్). 7995585722, 9848817137. [T-2386]

రెడ్డి/45/5'5" /గవర్నమెంట్ టీచర్ / M.Sc, M.Ed/ తిరుపతి /2nd మ్యారేజ్ / స్థిరాస్తులు కలిగిన /అందమైన వరుడుకు వధువు కావలెను డైరెక్ట్ నో బ్రోకర్స్ ✆ 89192 95915. [B-1242134]

కులం పట్టింపులేదు 2nd మ్యారేజ్ వయస్సు 50 సం॥లు, 5.8 H, B.Tech., నెలకు జీతం 80,000/-, వరుడికి ఏ బాదరబందీ లేని వధువు కావలెను. ✆ : 77949 11019 [R-1260826]

వరుడు కావలెను



రెడ్డి/విడో(2nd)/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/డిగ్రీ/Age: 35/సొంత బిజినెస్/అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం ఐనా OK) 1st/2nd అన్ని వయస్సుల వారికీ సంబంధాలు కలవు. Ph: 9032596676 [HA-16476]

కాపు /43y/ఫెయిర్/కుల పట్టింపు లేదు/ Govt. ఎంప్లాయ్/80K (PM), వెల్ సెటిల్డ్/2 సొంత ఇల్లులు & బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను. (1st, 2nd మ్యారేజ్ & ఇల్లరికం OK) సంప్ర : 9640133485 [H-796700]

కుల పట్టింపు లేదు /డైవర్సీ/ 35yrs/ Govt ఎంప్లాయ్ 2,50,000/- (PM)/ వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి వరుడు కావలెను. సంప్రదించండి : 9505422536 [H-796700]

రెడ్డి/37yr/5'5"/ ఫెయిర్/కుల పట్టింపు లేదు/ M.Com/Govtఎంప్లాయ్ 80K (PM), వెల్ సెటిల్డ్ అగ్రికల్చర్ ల్యాండ్ & సొంత ఇల్లు కలిగిన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 9133672661 [H-796700]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel- kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/B.Tech/MS/USA/1997/6'/400Cr *1998/6' / 300Cr *1991 / 5'11"/200Cr * 1998/6'/80Cr * Cont : K.C. Reddy- Hyd. Ph: 9347807015/9849321309

Reddy/USA Citizen *1995/5'10"/260K/ 120Cr *1994/5'9"/200Cr *1990/5'11"/ 20Cr * 1982/5'10"/200K/50Cr *Cont: K.C. Reddy - Hyd- Ph: 9849321309

Reddy/ B.Tech / MS/H1 /USA *1997/ 5'9"/60Cr *1995/5'9"/50Cr *1995/5'7"/ 300K/10Cr *1995/ 5'10"/100Cr *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/IIT/B.Tech/ MS *1996/6' *1996/ 6'/ 25Cr *1996/5'7" *1994/5'9" *30Cr *1995/ 5'7" *1994/6'/400K * Cont: K.C. Reddy Mar Bureau-Hyd-Ph: 9849321309

Reddy/BIG Business *B.Tech/MBA/ 1995 /5'7"/2000Cr *1995/ 5'10"/300Cr *1995/ 5'9"/500Cr * Cont. K.C. Reddy - Hyd-Ph: 9347807015/9849321309

Reddy / Business / B.Tech/ 1989/ 6'/ 40Cr *1994/5'11"/100Cr *1996/ 5'11"/ 65Cr *1993/5'7"/50Cr * Cont : K.C. Reddy -Hyd. Ph : 9347807015/9849321309

Reddy/ Business * 1994 / 70Cr *B.Tech/ MBA *1995/6'/150Cr *1994/5'10"/100Cr *1997/ 5'11"/100Cr *1993/5'7"/50Cr * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/ MBBS/ PG *1995 / 5'10"/400Cr *96/ 6'/50Cr *94/5'10"/70Cr *93/5'10"/50Cr *94/5'9"/30Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/USA Doctors/MBBS/MD/ 1992/ 6'/50Cr *1995/5'8"/10Cr *1998/5'8"/50Cr *1989/5'9" *1992/5'11" * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/ Divorcee *B.Tech / MS/MBA * 1990/ 5'9"/230K / 40Cr *1981/5'8"/500Cr *1986/ 5'11"/70L/yr/Hyd *95/5'9"/230K/25Cr * Cont: K.C. Reddy -Hyd. Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/B.Tech / Most Beautiful *1995/ 5'5"/ 100Cr *99/5'7"/100Cr *2000/ 5'5"/ 100Cr *95/5'5"/100Cr *97/5'4"/150Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/ MBA/Most Beautiful *1994/ 5'3"/300Cr *93/5'7"/100Cr *88/5'3"/300Cr *1993/5'3"/500Cr * Cont : K.C. Reddy- Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS/PG *2000/5'6"/100Cr *98/ 5'7"/100Cr *97/5'6"/500Cr *93/5'3"/50Cr *90/5'6"/100Cr *94/5'4"/50Cr * Cont. K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/B.Tech/2002/5'6"/20Cr *94/ 5'4"/ 20Cr *94/5'4"/15Cr *2001/5'3"/ 20Cr *91/ 5'7"/10Cr *94/5'10"/60Cr *97/ 5'5"/ 25Cr * Cont : K.C. Reddy -Hyd-Ph: 9347807015

Reddy/B.Tech / 1995/5'8"/100Cr *91/ 5'4"/10Cr *96/5'7"/50Cr *99/5'8"/15Cr *98/5'5"/50Cr *95/5'3"/50Cr *Cont: K.C. Reddy-Hyd.Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/H1 / USA *1997/ 5'4"/ 100Cr *99/5'6"/100Cr *99/5'7"/100Cr *97/ 5'5"/60Cr *92/5'7"/100Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1/USA *2002/5'6"/20Cr *89/5'6"/30Cr *98/5'4"/10Cr *94/5'4"/10Cr *97/5'5"/10Cr *95/5'5"/15Cr * Cont : K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/BS/ USA/Citizen *1996/5'3"/30Cr *2002/5'7"/50Cr *96/5'6" *99/5'6"/150Cr *1998/5'7" *95/5'7" *97/5'6" *95/5'2" * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Divorcee/B.Tech/1989/5'3"/100Cr *85/5'5"/400Cr *88/5'6"/30Cr *92/5'5"/50Cr *93/5'6"/50Cr *87/5'6"/15Cr *86/5'6"/30Cr * Cont : K.C. Reddy- Hyd-Ph: 9849321309

Reddy/Divorcee /MBBS/PG *1987/ 5'3"/ 15Cr *91/5'2"/40Cr *91/5'4"/10Cr *92/5'3"/ 10Cr *94/5'5" /50Cr *86/5'6"/50Cr * Cont : K.C.Reddy-Hyd. Ph: 9849321309

[D-558]

విశ్వబ్రాహ్మణ/M.Sc /C.Govt.Jr.అకౌంటెంట్/ కస్టమ్స్ Dept/42000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-16472]

SC హిందూ మాల/M.Com/Govt. Asst. స్టాటిస్టికల్ ఆఫీసర్/ MRO/ 60,000/-PM/ 5'4"ఎత్తు/28 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-16472]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 27, 5' 10", Sales Force, 240 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 33, 5' 8", Analyst, 120 K, 10 Crores, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 6', SWE, 10 L P/A, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 31, 5' 8", Analyst, 175 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, MHA, 26, 5' 5", Project Manager, 30 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 28, 5' 5", Manager, 200 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 6", Project Manager, 33 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 6", SWE, 2 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్డిలకు మాత్రమే)
D.V. Koti Reddy
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
98480 11818, 93933 11818

రెడ్డి BE, MS (IIIT), MS, 30, 6' 2", Sr Engineer, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 34, 5' 11", SWE, 350 K, 10 Crores, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 7", Doctor, 30 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (IIT), MBA (IIM), 35, 5' 10", 34 L P/A, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 3", Product Manager, 140 K, 8 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి B Pharm, MSc, 28, 5' 7", 15 L P/A, Hyderabad, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 4", PG Doctor, 25 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, Degree, 33, 5' 5", Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

గౌడ/వెల్ సెటిల్డ్/M.Sc, D.Ed/C.Govt. టీచర్/ కేంద్రీయ విద్యాలయ/55000/-PM/ 5'5"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-16472]

2వ పెళ్ళి/కులప్రసక్తి లేదు/B.Sc/C.Govt. బ్యాంక్ P.O/SBI/60,000/-PM/5'5" ఎత్తు / 29 సం॥ల పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-16472]

రెడ్డి/2nd మ్యారేజ్/(కుల, ఆస్తి) పట్టింపు లేదు/ Age: 32 (జాబ్-వ్యాపారం-మంచి స్థిరాస్తి) గల వధువుకి, వరుడు కావలెను (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1st-2nd సంబంధాలు కలవు. Ph: 9573002847 [HA-16476]

రజక/B.Tech, IIT/C.Govt.Jr. Asst./ పోస్టల్ Dept./40,000/-PM/5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 6305007091 [HA-16472]

రెడ్డి /కుల పట్టింపు లేదు/26y/B.Tech/ 5'4"/ పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. 9133640971 [HA-16473]

ఆర్యవైశ్య/21y&23y&25y&27y&28y&30y&32y&34y&35y&36y&38y&39y&40y&42y&43y&45y&46y&48y&50y/జి.సుబ్రహ్మణ్య గుప్తా "మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [HA-16473]

మాదిగ/ఏకైక కుమార్తె / B.Tech / C. Govt. బ్యాంక్ PO / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా/ 49000/-PM/5'4"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 7780299703 [HA-16473]

2వ పెళ్ళి/ 46Y / Govt. Employee/ 80,000/-PM/సొంత ప్రాపర్టీ గల వధువుకి సెటిల్డ్ వరుడు కావలెను. 50Y వరకు OK. సంప్ర :9848023736 [HA-16473]

యాదవ/డైవర్సీ/49y/Govt. Job/90K PM/Own Business, Own House Rents/2L PM/30 ఎ॥ ల్యాండ్ గల అందమైన ఏకైక వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. Ph: 7702043224 [HA-16476]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 37/ B.Com/Private Job కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం అయినా OK) All Cast marriages Available. Ph: 7729931358 [HA-16476]

రెడ్డి/విడో/50Y/ప్రైవేట్/Andhra/Hyd lo సొంత అపార్ట్‌మెంట్స్/సొంత Shops/ రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను (అర్జెంట్) (నో బ్రోకర్స్) (ఇల్లరికం OK) ఫోన్ : 7799083500, 7386660643 [H-796700]

కమ్మ/50Y /విడో / Govt.పెన్షనర్ / సొంత ఇల్లు /మార్బుల్ షో రూం/53 Acres/ Land/10 Lac Income గల వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7075194750 [H-783507]

గౌడ/50Y/ విడో /5'4" /Govt.Job/80,000/-PM/సొంత ఇల్లు & రెంట్స్/50K/PM/ఆస్తి, కుల పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను. పిల్లలు లేరు. Ph: 8309789736 [H-783507]

యాదవ/50Y/విడో/డిగ్రీ/VRS/ సొంత ఇల్లు/6 ఎకరాల పొలం గల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9705499686 [H-783507]

రెడ్డి/కమ్మ/49Y/విడో/5'5"/Govt(HM) Rtd/ సొంత ఇల్లు & రెంట్స్/ఆంధ్రాలో 28 ఎకరాల పండ్ల తోటలు, బిజినెస్ ఏ బాదరబందీలేని వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 7093717220 [H-783507]

2వ పెళ్ళి/3,00,000 PM/40years గల బాగా స్థిరపడి, కోట్ల ప్రాపర్టీ కల్గిన అందమైన వధువుకి, అందమైన అబ్బాయి కావలెను. కుల ప్రసక్తి లేదు. No Caste Feeling, No Asset's Feeling. ఇల్లరికం పిల్లలున్నా OK. Cell: 9381696641 [H-783603]

★★

కుల పట్టింపు లేదు /విడో/50Y/గుంటూరు లెక్చరర్ Own House (Rents)/Well Settled పిల్లలు పుట్టే అవకాశంలేని ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను (పిల్లలున్నా OK) Ph: 7997175138 [H-782789]

వేదికలు



కావ్య మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ లేట్ మ్యారేజస్, డైవర్స్, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి త్వరగా కుదుర్చబడును. (స్త్రీలకు ఫ్రీ) Ph: 7702526428 [HA-16476]

రజక/ డాక్టర్స్, ఇంజనీర్స్, లాయర్స్, ఇండియా, అబ్రాడ్, గవర్నమెంట్ జాబ్ వధూ వరుల వివాహ సంబంధాలకై సంప్ర॥ కోట్ల శ్రీనివాస్. Ph: 9391265304/8106303155 [H-783507]

మాల మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt.ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-16473]

Arya Vysya, Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles with Free Registration Ph: 8522047149/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16477]

Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles with Free Registration Ph: 8522047149/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16477]

Padmashali, Viswabrahmin, Yadava పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles with Free Registration Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16477]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles with Free Registration Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16477]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles with Free Registration Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-16477]

కాపు/మున్నూరు కాపు వధూవరుల స్వయంవరం Free Register 15/Dec/2024న కమలానగర్ వెల్ఫేర్ ఆఫీస్, ECIL, Hyderabad నందు. Ph: 9704656103, 9533608887 Whatsapp [HA-1194]

డాక్టర్స్ స్పెషలిస్ట్-MBBS, MD, DM, BDS, BAMS, BHMS, B.V.Sc అన్ని కులములకు, అన్ని ప్రాంతాలకు పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, ✆ 7093722724. [T-3202]

పద్మశాలి, 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్స్ వధువు, వరుడులకు మంచి సంబంధాలను కుదర్చగలం. 14సం॥ అనుభవం. భవిష్య మ్యాట్రిమోని.✆ 9381050979 / 6301887929 [G-801096]

★

Free Registration: బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1164]

చంద్రుడు మన మామ కాదా?

'చందమామ రావే.. జాబిల్లి రావే..', 'మామా.. చందమామా..' అని పాటలున్నాయి. 'కార్తీక పున్నమి వేళలోనా..' అంటూ గీతాలూ ఉన్నాయి.. చంద్రుడి వెన్నెల తగలగానే రూపమే మారిపోయే జానపద కథలు మరెన్నో ఉన్నాయి.. ఏ దేశం, ఏ సంస్కృతి అనే తేడా లేకుండా చంద్రుడు మనందరికీ అంత దగ్గరైపోయాడు. కానీ చంద్రుడు మనవాడు కాదని, అంతరిక్షంలో తిరుగుతూ ఉంటే.. భూమి లాగేసి పట్టేసుకుందని శాస్త్రవేత్తలు కొత్త సిద్ధాంతాన్ని వెలుగులోకి తెచ్చారు. దీన్ని బలపర్చే పలు ఆధారాలనూ చూపుతున్నారు. చంద్రుడు ఎక్కడివాడు? భూమికి ఎలా దొరికిపోయాడు? ఆ సిద్ధాంతం ఏం చెబుతోంది? దానికి ప్రాతిపదిక ఏమిటనే వివరాలు తెలుసుకుందామా..





భూమి నుంచి ఏర్పడిందనే అంచనాతో..

చందమామ మన భూమి నుంచే ఏర్పడిందనేది ఇప్పటివరకు ఉన్న సిద్ధాంతం. దాని ప్రకారం.. సూర్యుడు, ఇతర గ్రహాలు ఏర్పడిన కొత్తలో.. అంగారకుడి పరిమాణంలో ఉన్న 'థియా'అనే గ్రహం భూమిని ఢీకొట్టిందని, అప్పుడు భూమి నుంచి అంతరిక్షంలోకి విసిరివేయబడిన శకలాలు ఒకచోట చేరి చంద్రుడు రూపుదిద్దుకున్నాడు. భూమి గురుత్వాకర్షణ వల్ల గ్రహం చుట్టూ పరిభ్రమిస్తున్నాడు. ఇప్పటివరకు ఈ సిద్ధాంతాన్ని అందరూ విశ్వసిస్తున్నా.. ఎన్నో సందేహాలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలోనే అమెరికాలోని పెన్ స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు.. ఓ 'బైనరీ గ్రహాల జంట'లో భాగమైన చంద్రుడిని భూమి లాగేసుకుని ఉంటుందని కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

ఎక్కడి నుంచో భూమి లాగేసుకుందా?


చందమామ మిస్టరీలు ఎన్నో..

నాసా శాస్త్రవేత్తలు చంద్రుడిపై నుంచి తెచ్చిన సుమారు 363 కిలోల రాళ్లు, మట్టిపై పరిశోధనలు చేశారు. ఆ రాళ్లు, మట్టిలో ఉన్న రసాయన సమ్మేళనాలలో కొన్ని భూమ్మీది తరహాలోనే ఉండగా.. మరికొన్ని చాలా విభిన్నంగా ఉన్నట్టు గుర్తించారు. భూమి నుంచే చంద్రుడు ఏర్పడితే.. ఆ రసాయన సమ్మేళనాలు ఎక్కడివనే సందేహాలు ఉన్నాయి. మరో గ్రహం భూమిని ఢీకొట్టడంతో అంతరిక్షంలోకి ఎగిసిపడిన పదార్థాలన్నీ కాలక్రమేణా ఒకచోటికి చేరి చంద్రుడు ఏర్పడినట్టు పాత సిద్ధాంతం చెబుతోంది. కానీ అలా ఎగిసిపడిన పదార్థాలు.. శని చుట్టూ ఉన్న వలయాల తరహాలో భూమి మధ్య భాగానికి ఎగువన (భూమధ్య రేఖ ప్రాంతంలో) కేంద్రీకృతం కావాలని... అవన్నీ కలిసిపోయినప్పుడు చంద్రుడు కూడా భూమధ్య రేఖకు ఎగువనే ఉండాలని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. కానీ చంద్రుడు భూమధ్య రేఖ కన్నా ఏడు డిగ్రీలు ఎగువన, వంపు తిరిగిన కక్ష్యలో పరిభ్రమిస్తున్నాడు.



నెప్ట్యూన్ ఉపగ్రహం ట్రిటాన్.. అలా లాగేసుకున్నదే!

మన సౌర కుటుంబంలోనే అలాంటివి ఎన్నోసార్లు జరిగాయని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన శాస్త్రవేత్త డారెన్ విలియమ్స్ తెలిపారు. "ఉదాహరణకు నెప్ట్యూన్ గ్రహానికి ఉన్న ఉపగ్రహాల్లో అతి పెద్దదైన 'ట్రిటాన్'కూడా ఒకప్పుడు బైనరీ వ్యవస్థలో భాగమే. నెప్ట్యూన్ తనకు దగ్గరగా ఆ వ్యవస్థ వచ్చినప్పుడు.. ట్రిటాన్‌ను లాగేసుకుందని ఇప్పటికే గుర్తించారు. అంతేకాదు ట్రిటాన్ ఉపగ్రహం నెప్ట్యూన్ చుట్టూ.. దాని మధ్యరేఖ ఎగువన కాకుండా, 67 డిగ్రీలు వంపు తిరిగిన కక్ష్యలో పరిభ్రమిస్తోంది. మన చంద్రుడు కూడా అలా వంపు తిరిగిన కక్ష్యలోనే పరిభ్రమిస్తున్నాడు. చంద్రుడిని భూమి లాగేసుకుందనే దానికి ఇదొక ఆధారం.."అని డారెన్ విలియమ్స్ వెల్లడించారు.



మరో తోడు నుంచి చంద్రుడిని లాగేసుకుని..

సౌర కుటుంబంలో, అంతరిక్షంలో అక్కడక్కడా 'బైనరీ' వ్యవస్థలు ఉంటాయి. అంటే కొంచెం అటూ ఇటుగా సమాన పరిమాణం ఉన్న ఖగోళ పదార్థాలు (ఆస్టరాయిడ్లు, గ్రహాల వంటివి..) రెండూ ఒకదాని చుట్టూ మరొకటి తిరుగుతూ ఉంటాయి. అదే సమయంలో ఆ రెండూ కలసి.. ఏదైనా నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తుంటాయి. అలాంటి బైనరీ వ్యవస్థలో చంద్రుడు భాగమని కొత్త సిద్ధాంతం చెబుతోంది. ఆ బైనరీ మరుగుజ్జు గ్రహాలు భూమికి సమీపం నుంచి వెళ్లినప్పుడు.. అందులోని చంద్రుడిని భూమి గురుత్వాకర్షణ శక్తితో లాగేసుకుందని, రెండో మరుగుజ్జు గ్రహం అంతరిక్షంలోకి విసిరివేయబడిందని పేర్కొంటోంది.

కొత్త సిద్ధాంతం సందేహాలను తీర్చుతోందా?

"బైనరీ వ్యవస్థ నుంచి లాగేసుకున్న గ్రహాలు/ ఆస్టరాయిడ్లు దీర్ఘవృత్తాకార కక్ష్యలో తిరగాలి.. లాక్కున్న గ్రహం నుంచి మెల్లగా దూరంకావాలి.. అనే రూల్స్ కూడా ఉన్నాయి. వాటిని మా సిద్ధాంతం బలపరుస్తోంది.."అని శాస్త్రవేత్త విలియమ్స్ తెలిపారు. మొదట్లో చంద్రుడు దీర్ఘవృత్తాకార కక్ష్యలోనే తిరిగేవాడని.. అయితే భూమి టైడల్ ఫోర్స్ వల్ల మెల్లగా వృత్తాకార కక్ష్యకు చేరాడని వివరించారు. ఆ ఫోర్స్ వల్లే చంద్రుడి ఒకవైపు భాగం ఎప్పుడూ భూమివైపే ఉండేలా..'టైడల్ లాక్'అయిందని తెలిపారు. అంతేకాదు చంద్రుడు సగటున ఏటా మూడు సెంటీమీటర్ల మేర భూమి నుంచి దూరంగా జరుగుతున్నాడని గుర్తు చేశారు.

అలా లాగేసుకోవడం సాధ్యమేనా?




విశ్వంలో బైనరీ వ్యవస్థలు ఉండటం, అప్పుడప్పుడూ అలాంటి వాటిలోంచి ఒకదానిని పెద్ద గ్రహాలు, నక్షత్రాల వంటివి లాక్కోవడం సాధారణమేనని శాస్త్రవేత్తలు ఎప్పుడో గుర్తించారు. దీనికి 'బైనరీ ఎక్స్ఛేంజ్ క్యాప్చర్'గా పేరుపెట్టారు. ఇలా బైనరీ వ్యవస్థ నుంచి ఒకదాన్ని లాక్కున్నప్పుడు.. రెండో గ్రహం/ఆస్టరాయిడ్ వేగంగా విసిరివేసినట్టుగా వెళ్లిపోతుంది.

ఎవరేం సిద్ధాంతాలు తెస్తేనేం? ఎప్పుడో కోట్ల ఏళ్లనాటి మాట అది. ఏది కరెక్టో, ఏదికాదో కాదుగానీ.. మనుషులు పుట్టేనాటికే చంద్రుడు ఇక్కడే ఉన్నాడు. అంటే మన మామ చందమామే!

- సాక్షి, సెంట్రల్ డెస్క్

టుడేస్ గ్రాఫిక్



ప్రపంచవ్యాప్తంగా 24 ప్రధాన దేశాల్లో ప్రజారోగ్యం తీరుతెన్నులపై గ్రేట్ పవర్స్ ఇండెక్స్-2024 పేరిట ఇటీవల ఓ అధ్యయనం జరిగింది. ప్రజల ఆయుర్దాయం, శిశు మరణాల రేటు, దీర్ఘకాలిక వ్యాధులు, ఆత్మహత్యల శాతం, కాలుష్యం బారిన పడిన వారి శాతం తదితర అంశాల ప్రాతిపదికగా ఆయా దేశాల్లో ప్రజారోగ్యాన్ని అంచనా వేసింది. దీని ఆధారంగా ఈ ఏడాది అత్యంత ఆరోగ్యవంతమైన టాప్-10 దేశాల జాబితా విడుదలైంది. ఈ జాబితాలో 2.45 స్కోర్‌తో సింగపూర్ తొలిస్థానంలో నిలవగా మైనస్ 1.41 స్కోర్‌తో భారత్ 23వ స్థానంలో నిలిచింది.

- సాక్షి, సెంట్రల్ డెస్క్

విమానాలకు కొనసాగుతున్న బాంబు బెదిరింపులు

- తనిఖీలపై అసహనంతో బాంబు ఉందన్న ప్రయాణికుడు
- శంషాబాద్‌లో ఎమర్జెన్సీ ప్రకటించి విమానాన్ని తనిఖీ చేసిన అధికారులు.. బ్యాంకాక్ వెళ్లే నోక్ ఎయిర్ విమానంలో ఘటన

శంషాబాద్: విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఓ ప్రయాణికుడు అసహనంతో అధికారులతో చేసిన వ్యాఖ్యలు అత్యవసర పరిస్థితి ప్రకటించడానికి దారి తీశాయి. విమానాన్ని నిలిపివేసి తనిఖీ చేయాల్సి వచ్చింది. నోక్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన డీడీ-959 విమానం శంషాబాద్ విమానాశ్రయం నుంచి శుక్రవారం రాత్రి ఒంటి గంట సమయంలో బ్యాంకాక్‌లోని డాన్‌మాంగ్ విమానాశ్రయానికి బయలుదేరేందుకు సిద్ధమైంది. మరికాసేపట్లో టేకాఫ్ తీసుకుంటుందనగా తనిఖీల సమయంలో ఓ ప్రయాణికుడు అధికారులతో వాగ్వాదానికి దిగాడు. 'అంతగా ఎందుకు తనిఖీలు చేస్తున్నారు. నా వద్ద ఏమైనా బాంబు ఉందా?'అంటూ ప్రశ్నించాడు. మరికాసేపటి తర్వాత 'అవును నిజంగానే బాంబు ఉంది. తనిఖీ చేసుకోండి' అంటూ సవాలు విసిరినట్లుగా మాట్లాడాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే అత్యవసర పరిస్థితిని ప్రకటించి రాత్రి 1.20 నుంచి 2.30 గంటల వరకు ప్రయాణికులందరినీ కిందికి దించి విమానాన్ని తనిఖీ చేయడంతో పాటు అందరి లగేజీలు సైతం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డాగ్ స్క్వాడ్‌తో కూడా తనిఖీలు చేపట్టారు. మొత్తం మీద ఎలాంటి బాంబు లేదని నిర్ధారించుకున్నారు. విమానంలో పైలట్, సిబ్బంది ప్రయాణికులందరూ కలిపి 187 మంది ఉన్నారు. బెదిరింపునకు పాల్పడిన వ్యక్తిని సీఐఎస్ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అతడి పాస్‌పోర్టుపై విజయవాడ చిరునామా ఉన్నట్లు సమాచారం.



క్లుప్తంగా...

నటి కస్తూరి అరెస్టు

పుప్పాలగూడలో అరెస్టు చేసిన చెన్నై పోలీసులు



మణికొండ (హైదరాబాద్): టాలీవుడ్ నటి కస్తూరిని శనివారం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చెన్నై పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధి పుప్పాలగూడ టీఆర్‌సీ అపార్ట్‌మెంట్‌లోని బంధువుల ఇంట్లో ఉంటున్న ఆమెను చెన్నై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల కస్తూరి హిందూ మక్కల్ కట్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఆమె వ్యాఖ్యలపై తమిళనాడుతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దీంతో కస్తూరిపై తమిళనాడులోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. అప్పటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిన ఆమె హైదరాబాద్‌లోని పుప్పాలగూడలో ఉంటున్నారు. తెలుగు వారిని దూషించి.. తెలుగు రాష్ట్రంలోనే తలదాచుకున్న కస్తూరిని ఎట్టకేలకు చెన్నై పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఆమె అరెస్టును నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ధ్రువీకరించారు.

28 వరకు పీజీ కోర్సుల స్పాట్ అడ్మిషన్లు

టీజీసీపీజీఈటీ- 2024 కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలోని కళాశాలల్లో ఈ నెల 28 వరకు మిగిలిన 20 వేల సీట్లలో ప్రవేశానికి కౌన్సెలింగ్ జరగనుందని టీజీసీపీజీఈటీ-2024 కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి శనివారం తెలిపారు. వర్సిటీల పరిధిలోని జిల్లా పీజీ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఇతర పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టీజీసీపీజీఈటీ-2024 ప్రవేశ పరీక్షకు హాజరుకాని విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రతిభ ఆధారంగా సీట్లను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడాలని సూచించారు.

జోస్ ఆలుక్కాస్ బంపర్ ప్రైజ్ విజేతలు వీరే

త్రిస్సూర్: భారతదేశంలో అగ్రగామి ఆభరణాల రిటైల్ సంస్థ జోస్ ఆలుక్కాస్ తమ 60వ వార్షికోత్సవాల్లో భాగంగా, ఆరు ఎంజీ ఆస్టర్ కార్లు, గృహోపకరణాలు, బంగారు నాణేలతో సహా మెగా బహుమతులను గెలుచుకున్న అదృష్టవంతుల వివరాలను ప్రకటించింది. ఎంజీ ఆస్టర్ కార్లను గెలుచుకున్న లక్కీ విజేతల్లో వెట్టికుళమ్‌కు చెందిన అబ్దుల్ అజీజ్, విశాఖపట్నానికి చెందిన బేగమ్, హైదరాబాద్‌కు చెందిన కె.ఎస్.దుర్గాప్రసాద్, మంజేశ్వరకు చెందిన ఎం.లోకేశ్ రాయ్ ఉన్నారని పేర్కొన్నారు. స్లోగన్ పోటీలో పుదుక్కోట్టైకి చెందిన భారతీదాసన్, హోసూర్‌కు చెందిన బాలమురుగన్ ఎంఎస్ విజేతలుగా నిలిచినట్టు తెలిపారు.

సామాజిక న్యాయంపై నల్సార్ ప్రత్యేక దృష్టి

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

శామీర్‌పేట్: అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం చేకూర్చేందుకు నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం ప్రత్యేక దృష్టి సారించిందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. శామీర్‌పేట్‌లోని నల్సార్ వర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవంలో డిస్టెన్స్ లెర్నింగ్ ప్రోగ్రాం పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా పట్టాలను సీజే ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1989 నుంచి దూరవిద్య క్రమంగా పెరుగుతోందని, ఈ రంగంలో నల్సార్ తనదైన పాత్ర పోషిస్తోందన్నారు. నల్సార్ ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో విద్యార్థుల నమోదులో 50 శాతం మహిళలు ఉన్నారని వివరించారు. సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వారా భారత రాజ్యాంగంపై తెలుగులో ప్రాథమిక కోర్సును ప్రారంభించడాన్ని అభినందించారు. స్నాతకోత్సవంలో 1,256 మంది విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ కృష్ణదేవరావు, ప్రొఫెసర్ వాసంతి, విద్యార్థులు పాల్గొన్నారు.




పట్టాలు పొందిన విద్యార్థులతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

పరువు నష్టం కలిగించే పోస్టులు తొలగించండి

యూట్యూబ్‌కు హైకోర్టు ఆదేశం

- వేధింపులకు పాల్పడేలా వీడియోలు ఉండొద్దు
- అలాంటివి అప్‌లోడ్ చేయకుండా చూడండి



సాక్షి, హైదరాబాద్: వ్యక్తిగత హక్కులకు భంగం వాటిల్లే వీడియోలను అప్‌లోడ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని యూట్యూబ్‌ను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ల పరువుకు నష్టం కలిగించే పోస్టులు తొలగించాలని స్పష్టం చేసింది. వ్యక్తిగత వేధింపులకు పాల్పడే వీడియోలు పెట్టడం తగదని మందలించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద హామీ ఇచ్చిన విధంగా ఏ పౌరుడినీ వేధించే కంటెంట్ ఉండకూడదని తేల్చిచెప్పింది. 'మీమాంస విక్టిమ్స్'పేరుతో అనధికారిక ప్రతివాదులు పిటిషనర్లపై పెట్టిన వీడియోలు, ఫొటోలు, ఆడియో సందేశాలను వెంటనే బ్లాక్ చేయాలని యూట్యూబ్‌కు చెప్పింది. అలాగే పిటిషనర్ల పరువుకు నష్టం కలిగించే పోస్టు యూట్యూబ్‌లో పెట్టవద్దని ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేసింది. తమ పరువుకు నష్టం కలిగించేలా ఉన్న వీడియోలు, ఫొటోలు, ఆడియో సందేశాలు యూట్యూబ్ నుంచి తొలగించేలా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కోకాపేట్‌కు చెందిన ఎం.శివకుమార్, మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్‌వీ శ్రావణ్‌కుమార్ విచారణ చేపట్టారు.

కావాలనే పోస్టులు పెట్టారు..

పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న శివకుమార్ సూచన మేరకు మురళీకృష్ణ, సమత రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టి లాభం పొందారు. ఈ క్రమంలోనే శివకుమార్ తమ నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నారంటూ మురళి, సమతతోపాటు మరికొందరు క్రిమినల్ కేసు పెట్టారు. ఈ కేసు ట్రయల్ కోర్టు వద్ద పెండింగ్‌లో ఉంది. 'మీమాంస విక్టిమ్స్'పేరుతో యూట్యూబ్ చానల్ సృష్టించిన మురళి, సమత.. శివ, అతని కుటుంబసభ్యుల ఫొటోలతో పరువు నష్టం కలిగించేలా నిరాధార ఆరోపణలతో 51 వీడియోలు, ఆడియోలు పోస్టు చేశారు. ఈ వేధింపులు భరించలేక శివ భార్య ఆత్మహత్యకు యత్నించింది. ఈ పోస్టులను తొలగించాలని యూట్యూబ్‌కు మెయిల్ పంపినా స్పందన లేదు. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు' అని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఆ వివాదంపై వీడియోలు పెట్టడాన్ని తప్పుబట్టారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ ముఖ్య కార్యదర్శి, యూట్యూబ్, ఎ.మురళీకృష్ణ, సమతా శ్యామలకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణ డిసెంబర్ 4లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు.

23న నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగ అర్హత పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్‌నర్స్) ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఈ నెల 23న అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సభ్య కార్యదర్శి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో నిర్వహించే ఈ పరీక్షలు రెండు సెషన్లలో జరుగుతాయని, మొదటి సెషన్ ఉదయం 9 గంటల నుంచి 10.20 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 12.40 నుంచి 2 గంటల వరకు జరుగుతుందని వివరించారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుంచే కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తారని, పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందు గేట్లు మూసివేస్తారని తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించరని వివరించారు. అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాన్ని సందర్శించాలని, పరీక్ష రోజు గంటన్నర ముందే అక్కడికి చేరుకోవాలన్నారు. పరీక్ష వ్యవధి 80 నిమిషాలు ఉంటుందన్నారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్‌లో మాక్‌టెస్ట్ నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు.

జపాన్‌లో సెమీస్కిల్డ్ కొలువులకు దరఖాస్తులు



సాక్షి, హైదరాబాద్: జపాన్‌లో ఆటోమోటివ్ టెక్నీషియన్లు, సెమీకండక్టర్ ఇంజనీర్లు, ఆటోమొబైల్ సర్వీసెస్, కస్టమర్ అసోసియేట్లకు అధిక డిమాండ్ ఉందని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) తెలిపింది. జపాన్‌లో ఈ ఉద్యోగాల్లో పనిచేసేందుకు అర్హత, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్ ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ మెషినరీలో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేట్ లేదా ఇంజనీరింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, వారి వయసు 30 ఏళ్లలోపు ఉండాలని టామ్‌కామ్ స్పష్టం చేసింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటా లేదా రెజ్యూమ్‌ను tomcom.resume@gmail.com ఈమెయిల్ చేయాలని, మరిన్ని వివరాలకు టామ్‌కామ్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది. అభ్యర్థులు 9440048590, 94400 51452 ఫోన్ నంబర్లలో కూడా సంప్రదించవచ్చని వివరించింది.

టీజీసెట్-2024 ఫలితాల విడుదల

26,294 మందిలో 1,884 మందికి అర్హత



ఉస్మానియా యూనివర్సిటీ: అధ్యాపక ఉద్యోగాల అర్హత పరీక్ష తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్-2024 (టీజీసెట్-2024) ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ శనివారం విడుదల చేశారు. ఫలితాలను http://telanganaset.org అనే వెబ్‌సైట్లో చూడవచ్చు. గత సెప్టెంబర్‌లో జరిగిన పరీక్షకు 26,294 మంది అభ్యర్థులు హాజరుకాగా 1,884 మంది (7.17 శాతం) అర్హత సాధించారు. అందులో 50.21 శాతం పురుషులు కాగా 49 శాతం మహిళలున్నారు. అర్హులైన అభ్యర్థుల సర్టిఫికెట్లను త్వరలో పరిశీలించనున్నట్టు అధికారులు తెలిపారు.

భారతీయుల చూపు ఆస్ట్రేలియా వైపు!



మా దేశంలో అపార విద్య, ఉద్యోగావకాశాలు

పోస్ట్ స్టడీ వర్క్‌లో ఇండియన్స్‌కు అదనపు చాన్స్



ఆస్ట్రేలియా వర్సిటీల్లో అత్యుత్తమ విద్య

ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కోర్సులకు ప్రాధాన్యం

ఆస్ట్రేలియా ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ కమిషనర్ విక్ సింగ్

సాక్షి, హైదరాబాద్: ఖలిస్తానీ వేర్పాటువాదుల కారణంగా ఇటీవల కెనడాతో భారత్ సంబంధాలు దెబ్బతినటంతో ఆ దేశానికి ఉద్యోగాల కోసం, ఉన్నత విద్యకోసం వెళ్లాలని భావించిన భారతీయులు పునరాలోచనలో పడ్డారు. కెనడాలో ఉద్యోగావకాశాలు కూడా తగ్గిపోవటంతో మరో సురక్షితమైన, అపార అవకాశాలు ఉన్న దేశం కోసం చూస్తున్నారు. అలాంటివారికి ఇప్పుడు ఆస్ట్రేలియా అవకాశాల గనిలా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు, ఉద్యోగార్థులకు తమ దేశంలో మంచి అవకాశాలు ఉన్నాయని ఆస్ట్రేలియా ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ కమిషనర్ విక్ సింగ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఫెస్టివల్ ఆఫ్ ఆస్ట్రేలియా'లో పాల్గొనేందుకు వచ్చిన సింగ్.. ఆస్ట్రేలియాలో ఇక్కడి విద్యార్థులకు ఉన్న అవకాశాల గురించి 'సాక్షి'కి వివరించారు.

పోస్ట్ స్టడీ వర్క్ చేసుకునే వీలు..

కోర్సు పూర్తి చేసిన తర్వాత ఆస్ట్రేలియాలో పోస్ట్ స్టడీ వర్క్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని, ఇందుకోసం ప్రత్యేకంగా వీసా జారీ చేస్తున్నామని విక్ సింగ్ చెప్పారు. వేరే దేశాలవారికి రెండున్నరేళ్ల పాటు పనిచేసుకునే వీలు కల్పిస్తుండగా, భారతీయ విద్యార్థులకు అదనంగా మరో ఏడాది పాటు ఉద్యోగం చేసుకునే అవకాశం కల్పించామని వివరించారు. ఇరు దేశాల మధ్య ఎక్టా ద్వైపాక్షిక ఒప్పందం నేపథ్యంలో ఈ అవకాశం ఇచ్చామని తెలిపారు. చదువుకునే సమయంలో పార్ట్‌టైం ఉద్యోగాలు చేసుకునే వెసులుబాటు ఉందని చెప్పారు. ఇరు దేశాల మధ్య స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్ ఉన్నాయని గుర్తుచేశారు. పర్యాటకులకు కూడా అద్భుతమైన అనుభూతి కల్పించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

ఆస్ట్రేలియాలో చదువుకోవాలనుకునే విదేశీ విద్యార్థులకు తమ ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించేందుకు సానుకూలంగా ఉందని విక్ సింగ్ తెలిపారు. చదువు పూర్తయిన తర్వాత అద్భుతమైన ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నామని చెప్పారు. 'సైన్స్, మ్యాథ్స్, ఇంజనీరింగ్, బిజినెస్, హెల్త్ రంగాలతోపాటు క్వాంటమ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి వినూత్న కోర్సులు చదివేందుకు భారతీయ విద్యార్థులు ఆస్ట్రేలియాకు వస్తుంటారు. మా దేశంలోని 43 యూనివర్సిటీల్లో దాదాపు సగం వరకు వరల్డ్ టాప్ 200 జాబితాలో ఉన్నాయి. టాప్ 100 జాబితాలో 9, టాప్ 20 జాబితాలో మూడు ఆస్ట్రేలియా వర్సిటీలు ఉన్నాయి. నవకల్పనల్లో (ఇన్నోవేషన్) ఆస్ట్రేలియా ఎప్పుడూ ముందంజలో ఉంటుంది. ఇప్పుడు మనమంతా వాడుతున్న వైఫైని ఆస్ట్రేలియాలోనే కనిపెట్టారు. ఆస్ట్రేలియా వర్సిటీల్లో చదివిన విద్యార్థులకు ప్రపంచంలో ఎక్కడైనా మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మా దేశంలో స్కూల్ స్థాయి నుంచే ఏఐని వినియోగిస్తున్నాం'అని వివరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

దండకారణ్యంపై దండయాత్ర


ఏర్పాటు చేసిన బంకర్

పట్టు సాధించిన భద్రతా దళాలు

- కొండపల్లిలో క్యాంప్ ఏర్పాటు
- ఇప్పటికే పూవర్తి, పామేడు, గుండంలలో క్యాంప్‌లు
- ధర్మారం వద్ద అందుబాటులోకి కీలక వంతెన
- కీలక స్థావరాలు కోల్పోతున్న మావోయిస్టులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

సంయుక్త భద్రతా దళాలు, పోలీసులు కలిసి దూకుడుగా చేపడుతున్న జాయింట్ ఆపరేషన్లతో ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో ఒక్కొక్క కీలక స్థావరాన్ని మావోయిస్టు పార్టీ కోల్పోతోంది. దీంతో ఈ ఏడాది చివరికల్లా దండకారణ్యంపై పోలీసులు పూర్తి పట్టు సాధించే అవకాశం కనిపిస్తోంది.

కొండపల్లిలోనూ క్యాంప్

మూడేళ్లుగా ఆరు కిలోమీటర్లకు ఒకటి చొప్పున భద్రతా దళాలు క్యాంప్‌లు ఏర్పాటు చేస్తూ మావోయిస్టులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది ఆరంభంలో ఇటు బీజాపూర్ జిల్లాలోని గుండం, నంబి, పామేడు (ధర్మారం)లో, అటు మావోయిస్టు కీలకనేత హిడ్మా సొంతూరైన సుక్మా జిల్లా పూవర్తిలలో క్యాంపులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ నాలుగు ప్రదేశాల నడుమ కొండపల్లి, కవరుగట్ట, మీనగట్ట, జబ్బగట్ట, రాంపూర్, భీమవరంపాడు, ఉడతమల్ల ప్రాంతాలు పూర్తిగా మావోయిస్టుల ఆధీనంలో ఉన్నాయి. ఇప్పుడు కొండపల్లిలో క్యాంపు ఏర్పాటు చేయడంతో.. ఈ ప్రాంతం కూడా పోలీసుల ఆధీనంలోకి వెళ్లనుంది.

మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో..

బస్తర్ రీజియన్‌లోని అటవీ ప్రాంతాన్ని ప్రధానంగా అబూజ్‌మడ్, దండకారణ్యంగా పేర్కొంటారు. అబూజ్‌మడ్‌తో పోల్చితే సుక్మా, బీజాపూర్, దంతెవాడ, బస్తర్ జిల్లాల్లో విస్తరించిన దండకారణ్యంలోనే జనసాంద్రత ఎక్కువ. ఇక్కడే మావోయిస్టులు జనతన సర్కార్ పేరుతో సమాంతర పాలన సాగించారు. మరోవైపు నారాయణపూర్, కాంకేర్, కొండెగావ్, బీజాపూర్, గడ్చిరోలి జిల్లాల్లో విస్తరించిన ఎత్తయిన కొండలు, దట్టమైన అడవులతో ఉండే అబూజ్‌మడ్‌ను.. అగ్రనాయకత్వం ఉండేందుకు వీలుగా షెల్టర్ జోన్‌గా మార్చుకున్నారు. కానీ ఆపరేషన్ గ్రీన్ హంట్ మొదలైన తర్వాత.. దండకారణ్యంలో ఒక్కొక్క ప్రాంతంపై పట్టు కోల్పోతూ సుక్మా, బీజాపూర్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలకే మావోయిస్టులు పరిమితమయ్యారు.

అబూజ్‌మడ్ పైనా దృష్టి..



భద్రతా దళాల దూకుడు కారణంగా షెల్టర్‌జోన్‌గా ఉన్న అబూజ్‌మడ్‌లోనూ మావోయిస్టులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన ఎదురుకాల్పుల్లో 197 మంది మావోయిస్టులు మరణించగా.. అందులో 100కు పైగా అబూజ్‌మడ్‌వే కావడం గమనార్హం. 2026 మార్చి నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి ప్రకటించారు. 2025 మార్చి నుంచి 2026 మార్చి వరకు అబూజ్‌మడ్ ప్రాంతాన్ని ఆధీనంలోకి తెచ్చుకోవాలనేది ప్రభుత్వ బలగాల వ్యూహంగా ఉంది.

తెలంగాణ వైపు నుంచి..

తెలంగాణ సరిహద్దుగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి కొండపల్లి ప్రాంతానికి వెళ్లేందుకు పామేడు (బీజాపూర్)లో చింతవాగు ప్రధాన అడ్డంకిగా ఉండేది. రెండేళ్లుగా ఇటునుంచి మావోయిస్టు ఇలాకాలోకి కాలు పెట్టడం భద్రతా దళాలకు కష్టంగా మారింది. అందువల్లే ఇప్పటికీ గోదావరి తీరంలోని తెలంగాణ జిల్లాలపై మావోయిస్టులు ఎంతో కొంత ప్రభావం చూపగలుగుతున్నారు. అయితే ధర్మారం వద్ద చింతవాగుపై నిర్మించిన వంతెన రెండు వారాల క్రితమే అందుబాటులోకి వచ్చింది. దీంతో వెంటనే కొండపల్లిలో క్యాంపు ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. ఇదే వేగంతో క్యాంపుల ఏర్పాటు జరిగితే వేసవికల్లా దండకారణ్యంలో మావోయిస్టు సాయుధ దళాల సంచారం ప్రశ్నార్థకం కానుంది. కేవలం మావోయిస్టులకు అనుబంధంగా ఉండే ప్రజా సంఘాలే నామమాత్రపు ఉనికిలో ఉంటాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆనవాళ్లు చెరిపేస్తున్నారు..

దండకారణ్యంలోని కీలక ప్రాంతాలను ఆధీనంలోకి తెచ్చుకున్న వెంటనే భద్రతా దళాలు మావోయిస్టుల ఆనవాళ్లను చెరిపేస్తున్నాయి. జనతన సర్కారు ఆధీనంలోని ప్రాంతంలో ప్రభుత్వ ఛాయలు మచ్చుకైనా కనిపించవు. కేవలం మావోయిస్టులు ఏర్పాటు చేసిన బోర్డులు, నినాదాలు, అమర వీరుల స్థూపాలే ఉంటాయి. కానీ కొండపల్లికి చేరుకున్న భద్రతా దళాలు.. ఆ చుట్టుపక్కల మావోయిస్టులు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించడంతో పాటు భారీ యంత్రాలతో స్థూపాలను నిమిషాల్లో నేలమట్టం చేస్తున్నాయి. మరోవైపు నాలుగు వేల మంది జవాన్ల సాయంతో యుద్ధప్రతిపాదికన క్యాంపు ఏర్పాటు చేశారు.

కొండపల్లి పరిసర ప్రాంతాల్లో జనతన సర్కార్ అధ్వర్యంలో నిర్మించిన స్థూపాలు, ఏర్పాటు చేసిన బోర్డులు, పాఠశాల



కొండపల్లిలో క్యాంప్‌ను ప్రారంభిస్తున్న భద్రతా దళ అధికారులు



కొండపల్లిలో ఏర్పాటుచేసిన క్యాంప్ వద్ద భద్రతా దళ సభ్యులు

అగ్నిప్రమాదమా?.. ఇలా చేద్దాం!

- అగ్నిప్రమాదమా?.. ఇలా చేద్దాం!
- సచివాలయంలో అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్
- అగ్నిప్రమాదం నుంచి తప్పించుకొనే తీరుపై వివరణ
- పాల్గొన్న ఎస్పీఎఫ్ సిబ్బంది, ఉన్నతాధికారులు

సాక్షి, హైదరాబాద్: అగ్నిప్రమాదాలు జరిగితే సురక్షితంగా ఎలా తప్పించుకోవాలన్న అంశంపై సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో శనివారం అగ్నిమాపక శాఖ అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. సచివాలయం ప్రధాన గేటు ముందు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సచివాలయ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గతంలో తెలంగాణ సచివాలయ రక్షణలో టీజీఎస్పీ ఉండగా, ఇటీవల ప్రభుత్వం ఎస్పీఎఫ్ అధికారులకు రక్షణ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే బిల్డింగ్‌లో ప్రాథమిక అగ్నిమాపక టూల్స్, ఫైర్ ఎక్స్ టింగ్విషర్లు/ఫిక్స్‌డ్ ఫైర్ ఇన్‌స్టాలేషన్లను ఎలా ఉపయోగించాలనే అంశాన్ని అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ అఫీసర్ జీవీ ప్రసాద్, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ జన్య, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ యాదయ్య వివరించారు. సేఫ్టీ టూల్స్ వాడడంతోపాటు బిల్డింగ్ మెయింటనెన్స్ సిబ్బందికి, బిల్డింగ్‌లో ఉన్నవారికి వెంటనే సమాచారం ఇచ్చి అలారం మోగించాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ పరికరాలతో ప్రమాదాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తూనే.. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రమాద సమయంలో లిఫ్టులను వాడకుండా మెట్ల మార్గంలో వెళ్లాలని పేర్కొన్నారు. మంటలు భారీగా ఉంటే పై అంతస్తుల్లో ఉన్నవారిని బ్రొంటో స్కై లిఫ్ట్ (బీఎస్ఎల్) ద్వారా కిందికి దించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేవదాస్, అసిస్టెంట్ కమాండెంట్ అప్పాజీ, ఎంఎస్‌రెడ్డి, పవన్‌రెడ్డి, ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.




వలస కార్మికుల సమాచారం గోప్యం!

- సమగ్ర సర్వేలో ఎన్యుమరేటర్లకు సహకరించని కుటుంబాలు
- రేషన్ కార్డులు, ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగిస్తారని సందేహం
- వివరాలు తెలిస్తేనే సంక్షేమ పథకాలకు వీలవుతుందంటున్న కార్మిక సంఘాలు


సుంకెట్‌లో సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్

మోర్తాడ్ (బాల్కొండ): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర సర్వేలో విదేశాలకు వలస వెళ్లిన వారి సమాచారం ఇవ్వాలా.. వద్దా? అని వలసదారుల కుటుంబాలు సంశయం వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని చోట్ల వలస వెళ్లిన వారి సమాచారాన్ని కుటుంబ సభ్యులు ఇస్తున్నప్పటికీ, అనేక చోట్ల వలస కార్మికుల వివరాలను గోప్యంగా ఉంచుతున్నారని ఎన్యుమరేటర్లు చెబుతున్నారు. గతంలో ఒకే రోజు సమగ్ర సర్వే నిర్వహించగా ఈ సారి పటిష్టంగా వివరాలను సేకరించాలనే ఉద్దేశంతో 15 రోజుల పాటు సర్వే జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 74 అంశాలపై ఎన్యుమరేటర్లు సమాచారం సేకరిస్తుండగా, వలస కార్మికులకు సంబంధించి మూడు ప్రత్యేక కాలమ్‌లను రూపొందించారు. విదేశాలతో పాటు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారి వివరాలను నమోదు చేయడంతో ఎక్కడ ఉపాధి పొందుతున్నారు, వలస వెళ్లడానికి కారణం ఏమిటనే ప్రశ్నలను పొందుపరిచారు. గతంలో వలస వెళ్లిన వారి పేర్లను రేషన్ కార్డులు, ఓటర్ల జాబితాల నుంచి తొలగించడంతో ఈసారి కూడా అదే విధానం కొనసాగితే తాము నష్టపోతామనే భావించి అనేక మంది వలసల సమాచారం దాచేస్తున్నారు. మన రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి సంఖ్య దాదాపు 15 లక్షలు ఉంటుందని సమాచారం. ఇప్పటి వరకు వలస కార్మికుల అంశంపై ఎలాంటి సమాచారం సేకరించకపోవడంతో ప్రభుత్వం వద్ద నిర్దిష్టమైన సంఖ్య ఏది లేదు. తాజాగా గల్ఫ్‌తో పాటు పాశ్చాత్య దేశాలకు వలస వెళుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.

సమాచారం ప్రభుత్వానికి చేరితేనే..



వలస కార్మికుల నిర్దిష్టమైన సంఖ్య తెలితేనే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసే విషయంలో ముందడుగు వేయడానికి అవకాశం ఉంటుంది. ఎలాంటి అపోహలు లేకుండా వలస కార్మికుల వివరాలను పక్కాగా నమోదు చేయిస్తే ప్రభుత్వానికి ఒక లెక్క తెలిసి.. సంక్షేమ ప్రణాళికలను రూపొందించడానికి మార్గం సుగమం అవుతుంది.

– స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు

పక్కా సమాచారం ఉంటేనే సంక్షేమ ఫలాలు..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గల్ఫ్‌కు వలస వెళ్లిన కార్మికుల మేలు కోసం ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేసింది. గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారంతోపాటు ఇతర మూడు అంశాలపై స్పష్టత ఇచ్చింది. ఇదిలా ఉండగా సమగ్ర సర్వేలో పూర్తిస్థాయి వలసదారుల సంఖ్య తేలితేనే ఇంకా ఏమైనా సంక్షేమ పథకాలను అమలు చేయడానికి అవకాశం ఉంటుందని వలస కార్మికుల సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్ర సర్వేలో వలస కార్మికుల సంఖ్యను సేకరించినా ఆ వివరాలను బయట పెట్టడానికి ఆసక్తి చూపలేదు. కనీసం సమాచార చట్టం ప్రకారం వివరాలు వెల్లడించాలని కోరినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్పందించలేదు. అప్పటి పరిస్థితులకు, ఇప్పటికి తేడా ఉందని అందువల్ల వలస కార్మికుల కుటుంబాలు ధైర్యంగా ముందుకు వచ్చి వలస వెళ్లినవారి సమాచారం అందించాలని కార్మిక సంఘాల నాయకులు సూచిస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో సర్వే ముగిసిపోనుండగా వలస కార్మికుల సంఖ్య ఎంత అనేది త్వరలోనే తేలనుంది.

ఎరక్కపోయి ఇరుక్కుంది..



వెంకటాపురం(కె): ప్లాస్టిక్ డబ్బాలో ఏదైనా ఉందేమోనని తల దూర్చింది. తీరా అందులో ఏమీ లేకపోగా డబ్బాలో తల ఇరుక్కుపోయింది.. ఎట్టకేలకు గ్రామస్తులు డబ్బా తొలగించి శునకానికి విముక్తి కలిగించారు. ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధిలోని బీసీ మర్రిగూడెం గ్రామంలో.. ఒక శునకం తల ప్లాస్టిక్ డబ్బాలో ఇరుక్కుపోయింది. రెండు రోజులుగా తిండి తినలేక, నీరు తాగలేక తీవ్ర ఇబ్బందులు పడింది. ఇది గమనించిన గ్రామస్తులు శనివారం ఉదయం కుక్క తలనుంచి ప్లాస్టిక్ డబ్బాను తొలగించడంతో బతుకుజీవుడా అనుకుని పరుగులు తీసింది.

పదేళ్ల పాలన.. పది నెలల పాలనపై చర్చకు సిద్ధమా?

కేటీఆర్, హరీశ్‌రావుకు కల్వ సుజాత సవాల్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన... కాంగ్రెస్ పది నెలల పాలనపై చర్చకు సిద్ధమా అని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత సవాల్ విసిరారు. శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధులు మద్ది శ్రీనివాస్‌రెడ్డి, చరణ్ కౌశిక్ యాదవ్, లింగం యాదవ్‌లు కలిసి విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో ఏమీ చేయలేని నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై దాడులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్‌ఎస్ చేసిన సకల జనుల సర్వే ఏమైందో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కులగణనపై ప్రజలను రెచ్చగొట్టి సిబ్బందిని అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్డంగా పడుకున్నా, నిలువుగా పడుకున్నా బుల్డోజర్లతో తొక్కించి మూసీని అభివృద్ధి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒక్క రోజు మూసీ నిద్ర కాదు... మూసీ నీళ్లతో స్నానం చేయాలని డిమాండ్ చేశారు. మూసీ అభివృద్ధికి కేంద్రం నుంచి రూ. ఏడువేల కోట్లు తెచ్చే దమ్ము కిషన్‌రెడ్డికి ఉందా అని వారు నిలదీశారు. అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగానే లగచర్లలో ఇండస్ట్రియల్ పార్క్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు.

పంటకు 'తమన్నా' రక్ష!



అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం అమృతపురంలో పంట పొలానికి దిష్టి తగలకుండా ఓ రైతు ఇలా హీరోయిన్ తమన్నా ఫొటోను పెట్టాడు. ఇది అక్కడ చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

జోరుగా..హుషారుగా



కార్తీకమాసం సందర్భంగా విశాఖలోని పలు ప్రాంతాలకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. కైలాసగిరిపై తివాచీలాంటి పచ్చదనంపై ఉత్సాహంగా స్కై సైక్లింగ్‌లో పాల్గొంటూ సరదాసరదగా గడుపుతున్నారు.

గుంటూరు 'చానల్'లో గుర్రపు డెక్క



నీటిపారుదల శాఖ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గం పెదకాకానిలో గుర్రపు డెక్కలతో నిండిపోయిన గుంటూరు చానల్ కాలువ.

క్లుప్తంగా...

మున్సిపల్ ఉద్యోగులు, టీచర్ల పీఎఫ్‌కు పీడీ అకౌంట్



సాక్షి, అమరావతి: మున్సిపల్ ఉద్యోగులు, మున్సిపల్ ఉపాధ్యాయల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కోసం పీడీ అకౌంట్ తెరవాలని ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం మున్సిపల్ హైస్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ట్రెజరీ ద్వారా జీపీఎఫ్ అకౌంట్లు కొనసాగుతున్నాయి. అయితే, ఎలిమెంటరీ స్కూళ్లకు ఈ అవకాశం లేదు. కానీ మార్కాపురం, పుంగనూరు మున్సిపాలిటీల్లోని యూపీ, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ సదుపాయం ఉంది. ప్రస్తుత ఆదేశాల ప్రకారం మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు పీఎఫ్ అకౌంట్లు మున్సిపల్‌శాఖ పరిధిలోకి రానున్నాయి.

పీఎఫ్ ఉత్తర్వుల్లో అస్పష్టత..

మున్సిపాలిటీ ఉపాధ్యాయులకు భవిష్య నిధి (పీఎఫ్) ఖాతాలు తెరిచేందుకు ఆర్థిక శాఖ ఇచ్చిన ఆదేశాలు అస్పష్టంగా ఉన్నాయని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీ ప్రసాద్, రాధాకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ ఉపాధ్యాయ, ఉద్యోగుల్లాగే మున్సిపాలిటీ ఉపాధ్యాయులకు కూడా జెడ్పీపీఎఫ్, జీపీపీఎఫ్ ఖాతాలు తెరవాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల ఆందోళన

మున్సిపల్ శాఖ పరిధిలోని ఉపాధ్యాయులకు ఉన్న సదుపాయాలను విద్యాశాఖ తొలగిస్తున్నదని ఈ శాఖ పరిధిలోని టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2010లో పురపాలక టీచర్లకు జీవో 300 ద్వారా 010 పద్దు ద్వారా జీతాలు ఇస్తున్నారని, అప్పటి నుంచే జీపీఎఫ్ అకౌంట్లు తెరవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు చెబుతున్నారు. కానీ ఉన్న జీపీఫ్ అకౌంట్స్‌ను తొలగించి, మున్సిపల్‌శాఖ పరిధిలో ఉండేలా పీడీ అకౌంట్లకు మార్చడం ద్వారా తమను ప్రైవేట్ ఉపాధ్యాయులుగా పరిగణించినట్లయిందని పురపాలక టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ పేర్కొన్నారు.

టీచర్ల రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలి

సాక్షి, అమరావతి: సమగ్ర శిక్ష ప్రాజెక్టులో భాగంగా ఉపాధ్యాయులకు నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇస్తామని హామీ ఇచ్చి.. తిరిగి రెసిడెన్షియల్ విధానంలో శిక్షణకు ఆదేశాలివ్వడం తగదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఖండించింది. ఎస్పీడీతో ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చల్లో తీసుకున్న నిర్ణయాలకు భిన్నంగా మళ్లీ పాత పద్ధతిలోనే శిక్షణ నిర్వహించడానికి అధికారులు ఉత్తర్వులివ్వడంపై ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజుల, భానుమూర్తి ఖండించారు.

ఎస్‌హెచ్‌జీల గ్రేడింగ్‌కు వివరాల సేకరణ

సాక్షి, అమరావతి: మెప్మా ద్వారా రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో ఉన్న 2.79 లక్షల సంఘాల్లోని మహిళలను సంఘటితం చేసి వారి సామాజిక, ఆర్థిక సాధికారత కోసం కృషి చేసేందుకే సభ్యుల వివరాలు నమోదు చేస్తున్నామని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు. సభ్యుల సమగ్ర సమాచారం తెలిస్తే సరైన ప్రణాళిక అమలు చేసేందుకు ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. సంఘాల నిర్వహణ స్థితి, పొదుపు, అప్పులు, చెల్లింపులు, బాకీలు, అడ్వాన్సులు వంటి ఆర్థిక అంశాలతో పాటు సంఘం స్థాయిలో చేపడుతున్న జీవనోపాధి వివరాలను సేకరించి వాటి ఆధారంగా గ్రేడింగ్ ఇస్తామన్నారు.

ఎస్ఎఫ్ఐ మహాధర్నా తాత్కాలిక వాయిదా

సాక్షి, అమరావతి: విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18న తలపెట్టిన మహాధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎఫ్ఐ ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించిందని, ఇందులో భాగంగా మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ అనివార్య కారణాలతో అందుబాటులో లేకపోవడంతో ఓఎస్‌డీ బృందంతో చర్చించామని తెలిపారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని పేర్కొన్నారు. త్వరలోనే ఈ అంశాలపైన స్పష్టత రాకుంటే తమపోరాటం కొనసాగిస్తామని ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.

పొయ్యిపై సల.. సల.. ఆరోగ్యాలు విల విల!


పదే పదే కాగుతున్న నూనెతో ఆరోగ్యానికి చేటు

- ప్రజారోగ్యాన్ని పట్టించుకోని హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు
- కల్తీ నూనెతో ఆస్పత్రుల పాలవుతున్న జనం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు



పుట్టపర్తికి చెందిన 30 ఏళ్ల మహిళ తిన్న ఆహారం జీర్ణం కాలేదని ఆస్పత్రిలో చేరింది. కడుపు నొప్పితో పాటు ఆకలి మందగించినట్లు డాక్టర్లకు తెలిపింది. పలు వైద్య పరీక్షల అనంతరం కల్తీ ఆహారం తినడం కారణంగానే ఆరోగ్య సమస్య తలెత్తినట్లు వైద్యులు నిర్ధారించారు. కల్తీ నూనె, మసాలా పదార్థాలు తినడం తగ్గించాలని డాక్టర్లు సూచించారని ఆమె తెలిపింది.

పెనుకొండలో ఓ చిన్నారి పుట్టినరోజు సందర్భంగా ఐదు కుటుంబాలు విందులో పాల్గొనేందుకు హోటల్‌కు వెళ్లాయి. వాళ్లందరూ రకరకాల వంటకాలు తిన్నారు. చివరగా ఇంటికి చేరే సమయంలో దారిలో కనిపించిన స్ట్రీట్ ఫుడ్ కూడా రుచి చూశారు. ఎక్కడ తేడా కొట్టిందో తెలీదు. కానీ ఇద్దరు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా ఫుడ్ పాయిజనింగ్‌గా తేల్చారు.



సాక్షి, పుట్టపర్తి : నిత్యావసర సరుకుల ధరలతో పాటు వంటనూనె ధరలు విపరీతంగా పెరిగాయి. కానీ వాడకం మాత్రం తగ్గడంలేదు. మరోవైపు హోటళ్లలో తిండి ధరలు ఉన్నఫలంగా పెంచడం కుదరదు. దీంతో చాలా మంది కల్తీనూనె వాడటం మొదలుపెట్టారు. దీనికితోడు పొయ్యిపై నూనెను పదే పదే మరిగించేస్తున్నారు. ఫలితంగా తాజా నూనె అయినప్పటికీ మరిగించడంతో రుచి మారుతోంది. ఆ నూనెలో తయారు చేసిన పదార్థాలను తింటున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇలాంటి ఘటనలు పట్టణ ప్రాంతాల్లో తరచూ వెలుగు చూస్తున్నాయి. రోడ్డు పక్కన తయారు చేసే ఆహార పదార్థాలు దుమ్ము, ధూళి రేణువులు చేరి అనారోగ్యానికి గురి చేస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

పట్టణాల్లోనే అధికం..

పల్లెలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లోనే హోటళ్లు అధికం. అందులో రోడ్ల పక్కన చిన్న చిన్న హోటళ్లు, తోపుడు బండ్లు ప్రతి వంద మీటర్లకు ఒకటి కనిపిస్తాయి. ఇతర ప్రాంతాల నుంచి పలు పనులపై వచ్చే వాళ్లు గత్యంతరం లేక ఇక్కడే తినాల్సి వస్తోంది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ప్రధాన కూడళ్లలోని హోటళ్లలో ఎక్కువ మంది ఆహార పదార్థాలను తింటుంటారు. అయితే నూనెను పదే పదే మరిగించడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

ఉదయం నుంచి రాత్రి దాకా..

మద్యం దుకాణాల సమీపంలోని చికెన్ కబాబ్ సెంటర్లలో ఎక్కువసార్లు మరిగించిన నూనెలో చేసిన పదార్థాలను తినడం కారణంగా మందుబాబులు అనారోగ్యం బారిన పడుతున్నారు. మద్యం కంటే కల్తీ నూనె పదార్థాలు ఎక్కువగా ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయనే విషయం మత్తులో గమనించలేకపోతున్నారు. మటన్, చికెన్, కోడిగుడ్ల వంటకాల్లో ఎక్కువగా కల్తీ జరుగుతున్నట్లు తెలిసింది. ప్రైవేటు మద్యం దుకాణాలు రావడంతో ఒక్కో దుకాణం వద్ద పదుల కొద్దీ చికెన్ కబాబ్ సెంటర్లు వెలిశాయి. ఒకసారి పొయ్యి పెట్టిన నూనె సాయంత్రం వరకూ కాగుతూనే ఉంటోంది. ఫలితంగా ఆ ఆహారాన్ని తీసుకునే వారు ఫుడ్ పాయిజన్‌తో పాటు వివిధ రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు.

రోగాలు ఇలా..

ఒకసారి వాడిన వంటనూనెను మళ్లీ మళ్లీ వినియోగించడం వల్ల ఆరోగ్యానికి చేటు కలిగిస్తుంది. మోతాదుకు మించి మరిగిన నూనెలో టోటల్ పోలార్ కౌంట్ (టీపీసీ) 25 శాతానికి మించి శరీరానికి హానికరంగా మారుతుంది. అలాంటి నూనెతో ఆహార పదార్థాలు వండితే శరీరంలో అధికంగా ఫ్రీరాడికల్స్ పెరిగిపోతాయి. నూనె రంగు మారిపోతుంది. అడుగున నల్లటి పదార్థం తయారవుతుంది. ఆమ్లం అధికమవుతుంది. కొన్ని నూనెలలో నిల్వ ద్వారా విష పదార్థాలు కూడా ఏర్పడతాయి. స్థూలకాయం, గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్‌తో సహా చాలా వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు.

అటకెక్కిన తనిఖీలు..

పదే పదే మరిగించిన నూనెలో వంటకాలు చేయడం.. ఆ పదార్థాలు తిన్న వారు అనారోగ్యం బారిన పడటం.. సైకిల్ చక్రంలా స్పష్టంగా కనిపిస్తోంది. అయినా ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు లేకపోవడంతోనే ఇదంతా జరుగుతోందన్న విమర్శలున్నాయి. ఫిర్యాదులు వస్తే కానీ తనిఖీలు చేయరని అంటున్నారు. మరి కొన్ని చోట్ల ఆర్నెల్లకు ఒకసారి కూడా తనిఖీలు చేయడం లేదని రికార్డులు చెబుతున్నాయి. పండుగ సమయంలో మాత్రమే అడపాదడపా తనిఖీలు చేసి చేతులు దులుపుకొంటున్నారు. నూనె డబ్బాల్లో ఎంతమేరకు కల్తీ ఉందనే విషయం ఎవరూ బయటపెట్టడంలేదు. కబేళాలకు తరలించే పశువుల ఎముకల పిండి కూడా నూనెలో కలిపేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.

కల్తీ అని తేలితే కఠిన చర్యలు



మా సిబ్బంది ఆధ్వర్యంలో నిత్యం తనిఖీలు జరుగుతున్నాయి. అయితే ఎక్కడ కల్తీ జరుగుతోందో పక్కా సమాచారం ఇస్తే.. తనిఖీ ముమ్మరం చేస్తాం. శ్యాంపిళ్లు తీసి ల్యాబ్‌కు పంపిస్తాం. కల్తీ చేసినట్లు నిర్ధారణ అయితే చర్యలు తప్పవు. ఇప్పటికే చాలా చోట్ల తనిఖీలు చేశాం. కల్తీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకున్నాం. ప్రజలు బయట ఫుడ్ తినడం తగ్గిస్తే ఆరోగ్యం బాగుంటుంది.

– రామచంద్ర, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, పుట్టపర్తి

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



ఆహారం విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. మంచి ఆహారంతోనే ఆరోగ్యం బాగుంటుంది. బయట ఎక్కడ పడితే అక్కడ హోటళ్లలో తింటే అనారోగ్యం బారిన పడటం ఖాయం. మసాలా, నూనె వంటలు తినడం తగ్గించాలి. నూనె వంటకాలతో కొవ్వు శాతం పెరగడంతో పాటు కల్తీ నూనె వంటకాలు తింటే వివిధ రోగాలు సోకే ప్రమాదం ఉంది.

– డాక్టర్ మంజువాణి, డీఎంహెచ్‌ఓ

వివాదాల కేంద్రంగా ద్రవిడ విశ్వవిద్యాలయం

- పీహెచ్‌డీ సర్టిఫికెట్ల పంపిణీలో నిరంతరం వివాదం
- నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు
- వర్గపోరుతో చతికిలపడుతున్నా పాలన



ద్రవిడ విశ్వవిద్యాలయం

కుప్పం: చిత్తూరు జిల్లా కుప్పం సమీపంలో ద్రవిడ భాషల పరిశోధన కేంద్రంగా ఏర్పడిన ద్రవిడ విశ్వవిద్యాలయం వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. పరిశోధనలను పక్కన పెట్టి అవకతవకలకు, రాజకీయాలకు కేంద్రంగా వర్సిటీ పాలనను మార్చేశారు. అధికార పార్టీకి అనుకూలమైన వారికి అక్రమంగా పదోన్నతులు కల్పిస్తూ వివాదాలకు మరింత ఆజ్యం పోస్తున్నారు. దీంతోపాటు వర్గపోరుతో వర్సిటీ పాలన చతికిలపడింది. విద్యా కేంద్రాన్ని రాజకీయాలతో భ్రష్టు పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పీహెచ్‌డీలతో వర్సిటీ అప్రతిష్ట

ద్రవిడ వర్సిటీలో పీహెచ్‌డీలు మంజూరు పట్ల వర్సిటీ అప్రతిష్టను మూటకట్టుకుంది. యూనివర్సిటీ ఆధ్వర్యంలో దూరవిద్యను ప్రవేశపెట్టి పీహెచ్‌డీను ఇష్టానుసారంగా మంజూరు చేసింది. అప్పట్లో లక్షలు వసూలు చేసుకుని డాక్టరేట్లను ప్రదానం చేశారని పెద్ద ఎత్తున జాతీయస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తాయి. 2009 యూజీసీ తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం దూర విద్యా కేంద్రం పీహెచ్‌డీలను నిలిపివేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్‌లు పీహెచ్‌డీలు ప్రదానం చేసేందుకు శ్రీకారం చుట్టారు. దీంతో మళ్లీ యునివర్శిటీ పీహెచ్‌డీల గోల వివాదంగా తెరమీదకు వచ్చింది. ఈ సర్టిఫికెట్ల కోసం లక్షల్లో వసూళ్ళు చేస్తున్నారని సమాచారం. ఈ సర్టిఫికెట్ల వ్యవహారాన్ని వర్సిటీలో లైబ్రరియన్‌గా పనిచేస్తున్న ఓ అధికారి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. వర్సిటీలో పీహెచ్‌డీల మంజూరులో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఇటీవల బహిరంగ లేఖను విడదుల చేసింది. యూజీసీ నిబంధనలు వ్యతిరేకంగా పీహెచ్‌డీలు ప్రదానం చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు

ద్రవిడ వర్సిటీలో అసిస్టెంట్ లైబ్రరియన్‌గా పని చేస్తున్న ఓ ఉద్యోగి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందారని ఏసీబీ విచారణలో బయటపడింది. నకిలీ సర్టిఫికెట్ల విచారణ 2012 నుంచి కొనసాగింది. ఇదే విషయాన్ని హైకోర్టు సైతం ఏసీబీ విచారణను ధ్రువీకరిస్తూ సంబంధిత ఉద్యోగిని తొలగించి, అప్పట్లో ఉన్న వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్‌తో పాటు సెలెక్షన్ కమిటీ సభ్యులపై కేసు నమోదు చేయాలని సూచిందింది. దీంతో వర్సిటీలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఇవ్వడం పట్ల చర్చనీయాంశంగా మారింది. కొన్ని ఏళ్లుగా సాగుతున్న విచారణలో అసలు విషయం బయట పడటంతో యునివర్శిటీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

విధుల కన్నా ఇతర వ్యాపకాలపైనే ఆసక్తి

వర్సిటీ రెగ్యులర్ ఉద్యోగులు 42 మంది, బోధన సిబ్బంది 72 మంది , బోధనేతర సిబ్బంది 280 మంది పనిచేస్తున్నారు. 18 విభాగాల్లో 394 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీటిలో 10 శాఖలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. దీంతో ఉద్యోగులు వర్సిటీలో విధుల కన్నా కుప్పం పట్టణంలో ఇతర వ్యాపాకాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రతిరోజు ఉదయం వర్సిటీ వెళ్లి ఆయా శాఖల్లో హాజరు పట్టికలో సంతకాలు పెట్టి తిరిగి సొంత వ్యాపారాల్లో నిమగ్నం అవుతున్నారు. గతంలో 3 వేల మంది విద్యార్థులతో కళకళడుతుండే వర్శిటీ నేడు 300 మంది విద్యార్థులకే పరిమితమైంది.

రాజకీయాలకు వేదిక

విద్యా కేంద్రంగా ఉన్న ద్రవిడ యూనివర్సిటీ కూటమి ప్రభుత్వం రాగానే రాజకీయాలకు వేదికగా మారింది. కూటమి పార్టీల కార్యక్రమాలు క్యాంపస్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని వర్సిటీలో పనిచేస్తున్న ఓ ఉన్నత అధికారి ఉద్యోగులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. కుప్పం నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకుడితో క్యాంపస్‌లో సమావేశాలు చేపట్టి ఉద్యోగులతో సమావేశాలు నిర్వహిస్తూ విద్యాసంస్థలు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపణలున్నాయి.

రుషికొండను మ్యూజియంగా మార్చాలి

సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ



సాక్షి, అమరావతి: విశాఖపట్నం రుషికొండపై గత ప్రభుత్వం నూతనంగా నిర్మించిన భవనాలను సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియంగా మార్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై శనివారం ఆయన సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. రుషికొండ భవనాల నిర్వహణపై ఈనెల 18వ తేదీన శాసనసభలో చర్చ జరగబోతున్నట్లుగా మీడియాలో చూశానని, దాన్ని తిరిగి అతిథి గృహం, ప్రభుత్వ క్యాంపు ఆఫీసుగా ఉపయోగించడం సరైంది కాదని తెలిపారు. ప్రజాధనంతో నిర్మించిన ఆ భవనాలు ప్రజలకే ఉపయోగపడాలని సూచించారు. రాష్ట్ర విభజన తరువాత హైదరాబాద్, బెంగళూరు తరహాలో విజ్ఞానవంతమైన సైన్సు మ్యూజియం ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేదని, సైన్సు అండ్ టెక్నాలజీ మ్యూజియంను రుషికొండ భవనాల్లో ఏర్పాటు చేస్తే విద్యార్థులకు, యువతకు స్ఫూర్తివంతంగా ఉంటుందని పేర్కొన్నారు.

న్యాయవాద వృత్తిలో నైతికత విలువలు ముఖ్యం

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి



విశాఖ లీగల్ : న్యాయవాద వృత్తిలో రాణించడానికి నైతికత విలువలు ముఖ్యమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. శనివారం విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయవాదుల గ్రంథాలయంలో ప్రముఖ న్యాయవాది దివంగత సి.పద్మనాభరెడ్డి స్మారక ఉపన్యాసానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. న్యాయశాస్త్రానికి సంబంధించి తీర్పులు, ఇతరు జడ్జిమెంట్లు, చట్ట సమాచారం అతి సులభంగా లభ్యం అవుతుందని.. కానీ నైతికత విలువలు ఎక్కడి నుంచి లభ్యం కావన్నారు. నైతికత విలువలు లేని వృత్తి గుర్తింపు లేదని చెబుతూ దీనికి సంబంధించి సర్వోన్నత న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను ఆయన వివరించారు.ప్రతి న్యాయవాది తమ జూనియర్లకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. జీవితంలో ఎన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించిన విలువ లేకపోతే నిష్ప్రయోజనం అన్నారు. వృత్తిలో నైతిక విలువ లేకపోతే సమాజానికి తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదాలు ఉన్నాయన్నారు. ప్రతి న్యాయవాది తమ జూనియర్లకు ఒక ఉత్తమమైన వ్యక్తిగా కనిపించాలన్నారు. విలువలు దెబ్బతింటే సమాజంలో ఎన్నో నష్టాలు ఉన్నాయన్నారు. సభకు అధ్యక్ష వహించిన నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి నాగేశ్వరావు మాట్లాడుతూ న్యాయవాదులు న్యాయమూర్తులు మధ్య సత్ సంబంధాలు మంచి తీర్పులకు దారితీస్తాయన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర అధ్యక్షులు సురేష్ కుమార్ తదితరులు మాట్లాడారు.



అంతర్వేదిలో భక్తుల రద్దీ

సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయానికి కార్తిక మాసం మూడో శనివారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప, భవానీ మాలధారులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఏర్పాట్లు చేశారు. క్యూలో భక్తులకు మంచినీటి సదుపాయాన్ని దేవస్థానం కల్పించింది.

రత్నగిరి కిటకిట



అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం క్షేత్రంలోని రత్నగిరి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో శనివారం కిటకిటలాడింది. సత్యదేవుని సన్నిధికి భక్తులు ఉదయం నుంచీ తండోపతండాలుగా వచ్చారు. సుమారు 40 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. వ్రతాలు 4,800 జరిగాయి. నిత్య కల్యాణంలో రూ.1,116 చొప్పున టికెట్లు కొనుగోలు చేసి 27 మంది భక్తులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పవిత్ర కార్తిక మాసం.. అందునా స్వామివారికి ప్రీతికరమైన శనివారం కావడంతో వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు.


డీఎస్సీ ఉద్యోగాలకు ప్రభుత్వం ఉచిత శిక్షణ

బాపట్ల: డీఎస్సీ ఉద్యోగాలకు ప్రభుత్వమే ఉచితంగా శిక్షణ ఇవ్వడం శుభపరిణామమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించనున్న నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు స్థానిక సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శనివారం ప్రారంభించారు. ప్రారంభ సూచికగా జ్యోతి వెలిగించి అంబేడ్కర్, పూలే చిత్రపటాలకు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలో 700 పోస్టులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇందు కోసం ప్రభుత్వమే 220 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి శ్రీకారం చుట్టిందన్నారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక



తాడికొండ: తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో శనివారం షూటింగ్ బాల్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈ మేరకు పీఈటీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఈ నెల 23, 24, 25 తేదీలలో అనంతపురంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను షూటింగ్ బాల్ కార్యవర్గ సభ్యులు రవిబాబు, సీనియర్ ఉపాధ్యాయులు రమణయ్య, పీఈటీ తదితరులు అభినందించారు.



అండర్-19జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లాలో సోమవారం నుంచి అండర్-19 బాల,బాలికల జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని అండర్-19 ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు శనివారం పేర్కొన్నారు. గుంటూరు బీఆర్ స్టేడియంలో సోమవారం కలరియపట్టు, టంగ్టా మార్షల్ ఆర్ట్స్ అండర్-19 బాల,బాలికల జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయన్నారు. అదేరోజు నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీచ్ వాలీబాల్ జట్ల ఎంపికలు జరుగుతాయన్నారు. 23న సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు క్రికెట్ జట్ల ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2006 జనవరి 01 తర్వాత జన్మించి ఉండాలని, ఆధార్ కార్డు, ప్రిన్సిపల్ ధ్రువీకరణతో 10వ తరగతి మార్కుల జాబితాతో హాజరు కావాలని కోరారు.


● చిరంజీవి
● నాగార్జున

తెలుగింటి హీరో... పక్కింటి దర్శకుడు

హీరోయిన్లు ఒకే భాషకు పరిమితం కారనే విషయం తెలిసిందే. హీరోలు, దర్శకులు మాత్రం దాదాపు ఒకే భాషలోనే సినిమాలు చేస్తుంటారు. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది. హీరోలకు, దర్శకులకు హద్దులు, సరిహద్దులు లేవని పాన్ ఇండియన్ సినిమాలు చెబుతున్నాయి. దర్శకులు, హీరోలు ఇప్పుడు ఏ భాషలో అయినా సినిమాలు చేస్తున్నారు. కానీ ఈ ట్రెండ్ టాలీవుడ్‌లో మాత్రం ఎక్కువగా కనిపిస్తోంది. మరి... మన తెలుగింటి హీరోలు... ఏ పక్కింటి దర్శకులతో సినిమాలు చేస్తున్నారో తెలుసుకుందాం.


● ప్రభాస్


● ఎన్టీఆర్


● రామ్‌చరణ్


● విష్ణు


● సత్యదేవ్

కాంబో రిపీట్

చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర' సినిమాతో బిజీగా ఉన్నారు. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా వేసవిలో రిలీజ్ కావొచ్చని టాక్. ఈ చిత్రం తర్వాత చిరంజీవి ఏ దర్శకుడితో సినిమా చేస్తారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. హరీష్ శంకర్, మారుతి... ఇలా చాలామంది పేర్లు వినిపించాయి. అయితే ఇటీవల ఓ సందర్భంలో తన తర్వాతి చిత్రాల్లో ఒకటి చిరంజీవితో ఉంటుందని, సామాజిక నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందని, రచయిత–దర్శకుడు బీవీఎస్ రవి పేర్కొన్నారు. ఈ సినిమాకు బీవీఎస్ రవి కేవలం కథ మాత్రమే ఇస్తున్నారని, దర్శకత్వ బాధ్యతలు మోహన్‌రాజా తీసుకుంటున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. మోహన్ రాజా తెలుగు అయినప్పటికీ చెన్నైలో సెటిల్ అయి, తమిళ సినిమాలు ఎక్కువగా చేస్తున్నారు. ఇక చిరంజీవి కుమార్తె సుష్మిత కొణిదెల ఈ చిత్రానికి ఓ నిర్మాతగా వ్యవహరించనున్నారని తెలిసింది. త్వరలోనే ఈ సినిమా గురించిన పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి. ఇక హీరో చిరంజీవి–దర్శకుడు మోహన్‌రాజా కాంబినేషన్‌లో ఆల్రెడీ 'గాడ్ ఫాదర్' (2022) అనే సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. మోహన్ లాల్ మలయాళ హిట్ ఫిల్మ్ 'లూసిఫర్'కు తెలుగు రీమేక్‌గా 'గాడ్ ఫాదర్' చిత్రం రూపొందిన విషయం గుర్తుండే ఉంటుంది.

నవీన్‌తో నెక్ట్స్

సోలో హీరోగా నాగార్జున నెక్ట్స్ ఫిల్మ్ ఎవరితో ఉంటుందనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. కానీ తమిళంలో 'మూడర్ కూడం, అగ్ని సిరగుగళ్' సినిమాలు తీసిన దర్శకుడు నవీన్ గత ఏడాది నాగార్జునకు ఓ కథ వినిపించారట. ఈ మూవీకి నాగార్జున కూడా ఓకే చెప్పారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్‌ను మరింత మెరుగుపరిచే పనిలో నవీన్ బిజీగా ఉన్నారని, ఈ సినిమా విషయంపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుందని భోగట్టా. మరోవైపు ప్రస్తుతం నాగార్జున తమిళ చిత్రం 'కూలీ'లో ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. లోకేశ్ కనగరాజ్ ఈ సినిమాకు దర్శకుడు. రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న 'కూలీ' చిత్రం ఈ వేసవిలో విడుదల కానుంది. అలాగే తమిళ హీరో ధనుష్‌తో కలిసి నాగార్జున 'కుబేర' చేస్తున్నారు. ఈ సినిమాకు శేఖర్ కమ్ముల దర్శకుడు.

బిజీ బిజీ

ప్రభాస్ చాలా చాలా బిజీగా ఉన్నారు. ప్రభాస్ హీరోగా 'రాజా సాబ్, ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్)' సినిమాలు ప్రస్తుతం సెట్స్‌పై ఉన్నాయి. ఈ సినిమాల తర్వాత ప్రభాస్ 'స్పిరిట్' సినిమా సెట్స్‌లోకి వెళ్తారు. కాగా ఇటీవల కన్నడ నిర్మాణ సంస్థ హోంబలే ఫిలింస్ బ్యానర్‌లో ప్రభాస్ మూడు సినిమాలు కమిట్ అయ్యారు. ఈ చిత్రాల్లో ఒకటి తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో ఉంటుందని తెలిసింది. మరోటి కన్నడ దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో 'సలార్ 2' అని ఊహించవచ్చు. ఇంకో సినిమాకు తెలుగు దర్శకుడు ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తారని సమాచారం. ఇలా... ఓ తమిళ దర్శకుడు, ఓ కన్నడ దర్శకుడితో ప్రభాస్ సినిమాలు చేయనున్నారు. అంతేకాదు... ఇటీవల ప్రభాస్‌కు ఓ హిందీ దర్శకుడు కథ వినిపించారని, ఇప్పటికే ప్రభాస్ కమిటైన సినిమాల చిత్రీకరణలు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత ఈ సినిమాను ప్రకటిస్తారని బాలీవుడ్ భోగట్టా. కాబట్టి ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లేది 2026 లోనే అని ఊహించవచ్చు.

'జైలర్' దర్శకుడితో...

ఎన్టీఆర్ నటిస్తున్న తాజా చిత్రం 'వార్ 2'. హిందీ దర్శకుడు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. ఈ చిత్రంలో హృతిక్ రోషన్ మరో హీరోగా చేస్తున్నారు. 'వార్ 2' సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది. అయితే ఈ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్ 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమా షూట్‌లో జాయిన్ అవుతారు. కన్నడ దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమాను డైరెక్ట్ చేయనున్నారు. ఈ ఏడాదే షూటింగ్ ప్రారంభమయ్యేలా ప్రశాంత్ నీల్ సన్నాహాలు చేశారు. ముందుగా ఎన్టీఆర్ లేని సన్నివేశాలను చిత్రీకరించి, కొత్త సంవత్సరంలో ఎన్టీఆర్ పాల్గొనే సన్నివేశాల షూట్‌ను ప్రశాంత్ నీల్ ప్లాన్ చేశారని తెలిసింది. 2026 జనవరి 9న ఈ సినిమాను రిలీజ్ చేయనున్నట్లు ఆల్రెడీ మేకర్స్ ప్రకటించారు. అలాగే తమిళంలో 'కోలమావు కోకిల, డాక్టర్, జైలర్' సినిమాలను తీసిన దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ఇటీవల ఎన్టీఆర్‌కు ఓ కథ వినిపించారు. ఎన్టీఆర్ కూడా ఈ సినిమా చేసేందుకు అంగీకరించారని తెలిసింది. అయితే రజనీకాంత్‌తో 'జైలర్ 2' చేసిన తర్వాత ఎన్టీఆర్‌తో నెల్సన్ దిలీప్ కుమార్ సినిమా చేస్తారు.

కథ విన్నారా?

రామ్‌చరణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ సినిమాను తమిళ దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్నారన్న సంగతి తెలిసిందే. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కియారా అద్వానీ హీరోయిన్. ఈ చిత్రం జనవరి 10న సంక్రాంతికి రిలీజ్ కానుంది. అలాగే రామ్‌చరణ్ తర్వాతి చిత్రాలకు 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సన, సుకుమార్ డైరెక్ట్ చేస్తారు. అయితే ఓ హిందీ దర్శకుడు రామ్‌చరణ్‌కు కథ వినిపించారనే టాక్ కొన్ని రోజులు క్రితం ప్రచారంలోకి వచ్చింది. మరి... ఈ వార్త నిజమేనా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

మహాభారతం దర్శకుడితో...

హిందీ సీరియల్ 'మహాభారతం' చాలా ఫేమస్. ఈ సీరియల్ దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్‌ను 'కన్నప్ప' కోసం టాలీవుడ్‌కు తెచ్చారు విష్ణు మంచు. ఆయన హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో మోహన్‌బాబు, శరత్‌కుమార్, బ్రహ్మానందం ముఖ్య పాత్రల్లో నటిస్తుండగా, ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'కన్నప్ప' సినిమా విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత రానుంది.


జీబ్రా

తమిళంలో కీర్తి సురేష్‌తో 'పెంగ్విన్' సినిమా తీసిన తమిళ దర్శకుడు ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'జీబ్రా'. సత్యదేవ్ ఈ చిత్రంలో హీరోగా నటించగా, కన్నడ నటుడు డాలీ ధనుంజయ మరో లీడ్ రోల్‌లో నటించారు. ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈశ్వర్ కార్తీక్‌కు తెలుగులో ఇదే స్ట్రయిట్ సినిమా.

ఇతర భాషల దర్శకులతో సినిమాలు చేసే తెలుగు హీరోల జాబితాలో మరికొంతమంది ఉన్నారు.

– ముసిమి శివాంజనేయులు

సాహసం సేసేశారురా డింభకా పాతాళభైరవి గురించి మీకీ విషయాలు తెలుసా?







పాతాళ భైరవి... 1951లో రిలీజై, బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించిన తొలి తెలుగు చిత్రం ఇది. అప్పట్లో 28 కేంద్రాలలో వంద రోజులు పూర్తి చేసుకొన్న సినిమా. కేవీ రెడ్డి దర్శకత్వంలో ఎన్టీ రామారావు, ఎస్వీ రంగారావు పోటీ పడి మరీ నటించారు. ఈ చిత్రకథ విషయానికి వస్తే... ఉజ్జయిని రాజకుమారిని ప్రేమించిన తోట రాముడు సర్వ సంపన్నుడు కావడానికి నేపాల మాంత్రికుణ్ణి ఆశ్రయిస్తాడు. అయితే తోట రాముణ్ణి బలిచ్చి పాతాళ భైరవి అనుగ్రహాన్ని పొందాలన్నది మాంత్రికుడి ఆలోచన. చివరకు మాంత్రికుడ్ని తోట రాముడు ఎలా మట్టుబెట్టాడన్నదే కథ. మధిర సుబ్బన్న దీక్షితులు రాసిన కాశీ మజిలీ కథల్లోని ఓ కథ ఇది. ఈ సినిమాలోని అద్భుతమైన డైలాగ్స్‌లో సాహసం సేయరా డింభకా... ఒకటి. బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో ఎలాంటి టెక్నాలజీ అందుబాటులో లేనప్పుడే ఇలాంటి ఫ్యాంటసీ ఫిల్మ్ చేయాలనే ఆలోచన రావడం.. అనుకున్నదాన్ని అత్యద్భుతంగా తీసి.. చరిత్రలో నిలిచిపోయేలా చేయడం నిజంగా సాహసమనే చెప్పాలి. అంటే... సాహసం సేసేశారురా డింభకా అనాలి.

అలా తోట రాముడు సెలక్ట్ అయ్యాడు

'పాతాళ భైరవి'లో తోట రాముడి రోల్‌కు తొలుత అక్కినేని నాగేశ్వరరావుని, మాంత్రికుడి పాత్రకు గోవిందరాజుల సుబ్బారావు లేదా ముక్కామలను అనుకున్నారట డైరెక్టర్. ఓ రోజు వాహినీ స్టూడియో ప్రాంగణంలో ఎన్టీఆర్, ఏయన్నార్ టెన్నిస్ ఆడుతుంటే కేవీ రెడ్డి అక్కడికొచ్చారు. ఇద్దరు హీరోలూ ఆటలో లీనమైపోయారు. రెండు మూడు సార్లు బాల్ రాకెట్‌కు తగలకపోవడంతో ఎన్టీఆర్‌కు కోపమొచ్చి నెక్ట్స్ బాల్‌ను బలంగా బాదారట. దాంతో అది అడ్రస్ లేకుండా పోయింది. అప్పుడు ఎన్టీఆర్ రాకెట్ పట్టుకున్న విధానం డైరెక్టర్ కేవీ రెడ్డికి నచ్చేయడంతో తోట రాముడి రోల్‌కు ఆయన్ను సెలక్ట్ చేసుకున్నారట. హీరోగా పెద్దగా ఇమేజ్ లేని యాక్టర్‌ను తీసుకోవడంతో విలన్ కూడా ముక్కామల కాకుండా కొత్తవాడై ఉండాలని ఎస్వీఆర్‌ను తీసుకున్నారట. అంటే... అప్పటికి ఎన్టీఆర్, ఎస్వీఆర్ ఇద్దరూ కూడా పెద్దగా పేరున్న నటులు కాదన్నమాట.

ఎన్టీఆర్ పారితోషికం రూ. 250

అప్పట్లో సినిమాలకు డూప్‌లు ఉండేవారు కాదు. 'పాతాళ భైరవి'లోనూ ఎక్కడా డూప్‌లను పెట్టలేదు. ప్రతిదీ నేర్చుకోవాలన్న ఉత్సాహం అప్పటి నటుల్లో ఉండేది. తెల్లవారుజామున 4.30 గంటలకే ఎన్టీఆర్, ఎస్వీఆర్ వాహిని స్టూడియోకు వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన సాండ్ కోర్టులో ఫైట్స్ రిహార్సల్స్ చేసేవారు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ తీసుకున్న రెమ్యునరేషన్ 250 రూపాయలట. అంతేకాదు విజయా సంస్థ కోసం రెండేళ్లలో నాలుగు సినిమాలు చేయాలని ఒప్పందం కూడా జరిగిపోయింది. ఘంటసాల పాటలు ఎవర్ గ్రీన్, మార్కస్ బార్ట్లే కెమెరా మాయాజాలం సినిమాకు ప్రాణం పోశాయి.

తొలి ద్విభాషా చిత్రం

1952 జనవరిలో గోవాలో జరిగిన తొలి భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో సౌత్ నుంచి ప్రాతినిధ్యం పొందిన ఏకైక సినిమా 'పాతాళ భైరవి' కావడం విశేషం. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో ఒకే హీరోతో నిర్మాణం జరుపుకొన్న తొలి ద్విభాషా సినిమా కూడా ఇదే. తెలుగులో 1951 మార్చి 15న రిలీజైతే, తమిళంలో అదే ఏడాది మే 17న విడుదలైంది. 1980లో జితేంద్ర హీరోగా ఇదే సినిమాను సూపర్‌స్టార్ కృష్ణ హిందీలో కలర్‌లో తీశారు. ఈ సినిమాలోని సాహసం సేయరా డింభకా.. రాకుమారి దక్కును రా... అనే డైలాగ్ ఇప్పటికీ వినిపిస్తూ ఉంటుంది.

– అలిపిరి సురేష్

మహేశ్‌కి జోడీ?


● నవోమీ స్కాట్

మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కనున్న చిత్రం 'ఎస్ఎస్ఎమ్‌బి 29' (వర్కింగ్ టైటిల్). ఈ సినిమా పాన్ వరల్డ్ రేంజ్‌లో తెరకెక్కనుంది. అందుకే ఈ చిత్రంలో నటించే యాక్టర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు రాజమౌళి. భారతదేశ నటీనటులే కాకుండా హాలీవుడ్‌కు చెందిన వారిని కూడా ఈ ప్రాజెక్టులోకి తీసుకోనున్నారాయన. అందులో భాగంగా మహేశ్‌బాబుకి జోడీగా హాలీవుడ్ నటి నవోమీ స్కాట్‌ని ఎంపిక చేసుకోనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో 'ఎస్ఎస్ఎమ్‌బి 29' హీరోయిన్ల జాబితాలో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్, ఇండోనేషియాకు చెందిన చెల్సియా ఇస్లాన్ పేర్లు వినిపించాయి. తాజాగా భారత మూలాలున్న నవోమీ స్కాట్‌ని ఎంపిక చేయనున్నారని భోగట్టా. ఇంగ్లాండులో పుట్టారు నవోమి. భారత సంతతికి చెందిన నవోమి తల్లి ఉషా స్కాట్ గుజరాత్ నుంచి ఇంగ్లాండుకు వలస వెళ్లారట. 'ది మార్షియన్, అల్లాద్దీన్, ఛార్లీస్ ఏంజెల్స్, స్మైల్, విజర్డ్స్' వంటి పలు సినిమాల్లో నటించిన నవోమీ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు. 'ఎస్ఎస్ఎమ్‌బి 29'లో నటించే విషయంపై ఆమెతో రాజమౌళి చర్చలు కూడా జరిపారని ఫిల్మ్‌నగర్ సర్కిల్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. మరి... మహేశ్‌బాబుకి జోడీగా నవోమీ స్కాట్ ఖరారు అయినట్టేనా? అంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ నిర్మించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో షూటింగ్ ప్రారంభం కానుందని టాక్.

ఊహించినట్లుగా జరగలేదు!


● శ్రుతీహాసన్

'వై దిస్ కొలవెరి' పాట విన్న వెంటనే '3' సినిమా గుర్తుకు వస్తుంది. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో ధనుష్, శ్రుతీహాసన్ హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా ఇది. 2012లో విడుదలైన ఈ సినిమాలోని 'కొలవెరి' సాంగ్ బాగా పాపులర్ అయ్యింది కానీ, సినిమా మాత్రం ఆడియన్స్‌ను అంతగా అలరించలేకపోయింది. ఇటీవల '3' సినిమా రీ రిలీజ్ కాగా, ఆడియన్స్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ లభించింది. అయితే '3' సినిమా గురించి శ్రుతీహాసన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ''3' సినిమా విడుదలపై అప్పట్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా విడుదల తర్వాత కోలీవుడ్‌లో నాకు చాలా ఆఫర్లు వస్తాయనుకున్నాను. కానీ ఊహించినట్లుగా జరగలేదు. తమిళ చిత్ర పరిశ్రమలో నాకు అవకాశాలు రాలేదు. ఇతర భాషల్లో హీరోయిన్‌గా చేశాను. '3' తర్వాత తమిళంలో నేను మరో సినిమా చేయడానికి రెండు సంవత్సరాలు పట్టింది. కెరీర్ పరంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా కూడా తమిళంలో సినిమాలు చేయడాన్ని మాత్రం కొనసాగిస్తాను'' అని శ్రుతీహాసన్ పేర్కొన్నారు.

పన్నెండేళ్ల తర్వాత...


● నితిన్

నితిన్ కెరీర్‌లో వన్నాఫ్ ది బెస్ట్ హిట్స్‌లో 'ఇష్క్' ఒకటి. 2012లో విడుదలైన ఈ సినిమా నితిన్ కెరీర్‌ను హిట్ ట్రాక్ ఎక్కించింది. ఈ సినిమాలో నిత్యా మీనన్ హీరోయిన్‌గా నటించగా, విక్రమ్ కె. కుమార్ దర్శకత్వం వహించారు. దాదాపు పన్నెండు సంవత్సరాల తర్వాత దర్శకుడు విక్రమ్ కె. కుమార్‌తో హీరో నితిన్ మరో సినిమా చేయనున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఆల్రెడీ విక్రమ్. కె కుమార్ ఓ కథను నితిన్‌కు వినిపించగా, నితిన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా మొదలయ్యాయని, యూవీ క్రియేషన్స్ ఈ సినిమాను నిర్మించనుందని భోగట్టా. త్వరలోనే అధికారిక ప్రకటన రానుందట. ప్రస్తుతం నితిన్ 'రాబిన్ హుడ్, తమ్ముడు' సినిమాలతో బిజీగా ఉన్నారు. 'బలగం' ఫేమ్ వేణు ఎల్దండితో 'ఎల్లమ్మ' సినిమా కమిట్ అయ్యారు. 'ఎల్లమ్మ' సినిమాతో సమాంతరంగా విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలోని సినిమాను కూడా సెట్స్‌పైకి తీసుకుని వెళ్లాలన్నది నితిన్ ప్లాన్ అట. ఇక 'రాబిన్ హుడ్' చిత్రం డిసెంబరు 25న, 'తమ్ముడు' సినిమా వచ్చే ఏడాది మహాశివరాత్రి సందర్భంగా రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే.

బిజినెస్ రీల్

ఐఎల్అండ్ఎఫ్ఎస్ 'పరిష్కారానికి' గడువు పెంపు

న్యూఢిల్లీ: సంక్షోభంలో చిక్కుకున్న ఐఎల్అండ్ఎఫ్ఎస్ గ్రూప్‌లో భాగమైన 58 సంస్థల రుణ పరిష్కార ప్రక్రియను పూర్తి చేయడానికి నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) 2025 మార్చి 31 వరకు గడువును పొడిగించింది. అప్పటివరకు వాటిపై మారటోరియంను కూడా పెంచింది. పరిష్కార ప్రణాళిక అమలు పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన ద్విసభ్య బెంచ్ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణను ఏప్రిల్ తొలి వారానికి వాయిదా వేసింది. రూ. 99,355 కోట్ల రుణభారంతో కుదేలైన ఐఎల్అండ్ఎఫ్ఎస్ గ్రూప్ బోర్డును 2018లో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) రద్దు చేసి, కొత్త సభ్యులను నియమించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత గ్రూప్‌ను చక్కదిద్దే ప్రయత్నాల్లో భాగంగా కొత్త బోర్డు ఆర్థిక పరిస్థితులను బట్టి గ్రూప్‌లోని 302 కంపెనీలను వివిధ కేటగిరీల కింద వర్గీకరించింది. ఇందులో రూ. 37,700 కోట్ల రుణ భారం పరిష్కారం కాగా, 188 సంస్థలకు సంబంధించి ప్రణాళిక ఖరారు అయింది. వీటిలో 58 సంస్థలకు మాత్రమే మారటోరియంపరమైన రక్షణ అవసరమని కంపెనీ తెలియజేయడంతో ఎన్‌సీఎల్ఏటీ తాజా ఉత్తర్వులు ఇచ్చింది.

కల్పతరు ప్రాజెక్ట్స్‌కు రూ.2,273 కోట్ల ఆర్డర్స్

న్యూఢిల్లీ: కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ రూ.2,273 కోట్ల ఆర్డర్స్ దక్కించుకుంది. కొత్త ఆర్డర్లు భారత్‌లోని ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యాపారం.. అలాగే విదేశీ మార్కెట్లతో పాటు దేశంలోని నివాస భవనాల ప్రాజెక్ట్‌లకు సంబంధించినవి. జాయింట్ వెంచర్స్, అంతర్జాతీయ అనుబంధ సంస్థలు ఈ ఆర్డర్లను పొందాయని కల్పతరు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'కంపెనీ ఆర్డర్ బుక్ ముఖ్యంగా భారత్‌లో ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యాపారంలో గణనీయమైన జోరుతో బలోపేతం అవుతూనే ఉంది. తాజా ఆర్డర్లతో ఈ ఏడాదికి ఆర్డర్ బుక్ సుమారు రూ.14,100 కోట్లుగా ఉంది. ఆర్డర్స్‌లో 56 శాతం వాటా ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ విభాగం కైవసం చేసుకుంది. బిల్డింగ్స్, ఫ్యాక్టరీస్ విభాగం సైతం మెరుగ్గా ఉంది' అని కల్పతరు ఎండీ, సీఈవో మనీష్ మొహ్నోట్ వివరించారు. పవర్ ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్, నీటి సరఫరా, నీటిపారుదల, రైల్వేలు, ఆయిల్, గ్యాస్ పైప్‌లైన్‌లు, అర్బన్ మొబిలిటీ, హైవేలు, విమానాశ్రయాల విభాగాల్లో ప్రత్యేక ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) కంపెనీలలో కల్పతరు ప్రాజెక్ట్స్ ఒకటి.

జొమాటోతో ఎన్ఎస్ఈ జట్టు

న్యూఢిల్లీ: గిగ్ ఎకానమీ వర్కర్లలో మదుపు, ఆర్థికాంశాలపైన అవగాహన పెంచే దిశగా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాం జొమాటోతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) వెల్లడించింది. దీని ప్రకారం ప్రత్యేకంగా జొమాటో డెలివరీ పార్ట్‌నర్స్ కోసం రూపొందించిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఇందులో పర్సనల్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, ఇన్వెస్టింగ్‌కి సంబంధించి ప్రాథమిక అంశాలు ఉంటాయని ఎన్ఎస్ఈ తెలిపింది. పలు ప్రాంతీయ భాషల్లో బడ్జెటింగ్, పొదుపు, పెట్టుబడులు, బీమా మొదలైనవాటి గురించి వివరించనున్నట్లు పేర్కొంది. ఇప్పటికే 2,000 మంది డెలివరీ పార్ట్‌నర్స్ ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగమైనట్లు వివరించింది. దేశవ్యాప్తంగా 50,000 మంది తాత్కాలిక వర్కర్లకు ఇది ప్రయోజనం చేకూర్చగలదని ఎన్ఎస్ఈ పేర్కొంది.



న్యూ ఆడి క్యూ7

బుకింగ్‌లు ప్రారంభం ● ఈ నెల 28న విడుదల

ముంబై: లగ్జరీ కార్ల సంస్థ ఆడి.. నూతన ఆడి క్యూ7 మోడల్ కార్ల బుకింగ్‌లను ప్రారంభించినట్టు ప్రకటించింది. ఆడి ఇండియా వెబ్‌సైట్ లేదా 'మైఆడికనెక్ట్' మొబైల్ యాప్ నుంచి రూ.2,00,000 చెల్లించడం ద్వారా బుక్ చేసుకోవచ్చని సూచించింది. ఈ నెల 28న విడుదల చేసే న్యూ ఆడి క్యూ7 మోడల్ కార్లను ఔరంగాబాద్‌లోని ప్లాంట్‌లో అసెంబుల్ చేయనుంది. 3.0లీటర్ల వీ6 టీఎఫ్ఎస్ఐ ఇంజన్ కలిగిన ఆడి క్యూ7.. 340 హెచ్‌పీ పవర్, 500 ఎన్ఎం టార్క్‌తో ఉంటుంది. సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 5.6 సెకండ్లలో అందుకుంటుందని, 250 కిలోమీటర్ల గరిష్ట వేగంతో వస్తుంది.

మొదటి రెండు స్థానాలే లక్ష్యం

● అడుగు పెట్టే వ్యాపారంలోనూ అంతే
● ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కేఎం బిర్లా



న్యూఢిల్లీ: 'చేస్తున్న, ప్రవేశించే ప్రతి వ్యాపారంలో మొదటి లేదా రెండవ స్థానంలో ఉండాలనుకుంటున్నాం. కాబట్టి సామర్థ్యం పెంపు ఏకైక మార్గం. అలా కాని పక్షంలో ఈ రోజు మనుగడ సాగించడం చాలా కష్టమని నేను భావిస్తున్నాను. లేదంటే అధిక మార్జిన్‌లను అందించే చాలా ప్రత్యేక, ఉన్నత సాంకేతికత ఉండాలి' అని ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కేఎం బిర్లా అన్నారు. ఒక మీడియా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. 'ఆదిత్య బిర్లా గ్రూప్ దాదాపు 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు చేసింది. ప్రధానంగా తయారీ రంగంలో పెట్టుబడి పెట్టాం. కంపెనీ నిర్వహించే అన్ని విభాగాలలో మొదటి రెండు స్థానాల్లో నిలవాలని లక్ష్యంగా చేసుకున్నాం. గ్రూప్ పెట్టుబడులు చాలా వరకు రాబోయే 15–20 ఏళ్లలో వ్యాపార దృక్పథం దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలికంగా ఉంటాయి. విలువలు, వ్యక్తులు, సామర్థ్యం పెంపు, దీర్ఘకాలిక లక్ష్యంతో వ్యాపారాల నిర్వహణ అనేది సంస్థ వ్యాపార విధానాన్ని నిర్వచించే కీలక వ్యూహాలు' అని వెల్లడించారు.

కఠినమైన నిర్ణయాలు..

గ్రూప్ సంస్థ హిందాల్కో ద్వారా నోవెలిస్‌ను కొనుగోలు చేయడంతో సహా అనేక కఠినమైన నిర్ణయాలను తీసుకున్నామని బిర్లా తెలిపారు. నోవెలిస్‌ను దక్కించుకోవడానికి 6 బిలియన్ డాలర్లు వెచ్చించినట్టు చెప్పారు. 'నేను ఒక కంపెనీని (నోవెలిస్) కొనుగోలు చేశాను. అది చాలా పెద్దది. షేరు దెబ్బతింది. ముఖ్యమైనది కాదని పెట్టుబడిదారులు స్పష్టం చేశారు. తిరిగి పుంజుకోవడానికి దాదాపు ఏడాది పట్టింది. ఆ నిర్ణయం తీసుకున్న ఏ ప్రొఫెషనల్ సీఈవో అయినా తొలగించబడతారు. ఎందుకంటే ఆ సమయంలో అది తప్పుగా అనిపించింది' అని అన్నారు. దీర్ఘకాలానికి వ్యాపారాలు నిర్వహించడం అనేది మనలో ఒక సంస్కృతి అని వివరించారు. కంపెనీ 36 ఏళ్లలో 100 మిలియన్ టన్నుల సిమెంట్ సామర్థ్యాన్ని నిర్మించింది. వచ్చే 5 ఏళ్లలో దీనిని 150 మిలియన్ టన్నులకు, 10 ఏళ్లలో 200 మిలియన్ టన్నులకు పెంచుతామని ఆయన తెలిపారు.

సవాళ్లలోనూ పీఎస్‌బీల బలమైన పనితీరు

ఆదాయంలో 11 శాతం వృద్ధి
● 26% అధికంగా నికర లాభం ● కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడి



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) ప్రభుత్వరంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) బలమైన పనితీరు చూపించాయని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. పీఎస్‌బీల నికర లాభం 26 శాతం పెరగ్గా, వ్యాపారం 11 శాతం వృద్ధి చెందినట్టు తెలిపింది. ఎస్‌బీఐ, పీఎన్‌బీ, యూనియన్, కెనరా బ్యాంక్ సహా మొత్తం 12 ప్రభుత్వరంగ బ్యాంకుల గణాంకాలు ఇందులో ఉన్నాయి. ''క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చిచూసినప్పుడు రుణాలు 12.9 శాతం వృద్ధితో రూ.102.29 లక్షల కోట్లు, డిపాజిట్లు 9.5 శాతం వృద్ధితో రూ.133.75 లక్షల కోట్లకు చేరాయి. ఈ కాలంలో నిర్వహణ లాభం 14.4 శాతం పెరిగి రూ.1,50,023 కోట్లుగా, నికర లాభం 25.6 శాతం పెరిగి రూ.85,520 కోట్లుగా ఉన్నాయి. స్థూల ఎన్‌పీఏలు 3.12 శాతం (1.08 శాతం తక్కువ), నికర ఎన్‌పీఏలు 0.63 శాతానికి (0.34 శాతం తగ్గదల) తగ్గాయి''అని ఆర్థిక శాఖ వెల్లడించింది.

ఫలితమిస్తున్న చర్యలు..

''బ్యాంకింగ్‌లో చేపట్టిన సంస్కరణలు, నిరంతర పర్యవేక్షణ చాలా వరకు సవాళ్లను పరిష్కరించాయి. రుణాల విషయంలో మెరుగైన క్రమశిక్షణ అవసరమైన వ్యవస్థలు, విధానాలు ఏర్పడ్డాయి. నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏలు) గుర్తింపు, వాటికి పరిష్కారం, రుణాల మంజూరీలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం, టెక్నాలజీ అమలు తదితర చర్యలు ఫలించాయి. స్థిరమైన ఆర్థిక శ్రేయస్సుకు, బ్యాంకింగ్ రంగం పటిష్టానికి దోహదపడ్డాయి. ఇదే పీఎస్‌బీల పనితీరులో ప్రతిఫలించింది'' అని ఆర్థిక శాఖ వివరించింది. ఏఐ/క్లౌడ్/బ్లాక్‌చైన్ తదితర టెక్నాలజీల విషయంలో పీఎస్‌బీలు గణనీయమైన పురోగతి చూపించడంతోపాటు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మెరుగుపరుచుకున్నట్టు వివరించింది. సైబర్ సెక్యూరిటీ రిస్క్‌లను తగ్గించేందుకు అవసరమైన వ్యవస్థలు/నియంత్రణలను అమల్లో పెట్టినట్టు తెలిపింది. అత్యుత్తమ కస్టమర్ అనుభూతికై చర్యలు తీసుకున్నట్టు పేర్కొంది.

స్వల్పంగా పెరిగిన పీవీ హోల్‌సేల్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా అక్టోబర్‌లో ప్యాసింజర్ వెహికిల్స్ (పీవీ) హోల్‌సేల్ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే స్వల్పంగా పెరిగి 3,93,238 యూనిట్లు నమోదయ్యాయి. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) ప్రకారం.. 2023 అక్టోబర్‌లో తయారీ కంపెనీల నుంచి డీలర్లకు చేరిన ప్యాసింజర్ వాహనాల సంఖ్య 3,89,714 యూనిట్లు. ద్విచక్ర వాహనాలు 14 % వృద్ధి చెంది 21,64,276 యూనిట్లను తాకాయి. ఇందులో స్కూటర్లు 22 శాతం అధికమై 7,21,200 యూనిట్లకు చేరుకున్నాయి. మోటార్‌సైకిల్స్ 11 % ఎగసి 13,90,696 యూనిట్లుగా ఉన్నాయి. మోపెడ్స్ స్వల్పంగా తగ్గి 52,280 యూనిట్లకు వచ్చి చేరాయి. త్రిచక్ర వాహనాల హోల్‌సేల్ అమ్మకాలు 77,344 నుంచి 76,770 యూనిట్లకు పడిపోయాయి. రెండు ప్రధాన పండుగలైన దసరా, దీపావళి ఈ ఏడాది ఒకే నెలలో వచ్చాయి. ఇవి సంప్రదాయకంగా వినియోగదారుల డిమాండ్‌ను పెంచుతాయి. ఆటో పరిశ్రమ పనితీరుకు గణనీయ ప్రోత్సాహాన్ని అందిస్తాయి. ప్యాసింజర్ వెహికిల్స్ గత నెలలో 0.9% వృద్ధితో అత్యధిక అమ్మకాలను నమోదు చేశాయి. ద్విచక్ర వాహనాలు సైతం గరిష్ఠ విక్రయాలు సాధించాయి. 2023 అక్టోబర్‌తో పోలిస్తే గత నెలలో ప్యాసింజర్, ద్విచక్ర వాహనాల రిజిస్ట్రేషన్స్‌లో 30 శాతానికి పైగా వృద్ధి కనిపించింది.

వంట నూనెల దిగుమతులు తగ్గాయ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వంట నూనెల దిగుమతులు 2023–24 ఆయిల్ మార్కెటింగ్ సంవత్సరానికి 3.09 శాతం తగ్గి 159.6 లక్షల టన్నులు నమోదయ్యాయి. దేశీయంగా నూనె గింజల ఉత్పత్తి పెరగడం, అధికం అవుతున్న ధరలతో డిమాండ్ తగ్గడం ఈ క్షీణతకు కారణమని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) తెలిపింది. ప్రపంచంలో అత్యధికంగా వంట నూనెలను దిగుమతి చేసుకుంటున్న భారత్.. 2022–23 నవంబర్–అక్టోబర్ ఆయిల్ మార్కెటింగ్ ఏడాదికి 164.7 లక్షల టన్నులు దిగుమతి చేసుకుంది. విదేశాల నుంచి భారత్ కొనుగోలు చేసిన ఈ నూనెల విలువ 2022–23తో పోలిస్తే రూ.1,38,424 కోట్ల నుంచి 2023–24లో రూ.1,31,967 కోట్లకు పడిపోయింది. వివిధ కారణాల వల్ల అంతర్జాతీయ ధరలు స్థిరపడ్డాయి. ఇది దేశీయ ధరల పెరుగుదలతో ప్రతిబింబించింది. అలాగే కొంత మేరకు దిగుమతులను తగ్గించింది' అని అసోసియేషన్ తెలిపింది.

విభాగాల వారీగా ఇలా..

ముడి పామాయిల్ దిగుమతులు 75.88 లక్షల టన్నుల నుంచి 69.70 లక్షల టన్నులకు వచ్చి చేరాయి. ఆర్‌బీడీ పామోలిన్ 21.07 లక్షల టన్నుల నుంచి 19.31 లక్షల టన్నులకు క్షీణించింది. సోయాబీన్ నూనె 35.06 లక్షల టన్నుల నుంచి 34.41 లక్షల టన్నులు నమోదైంది. పొద్దుతిరుగుడు నూనె 30.01 లక్షల టన్నుల నుంచి 35.06 లక్షల టన్నులకు ఎగసింది. శుద్ధి చేసిన నూనెల వాటా అయిదేళ్లలో 3 నుంచి ఏకంగా 12 శాతానికి దూసుకెళ్లింది.

డిజిటల్ విప్లవంలో భారత్ ముందంజ

● జీడీపీలో పదోవంతుకు ఈ విభాగం
● ఆర్థిక సాంకేతికత చోదకం
● ఈ కామర్స్ పురోగతీ కారణమే
● ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత



జైపూర్: డిజిటల్ విప్లవంలో భారతదేశం ముందంజలో ఉందని రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత పాత్ర తెలిపారు.ఆర్థిక సాంకేతికత డిజిటల్ చెల్లింపులను వేగవంతం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ''ఈ–మార్కెట్లు పురోగమిస్తున్నాయి. వాటి పరిధి విస్తరిస్తోంది. డిజిటల్ ఎకానమీ ప్రస్తుతం భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో పదో వంతుగా అంచనా. గత దశాబ్దంలో గమనించిన వృద్ధి రేటు ప్రకారం, 2026 నాటికి జీడీపీలో ఐదవ వంతుకు డిజిటల్ ఎకానమీ చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి'' అని ఈ అంశంపై జరిగిన డీఈపీఆర్ సదస్సులో డిప్యూటీ గవర్నర్ పేర్కొన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

- కొత్త వృద్ధి మార్గాలను అన్వేషించడానికి, ఇప్పటికే ఉన్న మార్గాలను పటిష్టం చేసుకోడానికి భారత్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)ని పటిష్టం చేసుకుంటోంది. శక్తివంతమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం, యువత అధికంగా ఉండడం, అతిపెద్ద ఆర్టిఫిషీయల్ ఇంటిలిజెన్స్ టాలెంట్ బేస్ భారత్‌కు సానుకూల అంశం.
- ఫైనాన్స్ రంగాన్ని డిజిటలైజేషన్ చేయడంపై దేశం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. దేశంలో బ్యాంకులు మొబైల్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్‌ను పటిష్టంగా అమలుచేస్తున్నాయి. ఆన్‌లైన్ ఖాతా తెరవడం, డిజిటల్ కేవైసీ, ఇంటి వద్దకే డిజిటల్ అనుసంధాన బ్యాంకింగ్ సేవలు వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. సాంకేతికత అనుసంధానంలో బ్యాంకింగ్ పురోగమిస్తోంది.
- ఐదు ప్రధాన అంశాలపై ఆర్‌బీఐ ప్రధానంగా దృష్టి సారిస్తోంది. అందరికీ డిజిటల్ ఫైనాన్షియల్ వ్యవస్థను అందుబాటులోనికి తీసుకురావడం, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పురోగతి, సైబర్ సెక్యూరిటీ, సుస్థిర ఫైనాన్స్, అంతర్జాతీయ సహకారం, సమన్వయం ఇందులో ఉన్నాయి.

ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులు కీలకమైనవి: ఆర్‌బీఐ

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లను 2024కు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి దేశీయ వ్యవస్థాత్మకంగా ముఖ్యమైన బ్యాంకులు (డీ–ఎస్ఐబీలు)గా పేర్కొంది. బ్యాంకుల నుండి సేకరించిన డేటా ఆధారంగా 2024 వరకూ ఈ వర్గీకరణ అమల్లో ఉంటుందని ఆర్‌బీఐ తెలిపింది. ఆర్‌బీఐ మొదట 2014లో డీ–ఎస్ఐబీలకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను ప్రకటించింది. 2015, 2016 జాబితాలో ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్‌లను చేర్చింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను 2017లో ఈ లిస్ట్‌లో చేర్చింది. డీ–ఎస్ఐబీ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం, ఈ జాబితాలోని బ్యాంకులు ఎకానమీ పురోగతిలో కీలకపాత్ర పోషిస్తాయి. అందరికీ ఆర్థిక ఫలాలు అందడంలో ఈ బ్యాంకుల సేవల కీలకమైనవి.

మున్సిపల్ కార్పొరేషన్ల ఆదాయాలు పెరగాలి...

ఇదిలావుండగా, ఆస్తిపన్ను సంస్కరణలు, వినియోగదారు చార్జీల హేతుబద్ధీకరణ, మెరుగైన వసూళ్ల విధానాల ద్వారా మున్సిపల్ కార్పొరేషన్లు తమ ఆదాయ వనరులను పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ నివేదిక సూచించింది. పెరుగుతున్న పట్టణ జనాభాతో పట్టణ ప్రాంతాల్లో అధిక–నాణ్యత ప్రజా సేవలకు డిమాండ్ వేగంగా పెరుగుతోందని 'మునిసిపల్ ఫైనాన్సెస్' పేరుతో విడుదలైన ఈ నివేదికలో ఆర్‌బీఐ తెలిపింది. స్థానిక పన్నుల సంస్కరణలు, ఈ విషయంలో మెరుగైన అమలు విధానాలు, సంస్థాగత సామర్థ్యాన్ని పెంపొందించడం, పారదర్శక ఆర్థిక నిర్వహణ ద్వారా మునిసిపల్ కార్పొరేషన్ల ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయాలని నివేదిక పేర్కొంది. ఈ విషయంలో ఆయా రాష్ట్రాలు నిర్దిష్ట వ్యూహాలు అవలంభించాలని పేర్కొంది.

ఇండియాకు వెయిటేజీ పెంచిన సీఎల్ఎస్ఏ

● గత నిర్ణయం నుంచి వెనక్కి
● తిరిగి 20% వెయిటేజీ
● చైనా ఎక్స్‌పోజర్‌కు కోత



న్యూఢిల్లీ: గరిష్టాల నుంచి 10% దిద్దుబాటుకు గురైన భారత ఈక్విటీల పట్ల అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ సీఎల్ఎస్ఏ సానుకూల వైఖరి తీసుకుంది. లోగడ ఖరీదుగా మారిన భారత ఈక్విటీల నుంచి చౌకగా మారిన చైనా స్టాక్స్ వైపు మళ్లిన ఈ సంస్థ.. భారత ఈక్విటీ వ్యాల్యూషన్లు దిగిరావడంతో ఇక్కడ ఎక్స్‌పోజర్ పెంచుకోవాలని నిర్ణయించింది. చైనా పెట్టుబడులు తగ్గించుకోనున్నట్టు ప్రకటించింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయంతో చైనా మార్కెట్లు పెద్ద సవాళ్లు ఎదుర్కోనున్నాయంటూ, తన తాజా నిర్ణయానికి ఇదే కారణంగా పేర్కొంది. చైనా వృద్ధిలో ఎగుమతుల వాటాయే సింహభాగం ఉండడం, చైనా దిగుమతులపై భారీ సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించడాన్ని గుర్తు చేసింది. భారత్‌లో అధికంగా ఉన్న ఎక్స్‌పోజర్ నుంచి కొంత మేర అక్టోబర్ మొదటి వారంలో చైనాకు మళ్లించినట్టు పేర్కొంది. భారత వెయిటేజీని 20% నుంచి 10%కి తగ్గించి, చైనా అలోకేషన్‌ను 5%కి సీఎల్ఎస్ఏ లోగడ పెంచుకోగా, ఇప్పుడు పూర్వపు స్థితికి మారుతున్నట్టు ప్రకటించింది. భారత్‌లో 20% ఇన్వెస్ట్ చేయాలని తాజాగా నిర్ణయించింది. నెలన్నర రోజుల్లో భారత ఈక్విటీల నుంచి ఎఫ్‌పీఐలు సుమారు రూ.లక్షన్నర కోట్లను తరలించుకుపోయిన నేపథ్యంలో సీఎల్ఎస్ఏ నిర్ణయానికి ప్రాధాన్యం ఏర్పడింది. పలువురు అంతర్జాతీయ ఇన్వెస్టర్లు తమ భారత ఈక్విటీ ఎక్స్‌పోజర్‌ను పెంచుకునేందుకు ఈ తరహా కరెక్షన్ కోసం చూస్తున్నట్టు తెలిపింది.

చైనాకు ప్రతికూలతలు..

చైనా ఆర్థిక భవిష్యత్ అనిశ్చితిగా ఉన్నట్టు సీఎల్ఎస్ఏ తెలిపింది. చైనా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ఇటీవల ప్రకటించిన ఉద్దీపనలు ఆర్థిక వృద్ధికి కావాల్సినంత ప్రేరణనివ్వలేవని అభిప్రాయపడింది. యూఎస్ ఈల్డ్స్ పెరుగుతుండడం, ద్రవ్యోల్బణంపై అంచనాలు యూఎస్ ఫెడ్, చైనా సెంట్రల్ బ్యాంక్‌లు తమ పాలసీని మరింత సరళించే అవకాశాలను పరిమితం చేయనున్నట్టు పేర్కొంది. ఈ అంశాలతో చైనా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ఉద్దీపనల తర్వాత చైనా మార్కెట్ వైపు వెళ్లిన ఆఫ్‌షోర్ ఇన్వెస్టర్లు వెనక్కి రావొచ్చని అంచనా వేసింది.

ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో ఇళ్ల ధరలు రెట్టింపు

న్యూఢిల్లీ: గురుగ్రామ్, నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్ (ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతం) పరిధిలో గడిచిన ఐదేళ్ల కాలంలో కొత్త ప్రాజెక్టుల్లోని ఇళ్ల ధరలు సగటున రెట్టింపైనట్టు రియల్ ఎస్టేట్ డేటా అనలైటిక్ సంస్థ ప్రాప్ ఈక్విటీ తెలిపింది. 2019 నుంచి 2024 సెప్టెంబర్ మధ్య కాలంలో నోయిడాలో అత్యధికంగా చదరపు అడుగు (ఎస్ఎఫ్‌టీ) ధర 152 శాతం మేర పెరిగి రూ.5,910 నుంచి రూ.14,946కు చేరింది. ఘజియాబాద్‌లో 139 శాతం పెరిగి రూ.3,691 నుంచి రూ.8,823కు చేరింది. గురుగ్రామ్‌లో ఎస్ఎఫ్‌టీ ధర రూ.19,535కు చేరింది. 2019లో ఉన్న రూ.8,299తో పోల్చి చూస్తే 135 శాతం పెరిగింది. గ్రేటర్ నోయిడాలో చదరపు అడుగు ధర 121 శాతం పెరిగి రూ.8,601గా ఉంది. 2019లో ఇక్కడ చదరపు అడుగు రేటు రూ.3,900గా ఉంది.

కొత్త ఉద్యోగాలకు టెక్నాలజీ దన్ను



ముంబై: వర్ధమాన సాంకేతికతల తోడ్పాటుతో కొత్తగా కోట్ల సంఖ్యలో కొలువులు అందుబాటులోకి రానున్నాయి. దీంతో 2023లో 42.37 కోట్లుగా ఉన్న వర్కర్ల సంఖ్య 2028 నాటికి 45.76 కోట్లకు పెరగనుంది. వెరసి అయిదేళ్ల వ్యవధిలో వర్కర్ల సంఖ్య 3.38 కోట్ల స్థాయిలో వృద్ధి చెందనుంది. వినూత్న టెక్నాలజీల దన్నుతో కీలక రంగాల్లో కొత్తగా 27.3 లక్షల టెక్ కొలువులు రానున్నాయి. అమెరికన్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సర్వీస్‌నౌ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ఆర్థిక, సాంకేతిక పరివర్తన కారణంగా తయారీ రంగంలో 15 లక్షలు, విద్యారంగంలో 8.4 లక్షలు, ఆరోగ్య సంరక్షణ రంగంలో 80 లక్షల మేర ఉద్యోగాలు పెరగనున్నాయి. అధునాతన నైపుణ్యాలు అవసరమయ్యే హై–వేల్యూ ఉద్యోగాల కల్పనలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషించనుంది. జనరేటివ్ ఏఐ విభాగం పురోగమించే కొద్దీ ఏఐ సిస్టమ్స్ ఇంజినీర్లు, ఇంప్లిమెంటేషన్ కన్సల్టెంట్లు, ప్లాట్‌ఫాం ఓనర్లకు గణనీయంగా ప్రయోజనం చేకూరనుంది. రిటైల్ ప్రొఫెషనల్స్ మెరుగైన అవకాశాలు దక్కించుకునేందుకు సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, డేటా ఇంజినీరింగ్ వంటి విభాగాలకు సంబంధించి తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాల్సి ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

17-11-2024

విశాఖ	545–00
చిత్తూరు	593–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	560–00
విజయవాడ	565–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

ఫ్రాడ్ డిటెక్షన్ వ్యవస్థతో ప్రజల ఆస్తులు భద్రం..

కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రి సింధియా వెల్లడి



న్యూఢిల్లీ: ఫ్రాడ్ కాల్స్‌ను గుర్తించేందుకు అమలు చేస్తున్న సాంకేతిక వ్యవస్థతో (సంచార్ సాథీ, చక్షు) ఇప్పటివరకు రూ. 2,500 కోట్ల విలువ చేసే ప్రజల ఆస్తులను కాపాడగలిగామని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఈ నెట్‌వర్క్ ప్రతి రోజూ దాదాపు 1.35 కోట్ల ఫ్రాడ్ కాల్స్‌ను బ్లాక్ చేస్తోందని చెప్పారు. 2.9 లక్షల ఫోన్లను డిస్కనెక్ట్ చేయడంతో పాటు మెసేజీలను పంపించేందుకు ఉపయోగించే 18 లక్షల పైచిలుకు హెడర్లను బ్లాక్ చేసినట్లు మంత్రి వివరించారు. చాలా మటుకు స్పామ్ కాల్స్ విదేశాల్లోని సర్వర్ల నుంచి వస్తున్నాయని సింధియా తెలిపారు. మరోవైపు, వచ్చే ఏడాది మే నాటికి బీఎస్ఎన్ఎల్ 5జీని ఆవిష్కరించడం, శాచురేషన్ స్కీమ్ కింద ఏప్రిల్ నాటికి అందరికీ 4జీ సేవలను అందుబాటులోకి తేవడం, డిసెంబర్ నాటికి టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023లోని మిగతా నిబంధనలను నోటిఫై చేయడం తదితర అంశాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆయన వివరించారు. బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలకు సంబంధించి 1 లక్ష బేస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో ఇప్పటికే 50,000 టవర్ల ఏర్పాటు పూర్తయిందని పేర్కొన్నారు.

వినియోగానికి తగ్గట్టుగా చార్జీలు చెల్లించాలి

వొడాఫోన్ ఐడియా సీఈవో



న్యూఢిల్లీ: టెలికం కంపెనీలు మరోసారి చార్జీలు పెంచే అవకాశం ఉందా? ఇన్వెస్టర్లతో ఎర్నింగ్స్ కాల్ సందర్భంగా వొడాఫోన్ ఐడియా సీఈవో అక్షయ మూంద్రా చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ఎక్కువ డేటాను వినియోగించే టెలికం చందాదారులు పరిశ్రమకు సహేతుక రాబడిని అందించడానికి, సమాజంలోని అన్ని వర్గాలకు కనెక్టివిటీని చేర్చడానికి మరింత చెల్లించాలని ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. కొత్త టెక్నాలజీ వినియోగానికి, డేటా వృద్ధికి తోడ్పడటానికి భారీ పెట్టుబడులు అవసరమని, అదే సమయంలో సమాజంలోని అన్ని వర్గాలకు కనెక్టివిటీని అందించడానికి టారిఫ్‌లు అందుబాటు ధరలో కొనసాగించాలని ఆయన అన్నారు. పెట్టుబడిపై సహేతుక రాబడిని అందుకోవడానికి పరిశ్రమకు వీలు కల్పించేందుకు డేటాను మరింత ఎక్కువగా ఉపయోగించే కస్టమర్లు ఎక్కువ చెల్లించినప్పుడు ఇది సాధ్యమవుతుందని వివరించారు. పరిశ్రమ తన మూలధన వ్యయాన్ని తిరిగి పొందేందుకు టారిఫ్‌ల హేతుబద్ధీకరణ అవసరం అని నొక్కి చెప్పారు. టారిఫ్ పెంపు ఫలితంగా కంపెనీ త్రైమాసిక ప్రాతిపదికన కస్టమర్లను కోల్పోయినప్పటికీ.. మరొకసారి టారిఫ్‌ల పెంపు అవసరమని సూచించారు. టారిఫ్‌ల సవరణ కారణంగా రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా భారీగా చందాదార్లను కోల్పోయాయి. అత్యధికులు బీఎస్ఎన్ఎల్‌కు మారారు. 'సెప్టెంబర్ త్రైమాసికంలో బీఎస్ఎన్ఎల్ ప్రభావం ఉంది. ఆగస్ట్ నుండి క్రమంగా నవంబర్ వరకు ఆ ప్రభావం చాలా త్వరగా తగ్గుతోంది' అని మూంద్రా అన్నారు.



దక్షిణాఫ్రికా జట్టుపై గెలిచిన టి20 సిరీస్ ట్రోఫీతో భారత క్రికెటర్లు

సరిలేరు మీకెవ్వరు!

టి20 ఫార్మాట్‌లో అమేయ శక్తిగా భారత్

- సత్తా చాటుతున్న యువ ఆటగాళ్లు
- దిగ్గజాల స్థానాన్ని భర్తీ చేస్తున్న కుర్రాళ్లు
- ఈ ఏడాది టి20ల్లో టీమిండియా జైత్రయాత్ర
- ఆడిన 26 మ్యాచ్‌ల్లో 24 విజయాలు
- ప్రపంచకప్‌తోపాటు ఐదు సిరీస్‌లు సొంతం

ప్రపంచ క్రికెట్‌లో ఏ జట్టయినా మేటి ఆటగాళ్ల నిష్క్రమణతో డీలా పడటం సహజమే! టీమిండియా విషయంలో మాత్రం అందుకు భిన్నమైన ఫలితాలు కనిపిస్తున్నాయి. ఏ ఫార్మాట్‌లోనైనా విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా వంటి ప్లేయర్లు ఆటకు వీడ్కోలు పలికితే వారి స్థానాలను భర్తీ చేయడం అంత సులువు కాదు. ఈ ఏడాది ఐసీసీ టి20 ప్రపంచకప్ నెగ్గిన అనంతరం ఈ ముగ్గురు పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించగా... దిగ్గజాలను మైమరిపించేందుకు మేమున్నామంటూ యువతరం దూసుకొస్తోంది!సంజూ సామ్సన్ సుదీర్ఘ కెరీర్‌ను గాడిన పెట్టుకునే ప్రయత్నం చేస్తుంటే... అడిగి మరీ బరిలోకి దిగిన మూడో స్థానంలో తానే సరైన వాడినని హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ నిరూపించుకున్నాడు. సూర్యకుమార్ తన సారథ్యంతో సత్తా చాటుతుంటే... హార్దిక్ పాండ్యా అసలు సిసలు ఆల్‌రౌండర్‌గా తనని తాను ఆవిష్కరించుకుంటున్నాడు. 'ఛోటా పటాకా... బడా ధమాకా' మాదిరిగా అభిషేక్ శర్మ చెలరేగుతుంటే... 'నయా ఫినిషర్' తానే అని రింకూ సింగ్ నిరూపించుకుంటున్నాడు. టి20ల్లో ప్రమాదకర బౌలర్‌గా అర్ష్‌దీప్ సింగ్ పరిణతి సాధిస్తే... వరుణ్, రవి బిష్ణోయ్ బౌలింగ్‌లో వైవిధ్యంతో కట్టిపడేస్తున్నారు. వీరంత సమష్టిగా కదం తొక్కుతుండటంతో భారత జట్టు ఈ ఏడాది టి20ల్లో జైత్రయాత్ర సాగించింది. ఆడిన 26 మ్యాచ్‌ల్లో 24 విజయాలతో అదరగొట్టిన నేపథ్యంలో ప్రత్యేక కథనం. **–సాక్షి క్రీడా విభాగం**

టి20 ఫార్మాట్‌లో నిర్వహించిన తొలి ప్రపంచ కప్ (2007) గెలిచిన తర్వాత... మరోసారి వరల్డ్ కప్ ట్రోఫీ ముద్దాడేందుకు సుదీర్ఘ కాలం నిరీక్షించిన టీమిండియా... ఈ ఏడాది రెండోసారి జగజ్జేతగా నిలిచింది. చాన్నాళ్లుగా ఐసీసీ ట్రోఫీ కోసం ఎదురు చూస్తున్న భారత జట్టు ఆ కల నెరవేర్చుకోవడంతో పాటు... అత్యుత్తమ ప్రదర్శనతో అదరగొట్టింది. వరల్డ్‌కప్‌లో ఒక్క మ్యాచ్ ఓడకుండా కప్ కైవసం చేసుకున్న టీమిండియా... మరో ఐదు సిరీస్‌లు సైతం చేజిక్కించుకుంది. అఫ్గానిస్తాన్‌పై 3–0తో, జింబాబ్వేపై 4–1తో, శ్రీలంకపై 3–0తో, బంగ్లాదేశ్‌పై 3–0తో, దక్షిణాఫ్రికాపై 3–1తో సిరీస్‌లు హస్తగతం చేసుకుంది. ఇందులో అఫ్గానిస్తాన్‌తో సిరీస్ తర్వాత టి20 వరల్డ్‌కప్ జరగ్గా... ఆ తర్వాత నుంచి సీనియర్ ప్లేయర్లు లేకుండా యువ ఆటగాళ్లతోనే టీమిండియా అద్భుతాలు చేసింది. కోహ్లి, రోహిత్, జడేజా వంటి సీనియర్లు ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడం... మిగిలిన కీలక ఆటగాళ్లు కూడా అన్ని సిరీస్‌లకు అందుబాటులో లేకపోవడం ఇలాంటి ఎన్నో ప్రతికూలతల మధ్య కూడా యువ ఆటగాళ్లు సత్తా చాటారు. భవిష్యత్తుపై భరోసా ఇస్తూ... బాధ్యత తీసుకునేందుకు మేమున్నామంటూ ముందుకు వచ్చారు. ఫలితంగా ఈ ఏడాది ఆడిన 26 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌ల్లో భారత్ 24 మ్యాచ్‌ల్లో విజయాలు సాధించింది. అందులో రెండు 'సూపర్ ఓవర్' విజయాలు కూడా ఉన్నాయి. ఓడిన రెండింట్లో ఒకటి వరల్డ్‌కప్ నెగ్గిన వారం రోజుల తర్వాత సరిగ్గా కుదురుకోకుండానే జింబాబ్వేతో ఆడిన మ్యాచ్ ఒకటి అయితే... తాజాగా దక్షిణాఫ్రికా సిరీస్‌లో చివరి వరకు పోరాడి ఓడిన రెండో టి20 మరొకటి. ఈ రెండు మినహా మిగిలిన మ్యాచ్‌లు చూసుకుంటే మన జట్టు చక్కటి ప్రదర్శన కనబర్చింది. ఓవరాల్‌గా విజయాల శాతాన్ని పరిశీలిస్తే... భారత్ 92.31 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. 2018లో పాకిస్తాన్ 19 మ్యాచ్‌లాడి 17 గెలిచి 89.47 శాతంతో రెండో స్థానంలో ఉంది.

ప్రతి 12 బంతులకో సిక్స్...

టీమిండియా జైత్రయాత్ర వెనక యువ ఆటగాళ్ల దూకుడు ఉందనేది వాస్తవం. ఈ ఏడాది గణాంకాలు చూస్తే... భారత జట్టు సగటున ప్రతి 12 బంతులకో సిక్స్ బాదింది. జాతీయ జట్టులో చోటు సుస్థిరం చేసుకోవాలనుకునే ప్రతి ఆటగాడు తమకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని చెలరేగుతుండటం వల్లే ఇది సాధ్యమైంది. ముఖ్యంగా ఐపీఎల్ ద్వారా వెలుగులోకి వచ్చిన తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, రింకూ సింగ్ వంటి హిట్టర్ల వల్ల జట్టు బ్యాటింగ్ శైలి మారిపోయింది. గతంలో కుదురుకున్నాక భారీ షాట్లు ఆడాలనే ధోరణి ఎక్కువగా కనిపించే టీమిండియాలో... ఇప్పుడు బాదుడే పరమావధి అనేది స్పష్టమవుతోంది. దక్షిణాఫ్రికాతో సిరీస్ సందర్భంగా వన్‌డౌన్‌లో అవకాశం దక్కించుకున్న తిలక్ వర్మకు... టీమిండియా తాత్కాలిక కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ కూడా ఇదే నూరిపోసానని వెల్లడించాడు. 'వికెట్ పడ్డా ఫర్వాలేదు. దూకుడు మాత్రం తగ్గించొద్దు. సహజసిద్ధమైన షాట్లు ఆడితేనే మెరుగైన ఫలితాలు వస్తాయి'అని లక్ష్మణ్ తనకు చెప్పినట్లు తిలక్ మ్యాచ్ అనంతరం వెల్లడించాడు. ఈ ఏడాది 4.68 బంతులకో బౌండరీ (ఫోర్, సిక్స్) కొట్టిన భారత జట్టు ఈ జాబితాలో ఆ్రస్టేలియా (4.39) తర్వాత రెండో స్థానంలో నిలిచింది.

ఏడు సెంచరీలు..

2024 క్యాలెండర్ ఏడాదిలో భారత ఆటగాళ్లు ఒక్క టి20 ఫార్మాట్‌లోనే ఏడు సెంచరీలు బాదారు. సంజూ సామ్సన్, తిలక్ వర్మ తాజా సిరీస్‌లోనే చెరో రెండు సెంచరీలు బాదగా... అంతకుముందు సామ్సన్ హైదరాబాద్ వేదికగా బంగ్లాదేశ్‌పై మరో శతకం సాధించాడు. రోహిత్ శర్మ, అభిషేక్ శర్మ కూడా ఒక్కోసారి మూడంకెల స్కోరు అందుకున్నారు. ఒక ఏడాదిలో టి20ల్లో ఒక జట్టు ప్లేయర్లు చేసిన అత్యధిక సెంచరీలు ఇవే కావడం విశేషం. సెంచరీ నమోదైన ప్రతి మ్యాచ్‌లోనూ టీమిండియా 200 పైచిలుకు పరుగులు చేసింది. మొత్తంగా 2024లో తొమ్మిది సార్లు భారత జట్టు 200+ స్కోర్లు నమోదు చేసింది. ప్రపంచంలో మరే జట్టు ఏడు సార్లకు మించి ఈ ఫీట్ అందుకోలేదు. ఈ క్రమంలో టీమిండియా 9.55 రన్‌రేట్‌తో పరుగులు రాబట్టింది. ఇది ఆ్రస్టేలియా (9.87) తర్వాత రెండో అత్యధికం. కేవలం బ్యాటింగ్‌లోనే మెరుపులు మెరిపిస్తే ఈ స్థాయి జైత్రయాత్ర సాధ్యమయ్యేది కాదు! బ్యాటర్ల మెరుపులకు బౌలర్ల సహకారం కూడా తోడవడంతోనే ఈ నిలకడ సాధ్యమైంది. ఈ ఏడాది పొట్టి ఫార్మాట్‌లో భారత జట్టు పదిసార్లు ప్రత్యర్థులను ఆలౌట్ చేసింది. సగటున ప్రతి మ్యాచ్‌లో టీమిండియా 8.39 వికెట్లు పడగొట్టింది. 2023 వరకు టీమిండియా కేవలం నాలుగు మ్యాచ్‌ల్లోనే ప్రత్యర్థిపై 100 పరుగుల తేడాతో విజయం సాధించగా... ఈ ఒక్క ఏడాదే మూడు సార్లు ఆ ఫీట్ నమోదు చేయడం కొసమెరుపు!

ఫ్యూచర్ స్టార్స్

యశస్వి జైస్వాల్, శుబ్‌మన్ గిల్ ఇప్పటికే నిరూపించుకోగా... ఇప్పుడు అభిషేక్ శర్మ, తిలక్ వర్మ ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. గత ఏడాది దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన మ్యాచ్‌లో డకౌట్ అయిన తిలక్ వర్మ... ఈసారి సఫారీ టూర్‌లో రెండు సెంచరీలతో అదరగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'అవార్డు గెలుచుకున్నాడు. నాలుక మడతేసి కొడితే బంతి బౌండరీ దాటాల్సిందే అన్న తరహాలో... దక్షిణాఫ్రికాలో విధ్వంస రచన చేసిన తిలక్‌పై సర్వత్ర ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో మాదిరిగా కాకుండా ఒకే బంతికి భిన్నమైన షాట్లు ఎలా ఆడొచ్చో తిలక్ చివరి మ్యాచ్‌లో నిరూపించాడు. జాన్సన్ వేసిన ఇన్నింగ్స్ 16వ ఓవర్ చివరి బంతికి తిలక్ డీప్ మిడ్‌వికెట్ మీదుగా కొట్టిన సిక్సర్ చూస్తే అతడు ఎంత పరిణతి సాధించాడో ఇట్టే చెప్పేయొచ్చు. గతంలో సంప్రదాయ షాట్లతోనే పరుగులు రాబట్టేందుకు ఎక్కువ ప్రయత్నించిన తిలక్... తాను కూడా వికెట్‌కు నాలుగు వైపులా పరుగుల వరద పారించగలనని నిరూపించుకున్నాడు. మ్యాచ్ అనంతరం కెప్టెన్, కోచ్ మాటలను బట్టి చూస్తే... తిలక్ మూడో స్థానంలో కుదురుకున్నట్లే అనిపిస్తోంది. ఇప్పటి వరకు 20 టి20లు ఆడిన తిలక్ వర్మ రెండు సెంచరీలు, రెండు హాఫ్‌సెంచరీలతో 51.33 సగటుతో 616 పరుగులు సాధించాడు. ఇన్నాళ్లు కోహ్లి ఆడిన మూడో స్థానంలో నిలకడ కొనసాగించగలిగితే 22 ఏళ్ల తిలక్‌కు మంచి భవిష్యత్తు ఉండనుంది.


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్... 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' ట్రోఫీలతో తిలక్ వర్మ

18 ఏళ్ల తర్వాత...

- ఏటీపీ ఫైనల్స్ టోర్నీ టైటిల్ పోరుకు అమెరికా ప్లేయర్
- సెమీస్‌లో జ్వెరెవ్‌పై విజయంతో ఫైనల్లోకి టేలర్ ఫ్రిట్జ్


ఫ్రిట్జ్

ట్యూరిన్ (ఇటలీ): పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నమెంట్ ఏటీపీ ఫైనల్స్‌లో ఈసారి కొత్త చాంపియన్ అవతరించనున్నాడు. ప్రతిష్టాత్మక ఈ టోర్నీలో అమెరికా ప్లేయర్, ఈ ఏడాది యూఎస్ ఓపెన్ రన్నరప్ టేలర్ ఫ్రిట్జ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్ 6–3, 3–6, 7–6 (7/3)తో రెండు సార్లు చాంపియన్ (2018, 2021), ప్రపంచ రెండో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)పై గెలుపొందాడు. ఫలితంగా 18 ఏళ్ల తర్వాత ఈ మెగా టోర్నీలో ఓ అమెరికా ఆటగాడు టైటిల్ కోసం తలపడనున్నాడు. చివరిసారి 2006లో అమెరికా ప్లేయర్ జేమ్స్ బ్లేక్ ఫైనల్లోకి ప్రవేశించి తుది సమరంలో రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచాడు. 1999లో పీట్ సంప్రాస్ తర్వాత మరో అమెరికా ప్లేయర్ ఏటీపీ ఫైనల్స్‌లో టైటిల్ సాధించలేకపోయాడు. జ్వెరెవ్‌తో 2 గంటల 21 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో ఫ్రిట్జ్ 15 ఏస్‌లు సంధించాడు. ఒకసారి తన సర్వీస్‌ను కోల్పోయి, ఒకసారి జ్వెరెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేశాడు. 31 విన్నర్స్ కొట్టిన ఫ్రిట్జ్ 34 అనవసర తప్పిదాలు చేశాడు. ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ), ప్రపంచ ఆరో ర్యాంకర్ కాస్పర్ రూడ్ (నార్వే) మధ్య రెండో సెమీఫైనల్ విజేతతో నేడు జరిగే ఫైనల్లో ఫ్రిట్జ్ తలపడతాడు.

రొనాల్డో మ్యాజిక్



పోర్టో: యూరోప్ నేషన్స్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పోర్చుగల్ జట్టు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. పోలాండ్ జట్టుతో జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో క్రిస్టియానో రొనాల్డో నాయకత్వంలోని పోర్చుగల్ జట్టు 5–1 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. పోర్చుగల్ తరఫున రొనాల్డో రెండు గోల్స్ (72వ, 87వ నిమిషాల్లో) సాధించాడు. 87వ నిమిషంలో రొనాల్డో గాల్లో ఎగురుతూ ఓవర్ హెడ్ కిక్‌తో చేసిన గోల్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. రాఫెల్ లియో (59వ నిమిషంలో), ఫెర్నాండెస్ (80వ నిమిషంలో), పెడ్రో నెటో (83వ నిమిషంలో) పోర్చుగల్‌కు ఒక్కో గోల్ సాధించి పెట్టారు. పోలాండ్ జట్టుకు మార్జుక్ (88వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు.

గిల్ చేతికి గాయం

ఆ్రస్టేలియాతో తొలి టెస్టుకు దూరం!

పెర్త్: ప్రతిష్టాత్మక 'బోర్డర్–గావస్కర్' సిరీస్‌కు ముందు టీమిండియాకు గాయాల బెడద వెంటాడుతోంది. ప్రాక్టీస్ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ మోచేతికి గాయం కాగా... ఇప్పుడు తాజాగా శుబ్‌మన్ గిల్ గాయపడ్డాడు. టెస్టు మ్యాచ్‌ను పోలిన పరిస్థితుల మధ్య (సిమ్యులేషన్) 'వాకా' మైదానంలో ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా... బంతిని ఆపే క్రమంలో గిల్ ఎడమ బొటన వేలికి తీవ్రగాయమైంది. బాధతో విలవిల్లాడి గిల్ వెంటనే గ్రౌండ్‌ను వీడాడు. పరీక్షల అనంతరం గిల్ వేలు విరిగినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. దీంతో ఈ నెల 22 నుంచి ఆ్రస్టేలియాతో ప్రారంభం కానున్న తొలి టెస్టుకు గిల్ అందుబాటులో ఉండటం అనుమానంగా మారింది. సాధారణంగా ఇలాంటి గాయాల నుంచి కోలుకునేందుకు కనీసం రెండు వారాల సమయం అవసరం కావడంతో... గిల్ తొలి మ్యాచ్ ఆడటం దాదాపు అసాధ్యమే. అయితే తొలి టెస్టుకు రెండో టెస్టుకు మధ్య వ్యవధి ఎక్కువ ఉండటంతో అడిలైడ్ వేదికగా డిసెంబర్ 6 నుంచి ప్రారంభం కానున్న రెండో మ్యాచ్ వరకు అతడు కోలుకోవచ్చని టీమ్ మేనేజ్‌మెంట్ అంచనా వేస్తోంది. గత ఆసీస్ పర్యటనలో మెరుగైన ప్రదర్శన కనబర్చిన గిల్... 'బోర్డర్–గావస్కర్' ట్రోఫీని నిలబెట్టుకోవడంలో కీలకపాత్ర పోషించాడు.

టాపార్డర్ బలహీనం!

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఆ్రస్టేలియాతో తొలి టెస్టుకు దూరమవుతాడనే వార్తలు వస్తున్న నేపథ్యంలో... గిల్ కూడా అందుబాటులో లేకపోతే భారత టాపార్డర్ బలహీనపడే అవకాశాలున్నాయి. రోహిత్ శర్మ భార్య శుక్రవారం పండంటి బాబుకు జన్మనివ్వగా... టెస్టు సిరీస్ ప్రారంభానికి ఇంకా గడువు ఉండటంతో అతడు జట్టుతో చేరితే ఓపెనింగ్ విషయంలో ఎలాంటి సమస్య ఉండదు. లేదంటే ఇప్పటి వరకు అంతర్జాతీయ అరంగేట్రం చేయని అభిమన్యు ఈశ్వరన్ ఇన్నింగ్స్ ఆరంభిస్తాడు. మరోవైపు తొలి రోజు బ్యాటింగ్ చేస్తూ గాయపడ్డ కేఎల్ రాహుల్ రెండో రోజు మైదానంలో అడుగు పెట్టలేదు. అయితే గాయం తీవ్రత ఎక్కువ లేకపోయినా... ముందు జాగ్రత్త చర్యగా అతడు విశ్రాంతి తీసుకున్నాడు. రేపటితో ప్రాక్టీస్ మ్యాచ్ ముగియనుండగా... మంగళవారం నుంచి మూడు రోజుల పాటు భారత జట్టు ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొననుంది. మరోవైపు గాయం నుంచి కోలుకొని రంజీ ట్రోఫీలో సత్తా చాటిన మొహమ్మద్ షమీ... ఆసీస్‌తో రెండో టెస్టుకు ముందు జట్టులో చేరే చాన్స్ ఉంది. రంజీ ట్రోఫీలో మధ్యప్రదేశ్‌తో మ్యాచ్‌లో బెంగాల్ తరఫున బరిలోకి దిగిన షమీ 43.2 ఓవర్ల పాటు బౌలింగ్ చేసి 7 వికెట్లు పడగొట్టడంతో పాటు 37 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు.


గిల్

స్పెన్సర్ సూపర్

- 5 వికెట్లతో మెరిసిన ఆసీస్ పేసర్
- రెండో టి20లోనూ పాకిస్తాన్‌పై గెలిచి సిరీస్ సొంతం చేసుకున్న ఆ్రస్టేలియా

సిడ్నీ: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆ్రస్టేలియా జట్టు... పాకిస్తాన్‌పై టి20 సిరీస్‌ను సొంతం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన రెండో టి20లో ఆసీస్ 13 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. మరో మ్యాచ్ మిగిలుండగానే 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది. ఆ్రస్టేలియా నిర్దేశించిన 148 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన పాకిస్తాన్‌ను ఆ్రస్టేలియా పేసర్ స్పెన్సర్ జాన్సన్ హడలెత్తించాడు. స్పెన్సర్ 26 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. ఫలితంగా పాక్ జట్టు 19.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఉస్మాన్ ఖాన్ (38 బంతుల్లో 52; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకం సాధించగా... ఇర్ఫాన్ ఖాన్ (28 బంతుల్లో 37 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) చివరి వరకు పోరాటం సాగించాడు. బాబర్ ఆజమ్ (3), ఫర్హాన్ (5), సల్మాన్ ఆఘా (0), అబ్బాస్ అఫ్రిది (4), కెప్టెన్ రిజ్వాన్ (16) విఫలమయ్యారు. అంతకుముందు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆ్రస్టేలియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. ఓపెనర్ మాథ్యూ షార్ట్ (17 బంతుల్లో 32; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్. మెక్‌గుర్క్ (20), మ్యాక్స్‌వెల్ (21), టిమ్ డేవిడ్ (18), హార్డీ (28) తమవంతు పరుగులు చేశారు. పాకిస్తాన్ బౌలర్లలో హారీస్ రవూఫ్ 4 వికెట్లు, అబ్బాస్ అఫ్రిది 3 వికెట్లు పడగొట్టారు. స్పెన్సర్ జాన్సన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన మూడో టి20 సోమవారం జరగనుంది.


స్పెన్సర్

పోరాడి ఓడిన అభయ్ సింగ్

కౌలాలంపూర్: ఏస్ మలేసియా స్క్వాష్ కప్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో భారత స్టార్ అభయ్ సింగ్ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 58వ ర్యాంకర్ అభయ్ సింగ్ 5–11, 4–11, 11–7, 4–11తో ప్రపంచ 14వ ర్యాంకర్ అయిన్ యో ఎన్జీ (మలేసియా) చేతిలో ఓడిపోయాడు. 49 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థికి ఆద్యంతం గట్టిపోటీనిచ్చిన అభయ్ కీలకదశలో తడబడి మూల్యం చెల్లించుకున్నాడు. ఈ టోర్నీలో అభయ్ అద్భుత ప్రదర్శన చేశాడు. రెండో రౌండ్‌లో నాలుగో సీడ్, ప్రపంచ 27వ ర్యాంకర్ అబ్దుల్లా అల్ తమీమి (ఖతర్)ను బోల్తా కొట్టించిన అభయ్ అందరి దృష్టిని ఆకర్షించాడు.



అశు రెయిడింగ్ అదుర్స్

14 పాయింట్లతో మెరిసిన దబంగ్ ఢిల్లీ స్టార్

నోయిడా: స్టార్ రెయిడర్ అశు మలిక్ 14 పాయింట్లతో సత్తా చాటడంతో... ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో దబంగ్ ఢిల్లీ ఐదో విజయం నమోదు చేసుకుంది. శనివారం జరిగిన పోరులో దబంగ్ ఢిల్లీ జట్టు 35–25 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది. 12 రెయిడ్ పాయింట్లు, 2 బోనస్ పాయింట్లతో అశు మలిక్ విజృంభించగా... అతడికి డిఫెన్స్‌లో యోగేశ్ దహియా (5 పాయింట్లు) సహకరించాడు. బెంగళూరు బుల్స్ తరఫున నితిన్ రావల్ 7 పాయింట్లు సాధించగా... స్టార్ రెయిడర్ ప్రదీప్ నర్వాల్ 5 పాయింట్లకే పరిమితమయ్యాడు. ఫలితంగా మ్యాచ్ ఏ దశలోనూ బెంగళూరు జట్టు ఢిల్లీకి పోటీనివ్వలేకపోయింది. తాజా సీజన్‌లో 11 మ్యాచ్‌లాడిన దబంగ్ ఢిల్లీ 5 విజయాలు, 5 పరాజయాలు, ఒక 'టై'తో 32 పాయింట్లు ఖాతాలో వేసుకొని ఐదో స్థానానికి ఎగబాకింది. పది మ్యాచ్‌ల్లో 8వ పరాజయంతో బెంగళూరు జట్టు పట్టికలో 11వ స్థానానికి పరిమితమైంది. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46–31 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌పై గెలుపొందింది. తలైవాస్ తరఫున విశాల్ 12 పాయింట్లతో రాణించగా... బెంగాల్ తరఫున విశ్వాస్ 9 పాయింట్లు సాధించాడు. లీగ్‌లో 10 మ్యాచ్‌లు ఆడిన తమిళ్ తలైవాస్ 4 విజయాలు, 5 పరాజయాలు, ఒక 'టై'తో 27 పాయింట్లు సాధించి ఏడో స్థానంలో ఉంది. నేడు జరగనున్న మ్యాచ్‌ల్లో హరియాణా స్టీలర్స్‌తో తమిళ్ తలైవాస్ (రాత్రి 8 గంటలకు), జైపూర్ పింక్ పాంథర్స్‌తో పుణేరి పల్టన్ (రాత్రి 9 గంటలకు) తలపడనున్నాయి.


శనివారం ఢిల్లీలో పొగ మంచు, కాలుష్యంతో మసకబారిన ఎన్‌హెచ్‌-24పై వాహనాల రాకపోకలు


హిమపాతంతో కొత్తందాలు సంతరించుకున్న కశ్మీర్‌ లోయలోని కుప్వారా జిల్లా మచిల్‌ ప్రాంతం


జలంధర్‌లో పొగమంచు గుండా ఆచితూచి వెళ్తున్న వాహనదారుడు

మీ పోలింగ్‌బూత్‌లో గెలుపుపై దృష్టి సారించండి

పార్టీ కార్యకర్తలకు మోదీ దిశానిర్దేశం

ముంబై: మీ పోలింగ్‌బూత్‌ స్థాయిలో గెలుపుపై ప్రధానంగా దృష్టిపెట్టాలని బీజేపీ కార్యకర్తలకు ప్రధాని మోదీ సూచించారు. 'మేరా బూత్‌ సబ్‌సే మజ్బూత్‌'కార్యక్రమంలో భాగంగా శనివారం ముంబైలోని కార్యకర్తలతో ఢిల్లీ నుంచి మోదీ వర్చువల్‌గా మాట్లాడారు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పార్టీ గెలుపుపై ఆయన వారితో చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కాంగ్రెస్, ఎన్సీపీ(ఎస్పీ), శివసేన(యూబీటీ)ల మహా వికాస్‌ అఘాడీ కూటమిపై విమర్శలు గుప్పించారు. ''బూత్‌స్థాయిలో స్థానిక మహిళలు, యువత, రైతులతో విడివిడిగా సమావేశాలు ఏర్పాటుచేయండి. వారికి సమస్యలు ఆలకించండి. మీ స్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రయత్నించండి. ప్రభుత్వం నుంచి అందే సాయం, కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రభుత్వ పథకాల వివరాలు, వీడియోలకు విస్తృత ప్రచారం కల్పించండి. వైద్యుల వంటి వృత్తినిపుణులనూ ఇందులో కలుపుకోండి''అని కార్యకర్తలకు సూచించారు. ''మహా వికాస్‌ అఘాడీ కూటమి మన గురించి చేసే దుష్ప్రచారాలను తిప్పకొట్టండి. వాస్తవాలను ప్రజలకు తెలియజేయండి. మహారాష్ట్రలో పర్యటించినప్పుడు ఎక్కడికెళ్లినా మన పార్టీ కార్యకర్తల కృషి కనిపిస్తోంది. మీరే బీజేపీకి బలమైన సైనికులు. ప్రజలతో నేరుగా అనుసంధానమయ్యే మోదీ ప్రతినిధులు మీరే. వాళ్ల ఆశలు, ఆకాంక్షలకు మీరు గ్యారెంటీ అన్న నమ్మకం వారిలో కల్పించండి. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందనేది మాకు మీ వల్లే తెలుస్తుంది. కలిసి అభివృద్ధి చెందాలనేది మన ప్రభుత్వ విజన్. దీంతో ఎదిగే అవకాశం ప్రతి ఒక్కరికి వస్తుంది''అని అన్నారు.

వారి అనైక్యతే కాంగ్రెస్‌ విజయరహస్యం

''దేశంలో ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు ఐక్యంగా లేని కాలంలో కాంగ్రెస్‌ పార్టీ భారీ మెజారిటీతో గెలుస్తూ అధికారాన్ని కైవసంచేసుకుంటూ వచ్చింది. ఎప్పుడైతే ఈ వర్గాలు ఐక్యత సాధించాయో అప్పటి నుంచి కాంగ్రెస్‌ బలం తగ్గుతూ వచ్చింది. మళ్లీ అధికారం కోసం ఈ వర్గాల వాళ్లందరినీ మళ్లీ కులగణన పేరిట విడగొట్టాలని కాంగ్రెస్‌ చూస్తోంది. మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం ప్రతి ఒక్క వర్గం అభ్యున్నతి కోసం పాటుపడుతోంది. మన ప్రభుత్వానికి, మహా వికాస్‌ అఘాడీ కూటమికి తేడా ఇదే. మహాయుతినే మహారాష్ట్రలో మరో ఐదేళ్లు అధికారంలో ఉండాలని ప్రజలు ఆశపడుతున్నారు. మహాయుతి ప్రభుత్వంపై ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. మహారాష్ట్రకు వచ్చిన ప్రతిసారీ వాళ్ల ప్రేమ నాకు కనిపిస్తోంది''అని మోదీ అన్నారు.

చివరి దశలో కాంగ్రెస్‌ ఉరుకులు!

రేపటితో ముగియనున్న ప్రచారం

- దాంతో ప్రచార పర్వంలో అగ్రనాయకత్వమంతా బిజీ
- జార్ఖండ్‌ ప్రచారంలో వెనుకబాటు
- అక్కడే ఖర్గే విస్తృత పర్యటనలు
- మహారాష్ట్రలో ఉధృతంగా ప్రచారం చేస్తున్న రాహుల్, ప్రియాంక

సాక్షి, న్యూఢిల్లీ: జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల ప్రచార గడువు ముగుస్తుండటంతో కాంగ్రెస్‌ ఉరుకులు పరుగులు పెడుతోంది. ప్రచారానికి మరో రెండ్రోజులే గడువు ఉండటంతో పార్టీ అగ్రనేతలంతా ప్రచారాన్ని హోరెత్తించే పనిలో పడ్డారు. ముఖ్యంగా జార్ఖండ్‌ ప్రచారంలో కాంగ్రెస్‌ వెనుకబడిందన్న నివేదికల నేపథ్యంలో అక్కడ ప్రచార బాధ్యతలను తనపై వేసుకున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వరుసపెట్టి ర్యాలీలలో పాల్గొంటున్నారు. జార్ఖండ్‌ ఎన్నికల్లో 81 అసెంబ్లీ స్థానాలకు గానూ కాంగ్రెస్‌ 30 స్థానాల్లో పోటీ చేస్తోంది, అందులో 17 స్థానాల్లో మొదటి దశలో నవంబర్‌ 13న ఓటింగ్‌ జరిగింది. మరో 13 స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటితో పాటే మిత్రపక్షాలైన జేఎంఎం, ఆర్జేడీ, సీపీఐ (ఎంఎల్‌) పోటీ చేసే స్థానాల్లో కాంగ్రెస్‌ ప్రచారం అనుకున్న స్థాయిలో లేదని మిత్రపక్షాల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. మిత్రపక్షాలు పోటీచేస్తున్న స్థానాలను వదిలేసి, పార్టీ అభ్యర్థులు పోటీలో ఉన్న స్థానాల్లో మాత్రమే ప్రచారం చేస్తున్నారని, తమ సొంత నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్‌ పార్టీ జెండాలు, ప్రచార వాహనాలు అంతంత మాత్రంగానే కనిపించడంతోపాటు ర్యాలీలకు జనాలను పోగుచేయడానికి ఆ పార్టీ నానా తంటాలు పడుతోందనే నివేదికలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం జార్ఖండ్‌లో విస్తృతంగా పర్యటించారు. జామ్‌తారా, రాంచీ, ఖిజ్రీలలో నాలుగు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఆదివారం సైతం ఆయన నాలుగు ర్యాలీల్లో పాల్గొనేలా షెడ్యూల్‌ ఖరారైంది. జేఎంఎం తరఫున ముఖ్యమంత్రి హేమంత్‌ సోరెన్, సతీమణి కల్పనా సోరెన్‌లు ఏకంగా 60 ర్యాలీలు నిర్వహించగా, కాంగ్రెస్‌ స్టార్‌ అగ్రనేత రాహుల్‌ గాంధీ ఇప్పటివరకు మొత్తం ఏడు సమావేశాలలో ప్రసంగించారు. అగ్రనేతల ప్రచారాలు తక్కువగా ఉండటంతో ప్రచారం చివరి రోజైన ఈ నెల 18న రాహుల్‌ మరో మూడు ర్యాలీల్లో పాల్గొనేలా చూడాలని పార్టీ భావిస్తోంది. ఇక మహారాష్ట్రలోని మొత్తం 288 స్థానాలకు ఒకే దశలో ఈ నెల 20న పోలింగ్‌ జరుగనున్న నేపథ్యంలో రాహుల్, ప్రియాంకగాంధీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శనివారం రాహుల్‌ అమరావతి, చంద్రాపూర్‌లలో పర్యటించగా, ప్రియాంక షిర్డీ, కొల్హాపూర్‌ సభల్లో పాల్గొన్నారు. ఆదివారం సైతం ఇద్దరు నేతలు నాలుగు బహిరంగ సభల్లో, రెండు ర్యాలీల్లో పాల్గొననున్నారు. ఇక ఉత్తర్‌ప్రదేశ్‌లో జరుగుతున్న 9 స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో సమాజ్‌వాదీ నేత అఖిలేశ్‌ యాదవ్‌తో కలిసి అగ్రనేతలు ఒక్కరోజైనా ప్రచారం చేయాలనే డిమాండ్లు వస్తున్నా ఇంతవరకు ఎలాంటి స్పష్టత లేదు. అవసరాన్ని బట్టి ప్రియాంకగాంధీ చివరి ర్యాలీని యూపీలో నిర్వహించాలని పార్టీ భావిస్తున్నా, అది కుదిరేపని కాదని ఏఐసీసీ వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి.



ఫ్యాషన్ ఐకాన్‌గా సూపర్‌ బామ్మ

ఇంటర్నెట్‌లో నయా సెన్సేషన్

ఆమెకు 80 ఏళ్ల పై చిలుకే. మామూలుగా అయితే కృష్ణా, రామా అనుకునే వయసు. కానీ మనవరాలి పుణ్యమా అని లేటుగానే అయినా ఫ్యాషన్‌ ప్రపంచంలోకి లేటెస్ట్‌గా ఎంట్రీ ఇచ్చిందీ 'బామ్మ'. కూలింగ్‌ గ్లాసెస్, కిల్లింగ్‌ లుక్స్‌తో ఫ్యాషన్‌ ప్రపంచాన్నే షేక్‌ చేసింది. రాత్రికి రాత్రే తిరుగులేని ఫ్యాషన్‌ ఐకాన్‌గా మారిపోయింది. జాంబియాకు చెందిన ఈ బామ్మ ఇప్పుడు ఇంటర్నెట్లో నయా సెన్సేషన్! 'గ్రాండ్‌మా కాదు, గ్లామ్మా' అంటూ నెటిజన్లు తనకోసం సరికొత్త పదాలే కనిపెట్టేస్తున్నారు!

అసలే ఆఫ్రికా ఖండం. పైగా అక్కడి నిరుపేద దేశాల్లో ఒకటైన జాంబియా. అందులోనూ గ్రామీణ ప్రాంతం. మార్గరెట్‌ చోలా ఫ్యాషన్‌ ప్రపంచంలో అడుగు పెట్టేందుకు ఇవేవీ అడ్డంకులు కాలేకపోయాయి. పైగా ఈ నేపథ్యం ఆమెకు మరింత సాయపడింది కూడా. ఇదంతా నిజానికి చాల యాదృచ్ఛికంగా జరిగింది. చోటా మనవరాలు డయానా కొంబా ఫ్యాషన్‌ స్టైలిస్టు. 2012లోనే న్యూయార్క్‌లో స్థిరపడింది. ఏడాది కింద తండ్రి రెండో వర్ధంతి సందర్భంగా సెలవుల్లో జాంబియా వచ్చింది. ఆ సందర్భంగా మనవరాలి ముచ్చట కాదనలేక సరదాకు ట్రెండీ ఫ్యాషన్‌ డ్రెస్సులు వేసుకుంది చోలా. వాటికి పాటు మనవరాలి సన్‌ గ్లాసెస్‌ పెట్టుకుంది. ఆ వస్త్రధారణలో బామ్మను చూసి మనవరాలు చెప్పలేనంతగా మురిసిపోయింది. అంతటితో ఆగకుండా గ్రానీ పేరిట ఫొటో షూట్‌ చేసి సోషల్‌ సైట్లలో పోస్ట్‌ చేసింది. అంతే! అది సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. లేటు వయసు, అత్యంత ట్రెండీ డ్రెస్సింగ్, దానికి పూర్తి విరుద్ధంగా నేపథ్యంలో చెట్లు, ఇటుక ఇళ్లు తదితరాలతో కూడిన 'పక్కా లోకల్‌' జాంబియా గ్రామీణ వాతావరణంతో కూడిన ఆ సిరీస్‌ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంది. దాంతో చూస్తుండగానే చోలా ఫేమస్‌ అయిపోయింది. 'బామ్మతో చేసిన తొలి ఫొటో షూట్‌ను ఇన్‌స్టాలో పెడితే కేవలం పది నిమిషాల్లో వెయ్యికి పైగా లైక్‌లు రావడంతో నోరెళ్లబెట్టా'నంటూ తొలినాటి రోజులకు గుర్తు చేసుకుంటూ ఆమె మనవరాలు మురిసిపోయింది. మరిన్ని ఫ్యాషన్‌ ఫొటో షూట్లు చేసి అప్‌లోడ్‌ చేయాల్సిందిగా కుప్పలు తెప్పలుగా రిక్వెస్టులు వచ్చిపడ్డాయి. అలా చోలా ఫ్యాషన్‌ జైత్రయాత్ర మొదలైంది. జీన్స్, మెడలోనూ రిస్టుకూ ట్రెండీ పెండెంట్లు, అరచేతులకు గ్లౌజులు, భుజానికి విలాసవంతమైన హ్యాండ్‌బ్యాగులు, ఒక్కోసారి ఓవర్‌ సైజ్‌డ్‌ హ్యాట్స్, ఇంకోసారి గమ్మత్తైన విగ్గులతో నానమ్మకు కొంబా రకరకాల యాంగిల్స్‌లో ఫొటో షూట్లు చేయడం, అవన్నీ ఇన్‌స్టంట్‌ హిట్లుగా మారడం చకచకా జరిగిపోయింది. చూస్తుండగానే చోలా యమా ఫేమస్‌ అయిపోయింది. 'గ్లామర్‌ గ్రాండ్‌మా'గా గుర్తింపు పొందింది. 'లెజెండరీ గ్లామ్మా' అనే నిక్‌నేమూ సాధించింది. ఇప్పుడు ఇన్‌స్టాలో ఆమెకు ఏకంగా 2.25 లక్షల మంది ఫాలోవర్లున్నారు. బీబీసీ వంటి ప్రఖ్యాత వార్తా సంస్థలు ఆమెను ఇంటర్వ్యూ చేసేందుకు క్యూ కడుతున్నాయి. ప్రపంచమంతటా లక్షలాది మంది తనను ఎంతగానో ఇష్టపడుతున్నారంటే ఎంతో గొప్పగా అనిపిస్తోందని చెబుతుంది మార్గరెట్. ''నా వరకూ అవి కేవలం ఫ్యాషన్‌ దుస్తులు మాత్రమే కాదు. ఎందుకంటే వాటిని ధరించగానే నాలోకి చెప్పలేనంత జీవకళ ప్రవేశించినట్టు ఫీలవుతుంటా. ఇదంతా నాకు సరికొత్త అనుభూతి. ఈ వయసులో కూడా యువతపై ఇంతటి ప్రభావం చూపగలుగుతున్నానంటే నమ్మశక్యంగా లేదు'' అని ఉత్సాహంగా, చెబుతుందామె. ''వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేననేందుకు ఈ గ్లామ్మాయే రుజువు. ఆమె గొంతులో తొణికిసలాడే ఆత్మవిశ్వాసం చిన్న విషయాలకే నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయే ఎంతోమంది యువతీ యువకులకు ప్రేరణ కావాలి'' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. వయసై పోయిందని భావించే పెద్దవాళ్లకు కూడా ఆమె స్ఫూర్తిగా నిలుస్తోందని మరికొందరు అంటున్నారు. అన్నట్టూ, 'గతాన్ని మార్చలేం. కానీ భవిష్యత్తును ఎలా దిద్దుకోవాలన్నది మాత్రం మన చేతుల్లోనే ఉంటుంది' అంటూ తన సిరీస్‌ల్లో బామ్మ చెప్పే కొటేషన్లకు సపరేట్‌ ఫ్యాన్‌ బేసే ఉంది! ఇంతా చేస్తే తనకు సరిగ్గా ఎన్నేళ్లో ఈ బామ్మకే తెలియదు. ఆ రోజుల్లో ఆమె పుట్టిన తేదీని ఎవరూ నమోదు చేయకపోవడమే కారణం.



– సాక్షి, నేషనల్‌ డెస్క్‌

శిశువుల మరణోదంతంపై విచారణ కమిటీ

లక్నో/ఝాన్సీ(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలోని మహారాణి లక్ష్మీభాయ్‌ వైద్య కళాశాలలో పది మంది నవజాత శిశువులు అగ్నికి ఆహుతైన ఘటనను యోగి ఆదిత్యనాథ్‌ సర్కార్‌ సీరియస్‌గా తీసుకుంది. నలుగురు సభ్యులతో దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం యోగి చెప్పారు. షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. శుక్రవారం రాత్రి 10.45 గంటలకు ఆస్పత్రిలోని నవజాతశిశువుల సంరక్షణా వార్డులో మంటలు చెలరేగి 10 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెల్సిందే. కాలం చెల్లిన అగ్నిమాపక సిలిండర్లు ఉన్నాయన్న వాదనలను డిప్యూటీ సీఎం బ్రిజేశ్‌ పాఠక్‌ కొట్టిపారేశారు. వైద్య విద్య, శిక్షణ డైరెక్టర్‌ జనరల్‌ సారథ్యంలోని దర్యాప్తు బృందం ఏడు రోజుల్లోపు తమ నివేదికను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఘటన జరిగినప్పుడు వార్డ్‌లో దాదాపు 54 మంది చిన్నారులున్నారు. 16 మందికి చికిత్స అందిస్తున్నారు.

దిగ్భ్రాంతికరం: రాష్ట్రపతి

ఘటనపై రాష్ట్రపతి స్పందించారు. ''మనసు ముక్కలైపోయిన ఘటన ఇది''అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ప్రధాని మోదీ కూడా దీనిపై దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. మృతుల కుటుంబాలకు కేంద్రం రూ.2 లక్షలు, ఉత్తరప్రదేశ్‌ ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాయి. బుందేల్‌ఖండ్‌లోని అతిపెద్ద ఆస్పత్రుల్లో ఇదీ ఒకటి. దీంతో ఈ ప్రాంతంలోని 9 అసెంబ్లీ నియోజకవర్గాలకు నవంబర్‌ 20న జరగనున్న ఉప ఎన్నికల్లో ఇది ఎన్నికల ప్రచారాస్త్రంగా మారింది. యూపీలోనే ఒక దాని వెంట మరొకటి ఇలాంటి విషాద ఘటనలు జరగడం యోగి సర్కార్‌ అసమర్థత, పాలనా వైఫల్యానికి నిదర్శనమని కాంగ్రెస్‌ నేత రాహుల్‌ గాంధీ విమర్శించారు. మృతులకు తలో రూ. 1 కోటి నష్టపరిహారం ప్రకటించాలని ఎస్పీ చీఫ్‌ అఖిలేశ్‌ యాదవ్‌ డిమాండ్‌చేశారు. ''రాత్రి వార్డ్‌ బయటే పడుకున్నా. ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో కిటికీ పగలగొట్టి లోపలికి వెళ్లి కొందరు శిశువులను రక్షించా. కానీ నా సొంత ఇద్దరు కుమార్తెలను కాపాడుకోలేకపోయా'అంటూ యాకూబ్‌ మన్సూరీ కన్నీటిపర్యంతమయ్యాడు. 11 రోజుల క్రితం పుట్టిన తన బిడ్డ ఇక లేడని తెల్సి సంతోషి అనే మహిళ గుండెలవిసేలా ఏడ్వడం చూసి అంతా కంటతడి పెట్టారు.

రాహుల్‌కు భయపడుతున్న మోదీ, షా: ప్రియాంక

షిర్డీ/కొల్హాపూర్‌/పుణే: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌ షాపై కాంగ్రెస్‌ నాయకురాలు ప్రియాంకా గాంధీ వద్రా మరోసారి విరుచుకుపడ్డారు. రిజర్వేషన్ల విషయంలో తన సోదరుడు, కాంగ్రెస్‌ అగ్ర నేత రాహుల్‌గాంధీపై వారిద్దరూ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ''నా సోదరున్ని చూసి వాళ్లు విపరీతంగా భయపడుతున్నారు. అందుకే ఈ చౌకబారు ఎత్తుగడకు దిగారు'' అంటూ ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్‌ సారథ్యంలోని విపక్ష ఎంవీఏ కూటమి తరఫున శనివారం ఆమె ముమ్మరంగా ప్రచారం చేశారు. షిర్డీ, కొల్హాపూర్, పుణే తదితర చోట్ల ర్యాలీల్లో ప్రసంగించారు. మహారాష్ట్రులతో పాటు దేశమంతటికీ ఆరాధ్యుడైన ఛత్రపతి శివాజీని రాష్ట్రంలో బీజేపీ సారథ్యంలోని అధికార మహాయుతి నేతలు అవమానించారని మండిపడ్డారు.

మనసు దోస్తున్న గ్లాడియేటర్‌ పిడి!

పాతికేళ్ల క్రితం వచ్చిన సూపర్‌హిట్‌ హాలీవుడ్‌ మూవీ గ్లాడియేటర్‌ గుర్తుంది కదా! దాదాపు 2,000 ఏళ్ల క్రితం రోమన్‌ సామ్రాజ్యంలో ఓ వెలుగు వెలిగిన యుద్ధ వీరులు వాళ్లు. రాజులు, కులీనులకు వినోదం పంచేందుకు ప్రాణాలను పణంగా పెట్టి పోరాడేవారు. వాటిని దర్శకుడు రిడ్లీ స్కాట్‌ ఒళ్లు గగుర్పొడిచే రీతిలో తెరకెక్కించారు. ఆ కాలానికి చెందిన గ్లాడియేటర్‌ కత్తి పిడి ఒకటి తాజాగా వెలుగు చూసింది. అయితే అది బయట పడింది బ్రిటన్‌లో కావడం విశేషం! సెక్యూటర్‌ తరగతికి చెందిన గ్లాడియేటర్‌ను దానిపై అత్యంత అందంగా చెక్కారు. తలకు శిరస్త్రాణం మొదలుకుని చేతిలో పెద్ద డాలు, పాదాలకు ఇనుప రక్షణల దాకా వీళ్లు ఆపాదమస్తకం కవచాలు ధరిస్తారు. రెటియారియస్, లేదా నెట్‌ మ్యాన్‌గా పిలిచే మరో తరహా గ్లాడియేటర్లు వీరితో తలపడతారు. కేవలం మోకాళ్ల దాకా ఉండే ఆప్రాన్‌ మినహా వీళ్ల ఒంటిపై ఎలాంటి కవచాలూ ఉండవు. చేతిలో వల వంటి ఆయుధంతో సెక్యూటర్‌ను వీళ్లు మట్టి కరిపించాల్సి ఉంటుందన్నమాట. పిడిలో చిత్రించిన గ్లాడియేటర్‌ది ఎడమచేతి వాటమని వారి చరిత్రపై లోతైన పరిశోధనలు చేసిన ఇంగ్లండ్‌కు చెందిన ప్రముఖ హెరిటేజ్‌ క్యూరేటర్‌ ఫ్రాన్సెస్‌ మాకింతోష్‌ చెప్పుకొచ్చారు. ప్రాచీన రోమ్‌లో ఇలాంటి గ్లాడియేటర్లను దుశ్శకునంగా భావించేవారు. కాకపోతే ప్రత్యర్థుల మీద పైచేయి సాధించేందుకు కొందరు గ్లాడియేటర్లు ఉద్దేశపూర్వకంగా ఈ వాటాన్ని అభ్యాసం చేసేవాళ్లని ఆమె వివరించారు. ''ఈ పిడి బ్రిటన్‌లో నార్త్‌ హంబర్‌లాండ్‌ వద్ద హాడ్రియన్స్‌ వాల్‌ను ఆనుకున్న కేంబ్రిడ్జ్‌ రోమన్‌ టౌన్‌ సమీపంలో టైన్‌ నదిలో దొరికింది. అక్కడే దొరకడం వెనక కారణం లేకపోలేదు. ఈశాన్య ఇంగ్లండ్‌ను అప్పట్లో రోమన్లు ఆక్రమించారు. అనంతరం ఈ వాల్‌ను నిర్మించారు. చాలాకాలం పాటు ఆ ప్రాంతం వారి ఆవాసంగా కొనసాగింది. వాళ్లకు ఆహారం ఇతరత్రా సరఫరాలన్నీ ఈ టౌన్‌ నుంచే వెళ్లేవి''అని చెప్పుకొచ్చారు. ఏమైనా గ్లాడియేటర్లకు సంబంధించి ఇంతటి అరుదైన చిహ్నం బ్రిటన్లో దొరకడం విశేషమేనని అంగీకరించారు.



అపూర్వ ఆదరణ

రాగితో చేసిన గ్లాడియేటర్‌ మిశ్రమ లోహపు పిడి ఏ మాత్రమూ చెక్కుచెదరని స్థితిలో ఉంది. ఈ యుద్ధ వీరులకు నాటి రోమన్‌ సమాజంలో లభించిన అపూర్వ ఆదరణకు ఈ పిడి నిదర్శనమని మాకింతోష్‌ అభిప్రాయపడ్డారు. ''గ్లాడియేటర్ల బతుకు దినదిన గండం. ప్రతి పోటీ వాళ్లకు ప్రాణాంతకమే. సాధారణంగా యుద్ధ ఖైదీలు, బానిసల్లో గట్టివాళ్లను ఎంచుకుని గ్లాడియేటర్లుగా మార్చేవాళ్లు. చెక్కినట్టుగా ఉండే తీరైన దేహం, తిరుగులేని దారుఢ్యం వాళ్ల సొంతం. దాంతో నాటి రోమన్‌ సమాజంలో గ్లాడియేటర్ల సెక్స్‌ప్పీల్‌ మామూలుగా ఉండేది కాదు. ముఖ్యంగా రోమన్‌ మహిళలు వాళ్లంటే పడిచచ్చిపోయేవాళ్లు. అందమైన, అరుదైన కానుకలు ఇచ్చి వాళ్లను ఆకర్షించేవాళ్లు. బానిసలని కూడా చూడకుండా వాళ్లతో ప్రేమలో పడేవాళ్లు. గ్లాడియేటర్లతో లేచిపోయిన కులీన వర్గాల స్త్రీల సంఖ్య కూడా తక్కువేమీ కాదు!'' అని ఆమె వివరించారు. గ్లాడియేటర్‌ సినిమాలో ఆ పాత్రకు రసెల్‌ క్రో ప్రాణం పోసిన తీరును సినీ అభిమానులు ఇంకా మర్చిపోలేదు. తాజాగా దాని సీక్వెల్‌ కూడా వచ్చింది.

– సాక్షి, నేషనల్‌ డెస్క్‌

ట్రంప్‌ను చంపేందుకు ప్రయత్నించం

ఆయనపై చట్టపరంగానే ప్రతీకారం: ఇరాన్‌

టెహ్రాన్‌: అమెరికాతో ఉద్రిక్తతలను తగ్గించుకునేందుకు ఇరాన్‌ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ విషయంలో వైఖరిని మార్చుకుంది. ఆయన్ను హత్య చేసేందుకు ఎలాంటి ప్రయత్నాలూ చేయబోమని ఇరాన్‌ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ఈ మేరకు నెల రోజుల క్రితమే అమెరికాకు ఆయన స్పష్టత ఇచ్చినట్టు సమాచారం. న్యాయపరమైన మార్గాల ద్వారా మాత్రమే ట్రంప్‌పై ప్రతీకార చర్యల కోసం ప్రయత్నిస్తామని ఇరాన్‌ స్పష్టం చేసిందంటున్నారు. అత్యున్నత వర్గాల సమాచారం ప్రకారం, ట్రంప్‌ను హత్య చేసేందుకు ప్రయత్నిస్తే భారీ మూల్యం తప్పదని సెప్టెంబర్లోనే అమెరికా వర్గాలు ఇరాన్‌ను హెచ్చరించాయి. అలాంటి ప్రయత్నాలను అమెరికాపై యుద్ధంగా భావించి తగిన విధంగా ప్రతిస్పందించాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. దానికి స్పందనగానే, తమకు అలాంటి ఉద్దేశమేదీ లేదని ఖమేనీ స్పష్టం చేయాల్సి వచ్చిందంటున్నారు. ట్రంప్‌ అమెరికా అధ్యక్షునిగా ఉండగా 2020లో టెహ్రాన్‌లో జరిగిన డ్రోన్‌ దాడిలో ఇరాన్‌ అత్యున్నత సైనిక జనరల్‌ ఖాసీమ్‌ సులేమానీ చనిపోవడం తెలిసిందే. ఆ దాడికి ట్రంపే ఆదేశించారని ఇరాన్‌ ఆరోపించింది. ''ప్రాణానికి ప్రాణమే మూల్యంగా చెల్లించాల్సి ఉంటుంది. ట్రంప్‌పై ప్రతీకారం తప్పదు''అని అప్పట్లో ప్రతిజ్ఞ చేసింది. అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నం జరగడం తెలిసిందే. వాటి వెనక ఇరాన్‌ హస్తం కూడా ఉండొచ్చని అమెరికా నిఘా వర్గాలు అనుమానాలు వెలిబుచ్చాయి. అందుకే ఇరాన్‌కు అప్పట్లో అమెరికా ఘాటు హెచ్చరికలు జారీ చేసింది. దాంతో ఆ హత్యాయత్నాలతో తమకు ఏ సంబంధమూ లేదని ఇరాన్‌ ప్రకటించింది. ట్రంప్‌ ప్రానాలు తీసే ప్రయత్నాలేమీ లేయబోమంటూ ఖమేనీ స్పష్టత ఇవ్వడం దానికి కొనసాగింపేననే భావిస్తున్నారు. సులేమానీ హత్యోదంతానికి సంబంధించి ట్రంప్‌పై న్యాయపరంగానే చర్యలు తీసుకునే ప్రయత్నం చేస్తామని కూడా ఇరాన్‌ పేర్కొన్నట్టు తెలుస్తోంది. అమెరికా, ఇరాన్‌ మధ్య ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాల్లో ప్రపంచ కుబేరుడు, ట్రంప్‌ సన్నిహితుడు ఎలాన్‌ మస్క్‌ కూడా భాగం పంచుకుంటున్నట్టు ఇటీవల వార్తలు రావడం తెలిసిందే. వీటిలో భాగంగా ఐరాసలో ఇరాన్‌ రాయబారితో వారం క్రితం న్యూయార్క్‌లో ఆయన రహస్యంగా సమావేశమైనట్టు చెబుతున్నారు.

జైహింద్, చలో ఢిల్లీ నినాదకర్త?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

స్వాతంత్ర్యోద్యమం

- సిల్వర్ టంగ్డ్ ఆరేటర్ అని ఏ జాతీయ నాయకుడిని పిలుస్తారు? – **సురేంద్రనాథ్ బెనర్జీ**
- హంటర్ విద్యా కమిషన్ సభ్యుడైన భారతీయుడు? – **ఆనందమోహన్ బోస్**
- నేతాజీ స్థాపించిన పార్టీ? – **ఫార్వర్డ్ బ్లాక్**
- వందేమాతరాన్ని ఆంగ్లంలోకి అనువదించినవారు? – **అరవింద ఘోష్**
- ఆనందమఠ్‌లో ప్రధాన ఇతివృత్తం? – **సన్యాసుల తిరుగుబాటు**
- అలీపూర్ కుట్ర కేసు నుంచి అరవిందఘోష్‌ను నిర్దోషిగా విడుదల చేయించినవారు? – **సి.ఆర్.దాస్**
- భారతదేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన తొలి ముస్లిం? – **అష్ఫకుల్లాఖాన్**
- దేశంలో తొలిసారి అరెస్టయిన బాలుడిగా స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో నిలిచినవారు? – **ఓరుగంటి రామచంద్రయ్య**
- సిన్‌ఫిన్ ఉద్యమం ప్రేరణతో భారత్‌లో జరిగిన ఉద్యమం? – **హోం రూల్ ఉద్యమం**
- సహాయ నిరాకరణోద్యమం ఎప్పుడు ప్రారంభమైంది? – **1920, ఆగస్టు 31**
- సహాయ నిరాకరణోద్యమ సమయంలో స్థాపించిన విద్యా సంస్థలు? – **జామియా మిలియా ఇస్లామియా, బిహార్ విద్యాపీఠం, కాశీ విద్యాపీఠం, గుజరాత్ విద్యాపీఠం**
- వందేమాతర ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైంది? – **1905, అక్టోబర్ 16**
- న్యూలాంప్స్ ఫర్ ఓల్డ్, వ్యాస సంపుటి రాసినవారు? – **అరవింద ఘోష్**
- వందేమాతర ఉద్యమ కాలంలో గోపాల మిత్ర బెంగాల్‌లో ఏర్పర్చిన సంస్థ? – **వార్షిక హిందూ మేళా**
- దక్షిణ భారత్‌లో తొలి INC సమావేశం జరిగిన ప్రాంతం? – **మద్రాస్**
- ఇంగ్లండ్ పార్లమెంట్‌కు ఎన్నికైన తొలి భారతీయుడు? – **దాదాభాయ్ నౌరోజీ**
- క్విట్ కశ్మీర్ ఉద్యమ నిర్మాత? – **షేక్ అబ్దుల్లా**
- శాసనోల్లంఘనోద్యమం ఎప్పుడు ప్రారంభమైంది? – **1930, మార్చి 12**
- బెంగాల్‌ను తిరిగి ఏకీకరించిన సంవత్సరం? – **1911**
- కలకత్తా నుంచి రాజధానిని ఢిల్లీకి మార్చినవారు? – **హార్డింజ్**
- రాజాజీ ఫార్ములాను ఎప్పుడు రూపొందించారు? – **1944**
- స్వదేశీ ఉద్యమంలో బాలభారతి సమితి ఎక్కడ ఏర్పడింది? – **రాజమండ్రి**
- ''యాచించడం కాదు శాసించాలి'' అన్నవారు – **లోకమాన్య బాలగంగాధర్ తిలక్**
- తిలక్ ప్రచురించిన పత్రికలు? – **కేసరి, మరాఠీ**
- త్రివర్ణ పతాకాన్ని మేడం కామా ఎక్కడ ఎగురవేశారు? – **స్టట్‌గర్ట్ (జర్మనీ)**
- గాంధీజీ దక్షిణాఫ్రికాకు ఎప్పుడు వెళ్లారు? – **1893**
- మైఖేల్–ఒ–డయ్యర్‌ను ఉద్ధమ్‌సింగ్ ఎప్పుడు చంపాడు? – **1940**
- జామా మసీదు (ఢిల్లీ) ప్రార్థనలో పాల్గొన్న ఆర్యసమాజ నాయకుడు? – **స్వామి శ్రద్ధానంద**
- సైమన్ కమిషన్ కాలంలో మద్రాస్‌లో మరణించిన యువకుడు? – **పార్థసారథి**
- సైమన్ కమిషన్ ఏర్పడిన సంవత్సరం? – **1928 (ఇందులోని సభ్యుల సంఖ్య 7. ఈ కమిషన్ కాలం నాటి వైస్రాయ్ ఇర్విన్)**
- జెండా సత్యాగ్రహాన్ని నాగ్‌పూర్‌లో ప్రారంభించినవారు? – **జమ్నాలాల్ బజాజ్**
- కేంద్ర శాసనసభకు స్పీకర్‌గా ఎన్నికైన తొలి భారతీయుడు? – **విఠల్‌భాయ్ పటేల్**
- శాసనోల్లంఘనోద్యమ రాణి ఎవరు? – **సరోజినీ నాయుడు**
- గైడిన్‌లియూ ఏ ఉద్యమంలో ప్రసిద్ధి పొందారు? – **ఉప్పు సత్యాగ్రహం**
- ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ బిరుదు? – **సరిహద్దు గాంధీ**
- ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న గాంధీజీ అనుచరుల సంఖ్య? – **78**
- హరిజనోద్ధరణ ఆంధ్ర శాఖ స్థాపకుడు? – **కాశీనాథుని నాగేశ్వరరావు**
- శారదా నికేతన్‌ను ఉన్నవ లక్ష్మీనారాయణ ఎక్కడ స్థాపించారు? – **గుంటూరు**
- కొండా వెంకటప్పయ్య బిరుదు? – **దేశభక్త**
- సుభాష్ చంద్రబోస్ ఎక్కడ జన్మించారు? – **కటక్ (ఒడిశా)**
- అండమాన్, నికోబార్ దీవులకు బోస్ పెట్టిన పేర్లు? – **షహీద్, స్వరాజ్**
- ది డివైన్ లైఫ్, సావిత్రి గ్రంథాల రచయిత? – **అరవింద ఘోష్**
- 1946 నాటి క్యాబినెట్ మిషన్‌లోని సభ్యులు? – **పెథిక్ లారెన్స్, సర్ స్టాఫర్డ్ క్రిప్స్, ఎ.వి.అలెగ్జాండర్**
- వేల్స్ రాకుమారుడు (8వ ఎడ్వర్డ్) ఇండియాను ఎప్పుడు సందర్శించారు? – **1921**
- భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి భారతీయ వనిత? – **సరోజినీ నాయుడు**
- దేశికోత్తమ బిరుదాంకితులు ఎవరు? – **సురేంద్రనాథ్ బెనర్జీ**
- ఏ నియోజకవర్గం నుంచి దాదాభాయి నౌరోజీ బ్రిటన్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికయ్యారు? – **ఫిన్స్‌బరి**
- ఫకీర్ మోహన్ సేనాపతి ఏ రాష్ట్రానికి చెందిన జాతీయ కవి? – **ఒడిశా**
- కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ (1934) స్థాపకులు? – **జయప్రకాష్ నారాయణ్, ఆచార్య నరేంద్రదేవ్**
- అతివాదులు, మితవాదులు ఎప్పుడు ఏకమయ్యారు? – **1916**
- గాంధీజీ రాసిన ప్రముఖ గ్రంథాలు? – **మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్, హింద్ స్వరాజ్**
- 1921 మోప్లా తిరుగుబాటు (కేరళ) నాయకుడు? – **అలీ ముస్లియార్**
- రౌండ్‌టేబుల్ సమావేశాలు మొత్తం ఎన్ని జరిగాయి? – **3**
- అజాద్ హింద్ ఫౌజ్ సైనికుల తరఫున వాదించిన జాతీయ కాంగ్రెస్ న్యాయవాదుల బృందం? – **భూలాభాయ్ దేశాయ్, తేజ్ బహదూర్ సప్రూ, అసఫ్ అలీ**
- అజాద్ హింద్ ఫౌజ్ మహిళా విభాగం పేరు? – **ఝాన్సీ లక్ష్మీబాయి దళం**
- ఝాన్సీ లక్ష్మీబాయి దళానికి నాయకురాలు? – **లక్ష్మీ సెహగల్**
- ది గ్రేట్ కలకత్తా కిల్లింగ్ ఎప్పుడు జరిగింది? – **1946 ఆగస్టు 16**
- ఇండియన్ ఇండిపెండెన్స్ బిల్‌ను బ్రిటన్ హౌస్ ఆఫ్ కామన్స్ సభలో ప్రవేశపెట్టినవారు? – **లిస్టోవెల్**
- ఇండియన్ ఇండిపెండెన్స్ బిల్‌ను బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో ప్రవేశపెట్టినవారు? – **లార్డ్ శామ్యూల్**
- స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు? – **జీవత్‌రామ్ భగవాన్‌దాస్ కృపలాని (జె.బి.కృపలాని)**
- వైస్రాయి వెవేల్ 1945లో అఖిలపక్ష సమావేశాన్ని ఎక్కడ ఏర్పాటు చేశాడు? – **సిమ్లా**
- రవీంద్రనాథ్ ఠాగూర్ ఆత్మకథ పేరు? – **మై రెమినిసెన్సెస్**
- 'యాన్ ఇండియన్ పిలిగ్రిమ్' రాసినవారు? – **సుభాష్ చంద్ర బోస్**
- పూర్ణ స్వరాజ్ తీర్మానాన్ని నెహ్రూ ఎప్పుడు చేశారు? – **1929**
- చీరాల–పేరాల ఉద్యమం ఏ ఉద్యమంలో భాగం? – **సహాయ నిరాకరణోద్యమం**
- విజయవాడ INCకి పరిశీలకుడిగా హైదరాబాద్ నుంచి వచ్చినవారు? – **మాడపాటి హనుమంతరావు**
- జాతీయోద్యమంలో జైలుశిక్ష అనుభవించిన తొలి తెలుగు వనిత? – **రావూరి అలివేలు మంగమ్మ**
- అల్లూరి సీతారామరాజు దాడి చేసిన తొలి పోలీస్‌స్టేషన్? – **చింతపల్లి**
- 1920లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియాను ఎక్కడ స్థాపించారు? – **తాష్కెంట్**
- భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఎప్పుడు ఉరి తీశారు? – **1931, మార్చి 23**
- ఆనందమండల్ అనే విప్లవ సంస్థ ఎక్కడి నుంచి స్వాతంత్ర్యం కోసం పోరాడింది? – **అహ్మదాబాద్**
- 1937లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పాటు చేసింది? – **8**
- 1942లో భారత్‌లో పర్యటించిన చైనా అధ్యక్షుడు? – **చాంగ్ –కై–షేక్**
- నేతాజీ సింగపూర్‌లో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు? – **1943 అక్టోబర్ 21**
- ఇండియన్ ఇండిపెండెన్స్ బిల్లును ఆమోదించిన బ్రిటన్ చక్రవర్తి? – **6వ జార్జి**
- వైస్రాయ్‌గా లార్డ్ ఇర్విన్ పాలనా కాలం? – **1926–1931**
- లార్డ్ లిన్‌లిత్‌గో పాలనా కాలం? – **1936–1943**
- యుగాంతర్ పత్రికాధినేత? – **బరేంద్రకుమార్ ఘోష్**
- సచిన్ సన్యాల్ రాసిన గ్రంథం? – **బందీ జీవన్**
- మాండలే జైలు నుంచి తిలక్ విడుదలైన సంవత్సరం? – **1914**
- రస్త్‌గోఫ్తర్ పత్రికాధినేత? – **దాదాభాయి నౌరోజీ**
- భారతదేశం నుంచి బర్మా ఏ చట్టం ద్వారా విడిపోయింది? – **1935 చట్టం**
- అమృత బజార్ పత్రిక స్థాపకుడు? – **శిశిర్ కుమార్ ఘోష్**
- జైహింద్, చలో ఢిల్లీ నినాదకర్త? – **నేతాజీ బోస్**
- లార్డ్ రీడింగ్ పాలనా కాలం? – **1921–1925**
- ట్రాజెడీ ఆఫ్ హైదరాబాద్ గ్రంథకర్త? – **లాయక్ అలీ**
- 'ది ఎండ్ ఆఫ్ యాన్ ఎరా' రాసినవారు? – **కె.యం.మున్షీ**
- రెండో ప్రపంచ యుద్ధ కాలంలో భారతీయుల సహాయం కోరుతూ లిన్‌లిత్‌గో చేసిన ప్రకటన? – **ఆగస్ట్ ఆఫర్**
- క్యాబినెట్ మిషన్‌ను భారత్‌కు పంపిన ఇంగ్లండ్ ప్రధాని? – **క్లైమెంట్ అట్లీ**
- నేతాజీకి సహకరించిన జపాన్ ప్రధాని? – **టోజో**
- హోంరూల్ ఉద్యమాన్ని అనీబిసెంట్ ఎక్కడి నుంచి ప్రారంభించారు? – **అడయార్ (తమిళనాడు)**
- 1911లో తొలిసారి INCలో జాతీయ గీతాలాపన సమయంలో నాటి INC అధ్యక్షుడు? – **బి.ఎన్.ధర్**
- కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య కుదిరిన ఒప్పందం? – **లక్నో ఒప్పందం (1916)**
- హరిజనులకు ప్రత్యేక నియోజకవర్గాలపై రామ్సే మెక్‌డొనాల్డ్ చేసిన ప్రకటనను ఏమంటారు? – **కమ్యూనల్ అవార్డ్**
- ద్విజాతి సిద్ధాంత కర్త? – **మహ్మద్ అలీ జిన్నా**
- గాంధీజీ హరిజనులకు ప్రవేశం కల్పించిన దేవాలయం కృష్ణా జిల్లాలో ఎక్కడ ఉంది? – **సిద్ధాంతం అనే ఊరిలో**
- నీల్ దర్పణ్ గ్రంథకర్త? – **దీనబంధుమిత్ర**
- అంబేద్కర్, గాంధీజీల మధ్య జరిగిన ఒప్పందం? – **పూనా ఒప్పందం**
- గోఖలే తీర్మానం (1912) ఉద్దేశం? – **బడి ఈడు పిల్లలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య**
- గదర్ పార్టీలో చేరిన ఏకైక తెలుగు వ్యక్తి? – **దర్శి చెంచయ్య**
- స్వరాజ్య పార్టీ అధికార పత్రిక? – **ఫార్వర్డ్**
- మోతీలాల్ నెహ్రూ 1919లో స్థాపించిన పత్రిక? – **ఇండిపెండెంట్**
- వార్ధా విద్యా ప్రణాళికను గాంధీజీ ఎప్పుడు రూపొందించారు? – **1937**
- మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన సిక్కు ప్రతినిధి? – **సంపూరణ్ సింగ్**
- మహ్మద్ అలీ జిన్నా ఎప్పుడు ముస్లింలీగ్‌లో చేరాడు? – **1913**
- వేల్స్ రాకుమారుడికి గౌరవ పట్టా ఇచ్చిన యూనివర్సిటీ? – **బెనారస్ హిందూ యూనివర్సిటీ**
- ప్రిన్స్ ఆఫ్ బెగ్గర్స్ అని ఎవరిని అంటారు? – **మదన్‌మోహన్ మాలవ్య (బెనారస్ హిందూ యూనివర్సిటీ కోసం కోటీశ్వర నిధులు వసూలు చేసినందుకు ఇలా పిలుస్తారు)**
- RSSను ఎప్పుడు స్థాపించారు? – **1925**
- 'ది స్పాట్‌లెస్ పండిట్' అని ఎవరిని అంటారు? – **మదన్‌మోహన్ మాలవ్య**
- ఇండియన్ బిస్మార్క్ అని ఎవరిని అంటారు? – **సర్దార్ వల్లభాయ్ పటేల్**
- హైదరాబాద్‌లో పౌర ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడింది? – **1950**
- హైదరాబాద్ రాజ్యం, భారత యూనియన్‌కు మధ్య యథాతథ ఒప్పందం ఎప్పుడు జరిగింది? – **1947 నవంబర్ 29**
- ట్రావెన్‌కోర్ సంస్థాన రాజధాని? – **తిరువనంతపురం**
- ట్రావెన్‌కోర్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసినవారు? – **బలరామ్ వర్మ (1949లో)**

ఉన్ని, పట్టు వంటి వాటిలో ఉన్న ప్రొటీన్ ఏది?

ప్రాక్టీస్ టెస్ట్

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్

1. ప్రయోగశాలలో నీటి శాంపిల్ COD (Chemical Oxygen Demand)ను నిర్ణయించడానికి ఉపయోగించే ఆక్సీకరణి ఏది?
   1) KNO_3 2) $KMnO_4$
   3) ఆగ్జాలికామ్లం
   4) $K_2Cr_2O_7$ + 50% H_2SO_4 (ఆమ్లీకృత పొటాషియం డైక్రోమేట్)
2. నీటిని క్లోరిన్‌తో శుద్ధి చేయడానికి గల కారణం?
   1) ఆక్సిజన్ పరిమాణం పెరుగుతుంది.
   2) సూక్ష్మజీవులను చంపుతుంది.
   3) తేలియాడుతున్న కణాలను తొలగిస్తుంది.
   4) నీటి కాఠిన్యాన్ని తొలగిస్తుంది.
3. ఓజోన్ అనేది?
   1) ఆక్సిజన్ రూపాంతరం
   2) ఆక్సిజన్ ఐసోటోప్
   3) ఆక్సిజన్ సమ్మేళనం
   4) ద్విపరమాణుక అణువు
4. గది ఉష్ణోగ్రత వద్ద p- రకపు అర్ధవాహకంలో?
   1) అధిక స్వేచ్ఛా ఎలక్ట్రాన్‌లు, అల్ప రంధ్రాలు ఉంటాయి.
   2) అధిక రంధ్రాలు, అల్ప ఎలక్ట్రాన్‌లు ఉంటాయి.
   3) అధిక రంధ్రాలు, ఎలక్ట్రాన్‌లు ఉంటాయి.
   4) ఎలక్ట్రాన్‌లు, రంధ్రాలు ఉండవు.
5. పురోశక్మం (Forward Bias) పద్ధతిలో ఆదర్శ డయోడ్ నిరోధం?
   1) అనంతం 2) పరిమితం
   3) రుణాత్మకం 4) సున్నా
6. p-n-p ట్రాన్సిస్టర్ (Transistor) కంటే n-p-n ట్రాన్సిస్టర్ ఎక్కువగా ఎందుకు ఉపయోగిస్తారు?
   1) ఎక్కువ సామర్థ్యం ఉంటుంది కాబట్టి
   2) n-p-n లో శక్తి దుర్వినియోగం తక్కువ
   3) రంధ్రాల కంటే ఎలక్ట్రాన్‌ల చలనశీలత ఎక్కువ. అందువల్ల ఎక్కువ శక్తి చలనశీలత ఉంటుంది.
   4) రంధ్రాలకు ఎక్కువ చలనశీలత కాబట్టి శక్తి ఎక్కువగా ప్రసరిస్తుంది.
7. పౌనఃపున్యానికి (Frequency) మితి ఫార్ములా?
   1) $M^1L^2T^{-1}$ 2) $M^0L^2T^{-1}$
   3) $M^1L^0T^{-1}$. 4) $M^0L^0T^{-1}$
8. కిందివాటిని జతపరచండి
   గ్రూప్-A
   a) నిరోధం (Resistance)
   b) వాహకత్వం (Conductance)
   c) కెపాసిటెన్సీ (Capacitance)
   d) ప్రేరణా గుణకం (Inductance)
   గ్రూప్-B
   e) హెన్రీ (Henry)
   f) ఫారడ్ (Farad)
   g) ఓమ్ (Ohm)
   h) సీమెన్స్ (Siemens)
   1) a-g, b-f, c-h, d-e
   2) a-g, b-h, c-f, d-e
   3) a-f, b-g, c-f, d-e
   4) a-c, b-f, c-h, d-g
9. 10^{12} పూర్వ లగ్నం (Prefix) ఏది?
   1) పీటా 2) ఎక్సా
   3) టెరా 4) మెగా
10. 50kg ద్రవ్యరాశి ఉన్న స్త్రీ ఒంటికాలిపై 1 సెం.మీ.^{2} వైశాల్యమున్న మేజోళ్లు (Sharp-heeled shoe) పై నిలుచున్నది. భూమిపై ఆమె చేసే ఒత్తిడి? (g = 10 మీ/సె^{2})
    1) 5×10^6 Pa
    2) 5×10^5 Pa
    3) 500 Pa
    4) 0.05 Pa
11. 50 గ్రాముల ద్రవ్యరాశి, 20 సెం.మీ.^{3} ఘన పరిమాణం గల ఒక వస్తువును నీటిలో వేస్తే అది?
    1) పూర్తిగా మునిగిపోతుంది.
    2) తేలుతుంది.
    3) వేలాడుతుంది.
    4) మొదట మునిగి తర్వాత తేలుతుంది.
12. లాక్టోమీటర్ (Lactometer)ను పాల స్వచ్ఛతను కనుక్కోవడానికి ఉపయోగిస్తారు. ఇది ఏ సూత్రం ఆధారంగా పనిచేస్తుంది?
    1) ఆర్కిమెడిస్ సూత్రం
    2) ప్లవన సూత్రం
    3) బెర్నౌలీ సూత్రం
    4) కులూంబ్ సూత్రం
13. షర్మిష్ఠ (Sharmista) అనేది?
    1) ఒక తోకచుక్క 2) ఒక ఉల్క
    3) ఒక నక్షత్ర మండలం
    4) సౌర కుటుంబం ఆవల ఉన్న గ్రహాల సముదాయం
14. వేడి నీటి ఊటలు, అగ్ని పర్వతాలు వేటికి ఉదాహరణలు?
    1) భూగర్భ లవణాలకు
    2) భూగర్భ ద్రవ రూపాలకు
    3) భూగర్భ ఉష్ణానికి
    4) భూగర్భ ఖనిజాలకు
15. నీటి వక్రీభవన గుణకం 4/3. కాంతి నీటిలో 3 మీటర్లు ప్రయాణించడానికి పట్టే సమయం ఎంత? (శూన్యంలో కాంతి వేగం C= 3×10^8 మీ/సె)
    1) 1.33×10^{-8} సెకన్లు
    2) 1.33 సెకన్లు
    3) 3/4 సెకన్లు
    4) 1.33×10^8 సెకన్లు
16. ఖగోళ దూరదర్శినిలో వస్తు కటక నాభ్యంతరం F_0, అక్షి కటక నాభ్యంతరం F_e అయితే 'సహజ సర్దుబాటు' తర్వాత కటకాల మధ్య దూరం ఎంత?
    1) $L = F_0 + F_e$
    2) $L = F_0 / F_e$
    3) $L = F_0 \times F_e$
    4) $L = F_0 - F_e$
17. సంయుక్త సూక్ష్మదర్శిని వస్తు కటకం, అక్షి కటకాల నాభ్యంతర దూరాలు 0.5 సెం.మీ., 4 సెం.మీ., ఆవర్తనం 250 అయితే రెండు కటకాల మధ్య దూరం ఎంత?
    1) 24 సెం.మీ 2) 22 సెం.మీ
    3) 20 సెం.మీ. 4) 26 సెం.మీ
18. అనునాద ప్రయోగంలో మొదటి, రెండో అనునాదం వద్ద గాలి స్తంభం పొడవులు వరుసగా 20 సెం.మీ., 70 సెం.మీ. వాడుక చేసిన శ్రుతి దండం(Tuning Fork) పౌనఃపున్యం 330Hz అయితే గాలిలో ధ్వని వేగాన్ని కనుక్కోండి?
    1) 320 సెం.మీ/గంటలు
    2) 320 సెం.మీ/సెకన్లు
    3) 320 మీ/సెకన్లు
    4) 320 మీ/గంటలు
19. వస్తువులున్న గదిలో ప్రతిధ్వనులు వినపడవు. కానీ ఖాళీగా ఉన్న పెద్ద హాలులో ప్రతిధ్వనులు వినిపిస్తాయి. ఎందుకు?
    1) గదిలో ధ్వనిని శోషించుకుంటాయి. హాలులో ధ్వని అనేక పరావర్తనాలు చెందడం వల్ల ప్రతిధ్వనులు వినిపిస్తాయి.
    2) గది శోషణ గుణకం తక్కువ కాబట్టి
    3) గదిలో అనేక పరావర్తనాలు చెందుతాయి కాబట్టి
    4) హాలులో శోషణం ఎక్కువ కాబట్టి
20. వాయు సమీకరణం కిందివాటిలో దేనికి వర్తిస్తుంది?
    1) సమోష్ణగ్రతా ప్రక్రియలకు మాత్రమే
    2) స్థిరోష్ణక ప్రక్రియలకు మాత్రమే
    3) సమోష్ణోగ్రతా, స్థిరోష్ణక ప్రక్రియలకు వర్తిస్తుంది.
    4) పై రెండు ప్రక్రియలకు వర్తించదు.
21. ఒక ఘనపదార్థం దైర్ఘ్య వ్యాకోచ గుణకం (α=0.00009/°C) అయితే ఘనపరిమాణ వ్యాకోచ గుణకం γ ఎంత?
    1) 0.000027/°C
    2) 0.00027/°C
    3) 0.00081/°C
    4) 0.00003/°C
22. నీటిని 0°C నుంచి 10°C కు వేడి చేసినప్పుడు ఘనపరిమాణం?
    1) పెరుగుతుంది.
    2) తగ్గుతుంది.
    3) దాదాపుగా మారదు.
    4) మొదట తగ్గి తర్వాత పెరుగుతుంది.
23. కార్బోహైడ్రేట్ కానిది?
    1) గ్లూకోజ్ 2) చక్కెర
    3) అసిటిక్ ఆమ్లం
    4) రమనోజ్ (Rhamnose)
24. జంతువుల శరీరంలో నిక్షిప్తమైన కార్బో హైడ్రేట్ ఏది?
    1) సెల్యులోజ్ 2) గ్లైకోజన్
    3) అమైలోజ్ 4) లాక్టోజ్



25. ఆవశ్యక ఎమైనో ఆమ్లం (Essential amino acid) కానిది?
    1) గ్లైసిన్ 2) వాలిన్
    3) ల్యూసిన్ 4) లైసిన్
26. ఉన్ని, పట్టు వంటి వాటిలో ఉన్న ప్రొటీన్ ఏది?
    1) మైయోసిన్
    2) అల్బుమిన్స్ 3) కెరటిన్
    4) ఫైవన్స్
27. వీటిలో సహజ పాలిమర్ ఏది?
    1) రేయాన్ 2) నైలాన్
    3) బూనా-S 4) రబ్బర్
28. దుప్పెనల తయారీలో ఉపయోగించే పాలిమర్ ఏది?
    1) PVC 2) పాలిప్రొపీన్
    3) బెకలైట్ 4) పాలిస్టైరిన్
29. సోయా చిక్కుడు గింజలు ఏ ఫాటీ ఆమ్లాల వనరు?
    1) లారిక్ ఆమ్లం
    2) స్టియరిక్ ఆమ్లం
    3) లినోలినిక్ ఆమ్లం
    4) ఓలియిక్ ఆమ్లం
30. జి.ఎస్పిడిన్ కనుగొన్నది ఏది?
    1) గాజు 2) కృత్రిమ దారాలు
    3) సిమెంట్ 4) రంజనాలు
31. ఒక ధాతువును అధిక గాలి సమక్షంలో దాని ద్రవీభవన స్థానం కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద తీవ్రంగా వేడి చేయడాన్ని ఏమ ంటారు?
    1) భస్మీకరణం 2) భర్జనం
    3) ప్రగలనం 4) క్షయకరణం
32. 'గెలీనా' (Galena) ఏ లోహం ధాతువు?
    1) మెర్క్యురీ 2) వెండి
    3) సీసం 4) కాల్షియం
33. జర్మన్ సిల్వర్‌లోని సంఘటనాలు?
    1) కాపర్, జింక్, నికెల్
    2) కాపర్, టిన్, నికెల్
    3) కాపర్, జింక్, టిన్
    4) కాపర్, జింక్, అల్యూమినియం
34. అణుచలన సిద్ధాంతం ప్రకారం వాయు అణువుల సగటు గతిజ శక్తి (E_K), పరమ ఉష్ణోగ్రత (T) ల మధ్య సంబంధాన్ని కిందివిధంగా సూచించవచ్చు?
    1) $E_K \propto T^2$ 2) $E_K \propto T$
    3) $E_K \propto 1/T$ 4) $E^2_K \propto T$
35. ఒకే ఉష్ణోగ్రత వద్ద ఉన్న 3g హైడ్రోజన్, 4g ఆక్సిజన్ వాయువుల గతిజశక్తి నిష్పత్తిని లెక్కిస్తే అది ఎంత ఉంటుంది?
    1) 3:4 2) 12:1
    3) 1:12 4) 4:3
36. కిందివాటిలో వాండర్‌వాల్ బలాలు ఏవి?
    1) పదార్థంలోని కణాలైన పరమాణువులు లేదా అణువుల మధ్య బలాలు
    2) విరుద్ధ విద్యుదావేశాలు గల అయాన్‌ల మధ్య గల స్థిరవిద్యుత్ ఆకర్షణ బలాలు
    3) అణువులు, పరమాణువుల మధ్య ఉండే సంయోజనీయ బంధాలు
    4) కేంద్రక కణాల మధ్య ఆకర్షణ బలాలు
37. వాయువు వ్యాపనం రేటు దాని సాంద్రత వర్గమూలానికి విలోమానుపాతంలో ఉంటుంది. ఇది ఏ నియమం?
    1) డాల్టన్ పాక్షిక పీడనాల నియమం
    2) గ్రాహం వాయు వ్యాపన నియమం
    3) అవగాడ్రో నియమం
    4) చార్లెస్ వాయు వ్యాపన నియమం
38. సోమర్‌ఫీల్డ్ (Somerfield) దీర్ఘవృత్తాకార కక్ష్య అనే భావనను కింది విషయాన్ని విశదీకరించడానికి ప్రవేశపెట్టారు?
    1) రేఖావర్ణపటంలోని రేఖలను విశదీకరించడానికి
    2) రేఖావర్ణపటంలోని రేఖలు ఉపరేఖలుగా విడిపోవడాన్ని విశదీకరించడానికి
    3) పట్టిక వర్ణపట రేఖలను విశదీకరించ డానికి
    4) హైడ్రోజన్ వర్ణపటంలోని రేఖలను వివరించడానికి
39. d ఉప కర్పరంలోని ఆర్బిటాళ్ల సంఖ్య?
    1) 1 2) 3
    3) 5 4) 7
40. ఒక ఆర్బిటాల్‌లో గరిష్ఠంగా ఉంచగలిగే ఎలక్ట్రాన్‌ల సంఖ్యను తెలియచేయడానికి ఏ నియమం ఉపయోగపడుతుంది?
    1) పౌలీవర్జన నియమం
    2) ఆఫ్‌బౌ నియమం
    3) హుండ్ నియమం
    4) మాయిలర్ చిత్రం
41. పరమాణు ద్రవ్యరాశులను ఆరోహణ క్రమంలో ఒక క్రమపద్ధతిలో అమర్చి ఆవర్తన పట్టికను తయారుచేసిన శాస్త్రవేత్త?
    1) మోస్లే 2) మెండలీఫ్
    3) న్యూలాండ్స్ 4) డాబర్‌నీర్
42. ఆవర్తన పట్టికలో X అనే ఒకటో గ్రూపు మూలకం, Y అనే 17వ గ్రూపు మూలకం సంయోగం చెంది ఒక సమ్మేళనాన్ని ఏర్పరిస్తే దాని ఫార్ములా?
    1) X_3Y 2) X_2Y
    3) XY 4) X_2Y_3
43. ఏ రసాయన బంధాన్ని ఎలక్ట్రోవాలెంట్ బంధం (electro valent bond) అని కూడా అంటారు?
    1) సంయోజనీయ బంధం
    2) సమన్వయ సంయోజనీయ బంధం
    3) హైడ్రోజన్ బంధం
    4) అయానిక బంధం
44. వెస్పర్ట్ (VSEPRT) సిద్ధాంతం ప్రధానంగా దేనిని వివరించడంలో విఫలమైంది?
    1) బంధ దైర్ఘ్యం 2) బంధ కోణం
    3) బంధ శక్తి 4) బంధ స్వభావం
45. అమ్మోనియాలో బంధ కోణం విలువ?
    1) 104°31' 2) 107°48'
    3) 109°28' 4) 90°
46. ఆవర్తన పట్టికలోని ఏ గ్రూపు మూలకాలను చాల్కోజనులు అంటారు?
    1) 14 2) 15
    3) 16 4) 17

సమాధానాలు

1) 4	2) 2	3) 1	4) 2	5) 4
6) 3	7) 4	8) 2	9) 3	10) 1
11) 1	12) 1	13) 3	14) 3	15) 1
16) 1	17) 3	18) 3	19) 1	20) 3
21) 2	22) 4	23) 3	24) 2	25) 1
26) 3	27) 4	28) 3	29) 4	30) 3
31) 2	32) 3	33) 1	34) 2	35) 2
36) 1	37) 2	38) 2	39) 4	40) 1
41) 2	42) 3	43) 4	44) 3	45) 2
46) 3				

పటిష్టమైన ప్రణాళికతోనే ఆశించిన పురోగతి

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

ప్రణాళికా వ్యూహాలు

వ్యూహం అనే విస్తృత భావనలో అభివృద్ధి ప్రణాళికకు సంబంధించిన విధానపర చర్యలు ఇమిడి ఉంటాయి. భారతదేశంలో ప్రణాళికలకు సంబంధించిన వ్యూహాల్లో పేదరికం, అల్పాభివృద్ధి లాంటి సమస్యల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారు. పరిమాణం, పెట్టుబడుల పంపిణీ ప్రక్రియ, వనరుల సమీకరణ, ప్రభుత్వ రంగ పాత్ర తదితర అంశాలకు చెందిన విధానాలను ప్రణాళికల్లో అవలంబించారు.

భారత్‌లో ఆర్థిక ప్రణాళికల వ్యూహాన్ని ప్రభావితం చేసిన అంశాలు

1) మహలనోబిస్ వృద్ధి నమూనా
2) భారీ పరిశ్రమల వ్యూహం
3) ఉపాధి లక్ష్యం
4) సామాజిక లక్ష్యాలు; వృద్ధి, అసంతులిత వృద్ధి మధ్య వ్యూహం.

మొదటి పంచవర్ష ప్రణాళిక

విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, సాంఘిక పరిస్థితులను మెరుగుపరచడం లాంటి అంశాలకు ప్రాధాన్యమిస్తూ మొదటి పంచవర్ష ప్రణాళిక వ్యూహాన్ని ఖరారు చేశారు.

రెండో పంచవర్ష ప్రణాళిక

రెండో పంచవర్ష ప్రణాళికలో భారీ పరిశ్రమల అభివృద్ధి, ప్రజలకు సాంఘిక సేవల కల్పనపై దృష్టి సారించారు. ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్ రష్యా అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రెండో ప్రణాళికకు అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించారు.

రెండో ప్రణాళికలో అవలంబించిన వ్యూహంలోని ముఖ్యాంశాలు:

- మహలనోబిస్ ప్రకారం.. భారీ పరిశ్రమల్లో పెట్టుబడి పెంపు, సేవలపై వ్యయం పెంపు, కొనుగోలు శక్తి పెంపు ద్వారా నూతన డిమాండ్‌ను సృష్టించడం; చిన్న తరహా, గృహ పరిశ్రమల్లో పెట్టుబడి, ఉత్పత్తిని అధికం చేయడం ద్వారా నూతన డిమాండ్‌కు అనుగుణంగా వినియోగ వస్తువుల సరఫరా పెంచడం లాంటివి అభివృద్ధి వ్యూహంలో ప్రధాన అంశాలు.
- మహలనోబిస్ పెట్టుబడి వ్యూహంలో ప్రభుత్వ రంగానికి ప్రాధాన్యమిచ్చారు.
- నెహ్రూ - మహలనోబిస్ అభివృద్ధి నమూనా రెండో ప్రణాళిక రూపకల్పన సమయంలో వెలువడింది. ఇందులో అభివృద్ధికి సంబంధించి దీర్ఘ కాలిక లక్ష్యాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అధిక పెట్టుబడి రేటు సాధన కోసం పొదుపు రేటును పెంచడం, భారీ పరిశ్రమలకు ప్రాధాన్యమివ్వడం, నూతన పరిశ్రమల రక్షణకు 'రక్షిత విధానం' అవలంబించడం, దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ, లక్షిత వర్గాల ప్రజలకు అవకాశాలను విస్తృతం చేయడం లాంటి అంశాలకు నెహ్రూ - మహలనోబిస్ అభివృద్ధి నమూనాలో ప్రాధాన్యం ఇచ్చారు.
- ఆధునిక యంత్రాలు, విద్యుచ్ఛక్తిని ఉపయోగించి వినియోగ వస్తువులు రూపొందించే కుటీర, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి నెహ్రూ - మహలనోబిస్ నమూనాలో తగిన ప్రోత్సాహం ఇచ్చారు.

మూడో పంచవర్ష ప్రణాళిక

మూడో పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయం, పారిశ్రామిక రంగాల మధ్య ఇంటర్‌డిపెండెన్స్ (పరస్పర ఆధారం) వృద్ధి చేయడంపై దృష్టి సారించారు. జాతీయ, ప్రాంతీయ అభివృద్ధి, స్వదేశీ, బహిర్గత ఆధారాల నుంచి వనరుల సమీకరణ తదితర అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ప్రణాళికలో సాంకేతిక ప్రగతికి చర్యలు తీసుకోవడం, అధిక ఉత్పాదకత సాధించడం, జనాభా నియంత్రణ, ఉపాధి, సామాజిక మార్పు అంశాలపై దృష్టి కేంద్రీకరించారు.

వార్షిక ప్రణాళికలు

వార్షిక ప్రణాళికల కాలం(1966-69)లో.. మూడో పంచవర్ష ప్రణాళికలో ఆర్థిక వ్యవస్థలో సంభవించిన అనిశ్చిత పరిస్థితులను నివారించడంపై దృష్టి సారించారు. దీంతోపాటు ఏ విధమైన అదనపు ద్రవ్యోల్బణ పరిస్థితులు తలెత్తకుండా సహేతుక వృద్ధి రేటు సాధనకు ప్రాధాన్యం ఇచ్చారు. అవస్థాపితా సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం, ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి కేంద్రీకరించారు. విద్య, కుటుంబ నియంత్రణ, రక్షిత తాగునీటి సరఫరా, పారిశుధ్యం తదితర అంశాలపై దృష్టి సారించి వివిధ సాంఘిక సేవా పథకాలను ప్రవేశపెట్టారు.

నాలుగో పంచవర్ష ప్రణాళిక

నాలుగో పంచవర్ష ప్రణాళికా కాలంలో (1969-74) వార్షిక ప్రణాళికల్లో అవలంబించిన వ్యూహాన్ని కొనసాగించారు. చిన్న రైతులకు ప్రోత్సాహం కల్పించేవిధంగా వ్యవసాయం, నీటి పారుదల అభివృద్ధికి సంబంధించిన వ్యూహాలను అమలు చేశారు. ఆధునిక పరిశ్రమలను అభివృద్ధి చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే క్రమంలో.. చిన్న, పెద్ద తరహా పారిశ్రామిక యూనిట్ల వికేంద్రీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఎగుమతులను పెంచడం, దిగుమతులను తగ్గించుకోవడంతో పాటు క్రమంగా విదేశాలపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించడానికి ఈ ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు. సమతౌల్య ఆర్థికవృద్ధిని దృష్టిలో ఉంచుకొని సుస్థిరత, స్వయం సమృద్ధి సాధనకు ఈ ప్రణాళికలో పెద్దపీట వేశారు.



అయిదో పంచవర్ష ప్రణాళిక

పేదరిక నిర్మూలన, ఆర్థిక స్వయం సాధనను దృష్టిలో ఉంచుకొని 5వ పంచవర్ష ప్రణాళిక వ్యూహాన్ని రూపొందించారు. వ్యవసాయ రంగంలో అధిక దిగుబడినిచ్చే వంగడాల వాడకం, బహుళ పంటల కార్యక్రమం ద్వారా ఉత్పత్తి పెంపునకు ప్రాధాన్యం ఇచ్చారు. పారిశ్రామిక రంగ అభివృద్ధిలో భాగంగా వినియోగ వస్తువులు, వ్యవసాయాధారిత పరిశ్రమల విస్తరణ, ప్రోత్సాహం లాంటివాటిపై దృష్టి సారించారు.

ఆరో పంచవర్ష ప్రణాళిక

ఆరో పంచవర్ష ప్రణాళిక వ్యూహంలో నిరుద్యోగ సమస్య, అల్ప ఉద్యోగిత, పేదరికాన్ని అట్టడుగు స్థాయికి తగ్గించడం లాంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడుల వృద్ధిని వేగవంతం చేయడం ద్వారా అవస్థాపనా సౌకర్యాల పెంపు, ఉత్పత్తి, ఎగుమతుల వృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. ఆయా లక్ష్యాల సాధన కోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించారు. ప్రజలకు కనీస అవసరాల కల్పన, గ్రామీణ, అసంఘటిత రంగాల్లో ఉపాధి అవకాశాల పెంపునకు ప్రాధాన్యం ఇస్తూ వ్యూహాన్ని సిద్ధం చేశారు.

ఏడో పంచవర్ష ప్రణాళిక

మానవ వనరుల అభివృద్ధి, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఏడో పంచవర్ష ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించుకోవడం ద్వారా దేశంలో పేదరికం, నిరుద్యోగం, ప్రాంతీయ అసమానతల తగ్గింపునకు కృషి చేసే దిశగా అవసరమైన అభివృద్ధి వ్యూహాన్ని అవలంబించారు.

ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక

ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక (1992-97)లో మానవాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ప్రణాళికలో ఉపాధి అవకాశాల విస్తరణకు అవలంబించిన వ్యూహాలు, విధానాలు, కార్యక్రమాల్లోని ముఖ్యాంశాలు కింది విధంగా ఉన్నాయి..

1. వేగవంతమైన, అన్ని ప్రాంతాలకు విస్తరించిన వ్యవసాయ రంగ అభివృద్ధి.
2. వ్యవసాయాధారిత, అనుబంధ కార్యకలాపాలైన డెయిరీ, ఫిషరీలకు సంబంధించి అవస్థాపనా సౌకర్యాలు, మార్కెటింగ్ సౌకర్యాల అభివృద్ధి.
3. గ్రామీణ ప్రాంతాల్లో తయారీ కార్యకలాపాల అభివృద్ధి.
4. చిన్న తరహా, తయారీ రంగ వికేంద్రీకరణపై దృష్టి సారించడం.
5. ఆరోగ్య, విద్యా సౌకర్యాలను పటిష్టపరచడం.
6. సేవా, ఇన్‌ఫార్మల్ రంగాల కార్యకలాపాల్లో వేగవంతమైన వృద్ధి.
7. ఉపాధి వృద్ధి పెంపులో భాగంగా నియంత్రణ విధానాన్ని సరళీకరించడం.
8. అవస్థాపనా సౌకర్యాలు, గృహ వసతి కల్పనకు సంబంధించిన కార్యక్రమాలను ప్రవేశపెట్టడం.

తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక

తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక (1997-2002) వ్యూహంలో భాగంగా.. వ్యవసాయ ఉత్పత్తి పెంపు ద్వారా సాంవత్సరిక వృద్ధి రేటు పెంపు, వనరుల సమీకరణలో స్వయం సాధన (సెల్ఫ్ రిలయన్స్), గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో మార్పులను తీసుకురావడం ద్వారా గ్రామీణ పేదరిక తీవ్రత తగ్గింపు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని మధ్య తరహా, భారీ పరిశ్రమల్లో సామర్థ్యం, పోటీతత్వం పెంపునకు తగిన చర్యలను విస్తరించడం, ఫార్మల్, ఇన్‌ఫార్మల్ రంగాల్లోని గ్రామీణ, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి, అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. మానవాభివృద్ధిని మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

పదో పంచవర్ష ప్రణాళిక

పదో పంచవర్ష ప్రణాళిక వ్యూహంలో.. ప్రైవేట్ రంగం అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. వృద్ధి పెంపునకు వ్యూహాలు, ప్రభుత్వం ఎదుర్కొంటున్న విధానపరమైన సవాళ్లను అధిగమించడంపై దృష్టి సారించారు. ప్రభుత్వ రంగ పెట్టుబడుల్లో మూలధనం - ఉత్పత్తి నిష్పత్తికి ప్రాధాన్యం ఇవ్వడానికి బదులుగా ప్రైవేట్ రంగంలో అధికవృద్ధి వ్యూహాన్ని అమలు చేశారు.

పదకొండో పంచవర్ష ప్రణాళిక

పదకొండో పంచవర్ష ప్రణాళికలో (2007-2012) పేదరికం తగ్గించడం, ఉపాధి అవకాశాల కల్పన, లింగ సంబంధిత తేడాలు నివారించడం, అక్షరాస్యత పెంచడం, వ్యవసాయ రంగంలో 4 శాతం వార్షిక వృద్ధి సాధించడం ధ్యేయంగా విశాల దృక్పథంతో కూడిన సమ్మిళిత వృద్ధి వ్యూహాన్ని అమలు చేశారు.

పన్నెండో పంచవర్ష ప్రణాళిక

పన్నెండో పంచవర్ష ప్రణాళిక వ్యూహంలో (2012-2017) వ్యవసాయ రంగంలో అధిక ప్రగతి సాధించడం, ఉపాధి కల్పన (ముఖ్యంగా తయారీ రంగంలో) వేగవంతం చేయడం, విద్య, ఆరోగ్యం, శిక్షణా నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి పటిష్ట చర్యలు తీసుకోవడం, పేదల అభ్యున్నతికి ప్రత్యేకంగా ఉద్దేశించిన పథకాలను సమర్థంగా అమలు చేయడం, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్రణాళికలు, లక్షిత వర్గాల ప్రజలకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించడం లాంటి విధానాలపై దృష్టి సారించారు. వేగవంతమైన, సుస్థిర, అధిక సమ్మిళిత వృద్ధికి ఈ ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు.

మాదిరి ప్రశ్నలు

1. మహలనోబిస్ పెట్టుబడి వ్యూహంలో ఏ రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు?
   1) ప్రభుత్వ రంగం 2) ప్రైవేట్ రంగం
   3) అసంఘటిత రంగం
   4) సంఘటిత రంగం
2. కింది వాటిలో నెహ్రూ - మహలనోబిస్ అభివృద్ధి నమూనాలో భాగం కానిది?
   1) దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ
   2) పరిశ్రమలకు సంబంధించిన రక్షిత విధానం
   3) సమ్మిళిత వృద్ధి
   4) భారీ పరిశ్రమలకు ప్రాధాన్యం
3. ఎన్నో పంచవర్ష ప్రణాళికలో చిన్న రైతులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయం, నీటి పారుదల అభివృద్ధికి వ్యూహం అవలంబించారు?
   1) 3 2) 4 3) 5 4) 6
4. ఆర్థిక ప్రణాళికా వ్యూహాన్ని కింద పేర్కొన్న ఏ అంశం ప్రభావితం చేసింది?
   1) మహలనోబిస్ వృద్ధి నమూనా
   2) ఉపాధి లక్ష్యం
   3) సామాజిక లక్ష్యాలు
   4) పైవన్నీ
5. దీర్ఘ కాలంలో అధిక పారిశ్రామికీకరణ అనేది బొగ్గు, విద్యుచ్ఛక్తి, భారీ యంత్రాలు, ఇనుము, ఉక్కు రంగాల్లో ఉత్పత్తి పెరుగుదలపై ఆధారపడి ఉంటుందని భావించిన వారు?
   1) వి.కె.ఆర్.వి. రావ్ 2) మహలనోబిస్
   3) కాల్డర్ 4) ఎస్. చక్రవర్తి
6. భారీ పరిశ్రమల వ్యూహం ఏ పరిస్థితికి దారి తీసిందనే విమర్శ ఉంది?
   1) వాణిజ్య లోటు పెంపు
   2) వ్యవసాయ ఉత్పత్తి పెంపు
   3) అసంఘటిత రంగ అభివృద్ధి
   4) అసమానతల తగ్గింపు

సమాధానాలు

1) 1; 2) 3; 3) 2; 4) 4; 5) 2; 6) 1.

The synonym of corrugated is..



BANK EXAMS

GENERAL ENGLISH

Model Questions

Directions (Q.No.1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The initial reports of the train accident in Amritsar (1)/ suggested that over 50 killed (2)/ when the Dussera revellers were watching (3)/ the burning of the Ravan close the track. (4)/ No error (5)
2. The widespread agitations center around (1)/ the hill shrine of Sabarimala (2)/ will have far-reaching ripples (3)/ in the state's political waters. (4)/ No error (5)
3. Several districts along the Siang River in Arunachal Pradesh have been put on high alert (1)/ keeping in mind the possibility of flash floods (2)/ after China informed India about a landslide blocking a river in Tibet (3)/ leading to the formation of a artificial lake. (4)/ No error (5)
4. The award-winning photograph by Arshdeep (1)/ which features a couple of owlets nesting inside a pipe, (2)/ which was captured while he was on the way (3)/ to a wetland in Punjab's Kapurthala District. (4)/ No error (5)
5. Swami Paripoornananda, head of Sree Peetham, who has also written a book (1)/ on Prime Minister Narendra Modi titled, Third Eye, (2)/ joined the BJP (3)/ in the presence of party president Amit Shah in New Delhi. (4)/ No error (5)

Directions (Q.No. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Although he was typically ____ and outgoing, Dayanand also needed a lot of time alone to relax and recharge.
   1) idiosyncratic
   2) elusive 3) wary
   4) fatigue 5) gregarious
7. The Indonesian tidal wave ____ terrible suffering and the grief in that country is ____.
   1) wrought, pervasive
   2) brought, experienced
   3) created, contained
   4) wreak, controlled
   5) inflict, proscribed
8. The defense lawyer claims the prosecutor ____ with ____ not with reason.
   1) reasons, creativity
   2) argues, sophistry
   3) defends, values
   4) objects, imagination
   5) disputes, thoughts
9. The board of directors met for a ____ to examine recent financial ____.
   1) writing, tardiness
   2) dissertation, lateness
   3) disquisition, irregularities
   4) treatise, promptness
   5) exposition, reliability
10. Police were able to prevent ____ because officers discovered a secret plot by ____.
    1) treason, major
    2) sedition, loyalists
    3) insurrection, partisans
    4) subversion, rebels
    5) mutiny, stalwarts

Directions (Q.No. 11-12): Each question below has five options with a set of words in each option, find the odd one out from the options and mark it as your answer.

11. 1) tractate, memoir
    2) rescindment, defeasance
    3) supplant, supersede
    4) penchant, antipathy
    5) appose, connect
12. 1) obscure, cleanse
    2) bedlam, peace
    3) extinct, extant
    4) basal, vital
    5) impasse, boon

Directions (Q.No. 13-17): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) In medieval Europe, it was customary to feast the poor at the funeral in return for their prayers for the deceased.
B) If the recipient makes material return of more than a token value, the transaction is normally not called charity.
C) Most forms of charity are concerned with providing basic necessities such as food, water, clothing, healthcare and shelter but other actions may be performed as charity: visiting the imprisoned or the homebound, ransoming captives, educating orphans, even social movements.
D) With regards to religious aspects, the recipient of charity may offer to pray for the benefactor.
E) Donations to causes that benefit the unfortunate indirectly, such as donations to fund cancer research, are also charity.
F) Institutions may commemorate benefactors by displaying their names, up to naming buildings or even the institution itself after the benefactors.

13. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) E
14. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) E
15. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) D
    4) E 5) F
16. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C
    4) D 5) E
17. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) F

Directions (Q.No. 18-20): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

18. Neither my mother nor my father, both of whom are English professors, agree with my contention that James Joyce's novel Ulysses is overrated.
    1) agrees with my contention that James Joyce's novel Ulysses is overrated.
    2) agree with my contention that Ulysses, a novel by James Joyce is overrated.
    3) agree my contention that James Joyce's novel Ulysses is overrated.
    4) agreed with my contention that James Joyce's novel Ulysses is overrated.
    5) No correction required
19. Although Samson once championed the charity, he changed his mind after journalist linked its origin to a corrupt individual.
    1) has once championed the charity
    2) had once championed the charity
    3) was a champion of the charity
    4) championed the charity at one time
    5) No correction required
20. Of the numerous decisions facing the Supreme Court this term, the question of an individual's right to die is for certain the more perplexing.
    1) the question of an individual's right to die is for certainly perplexing
    2) it seems certain that the more perplexing is the question of an individual's right to die
    3) the question of an individual's right to die is certainly the most perplexing
    4) it seems certain the question of an individual's right to die is the most perplexing
    5) No correction required

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

One recent example of industrial hyper growth has taken place in the recycling industry, led by the rapid expansion of the recycled paper market. Though many laws were enacted in the late 1980s to encourage (and in some cases require) the collection of waste paper for recycling, there were not, at that time, companies with sufficient capacity to recycle it all. Consequently the collected paper accumulated in storage, usually at the expense of the recycling companies, thereby adding to their overhead and squeezing their already thin profit margins. Today a different situation exists. Fifty-seven new paper mills have been built since 1991, and of these, at least twenty-nine use recycled fiber. This surge in capacity has resulted in a concurrent rise in profits. The price per Ton of waste paper has quadrupled in the past year, as have the prices of **corrugated** cardboard and used newsprint. Trash haulers have benefited from these conditions by combining their trash hauling and recycling operations. Recycling centers are connected both to the clients to whom they sell end products and to those from whom they collect refuse; thus, the company gets paid twice for the same trash, once for hauling the waste and once for selling the usable material. Industry profits have increased more than tenfold during this period. As the industry has become more competitive, some haulers have chosen to rebate a portion of this money to their clients in the hopes of ensuring their loyalty.

21. According to the passage, which of the following is a reason for the increase in profits in the trash hauling business?
    1) Haulers' ability to sell both services and products.
    2) Money offered by haulers to preferred customers.
    3) Foresight exhibited by the leaders of the industry.
    4) Haulers' willingness to adapt technology to a changing industry.
    5) Passage of stricter environmental legislation.
22. It can be inferred from the passage that the price of waste paper
    1) will increase steadily over the next few years
    2) will increase as more companies get involved in the industry
    3) is closely related to the availability of trash haulers
    4) is not as important to trash haulers as the price they charge for hauling waste
    5) is sometimes set by the weight of the product
23. The author of the passage would most likely agree with which of the following?
    1) Competition between trash haulers and recyclers will prevent the recycled paper industry from reaching its full economic potential.
    2) Pressure from anti-environmental groups has increased pressure on the government to oppose recycled paper initiatives.
    3) The recycled paper industry may continue to grow at its present rate as long as the industry remains profitable.
    4) The profit-seeking of recyclers have overshadowed environmental concerns in the recycled paper industry.
    5) Government negligence prevented the recycled paper industry from becoming successful until the early 1990's.
24. According to the passage, all of the following are results of the increase in the number of new mills using recycled finer except
    1) The price of waste paper has risen dramatically.
    2) Trash haulers are earning increased revenues.
    3) Profits at recycling centers have increased more than tenfold.
    4) The price of corrugated cardboard has risen.
    5) Trash haulers have been forced to compete with recyclers.
25. The synonym of corrugated is:
    1) Smooth 2) Downy
    3) Fluffy 4) Grooved
    5) Level

KEY

1) 4	2) 1	3) 4	4) 2	5) 1
6) 5	7) 1	8) 2	9) 3	10) 4
11) 4	12) 4	13) 5	14) 4	15) 1
16) 3	17) 5	18) 1	19) 2	20) 3
21) 1	22) 5	23) 3	24) 5	25) 4